

సత్యమేవ జయతే

సాక్షి

'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 133

శనివారం 3-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 3-8-2024



మహిళా పాఠకులూ...
మీ బెస్ట్ ఫ్రెండ్‌తో ఫొటో పంపండి

మీ చిన్ననాటి, కాలేజీ నాటి బెస్ట్ ఫ్రెండ్‌తో అప్పట్లో మీరు దిగిన ఫొటోను, మీ స్నేహాన్ని, ఏదేని తీపి జ్ఞాపకాన్ని నాలుగు మాటల్లో వివరిస్తూ ఈ వాట్సప్ నంబర్ / మెయిల్‌కు పంపండి. ఎంపికైన వాటిని ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ఆదివారం వచ్చే ఫ్యామిలీ ఫ్రెండ్‌షిప్ పేజీలో ప్రచురిస్తాం.

బెస్ట్ ఫ్రెండ్ వాట్సప్ నంబర్: 90523 95740
మెయిల్ : sakshifamily3@gmail.com


వివియానా రాబిన్‌సన్

● ఆస్తుల కోసం కాదు ఒలింపిక్స్‌కు వెళ్లడానికి డబ్బు పొదుపు చేసే రాబిన్‌సన్ కథ
● సూపర్ ఫ్యాన్

ఒలింపిక్స్ ఇంటిపేరయింది

మనసు ఉంటే మార్గమే కాదు 'మనీ' కూడా ఉంటుంది.

'అదెలా!' అని ఆశ్చర్యపడితే...

వివియానా రాబిన్‌సన్ గురించి తెలుసుకోవాల్సిందే. 'ఒలింపిక్స్' అనే మాట వినబడగానే ఆమె ఒళ్లు పులకించిపోతుంది.

ప్రపంచ సంగ్రామ క్రీడను టీవీలో కాదు ప్రత్యక్షంగా చూడాలనేది ఆమె కల. అలా కల కని ఊరుకోలేదు. ఒక్కసారి కాదు ఏడుసార్లు ఒలింపిక్స్ వెళ్లింది... అలా అని ఆమె సంపన్నురాలేం కాదు. చాలా సామాన్యురాలు.

ఒలింపిక్స్‌పై ఆసక్తి రాబిన్‌సన్‌కు 1984 ఒలింపిక్స్ సమయంలో మొదలైంది. ఆమె తల్లి 'యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా'లో అథ్లెట్‌లకు ట్రాన్స్‌లేటర్‌గా ఉండేది. తల్లి నోటి నుంచి ఒలింపిక్స్‌కు సంబంధించి ఎన్నో విషయాలు, విశేషాలు వినేది. ఆ ఆసక్తి రాబిన్‌సన్‌ను అట్లాంటా ఒలింపిక్స్‌కు వెళ్లేలా చేసింది.

'ఇప్పటిలా అప్పట్లో అథ్లెట్స్‌కు హైసెక్యూరిటీ ఉండేది కాదు. దీంతో ఎంతోమంది అథ్లెట్స్‌తో మాట్లాడే అవకాశం దొరికేది. కాని ఇప్పుడు సమీపంలోకి కూడా వెళ్లే పరిస్థితి లేదు' అని ఆరోజులను గుర్తు చేసుకుంటుంది రాబిన్‌సన్.

లాస్ ఏంజెల్స్, అట్లాంటా, సిడ్నీ, ఏథెన్స్, లండన్, రియో డి జెనీరోలతో పాటు తాజాగా ప్యారిస్ ఒలిపింక్స్‌కు కూడా వెళ్లింది.

స్థలం కొనడానికో, ఇల్లు కొనడానికో, భవిష్యత్ అవసరాల కోసమో సాధారణంగా డబ్బు పొదుపు చేస్తారు. కాని రాబిన్‌సన్ మాత్రం ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని డబ్బు పొదుపు చేస్తుంది. రోజుకు రెండు ఉద్యోగాలు చేసింది. ప్రస్తుత ప్యారిస్ ఒలింపిక్స్ కోసం కూడా ఎప్పటినుంచో పొదుపు మంత్రం పాటించింది.

ఒలింపిక్ థీమ్డ్ ట్రాక్‌సూట్‌తో ప్యారిస్‌లో టూరిస్ట్‌లు, వాలెంటీర్లకు ప్రత్యేక ఆకర్షణగా మారింది రాబిన్‌సన్. ఎంతోమంది ఆమెతో కలిసి సెల్ఫీలు దిగుతున్నారు. కొందరు ఆమె పాపులర్ టిక్‌టాక్ వీడియోల గురించి మాట్లాడుతుంటారు.

'సాధారణ దుస్తుల్లో కంటే ఇలాంటి దుస్తుల్లో కనిపించడం వల్ల నాతో మాట్లాడటానికి ఉత్సాహం చూపుతారు' అంటుంది తన ప్రత్యేక వేషధారణ గురించి చెబుతూ.

ఒలింపిక్స్ పుణ్యమా అని ప్రఖ్యాత అథ్లెట్లతో పాటు టామ్ క్రూజ్, లేడీ గాగా లాంటి సెలబ్రిటీ ఆర్టిస్టులతో కూడా మాట్లాడే అవకాశం వచ్చింది.

> **ఒలింపిక్స్ డైరీస్**
>
> ఒక్కసారి ఒలింపిక్స్‌కు వెళ్లొస్తేనే ఆ అనుభవం 'ఆహా ఓహో' అనిపిస్తుంది. అలాంటిది ఏడుసార్లు వెళ్లడం అంటే అంతులేని అనుభూతి. అలాంటి అనుభూతిని సొంతం చేసుకుంది రాబిన్‌సన్. అథ్లెట్లకు లక్ష్యం మాత్రమే. వాలెంటీర్‌లకు వారు చేస్తున్న పని మాత్రమే కనిపిస్తుంది. అయితే ప్రేక్షకులుగా వెళ్లాలనుకునే వారికి మాత్రం 360 డిగ్రీల కోణంలో ఒలింపిక్స్ అనుభూతి సొంతం అవుతుంది. ఏడు ఒలింపిక్‌ల జ్ఞాపకాల సంపదను వృథా చేయవద్దు అంటున్నారు రాబిన్‌సన్ స్నేహితులు. సామాన్య ప్రేక్షకురాలిగా తాను చూసిన అనుభవాలను గ్రంథస్థం చేస్తే అదొక విలువైన గ్రంథం అవుతుంది. డైరీలలో దాగి ఉన్న ఆమె ఒలింపిక్ అనుభవాలు ఏదో ఒకరోజు పుస్తకరూపం దాల్చుతాయని ఖాయంగా చెప్పవచ్చు.

ఆరంభంలో ఉన్న ఉత్సాహం ఆ తరువాత ఉండకపోవచ్చు. అయితే 66 సంవత్సరాల వయసులోనూ రాబిన్‌సన్‌కు ఒలిపింక్స్‌పై ఆసక్తి తగ్గలేదు.

'డబ్బును పొదుపు చేస్తూ నేను బతికి ఉన్నంత వరకు ఒలింపిక్స్‌కు వెళుతూనే ఉంటాను' అంటుంది మెరిసే కళ్లతో రాబిన్‌సన్. అయితే నెక్స్ట్ ఒలింపిక్స్ కోసం ఆర్థికపరంగా రాబిన్‌సన్ అంతగా కష్టపడక్కర్లేదు. ఎందుకంటే తన హోమ్‌టౌన్ లాస్ ఏంజెల్స్‌లోనే అవి జరగనున్నాయి.

వివియానా రాబిన్‌సన్ పేరుతో ఎంతోమంది ప్రొఫెసర్‌లు, రచయితలు, రకరకాల వృత్తుల వారు ఉన్నారు. ఈ నేపథ్యంలో 'ఒలింపిక్స్' అనేది రాబిన్‌సన్ ఇంటి పేరు అయింది. ఆటల ప్రేమికులు, గూగుల్ లాంటి సెర్చ్ ఇంజిన్‌లకు వివియానా రాబిన్‌సన్ అనే కంటే 'ఒలింపిక్స్ రాబిన్‌సన్' అంటేనే సుపరిచితం.

రేపు ఫ్రెండ్‌షిప్ డే

'పక్కింట్లో సుజాత నాతో కాలేజ్‌కొచ్చేది ఇప్పుడు ఎక్కడుందో'
'డిగ్రీ లాస్ట్ ఎగ్జామ్‌లో చూశాను సంధ్యను. మళ్లీ కాంటాక్ట్ లేదు'
'పెళ్లయ్యాక రెండుమూడుసార్లు మాట్లాడింది మాలతి. చూసి ఎన్నాళ్లయ్యిందో'
స్త్రీల మధ్య ఏర్పడే గాఢమైన స్నేహాలు ఎప్పుడో ఒకసారి తెగిపోవడమే జరుగుతుంది.
ఫ్రెండ్‌షిప్ డే నాడు స్త్రీలు తమ ఆత్మీయ స్నేహితురాళ్లను తలుచుకోవడమే తప్ప కలుసుకునే వీలెక్కడ?
కాని నాటి జ్ఞాపకాలు ఎంతో మధురమైనవి కదా.

ఎన్నాళ్లయ్యింది నిన్ను చూసి


ప్రతీకాత్మక చిత్రం

చిన్నప్పుడు ఆడపిల్లలు జట్టు కడతారు. అరుగుల మీద ఆటలాడతారు. స్కూల్ నుంచి రాగానే గబగబా స్నానాలు ముగించి కూడబలుక్కుని ట్యూషన్లకు నడుస్తారు. ఆదివారం వస్తే కలిసి పూలు కోసుకుంటారు. రేడియోలో పాటలు... దూరదర్శన్‌లో చిత్రహార్‌లు ...స్నేహితురాలి కుటుంబంతో సినిమాకు వెళ్లడం లేదా తన కుటుంబంతో స్నేహితురాలిని తీసుకెళ్లడం... ఒకరిని విడిచి మరొకరు ఉండలేనంత కబుర్లు.. రహస్యాలు... వెంటబెట్టుకెళ్లి చేసే బట్టల సెలక్షన్‌లు... జామెట్రీ బాక్స్‌లో దాచిన చిరుతిండ్ల పంపకాలు... ఇవన్నీ గొప్ప ఆనందాలు... శాశ్వతం అనిపిస్తాయి. కాని కుదరదు. చాలామందికి ఆ స్నేహం అసంపూర్ణమే.

వివాహం ఒక పునరావాసం

పెళ్లయ్యాక స్త్రీ భర్త ఇంటికి చేరుతుంది. భర్తది అదే ఇల్లు. పెళ్లికి ముందు పెళ్లి తర్వాత కూడా. కాని అమ్మాయికి పెళ్లికి ముందు ఒక ఇల్లు. పెళ్లి తర్వాత ఒక ఇల్లు. పుట్టింటి వాళ్లు తమ కూతురి స్నేహాలను ప్రోత్సహిస్తారు. ఆమె స్నేహితురాళ్లను తమ ఇంటి ఆడపిల్లల్లా చూస్తారు. వారికి ఎప్పుడూ స్వాగతం ఉంటుంది. కాని పెళ్లి అమ్మాయిని 'పరాయి ఇంటి'కి చేరుస్తుంది. ఆ పరాయి ఇంట్లోకి పెళ్లికూతురి స్నేహితురాలు స్వతంత్రించి వెళ్లలేదు. అందుకు భర్త అనుమతి అత్తామామల అనుమతి కావాలి. అది అంత సులభం కాదు.

కుటుంబమే ముఖ్యం

స్త్రీ ఇంటి పట్టున ఉన్నా, ఉద్యోగం చేస్తున్నా కుటుంబం మొదటి ప్రాధాన్యం అవుతుంది. పిల్లలు పుట్టాక స్త్రీ అన్నీ ప్రాధాన్యాలనూ వెనక్కు నెట్టి పిల్లల బాధ్యత ప్రథమంగా తీసుకుంటుంది. ఆమెకు సమయం చిక్కదు. ఆమె తన స్నేహితురాళ్లతో ఫోన్ మాట్లాడటం ఒకోసారి అభ్యంతరకరం కూడా కావచ్చు. 'ఎన్నో చెప్పుకోవాలని ఉంటుంది. కాని ఎప్పుడు చెప్పుకోవడం. ఎన్నోసార్లు కలవాలని ఉంటుంది. కాని ఎలా కలవడం?'

అతడిలా ప్రయాణం కట్టడం

భర్తకు విసుగు కలిగితే తన స్నేహితులను తీసుకొని అలా ఒక టూర్‌కు వెళతాడు. భార్య అలా తన స్నేహితురాళ్లతో వెళ్లలేదు. సామాజిక భద్రత సంగతి ఒక కారణమే అయినా అసలు అలాంటి వీలు కూడా ఉండదు చాలాసార్లు. తన స్నేహితులు వస్తే భార్యను పరిచయం చేసి వారికి టీలు కాఫీలు భోజనాలు భార్య చేత ఏర్పాటు చేయించే భర్త 'నీ స్నేహితురాళ్లను నువ్వూ ఆహ్వానించుకోవచ్చు' అని అనడం చాలా తక్కువగా జరుగుతుంది. విచిత్రమేమంటే మధ్య వయసు దాటాకే స్త్రీలు తమ పాత స్నేహితురాళ్లను కలిసే అనుమతి పొందుతారు. లేదా పిల్లల ద్వారా స్నేహాన్ని పునరుద్ధరించుకుంటారు.

స్నేహం అవసరం

ప్రతి మనిషికీ స్నేహం అవసరం. భర్త, పిల్లలు, బంధువులు ఎందరు ఉన్నా ప్రతి స్త్రీకి తన చిన్ననాటి, కాలేజీ నాటి, ఊరి స్నేహితురాళ్లు తప్పక అవసరమే. వారితో పంచుకునే విషయాలు. వారి ద్వారా పొందే ఓదార్పు, వారి నుంచి పొందే సలహాలు, వెళ్లబోసుకోవడాలు... ఇవన్నీ స్త్రీలు అలసిపోకుండా చూస్తాయి. కాని దురదృష్టవశాత్తు మన దేశంలో స్నేహమంటే పురుషుల స్నేహమే. స్నేహగాథలన్నీ వారివే.

కుటుంబంలో ఎంతో సంతోషంగా ఉండే స్త్రీ కూడా తన పాత స్నేహితురాలు కనిపిస్తే నవ్వే నవ్వు, కార్చే ఆనందబాష్పాలు పూర్తిగా ప్రత్యేకం. ఆ నవ్వు ఆనంద బాష్పాలు వారికి దక్కాలని ఈ ఫ్రెండ్‌షిప్‌డే సందర్భంగా కోరుకుందాం. ●

చెవి రింగులతో ర్యాష్ వస్తోందా?



కొందరికి చెవి రింగులు లేదా దుద్దులు సరిపడక చెవి తమ్మెలకు ర్యాష్ రావచ్చు. కృత్రిమ ఆభరణాలలోని నికెల్ కారణంగా కొందరిలో ఈ ర్యాషెస్ వస్తాయి. ఫలితంగా దురద, ఎర్రబారడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఈ దశలో నిర్లక్ష్యం చేస్తే గాయం మరింత రేగి, రక్తస్రావమయ్యే అవకాశాలు ఎక్కువ. ఈ సమస్యను 'అలర్జిక్ కాంటాక్ట్ డర్మటైటిస్ టు నికెల్' అంటారు. ఈ కింది సూచనలు పాటించడం ద్వారా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. ● నికెల్‌తో అలర్జీ ఉన్నవారు ఆ లోహంతో తయారైన రింగులు, దిద్దుల వంటి కృత్రిమ ఆభరణాలు ధరించడం సరికాదు. ● ఫ్యూసిడిక్ యాసిడ్ లాంటి తక్కువ మోతాదు కార్టికోస్టెరాయిడ్ ఉన్న యాంటీబయాటిక్ కాంబినేషన్‌తో లభించే క్రీములను గాయం ఉన్న చోట రోజుకు రెండు సార్లు చొప్పున కనీసం 10 రోజులు రాస్తే త్వరగా తగ్గుతుంది. అప్పటికీ తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించాలి.



'ఐయామ్ వాట్ ఐయామ్'... సునీతకృష్ణన్ రాసుకున్న జీవన జ్ఞాపకాల గుచ్ఛం. ఆడపిల్లల అక్రమ రవాణా, లైంగికదాడి బాధితుల పునర్జీవనం పై పోరాడుతున్న సామాజిక కార్యకర్తగా సునీతా కృష్ణన్ ఈ పుస్తకంలో సాంకేతికత ముసుగులో సోషల్ మీడియా వేదికగా ఆడపిల్లలకు ఎదురవుతున్న దుర్భర పరిస్థితులను నమోదు చేశారు. ఆమె 'సాక్షి'తో మాట్లాడిన వివరాలు...

నీలినీడలో ఆడపిల్ల


''సైబర్ టెక్నాలజీ ఇన్ హ్యూమన్ ట్రాఫికింగ్' మీద నేను జాతీయస్థాయి సర్వే చేస్తూ ఆధారాల కోసం ఒక యాప్ ద్వారా 'పిల్లల అశ్లీల వీడియో'ల కోసం ప్రయత్నించాను. అందుకోసం 532 రూపాయలు చెల్లించాను. మూడు రోజుల్లో తొమ్మిదివేల వీడియోలు వచ్చాయి. ఆరు నెలల పసిబిడ్డ నుంచి ఎనిమిదేళ్ల అమ్మాయి వరకు ఉన్న వీడియోలు కళ్లు మూసుకోవాల్సినంత ఘోరంగా ఉన్నాయి. ఇది ఏ డార్క్ వెబ్‌లోనో కాదు, పబ్లిక్ డొమైన్‌లోనే. ఒక ఇన్‌ఫ్లూయెన్సర్‌కి డబ్బు పంపించాం, వీడియో రావడం ఆలస్యమైంది. ఫోన్ చేసి అడిగితే వచ్చిన సమాధానమేంటో తెలుసా... 'నేను ట్యూషన్‌లో ఉన్నాను. తర్వాత పంపిస్తాన' అని. అంటే ఆ కుర్రాడి వయసు ప్లస్‌టూ దాటలేదని అర్థమవుతోంది. సమాజం ఇలా ఉంది'

మగపిల్లలకూ రక్షణ లేదు

'ఒకప్పుడు మానవ అక్రమ రవాణా అంటే చదువు లేక పేదరికంతో కష్టాలు పడుతున్న వారికి మాయ మాటలు చెప్పి మోసం చేసేవారు. ఇప్పుడు ఆ ఆర్థిక రేఖ కూడా చెరిగి పోయింది. బాగా చదువుకున్న అమ్మాయిలు కూడా బాధితులవుతున్నారు. ఒకప్పుడు ఈ నేరాలు ఎవరు చేశారనేది దర్యాప్తులో స్పష్టంగా తెలిసేది. ఇప్పుడు నేరస్థులు సాంకేతికత మాటున దాక్కుంటున్నారు. మగపిల్లలు కూడా ట్రాఫికింగ్‌కి గురవుతున్నారిప్పుడు. ఈ ఘోరాలన్నింటికీ సోషల్‌మీడియా అనేది ప్రధాన మాధ్యమంగా మారింది. వీటన్నింటినీ నియంత్రించాలంటే ప్రభుత్వం రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ పటిష్టంగా ఏర్పాటు చేయాలి, వాటిని కచ్చితంగా అమలు చేయాలి. మాలాంటి సోషల్ నేను నా పుస్తకం 'ఐ యామ్ వాట్ ఐ యామ్'లో ఉదహరించిన అనేక అంశాలు, వాటి నుంచి నేను నేర్చుకున్న పాఠాలు కూడా ఈ సమస్యల మీద ముందుకెళ్లడానికి ఉపకరిస్తాయనే అనుకుంటున్నాను'

ఎందుకు రాశానంటే...

'మా నాన్నకు తన ఆటోబయోగ్రఫీ రాయాలనే కోరిక ఉందని తెలిసి పిల్లలుగా మేము సహకరించాం. ఆయన తుదిశ్వాస వదలడానికి రెండు నెలల ముందు పుస్తకం ఆవిష్కరించాం. బంధువులు, స్నేహితులకు ఆ ప్రతులను పంచినప్పుడు ఒక్కొక్కరూ 'ఆయన సమాజం కోసం ఇంత సర్వీస్ ఇచ్చారని మాకిప్పటి వరకూ తెలియద'ంటూ నాన్నగారి గురించి ప్రశంసాపూర్వకంగా మాట్లాడారు. ఆ మాటలు వినడానికి నాన్న లేరు. అప్పుడు నాకు ఒక మనిషి గురించి పదిమందికి ఆ మనిషి బతికుండగానే తెలియాలి. అలాగే ఆ పదిమంది ఏమనుకున్నారనేది అది మంచి అయినా చెడు అయినా సరే... ఆ మనిషి బతికుండగానే తెలుసుకోవాలి అనిపించింది. అది తొలి కారణం. రెండో కారణం బాలీవుడ్ బయోపిక్. బాలీవుడ్ ఇండస్ట్రీ వాళ్లు నా బయోపిక్ తీస్తామని అనుమతి కోరారు. ఈ వార్త బయటకు వచ్చిన వెంటనే యూట్యూబ్‌లో నా గురించి ఎవరికి తోచిన కథ వారు పెట్టారు. ఇతరులకు ఆ అవకాశం ఇవ్వడం కంటే నా స్టోరీ నా వెర్షన్ నేనే చెప్పాలి అనుకున్నాను. నా పుస్తకంలో నేనేంటో ఉంది. ఒక గదిలో కూర్చుని రోజుకు 14 గంటల చొప్పున 13 రోజుల్లో పూర్తి చేసి జూన్ 17వ తేదీన విడుదల చేశాను. 'ఐ యామ్ వాట్ ఐ యామ్' ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది' అని వివరించారు సునీతాకృష్ణన్.

> **బలహీనత తెలియడమే బలం**
>
> 
>
>
> మన బలహీనతలను గుర్తించగలగడమే మన శక్తి. నా బలహీనత ఏమిటో గుర్తించగలిగాను కాబట్టే శక్తిమంతమయ్యాను. మన ఇచ్ఛాశక్తిలో శుద్ధి ఉంటే ప్రపంచంలోని శక్తులన్నీ మనకు సహాయంగా వస్తాయి. ప్రజ్వల నిర్వహణ కోసం ఫండ్‌రైజింగ్ గురించి ప్రోగ్రామ్ చేయడానికి ఎన్‌డీటీవీ, సాక్షి టీవీలు అవకాశం ఇచ్చాయి. లైవ్ పూర్తయ్యేలోపు ఒక చిన్న పాప తన కిడ్డీ బ్యాంక్‌ని పగలకొట్టి ఏడువేల రూపాయలిచ్చింది. ఇలాంటి ఎంతోమంది సహకారం అందించారు. ఇప్పటి వరకు బాధితులైన మహిళల రక్షణ కోసమే పని చేశాను. టెక్నాలజీ ముసుగులో జరుగుతున్న సామాజిక విధ్వంసం చూస్తుంటే ప్రమాదం బారిన పడుతున్న మహిళల గురించి పని చేయాలనుకుంటున్నాను.
>
> – సునీతా కృష్ణన్, ఫౌండర్, ప్రజ్వల ఫౌండేషన్

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటో : అనిల్ కుమార్ మోర్ల

అంధమైన వెలుగు

● మెదడులో అమర్చే ఇంప్లాంట్స్ సహాయంతో దృష్టిజ్ఞానం.
● సమీప భవిష్యత్తులో సుసాధ్యం చేసేందుకు యత్నం .
● కొన్ని టెక్నాలజీ ల్యాబ్స్, కొన్ని కంపెనీల సంయుక్త కృషి.



చికాగో వేదికగా అంధులకు చూపు తెప్పించేందుకు ఇలినాయీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహిస్తున్న తొలి ప్రయోగాలు బ్రియాన్ బసార్డ్ అనే వ్యక్తిపై జరుగుతున్నాయి. పదహారో ఏట అతడి ఎడమకన్ను పోయింది. ఎలాగోలా నెట్టుకొస్తుండగా 48వ ఏట అతడి రెండో కన్నూ దృష్టిజ్ఞానాన్ని కోల్పోయింది. వైర్డ్ మ్యాగజైన్ కథనం ప్రకారం... ఇలాంటి అంధుల మెదడులో అమర్చే కొన్ని చిప్స్, బయట ఉండే వైర్‌లెస్ ఉపకరణం సహాయంతో చూపు తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు.

కేవలం చికాగో ట్రయల్ మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇలాంటివి ఎన్నో పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఉదాహరణకు స్పెయిన్‌లోని మిగ్యుయెల్ హెర్నాండెజ్ యూనివర్సిటీ పరిశోధకులూ ఇలాంటి ప్రయోగాలే చేస్తున్నారు. కాలిఫోర్నియాలోని కార్టిజెంట్ అనే సంస్థ 'ఓరియాన్' అనే ఉపకరణాన్ని రూపొందించి, ఆరుగురు వలంటీర్లకు ప్రయోగాత్మకంగా అమర్చింది.

ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని 'న్యూరాలింక్' సంస్థ కూడా అంధులకు దృష్టిజ్ఞానం తెప్పించే దిశగా పనిచేస్తోంది. ఇందుకోసం బ్రెయిన్ ఇంప్లాంట్స్ రూపొందించి ప్రయోగాలు చేస్తోంది. వాళ్ల దగ్గర తయారవుతున్న ఇంప్లాంట్‌కు 'బ్లైండ్‌సైట్' అని పేరు పెట్టారు. కోతులకు అమర్చిన ఈ 'బ్లైండ్‌సైట్'తో మంచి ఫలితాలే వచ్చాయనీ, ఇకపైన దాన్ని మానవులపై ప్రయోగించి చూడాల్సిందే మిగిలి ఉందని 'న్యూరాలింక్స్' పేర్కొంది. అయితే చూడటం అనేది చాలా సంక్లిష్టమైన ప్రక్రియ కావడంతో ప్రస్తుతానికి ఈ ప్రయోగాలపట్ల చాలామంది నిపుణుల నుంచి సందేహాత్మకమైన అభిప్రాయాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. గతంలో దృష్టిజ్ఞానం ఉండి తర్వాత చూపు కోల్పోయిన వారికే ఈ ఇంప్లాంట్స్ అమర్చుతున్నారు. అయితే ఈ బ్లైండ్ సైట్ ఉపకరణం కేవలం గతంలో చూపున్న వారికి మాత్రమే కాకుండా పుట్టు అంధులకూ దృష్టిజ్ఞానం కలిగించగలదన్నది ఎలాన్ మస్క్ చెబుతున్న మాట.

ఇప్పుడు ప్రయోగాత్మకంగా తయారవుతున్న ఉపకరణాలన్నీ రెటీనా, ఆప్టిక్ నర్వ్ ప్రమేయం లేకుండానే నేరుగా మెదడుకు దృష్టిజ్ఞానం కలిగించేలా రూపొందుతున్నాయి.

మెదడులో అమరుస్తున్న చిప్స్... కొన్ని విద్యుత్తరంగాలతో అక్కడి న్యూరాన్లను ఉత్తేజితం (స్టిమ్యులేట్) చేయడం... ఫలితంగా మెదడులోని విజువల్ కార్టెక్స్‌లో చూస్తున్న దృశ్యం ఒక చుక్కల ఇమేజ్‌లా కనిపిస్తుంది. (విజువల్ కార్టెక్స్ అంటే... రెటీనా నుంచి ఆప్టిక్ నర్వ్ ద్వారా కాంతి మెదడుకు చేరాక దృష్టిజ్ఞానం కలిగించేందుకు మెదడులో ప్రాసెసింగ్ జరిగే మెదడులోని ప్రాంతం.

అయితే ఇప్పుడిది ఎలక్ట్రానిక్ ఉపకరణాలతో జరుగుతున్న ప్రక్రియ కావడంతో ఇందులో వాస్తవ కాంతి ప్రమేయం లేకుండానే ఇదంతా జరిగిపోతుంది. వీటి సాయంతో కనిపిస్తుందనే ఆ ఇమేజ్ కూడా అస్పష్టమైనది. ఆ డివైజ్ కారణంగా కనిపించే అస్పష్ట దృశ్యాలూ, దృష్టిజ్ఞానపు పరిమితులూ వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రయోగం జరుగుతున్నవారికి ప్రతిరోజూ కొన్ని సూచనలివ్వడం జరుగుతోంది. ఉదాహరణకు వారు గుర్తిస్తున్నదేమిటీ, ఒకవైపు వెళ్లమన్న తర్వాత వారు ఆ దిశగా వెళ్తున్నప్పుడు వారికి ఎదురవుతున్న ప్రతిబంధకాలేమిటన్న అంశాలను బట్టి... డివైస్‌లను మరింత మెరుగుపరిచేందుకు రోజూ ప్రయోగాలు జరుగుతున్నాయి.

దృష్టిజ్ఞానాన్ని మరింతగా మెరుగుపరిచే దిశగా వారికి ఎదురవుతున్న సవాళ్లలో మరో అంశం ఏమిటంటే... ఒక పక్క దృష్టిజ్ఞానం కల్పిస్తూనే, ఈ స్టిమ్యులేషన్స్ వల్ల వారికి వేరే అనర్థాలు రాకుండా బ్యాలెన్స్ చేసుకోవాలి. ఉదాహరణకు... ఈ ఎలక్ట్రిక్ స్పందనలు మెదడులోని ప్రదేశాలకు తాకినప్పుడు అవి సీజర్స్, మూర్ఛ వంటివి వచ్చేలా మెదడును ప్రేరేపించకూడదు. కంటిన్యూవస్‌గా ఎలక్ట్రిక్ తరంగాలకు గురవుతున్నందు వల్ల మెదడులో స్కార్ ఏర్పడే అవకాశముందా, అప్పుడు మెదడుకు హానిచేయని విధంగా ఈ ఉపకరణాల రూపకల్పన ఎలా అన్న సవాలు కూడా మరో ప్రతిబంధకం. ప్రస్తుతానికి ఇలాంటి పరిమితులు కనిపిస్తున్నప్పటికీ దీర్ఘకాలంలో చూపులేనివారికి దృష్టిజ్ఞానం కల్పించగలమనే నమ్మకం పెరుగుతోందన్నది పరిశోధకుల మాట.

> **ఎలాన్ మస్క్ ట్వీట్**
>
> 
>
> మా 'బ్లైండ్‌సైట్' ఇంప్లాంట్ ఇప్పటికే కోతుల్లో బాగా పనిచేస్తోంది. మొదట్లో స్పష్టత (రెజెల్యూషన్) కాస్త తక్కువే. అంటే తొలినాళ్లలో వచ్చిన 'నింటెండో గ్రాఫిక్స్' మాదిరిగా. కానీ క్రమంగా మానవుల నార్మల్ దృష్టిజ్ఞానంలాగే ఉంటుంది. (ఇంకా ఏమిటంటే... ఈ న్యూరాలింక్ వల్ల ఏ కోతీ చనిపోలేదూ, ఇంకేకోతికీ హాని జరగలేదు).
>
> *పైది 'ఎక్స్' (ట్విటర్)లో 2024 మార్చి 21న ఎలాన్ మస్క్ చేసిన ట్వీట్.*

హెల్దీ డైట్ | స్టవ్ టాప్ బనానా-కోకో కేక్



కావలసినవి: బనానా క్యారమిలైజ్ చేయడానికి: అరటికాయలు – 3 (కూర చేసే కాయలు); బటర్ – 20 గ్రాములు; బ్రౌన్ షుగర్– టేబుల్ స్పూన్ (బ్లీచ్ చేయని చక్కెర) **కేక్ బ్యాటర్ కోసం:** కోడిగుడ్డు – 1; చక్కెర– 50 గ్రాములు; పాలు– 100 ఎంఎల్; నూనె – 6 టేబుల్ స్పూన్‌లు (50 గ్రా); వెనీలా ఎసెన్స్– 2 చుక్కలు; గోధుమ పిండి – 130 గ్రాములు; కోకో పౌడర్– 20 గ్రాములు; బేకింగ్ పౌడర్– టీ స్పూన్.

తయారీ: ● అరటికాయలను పలుచగా నిలువుగా కట్ చేసి పక్కన పెట్టాలి ● పెనాన్ని మీడియం మంట మీద ఉంచి బటర్ వేయాలి. బటర్ కరిగిన తర్వాత అందులో బ్రౌన్ షుగర్ వేసి కలియబెడుతూ చక్కెర కరిగి తీగపాకం వచ్చే వరకు ఉడికించాలి. ఇప్పుడు అరటికాయ ముక్కలు వేసి స్టవ్ మీద నుంచి పాన్‌ను దించి పక్కన పెట్టాలి
● ఇప్పుడు కేక్ కోసం ఒక పాత్రలో కోడిగుడ్డు సొన, చక్కెర, నూనె, పాలు, వెనిలా ఎసెన్స్ పిండి వేసి బాగా కలిసేవరకు బీటర్‌తో చిలకాలి. ఇప్పుడు గోధుమపిండి, కోకో పౌడర్, బేకింగ్ పౌడర్ వేసి మెత్తని పేస్ట్ అయ్యే వరకు చిలకాలి. ఈ మిశ్రమాన్ని పెనంలో అరటికాయ ముక్కల మీద పోసి మూత పెట్టి 20–25 నిమిషాల సేపు ఉడికించాలి. మొత్తం చక్కగా ఉడికిందీ లేనిదీ తెలుసుకోవాలంటే మూత తీసి ఒక టూత్ పిక్‌తో మిశ్రమం మీద గుచ్చి బయటకు తీయాలి. పిక్‌కి పిండి ఏమీ అంటుకోకపోతే చక్కగా బేక్ అయినట్లు. తేమగా పిండి అంటుకుంటే మరో ఐదు నిమిషాల సేపు సన్న మంట ఉంచాలి ● చక్కగా బేక్ అయినట్లు నిర్ధారణ అయిన తరవాత స్టవ్ ఆపేసి ఐదు నిమిషాల సేపు వేడి అమరే వరకు ఉంచాలి. వేడి తగ్గిన తరవాత మూత తీసి ఒక ప్లేట్‌లోకి బోర్లించాలి (కేక్ ఇలా తిరగబడినప్పుడు అరటికాయ ముక్కలు పైకి కనిపిస్తూ ఉంటాయి). వెన్న రాసిన చాకుతో కేక్‌ను కట్ చేయాలి.


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

పోషకాలు: **కేలరీలు:** 180–220; **ప్రొటీన్‌లు:** 2–3 గ్రాములు; **ఫ్యాట్:** 7–10 గ్రాములు; **కార్బోహైడ్రేట్‌లు:** 30–35 గ్రాములు; **ఫైబర్:** 1–2 గ్రాములు.

హెయిర్ కేర్

● ప్రతిరోజూ కేశాలతోపాటు మాడును కూడా బాగా దువ్వాలి. కనీసం ఐదు నిమిషాల సేపు మాడును దువ్వితే కుదుళ్లకు చక్కటి మసాజ్ అందుతుంది. అనేక రకాల కేశ సంబంధమైన, ఒత్తిడి కారణంగా తలలో కలిగే అసౌకర్యం వంటి సమస్యలు దూరమవుతాయి.



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 133
శనివారం 3-8-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'



మరో చరిత్రకు మను 'సై'

ఒలింపిక్స్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత పతకాలు గెలిచిన భారత ప్లేయర్‌గా రికార్డు సృష్టించేందుకు షూటర్ మనూ భాకర్ ఒక్క పతకం దూరంలో ఉంది. పారిస్ ఒలింపిక్స్‌లో మనూ ఇప్పటికే రెండు కాంస్య పతకాలు నెగ్గింది. 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ ఈవెంట్‌లోనూ మనూ ఫైనల్లోకి దూసుకెళ్లింది. నేడు జరిగే ఫైనల్లో మనూ టాప్–3లో నిలిస్తే మూడో పతకాన్ని ఖాయం చేసుకుంటుంది.

- వివరాలు 16లో



మళ్లీ 'నీట్'కు ఆదేశించలేం

నీట్–యూజీలో వ్యవస్థీకృత లీకేజీ జరిగినట్లు రుజువుల్లేనందున పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఆదేశించలేమని సుప్రీం స్పష్టం చేసింది.

- వివరాలు 6లో



ఐఎస్ఎస్‌లోకి శుభాన్షు, ప్రశాంత్

నాసా సారథ్యంలో భారతీయ వ్యోమగాములు త్వరలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టబోతున్నారు.

- వివరాలు 6లో



గవర్నర్లే వారధి..

కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య గవర్నర్లు ప్రభావవంతమైన వారధిగా పనిచేయాలని ప్రధాని మోదీ అన్నారు.

- వివరాలు 6లో



వేల కి.మీ.ల దూరం నుంచి ఆపరేషన్

5జీ టెక్నాలజీ సాయంతో చైనాలో ఓ డాక్టర్ 5 వేల కి.మీ. దూరం నుంచే ఓ రోగికి విజయవంతంగా ఊపిరితిత్తుల శస్త్రచికిత్స చేశాడు.

- వివరాలు 6లో

ఇదిగో జాబ్ కేలండర్

శాసనసభకు సమర్పించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- వివిధ రకాల నోటిఫికేషన్లు, పరీక్షల షెడ్యూల్ విడుదల
- గ్రూప్ పరీక్షలతో పాటు వివిధ పోస్టుల భర్తీ వివరాలు వెల్లడి
- ఖాళీల సంఖ్యను మాత్రం వెల్లడించని సర్కారు
- ఇచ్చిన మాట ప్రకారం జాబ్ కేలండర్ ప్రకటించామన్న ఉప ముఖ్యమంత్రి
- గత ప్రభుత్వంలో నిరుద్యోగులు ఇబ్బందులు పడ్డారని విమర్శ
- తమకు మాట్లాడే అవకాశం ఇవ్వనందుకు బీఆర్ఎస్ సభ్యుల నిరసన


సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీల భర్తీ ప్రక్రియకు సంబంధించిన జాబ్ కేలండర్‌ను ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జాబ్ కేలండర్‌ను శాసనసభకు సమర్పించారు. రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన నోటిఫికేషన్లు, పోస్టుల కేటగిరీలు, నోటిఫికేషన్లు జారీ చేసే నెలలు, పరీక్షలు నిర్వహించే నెలలు (తాత్కాలిక ఖరారు), రిక్రూటింగ్ ఏజెన్సీలు, పోస్టులకు అర్హతలను కేలండర్‌లో సవివరంగా తెలియజేశారు. ఇప్పటికే నోటిఫికేషన్లు విడుదల చేసిన గ్రూప్ పరీక్షల వివరాలతో పాటు భవిష్యత్తులో విడుదల చేయబోయే గ్రూప్ పరీక్షల వివరాలు, వివిధ సంస్థల్లో ఇంజనీరింగ్ పోస్టులు, టీచర్లు, లెక్చరర్లు ఎస్‌ఐలు తదితర పోస్టుల భర్తీ, టెట్ నిర్వహణకు

మిగతా 7వ పేజీలో ▶

అబిడ్స్‌లో అమ్మే కేలండర్‌లా ఉంది: బీఆర్ఎస్

జాబ్ కేలండర్ విడుదలపై భట్టి విక్రమార్క ప్రకటన చేయగానే, తమకు స్పందించే అవకాశం ఇవ్వాలంటూ బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్ స్పీకర్‌ను కోరారు. మంత్రులు చేసే స్టేట్‌మెంట్లపై స్పందించేందుకు వీలుండదంటూ స్పీకర్ తిరస్కరించారు. దీంతో జాబ్ కేలండర్‌పై తమకు అసంతృప్తి ఉందని, దానిపై కొంత స్పష్టత అవసరముందని, తనకు మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని కేటీఆర్ కోరారు. డిప్యూటీ సీఎం భట్టి లేచి శాసనసభ రూల్ బుక్‌లో నిబంధన చదివి వినిపించారు. మంత్రులు స్టేట్‌మెంట్ ఇచ్చిన తర్వాత దానిపై ప్రశ్నలు, వివరణలకు వీలులేదని చెప్పారు. దీంతో స్పీకర్ తదుపరి అంశాన్ని చేపట్టారు. అయితే బీఆర్ఎస్ సభ్యులు పలువురు కేటీఆర్‌కు మద్దతుగా పోడియం వద్దకు వెళ్లి తమకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని అడిగారు. అది జాబ్ కేలండర్‌లా లేదని, అబిడ్స్‌లో విక్రయించే సాధారణ కేలండర్‌లా ఉందంటూ ఎద్దేవా చేశారు. అప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కౌన్సిల్‌కు వెళ్లిపోవడంతో ఆయన వచ్చిన తర్వాత అవకాశమిస్తానని స్పీకర్ చెప్పారు. బీఆర్ఎస్ సభ్యులు పట్టించుకోకుండా చాలాసేపు పోడియం వద్దనే నిలబడి నిరసన వ్యక్తం చేశారు.

సభ్యత్వం రద్దు చేస్తే బుద్ధి వస్తుంది..

2లో

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలనుద్దేశించి సీఎం వ్యాఖ్య

జాబ్ కేలండర్ షెడ్యూల్

తేదీలవారీగా నోటిఫికేషన్ల వివరాలు విడుదల చేసిన ప్రభుత్వం - 7లో


గన్‌పార్క్ వద్ద నిరసన తెలుపుతున్న కేటీఆర్‌ను బలవంతంగా తరలిస్తున్న దృశ్యం

బజారుభాషతో రేవంత్ పైశాచిక ఆనందం

- ముఖ్యమంత్రి మగాడైతే సిటీ సెంట్రల్ లైబ్రరీకి రావాలి
- కాంగ్రెస్ నేతలను నిరుద్యోగులు తన్ని తరుముతారు
- ఒక్క ఉద్యోగం ఇచ్చినా మేమంతా రాజీనామా చేస్తాం
- గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఆందోళనలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: జాబ్ కేలండర్‌పై చర్చించాలని అడిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీ మారినవారితో బజారుభాషలో తిట్టిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాడిస్ట్ సీఎం రేవంత్ అందరినీ ఉసిగొల్పుతూ దిగజారుడు..దివాలాకోరుతనంతో వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. శాసనసభలో ఇది చీకటిరోజు అని, అధికార పక్షం బజారుభాష వినలేక సభ నుంచి బయటకు వచ్చేశామన్నారు. బోగస్ జాబ్

మిగతా 14వ పేజీలో ▶

టార్గెట్ జగన్..

కాంగ్రెస్ లక్ష్యం అదే.. జగన్‌ను దెబ్బ తీసేందుకు నన్ను వాడుకుంది: యూట్యూబ్ ఇంటర్వ్యూలో సబితా ఇంద్రారెడ్డి

- ఆయన్ను టార్గెట్ చేసేందుకు నామీద సీబీఐ కేసులు పెట్టారు
- హోంమంత్రి పదవి ఇచ్చి నాకేమీ ప్రయోజనం చేకూర్చలేదు
- జగన్‌పై అక్రమ కేసుల వెనుక లోగుట్టు మరోసారి బట్టబయలు
- కాంగ్రెస్ అధిష్టానం కుట్రలను గతంలోనే వెల్లడించిన ఆజాద్, మొయిలీ
- సోనియా ఆదేశాలతోనే నాడు పిటిషన్ దాఖలు చేశానన్న శంకర్‌రావు



సాక్షి, అమరావతి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై గతంలో కక్షపూరితంగా అక్రమ కేసులు నమోదు చేసినట్లు మరోసారి స్పష్టమైంది. ఉమ్మడి రాష్ట్రంలో గనులు, హోం శాఖలను నిర్వహించిన నాటి కాంగ్రెస్ నేత, ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న పి.సబితా ఇంద్రారెడ్డి తాజాగా ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాటి కుట్రలు స్పష్టంగా బహిర్గతమయ్యాయి. 'మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించిన తరువాత ఆయన కుమారుడు వైఎస్ జగన్‌ను కాంగ్రెస్ పార్టీ వేధించింది. ఓదార్పు యాత్ర నిర్వహించేందుకు ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడమే దీనికి కారణం' అని సబిత పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తనను ఉమ్మడి రాష్ట్రంలో హోంమంత్రిని చేసిందన్న వ్యాఖ్యలపై సబిత తీవ్రంగా ప్రతిస్పందించారు. హోంమంత్రి పదవి ఇచ్చి కాంగ్రెస్ పార్టీ తనకేమీ ప్రయోజనం చేకూర్చలేదని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని దెబ్బ తీసేందుకు ఆ పార్టీ తనను వాడుకుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని టార్గెట్ చేయడానికి

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ధరణి పేరుతో పెద్దాయన దగా చేశారు: పొంగులేటి



ధరణి పేరుతో పెద్దాయన రాష్ట్ర ప్రజలను దగా చేశారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. 2020లో తెచ్చిన ఈ పోర్టల్ వల్ల ప్రజలు ఎంతో నష్టపోయారన్నారు.

- వివరాలు 2లో

తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు!



అన్ని రాజకీయ పక్షాలు ఒప్పుకుంటే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీగా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

- వివరాలు 2లో

ఇళ్లల్లోకి చొరబడి మనుషులను చంపడమా!



వీధి కుక్కలు ఇంట్లోకి వెళ్లి మహిళను చంపి.. అవయవాలు తినడం దారుణమని హైకోర్టు పేర్కొంది. ఇలా మహిళలు, చిన్నారులను కుక్కలు చంపుతున్నా పరిష్కారం కనుగొనకుంటే ఎలా అని ప్రభుత్వాన్ని నిలదీసింది.

- వివరాలు 13లో

ఐదేళ్లలో 35 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు



'కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పనిచేస్తుంది. ఈ ఐదేళ్లలో 35 లక్షల ఎకరాల్లో ఆయకట్టును సృష్టించి సాగునీరు అందించబోతున్నాం' అని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

- వివరాలు 8లో

మీ చేతుల్లోనే రాష్ట్ర భవిత

- ప్రభుత్వ టీచర్ల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్
- ప్రతి ప్రభుత్వ స్కూల్‌కు ఉచిత విద్యుత్ అందిస్తాం..
- హామీల కారణంగా విద్యా రంగానికి 10 శాతం నిధులివ్వలేకపోయాం
- టీచర్లు తేనెతుట్టెలాంటి వారు.. అపకారం చేస్తే ఎదురుదాడి చేస్తారని వ్యాఖ్య
- పేరుకే ముఖాముఖి.. మమ్మల్ని మాట్లాడనివ్వరా..?: టీచర్ల అసంతృప్తి


ఆత్మీయ సమ్మేళనంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం రేవంత్. పక్కన మంత్రి పొన్నం, కోదండరాం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర భవిష్యత్ టీచర్ల చేతుల్లోనే ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తేనెతుట్టె వంటి వారని.. వారికి ఎవరైనా అపకారం చేస్తే తేనెటీగల్లా ఎదురుదాడి చేస్తారని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వానికి ఉపాధ్యాయులే బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో శుక్రవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో సీఎం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే క్రమంలో ముందుంటాం. 15 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న 30వేల మంది టీచర్ల పదోన్నతులు చేపట్టడం గర్వకారణం. బడ్జెట్‌లో విద్యారంగానికి 10% కేటాయించాలనుకున్నా.. హామీల అమలు దృష్ట్యా 7.3% నిధులే ఇవ్వగలిగాం.

స్కూళ్లలో దారుణ పరిస్థితులు..

గురుకులాలతో కలిపి రాష్ట్రంలో 30వేల ప్రభుత్వ స్కూళ్లుంటే వాటిలో 26 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అదే ప్రైవేటు స్కూళ్లు 10వేలు ఉంటే వాటిలో

మిగతా 8వ పేజీలో ▶

నేడు అమెరికాకు సీఎం రాష్ట్రానికి పెట్టుబడుల కోసం పయనం 13లో

పరిశోధనలతో సమాజానికి మేలు



- 'సాక్షి'తో యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్
- పరిశోధనల్లో నాణ్యత పెరగాలంటే విద్యార్థులు, అధ్యాపకుల నిష్పత్తి సరిగ్గా ఉండాలి
- కాంట్రాక్టు సిబ్బంది నుంచి నాణ్యమైన పరిశోధనలు ఆశించలేం!

- వివరాలు 14లో



శ్రీలంక 230... భారత్ 230

'టై'గా ముగిసిన తొలి వన్డే

- రాణించిన రోహిత్, అక్షర్ పటేల్
- తిప్పేసిన అసలంక, హసరంగ
- రేపు రెండో వన్డే

- వివరాలు 17లో

ఇదండీ సంగతి


..ఫోన్ పే కూడా ఉంది సార్!

భూమి హక్కులకు 'కొత్త చట్టం'!

'రికార్డ్ ఆఫ్ రైట్స్–2024' ముసాయిదా బిల్లును ప్రజల ముందుకు తెచ్చిన సర్కారు

- తహసీల్దార్లతోపాటు ఆర్డీవోలకూ మ్యుటేషన్ చేసే అధికారం
- రిజిస్ట్రేషన్ తర్వాత మ్యుటేషన్ సమయంలో విచారణ.. తప్పుగా తేలితే మ్యుటేషన్ నిలిపివేత
- ప్రతి భూకమతానికి భూ ఆధార్.. ఆబాదీలకూ హక్కుల రికార్డు
- హక్కుల బదలాయింపు జరగ్గానే గ్రామ పహాణీలో నమోదు
- అప్పీల్, రివిజన్‌లకు వెసులుబాటు.. రివిజన్ అధికారాలు రాష్ట్ర ప్రభుత్వానికి..
- సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో పెట్టిన అధికారులు
- ఈ నెల 23 వరకు ముసాయిదా బిల్లుపై ప్రజాభిప్రాయసేకరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తులపై హక్కులను నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకురానుంది. ఈ మేరకు 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్–2024' పేరుతో రూపొందించిన ముసాయిదా బిల్లును ప్రజల ముందుకు తెచ్చింది. భూహక్కుల రికార్డులను ఎప్పటికప్పుడు సవరించడం, ఇప్పటివరకు పాస్‌బుక్‌లు రాని భూముల సమస్యలను పరిష్కరించడం, సర్వే చేసి కొత్తగా భూహక్కుల రికార్డు తయారు చేసుకునే అధికారాన్ని కల్పించడమే ప్రధాన ఉద్దేశాలుగా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నట్టు పేర్కొంది. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూ ఆధార్, ఆబాదీలకు ప్రత్యేక హక్కుల రికార్డు, అప్పీల్, రివిజన్ వంటి సెక్షన్లను ముసాయిదా బిల్లులో ప్రతిపాదించారు. దీనిపై ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకున్నాక.. ప్రత్యేకంగా అసెంబ్లీని సమావేశపర్చి బిల్లుకు ఆమోదం తీసుకునే అవకాశాలు ఉన్నాయని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి.

ముసాయిదా బిల్లులోని ముఖ్యాంశాలివీ..

→ భూమి హక్కుల బదలాయింపు కోసం 18 రకాల పద్ధతులు గుర్తించి.. వాటిలో ఏ రకంగా హక్కుల బదలాయింపు జరిగినా 'రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)'లో నమోదు చేయాల్సి ఉంటుంది. రిజిస్టర్డ్ దస్తావేజులు, వారసత్వం, భాగ పంపకాల ద్వారా హక్కుల బదలాయింపునకు పాత చట్టంలోని నిబంధనను కొనసాగించారు. ఈ పద్ధతుల్లో తహసీల్దారే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేస్తారు. అయితే మ్యుటేషన్ చేసే సమయంలో విచారణ జరిపే వెసులుబాటు ఉంటుంది. ఆ విచారణలో తప్పులేమైనా గుర్తిస్తే..


మిగతా 13వ పేజీలో ▶

7 అడుగుల నాగు.. 17 ఏళ్ల వయసు



- వనపర్తిలో అతిపెద్ద నాగుపాము
- పట్టుకున్న 'స్నేక్ సొసైటీ'

వనపర్తి: వనపర్తి జిల్లా కేంద్రంలోని చందాపూర్ రోడ్డు పీర్లగుట్ట సమీపంలోని ఓ ఇంట్లోకి అతి పెద్ద నాగుపాము వచ్చింది. శుక్రవారం సాయంత్రం ఇంటి యజమాని రాంబాబు బాత్‌రూంలోకి వెళుతుండగా.. బుసలు కొడుతున్న శబ్దం విని ఆగిపోయాడు. ఆ తర్వాత చూడగా పెద్ద నాగుపాము కనిపించింది. దీంతో భయపడిన రాంబాబు సాగర్ స్నేక్ సొసైటీ నిర్వాహకుడు చీర్ల కృష్ణసాగర్‌కు ఫోన్ చేశాడు. వెంటనే ఆయన తన బృందంతో అక్కడకు చేరుకొని పామును పట్టుకున్నాడు. పాము పొడవు ఏడు అడుగులు ఉండగా, వయసు 16 నుంచి 17 ఏళ్లకు పైబడి ఉంటుందని కృష్ణసాగర్ చెప్పాడు. తాను ఇప్పటి వరకు 7,013 పాములు పట్టుకున్నానని, కానీ ఇంతపెద్ద నాగుపామును చూడటం ఇదే మొదటిసారి అని కృష్ణసాగర్ తెలిపాడు. ఈ విషయంపై వెటర్నరీ ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పాము వయసు ఎక్కువే ఉండొచ్చని.. దాన్ని సమీపంలోని అడవిలో వదిలిపెట్టినట్టు తెలిపారు.



కేసీఆర్ సభకు రాకపోతే మజా లేదు

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే మజా లేదని, సభకు ప్రతిపక్ష నేత రాకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తల్లి లేని అనాథల్లా మిగిలిపోయారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏ నిర్ణయమైనా కేసీఆర్ ఒక్కరే తీసుకున్నారని, ఆయన తీసుకున్న నిర్ణయాలపై చర్చించేందుకుగాను కేసీఆర్ అసెంబ్లీకి వస్తే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ లాబీల్లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నిర్ణయాలు తీసుకున్న వ్యక్తి సభలో లేనప్పుడు ఎన్ని మాట్లాడినా అనుకున్న ఫలితం ఉండదన్నారు. విద్యుత్ కొనుగోళ్లపై చర్చ సందర్భంలో కేసీఆర్ అసెంబ్లీలో ఉండి ఉంటే చర్చ ఇంకా బాగా జరిగి ఉండేదని అభిప్రాయపడ్డారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు కేసీఆర్‌ను జాతిపిత అంటూ పొగిడి ఆకాశంలో కూర్చోబెట్టారన్నారు. ఓడిపోయిన తర్వాత కూడా ఆయన అదే భ్రమల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేత హోదా కేటీఆర్‌కు ఇస్తే పార్టీ ఆగమవుతుందని, హరీశ్‌రావు పనిమంతుడైనా అతడికి ఇవ్వరని వ్యాఖ్యానించారు.

ముందు మీ సభ్యత్వం సంగతి చూసుకోండి

సీఎం రేవంత్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దవుతుందో లేదో తెలియదు కానీ మీరు అమెరికా వెళ్లి వచ్చేలోగా మీ సభ్యత్వం మాత్రం రద్దయ్యేలా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌ను ఉద్దేశించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాల మంత్రులు, నాయకులు మీ సభ్యత్వం రద్దు చేస్తారేమో ముందు మీరు జాగ్రత్తపడాలని రేవంత్‌కు హితవు పలికారు. సభ్యుల సభ్యత్వం రద్దు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరిస్తే భయపడేవాళ్లు ఎవరూ లేరన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించిన రేవంత్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మాట్లాడదామంటే మైక్ ఇవ్వడంలేదని ధ్వజమెత్తారు.

వీధి రౌడీలా దానం

మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే దానం నాగేందర్ నిండు శాసనసభలో వీధి రౌడీలా వ్యవహరించిన తీరు జుగుప్సాకరమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయ అవగాహన లేక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని విమర్శించారు. సభ మర్యాద, గౌరవాన్ని కాంగ్రెస్ పార్టీ మంటగలిపిందని విరుచుకుపడ్డారు. యథారాజా తథాప్రజా.. అన్నట్టు.. సీఎం ప్రవర్తనకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీ ఆవరణలో ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై శాసనసభ స్పీకర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు!

అన్ని రాజకీయ పక్షాలు అంగీకరిస్తే పెడతాం

- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి
- వచ్చే శాసనసభా సమావేశాల్లో కొత్త క్రీడా పాలసీ
- భూములున్న మండల కేంద్రాల్లో మినీ స్టేడియంలు నిర్మిస్తాం
- బ్యాగరికంచెలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియం



సాక్షి, హైదరాబాద్: అన్ని రాజకీయ పక్షాలు ఒప్పుకుంటే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలుగు భాషకు, పత్రికా రంగానికి సురవరం ప్రతాప్‌రెడ్డి ఎంతో సేవ చేశారని, తెలంగాణ పోరాటంలో సైతం పాల్గొన్నారని కొనియాడారు. సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు ద్వారా ఆ పార్టీ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి.. శుక్రవారం శాసనసభలో విజ్ఞాపన లేఖను అందించగా, దానిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. పోలీసులు, సెక్యూరిటీ గార్డులు విధి నిర్వహణలో గంటల తరబడి నిలబడి ఉండాల్సి వస్తోందని, తమిళనాడు తరహాలో వారికి కూర్చునే అవకాశం కల్పించాలని సుధాకర్‌రెడ్డి చేసిన మరో విజ్ఞప్తి అమలుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.

మేం గతంలోనే నిర్ణయం తీసుకున్నాం: కేటీఆర్

తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టడానికి తాము మద్దతిస్తున్నట్టు బీఆర్‌ఎస్ సభ్యుడు కె.తారక రామారావు తెలిపారు. వాస్తవానికి దీనిపై తాము గతంలోనే నిర్ణయం తీసుకున్నామని, అయితే పదేళ్ల వరకు వర్సిటీ విభజన జరగకపోవడంతో అప్పట్లో సాధ్యం కాలేదని చెప్పారు. రూ.5 కోట్లతో దేశోద్ధారక భవనంలో సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు మీద ఆడిటోరియాన్ని బాగు చేశామని తెలిపారు. ఆయనపై గౌరవంతో 394 మంది కవులతో గోల్కొండ కవుల సంచిక కూడా తెచ్చామన్నారు.

అత్యుత్తమ క్రీడా పాలసీ రూపొందిస్తాం

రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి వచ్చే శాసనసభ సమావేశాల్లో నూతన క్రీడా పాలసీని తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. చదువులోనే కాదు..క్రీడల్లో రాణించినా ఉన్నతోద్యోగం వస్తుందని, కుటుంబ గౌరవం పెరుగుతుందనే సందేశం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిని రుజువు చేసేందుకే క్రీడాకారులు నిఖత్ జరీన్, మహమ్మద్ సిరాజ్‌కు గ్రూప్–1 (డీఎస్పీ) ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది, వేతనాల హేతుబద్ధీకరణ చట్ట సవరణ బిల్లుపై జరిగిన చర్చలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు సీఎం సమాధానమిచ్చారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించడానికి వీలుగా ఈ చట్ట సవరణ చేస్తున్నామని, సిరాజ్ ఇంటర్మీడియెట్ మాత్రమే చదివినా ప్రత్యేక మినహాయింపు ఇచ్చి డీఎస్పీ ఉద్యోగం ఇస్తున్నామని చెప్పారు. అత్యధిక మంది క్రీడాకారులను తయారు చేస్తున్న హరియాణా, పంజాబ్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న క్రీడా పాలసీలపై అధ్యయనం చేసి అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందిస్తామని పేర్కొన్నారు. ఏ స్థాయి క్రీడల్లో ఏ మేరకు రాణిస్తే/ఏ మెడల్ సాధిస్తే ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వాలి? ఎంత ఆర్థిక సహాయం చేయాలి? ఎంత స్థలం కేటాయించాలి? వంటి అంశాలు కొత్త పాలసీలో ఉంటాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో క్రీడలకు రూ.321 కోట్లు కేటాయించామని గుర్తు చేశారు.

యువత వ్యసనాలు వీడేలా..

మండల కేంద్రాల్లో భూములు అందుబాటులో ఉంటే మినీ స్టేడియం నిర్మిస్తాం. ప్రస్తుతం మాదాపూర్‌లోని 'నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్'ను బ్యాగరికంచె (మీర్‌ఖాన్‌పేట)కు తరలిస్తాం. అక్కడే అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియం నిర్మించడానికి బీసీసీఐతో చర్చిస్తే సానుకూలంగా స్పందించింది. కొద్దిరోజుల్లోనే భూమిని కేటాయిస్తాం. రాష్ట్రంలోని యువతను వ్యసనాల బాట నుంచి తప్పించడానికి క్రీడలను వాడుకుంటాం. హైదరాబాద్‌లో గతంలో నిర్మించిన సరూర్‌నగర్, ఎల్బీనగర్ స్టేడియాలు ప్రైవేట్, రాజకీయ కార్యక్రమాలకే పరిమితమయ్యాయి. వీటన్నింటినీ అప్‌గ్రేడ్ చేసి విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తిని పెంచేందుకు ఉపయోగిస్తాం..' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

ఎమ్మెల్యేల క్రీడా పోటీలను పునరుద్ధరిస్తాం

శాసనసభ్యులకు నిర్వహించే క్రీడా పోటీలను పునరుద్ధరించనున్నట్లు రేవంత్ వెల్లడించారు. శాసనసభలో క్రీడలపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఏటా బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనసభ్యుల క్రీడాపోటీలు జరిగేవని గుర్తు చేశారు. పదేళ్లుగా క్రీడా స్ఫూర్తి లేకుండా పోయిందన్నారు. వచ్చే సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేల మధ్య క్రీడాపోటీలు నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. అన్ని పార్టీలతో ఓ కమిటీని ఏర్పాటు చేసి, క్రీడా పోటీల నిర్వహణకు కృషి చేయాలని స్పీకర్‌ను కోరారు.

సభ్యత్వం రద్దు చేస్తే బుద్ధొస్తుంది

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- వారి తీరును ఓపికతో చూస్తున్నాం..
- హైదరాబాద్‌లో రాత్రి ఒంటి గంట వరకు వ్యాపారాలకు అనుమతి
- ట్రాఫిక్ నియంత్రణకు కమిషనర్లు బయటకు రావాలి.. లేకుంటే నేనే చేస్తా

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు చెందిన అరడజను మంది ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేస్తే అప్పుడు వారికి బుద్ధొస్తుందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, సంపత్‌కుమార్‌ను గత సభలో ఏం చేశారో మనం చూడలేదా? అని అన్నారు. బీఆర్‌ఎస్ సభ్యుల తీరును ఓపికతో చూస్తున్నామని అన్నారు. దానం నాగేందర్ సభలో మాట్లాడితే తప్పేంటని, ఓ సభ్యుడికి మైక్ ఇవ్వొద్దనే అధికారం వారికి ఎక్కడిదని ప్రశ్నించారు. లాంగ్వేజ్, నాలెడ్జ్ వేర్వేరని కేటీఆర్ తెలుసుకోవాలన్నారు. శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

30 ఎకరాల్లో కొత్త ఉస్మానియా ఆస్పత్రి

'మిషన్ భగీరథ ద్వారా గజ్వేల్‌కు నీళ్లు ఇచ్చామని చెబుతున్న కేటీఆర్‌కు నేను సవాల్ విసురుతున్నా. కాంగ్రెస్ వేసిన శ్రీపాద ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు వచ్చే నీటినే మధ్యలో పైప్‌లైన్ ద్వారా గజ్వేల్‌కు అందించారు. మీరు కట్టిన మేడిగడ్డ మేడిపండు అయింది. కాళేశ్వరం కట్టడం, కూలడం అయిపోయింది. అయినా ఇంతవరకు డీపీఆర్ లేదు. కానీ మూసీ అభివృద్ధి పనులు మొదలు పెట్టకముందే కేటీఆర్ డీపీఆర్ అడుగుతున్నారు. అప్పుడే ఏదో జరిగిపోయినట్టు ఎందుకు వాళ్లకు ఇంత బాధ. పది నెలలైనా కాకముందే మాపై ఎందుకింత ఆక్రోశం? 200 ఏళ్లు ఏలిన నిజాం నవాబులే ప్రజాస్వామ్యానికి తలొగ్గారు. పదేళ్లు ఏలిన మీరెంత? మేము అమెరికాతో పాటు కొరియాకు కూడా వెళుతున్నాం. పెట్టుబడులు, పరిశ్రమలకు సంబంధించి అక్కడ చర్చలు జరుపుతాం. గ్రీన్ తెలంగాణ–2050 తయారు చేస్తాం. మూసీ కబ్జాలను తొలగిస్తాం. మూసీపై 10,800 ఇళ్లు ఉన్నాయి. వాటిని ఖాళీ చేయించి అవసరమైన వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తాం. గోషామహల్ పోలీస్ క్వార్టర్స్ స్థలంలో కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తాం. 30 ఎకరాల స్థలంలో నిర్మాణం చేస్తాం. ప్రస్తుతం ఆసుపత్రి ఉన్న భవనాన్ని హెరిటేజ్ బిల్డింగ్‌గా కొనసాగిస్తాం.. ' అని సీఎం తెలిపారు.

మీరాలం చెరువుపై సస్పెన్షన్ బ్రిడ్జి

'మీరాలం చెరువుపై 2.6 కిలోమీటర్ల సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మిస్తాం. లండన్ ఐ లాంటి టవర్‌ను మీరాలం చెరువులో నిర్మిస్తాం. దానికి హైదరాబాద్ ఐ అని పేరు పెడతాం. బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడితే హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయంటున్నారు. మొయినాబాద్ దగ్గర బీఆర్‌ఎస్ నాయకుడు రేప్, మర్డర్ చేస్తే చర్యలు శూన్యం. ఇప్పుడు రాష్ట్రంలో గంజాయి అమ్మే దమ్ము ఎవరికైనా ఉందా? రాష్ట్ర అభివృద్ధికి కలసి పనిచేద్దామని చెప్పినా కిషన్‌రెడ్డి ముందుకు రాలేదు. బండి సంజయ్, కిషన్‌రెడ్డిని సచివాలయంలో సన్మానం చేసి రాష్ట్ర అభివృద్ధికి నిధులు కోరాలని భావించాం. ఆ మేరకు ఆహ్వానించినా వారు స్పందించలేదు..' అని రేవంత్ వెల్లడించారు.

హైదరాబాద్ మెట్రోను వైఎస్సార్ తీసుకొచ్చారు

'హైదరాబాద్ మెట్రోను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు తీసుకొచ్చారు. వైఎస్‌కు, చంద్రబాబుకు మధ్య భిన్నాభిప్రాయాలున్నా వారిద్దరూ హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేశారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డును వైఎస్సార్ మణిహారంగా తీర్చిదిద్దారు. సైబరాబాద్‌ను కూడా వైఎస్సారే నిర్మించారు. మద్యం షాపులు మినహా రాత్రి ఒంటి గంట వరకు హైదరాబాద్‌లో వ్యాపారాల నిర్వహణకు అనుమతిస్తా. ఈ మేరకు వెంటనే ఆదేశాలు ఇస్తున్నా. హైదరాబాద్‌ను 2 వేల కిలోమీటర్ల వైశాల్యం వరకు విస్తరించనున్నాం. హైదరాబాద్ నగరాన్ని 12 జోన్లుగా విభజిస్తున్నాం. 12 మంది అధికారులను నియమిస్తాం..' అని సీఎం చెప్పారు.

రోడ్లపై నీళ్లు నిల్వకుండా హార్వెస్టింగ్ వెల్స్

'భారీ వర్షాలు పడినప్పుడు రోడ్లపై నీళ్లు నిలవకుండా హార్వెస్టింగ్ వెల్స్ డిజైన్ చేయాల్సిందిగా అధికారులకు సూచించాం. 141 ప్రాంతాలను గుర్తించి డిజాస్టర్ మేనేజ్ మెంట్ సిబ్బందిని అప్రమత్తం చేసేలా చర్యలు చేపట్టాం. ట్రాఫిక్ నియంత్రణకు హైదరాబాద్‌లోని పోలీసు కమిషనర్లు బయటకు రావాలి. వాళ్లు రోడ్లపైకి రాకపోతే నేనే ట్రాఫిక్ కంట్రోల్ చేస్తా. నగరంలో చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. ఆక్రమణలను నియంత్రించే బాధ్యత హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) తీసుకోనుంది..' అని సీఎం తెలిపారు.

టార్గెట్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

తన మీద ఐదు సీబీఐ కేసులు పెట్టారని తెలిపారు. 'నేను రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో ఉన్నాను కాబట్టి నామీద కేసులు పెడితే జనం నమ్ముతారని భావించారు. నన్ను ముందు పెట్టి జగన్‌ను దెబ్బ కొట్టాలని ప్రయత్నించారు. జగన్ తరువాత ఎక్కువ కేసులు నామీదే ఉన్నాయి. నామీద ఐదు సీబీఐ కేసులు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గిఫ్ట్ కాదా ఇది? ఏ తప్పూ చేయని నేను ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నా. వైఎస్ రాజశేఖరరెడ్డి నన్ను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకొచ్చారనే కారణంతో.. నామీద ఐదు సీబీఐ కేసులు బనాయించినా 24 ఏళ్ల రాజకీయ జీవితంలో 20 ఏళ్లు ఆ పార్టీలోనే పనిచేశా' అని చెప్పారు. మహిళలంటే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గౌరవం లేదన్నారు

అధిష్టానం చెబితేనే పిటిషన్ దాఖలు చేశా: శంకర్‌రావు

వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు బనాయించేందుకు కాంగ్రెస్ పార్టీ పావుగా వాడుకున్న దివంగత మాజీ మంత్రి శంకర్‌రావు కూడా గతంలోనే ఆ కుట్రను బయటపెట్టడం గమనార్హం. జగన్‌కు వ్యతిరేకంగా శంకర్‌రావుతో న్యాయస్థానంలోపిటిషన్ దాఖలు చేయించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఈ కుట్రలకు తెర తీసింది. తదనంతర పరిణామాల నేపథ్యంలో శంకర్‌రావు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 'సాక్షాత్తూ సోనియాగాంధీ ఆదేశించడంతోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశా' అని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌లో ఉంటే మంచోడే: వీరప్ప మొయిలీ

ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన దివంగత వీరప్ప మొయిలీ సైతం వైఎస్ జగన్‌పై అక్రమ కేసుల వెనుక లోగుట్టును గతంలోనే బయటపెట్టారు. 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో కొనసాగి ఉంటే మంచి వ్యక్తే. ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేయడం దురదృష్టకరం' అని నాడు మీడియాతో వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్‌లో ఉంటే కేంద్రమంత్రి అయ్యేవారు: ఆజాద్

యూపీఏ హయాంలో ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా ఉన్న గులాం నబీ ఆజాద్ సైతం వైఎస్ జగన్‌పై అక్రమ కేసుల వెనుక ఉన్న కుట్రను బయటపెట్టారు. ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన ఆయన గతంలోనే మీడియా ప్రతినిధులకు అసలు విషయాన్ని వెల్లడించారు. 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో కొనసాగి ఉంటే కేంద్ర మంత్రి అయ్యేవారు' అని ఆజాద్ వ్యాఖ్యానించారు. తద్వారా కాంగ్రెస్‌కు రాజీనామా చేయడం వల్లే వైఎస్ జగన్‌పై అక్రమ కేసులు నమోదు చేశారన్న వాస్తవాన్ని బహిర్గతం చేశారు. కాంగ్రెస్‌లో కొనసాగి ఉంటే అక్రమ కేసులు ఉండేవి కావు.. పైగా జగన్ కేంద్ర మంత్రి కూడా అయ్యేవారు అని ఆనాడే స్పష్టం చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

క్రీడాకారులకు సర్కారీ ఉద్యోగాలు

- అందుకు వీలుగా ఉద్యోగ నియామకాల చట్ట సవరణకు అసెంబ్లీలో ఆమోదం
- తెలంగాణ సంక్షిప్త నామం టీఎస్ నుంచి టీజీకి మార్పు

సాక్షి, హైదరాబాద్: ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించడానికి వీలుగా తెలంగాణ(పబ్లిక్ సర్వీస్ నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది, వేతనాల హేతుబద్ధీకరణ) చట్ట సవరణ బిల్లును శుక్రవారం శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్, కాలేజీ సర్వీస్ కమిషన్, ఏదైనా కమిటీ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీ, పత్రికల్లో బహిరంగ ప్రకటనల ద్వారా మినహా ఇతర పద్ధతుల్లో ఉద్యోగాల భర్తీపై ఈ చట్టం ద్వారా నిషేధం విధించారు. కారుణ్య నియామకాలతో పాటు పోలీసు కాల్పులు/ బాంబు పేలుళ్లు/ తీవ్రవాదుల హింస బాధితులు, అత్యాచారాలకు గురైన ఎస్సీ, ఎస్టీల విషయంలో మినహాయింపు ఉంది. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్, అంతర్జాతీయ క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఇకపై క్రీడాకారులకు సైతం ఉద్యోగాలు ఇచ్చేందుకు వీలుగా ఈ చట్టానికి ప్రభుత్వం సవరణలను ప్రతిపాదించింది.

మరో రెండు బిల్లులకు ఆమోదం..: జూనియర్ సివిల్ జడ్జీల ద్రవ్య అధికార పరిధిని రూ.20 లక్షల నుంచి రూ.10 లక్షలకు కుదించడానికి ప్రతిపాదించిన తెలంగాణ సివిల్ కోర్టు చట్ట సవరణ బిల్లుతో పాటు తెలంగాణ సంక్షిప్తనామాన్ని 'టీఎస్'నుంచి 'టీజీ'కి మార్చుతూ ప్రతిపాదించిన కొత్త చట్టం బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

అసెంబ్లీలో తీసిన వీడియోల మార్ఫింగ్‌పై స్పీకర్ సీరియస్



సాక్షి, హైదరాబాద్: శాసనసభ, దాని ప్రాంగణంలో తీసిన వీడియోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేసినట్టు వచ్చిన ఆరోపణలపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. శాసనసభ ప్రత్యక్ష ప్రసారాలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారని, మంత్రి సీతక్క వీడియోను అసభ్యకర రీతిలో మార్ఫింగ్ చేశారని బీఆర్‌ఎస్ సోషల్ మీడియాను ఉద్దేశించి మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయగా, స్పీకర్ ఈ మేరకు ప్రకటన చేశారు. తెలంగాణ సివిల్ కోర్టుల చట్టసవరణ బిల్లుపై శుక్రవారం శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ మధ్య మార్ఫింగ్ వ్యవహారంపై వాడీవేడిగా వాదోపవాదాలు జరిగాయి. అన్ని పార్టీల నేతలపై సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హనన జరుగుతోందని కేటీఆర్ స్పష్టం చేశారు. 'చెప్పుతో కొడ్తాం' అని సభలో భాషను వినియోగించడం సరికాదని సీఎం రేవంత్‌ను ఉద్దేశిస్తూ అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా శాసనసభ కార్యకలాపాల ఫొటోలను బీఆర్‌ఎస్ సభ్యులు తీశారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించగా, పార్లమెంట్‌లో ఫొటోలు, వీడియోలు తీసేందుకు సభ్యులను అనుమతి స్తారని కేటీఆర్ తెలపగా, మంత్రి ఉత్తమ్ కొట్టిపారేశారు. ఇదిలా ఉండగా.. మంత్రి సీతక్క వీడియోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది తేజావత్ వెంకటనాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

జర్నలిస్టులకు భట్టి విందు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జర్నలిస్టులకు శుక్రవారం రాత్రి విందు ఇచ్చారు. బేగంపేటలోని ఓ హోటల్‌లో ఇచ్చిన విందుకు పలువురు సీనియర్ పాత్రికేయులు హాజరయ్యారు.

రేవంత్‌పై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ మీటర్ల విషయంలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇవ్వడం, ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం రెండు వేర్వేరు సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చింది. శుక్రవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలిసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆ నోటీసులు అందజేశారు. హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింత ప్రభాకర్, విజయుడు తదితరులు స్పీకర్‌ను కలిసి సీఎం సభాహక్కుల ఉల్లంఘనకు పాల్పడిన తీరును వివరించారు. గత నెల 27న బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చలో జోక్యం చేసుకున్న సీఎం రేవంత్ వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లకు సంబంధించి గత ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వం నడుమ ఒప్పందం జరిగిందని వ్యాఖ్యానించి.. ఉద్దేశపూర్వకంగా సభను తప్పుదోవ పట్టించారన్నారు. శాసనసభ నియమావళిని అనుసరించి చర్యలు తీసుకోవాలని కోరారు. గత నెల 31న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి పట్ల సీఎం సంస్కారం లేని వ్యాఖ్యలు చేశారని మరో నోటీసు ఇచ్చారు. క్షమాపణ చెప్పకుండా సభ బయట కూడా అనుచితవ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌పై సభ నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం స్పీకర్‌ను కోరింది.

ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటించండి

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు టి.భానుప్రసాద్, ఎమ్మెస్ ప్రభాకర్‌రావు, దండె విఠల్, యెగ్గె మల్లేశంపై అనర్హత వేటు వేయాలని మండలి బీఆర్‌ఎస్ పక్ష నేతలు కోరారు. ఈ మేరకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. స్పీకర్‌ను కలిసి పిటిషన్ అందజేసిన వారిలో మండలిలో బీఆర్‌ఎస్ శాసనసభా పక్షనేత మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, ఎల్.రమణ, మహమూద్ అలీ తదితరులున్నారు.

ధరణి పేరుతో పెద్దాయన దగా చేశారు

గడీల మధ్య ఇద్దరు కూర్చొని చేసిన చట్టం ఇది	రాష్ట్రంలో పీవీ, వైఎస్ భూసంస్కరణలతో పేదలకు మేలు చేశారు	ధరణి స్థానంలో తీసుకొచ్చే కొత్త చట్టాన్ని మూడు వారాల్లో వెబ్‌సైట్‌లో పెడతాం	లఘు చర్చ సందర్భంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ధరణి పేరుతో పెద్దాయన రాష్ట్ర ప్రజలను దగా చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. 2020లో తెచ్చిన ఈ పోర్టల్ వల్ల ప్రజలు ఎంతగానో నష్టపోయారన్నారు. అసెంబ్లీలో శుక్రవారం 'తెలంగాణ భూ హక్కులు–సంస్కరణలు' అనే అంశంపై జరిగిన లఘుచర్చలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఆ పెద్దమనిషి చేసిన పాప ఫలితాన్ని తెలంగాణ ప్రజానీకం అనుభవిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిగా 1973లో పీవీ నరసింహారావు భూపరిమితి చట్టం తెచ్చి భూస్వాముల వద్ద ఉన్న భూములను పేదలకు పంచారన్నారు. 2006లో వైఎస్.రాజశేఖరరెడ్డి తొలిసారిగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడుభూములకు పట్టాలిచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికీ గిరిజనులు వైఎస్ పట్టా భూములుగానే చెప్పుకుంటున్నారన్నారు. ఎవరి సూచనలు, అభిప్రాయాలను తీసుకోకుండా పెద్దాయన, ఆయన తొత్తుగా ఉన్న ఓ అధికారి కూర్చొని చేసిన చట్టం ధరణి అని...ఇప్పటికీ 1.18 లక్షల భూ ఫిర్యాదులు పెండింగ్‌లోనే ఉన్నాయని చెప్పారు. ధరణి పేరుతో పేదల దగ్గరి నుంచి గత ప్రభుత్వం లాక్కొన్న ఆస్తులను తిరిగి పేదలకు పంచుతామని, మాయమైపోయిన లక్షల ఎకరాలను అర్హులైన వారికి ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ ధరణి వల్ల రెవెన్యూ వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ నవాబ్ నాటి దోపిడీని తలపించేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణితో రైతులను దోపిడీ చేసిందన్నారు. .



ధరణి.. ఓ విప్లవం: పల్లా



రాష్ట్రంలో భూ వివాదాలు లేకుండా చేయాలనే కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారని జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అందరితో చర్చించిన తర్వాతే ధరణి తెచ్చారని, నాలుగు గోడల మధ్య తీసుకున్న నిర్ణయం కాదని చెప్పారు. భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలున్న 18 లక్షల ఎకరాలను పార్ట్ బీలో చేరిస్తే, అందులో కూడా 10 లక్షల ఎకరాలకు సంబంధించిన సమస్యలు పరిష్కారమైనట్టు చెప్పారు. వివిధ కారణాల వల్ల కొన్ని భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లాయన్నారు.

రైతుల ఆత్మహత్యలు, హత్యలకు ధరణే కారణం: సీతక్క



ధరణి ఎంతో అద్భుతంగా ఉందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెబుతుండగా మంత్రి సీతక్క కలగజేసుకున్నారు. ధరణి అంటేనే ప్రజలు భయపడే పరిస్థితి వచ్చిందని, రైతుల ఆత్మహత్యలు, హత్యలు పెరిగాయని చెప్పారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌ను తుంగలో తొక్కారని, దీంతో పేదలు భూముల్లో ఫాంహౌస్‌లు వెలిశాయని చెప్పారు. భూమిని ఎవరు సాగుచేస్తున్నారో తెలిపే కాలమ్‌ను తొలగించారని విమర్శించారు.

సోమేశ్‌కుమార్ మాయలో కేసీఆర్ పడ్డారు: కూనంనేని



ధరణితో గ్రామాల్లో అల్లకల్లోల పరిస్థితి ఏర్పడిందని, ప్రజలకు పనికిరాని ఈ పోర్టల్‌ను రద్దు చేయడం సరైందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమేశ్‌కుమార్ మాయలో పడిన కేసీఆర్ ధరణితో ప్రజలకు ఎన్నో ఇబ్బందులు కలిగించారని చెప్పారు. కాంగ్రెస్ చేపట్టే సంస్కరణల్లో కాస్తు కాలమ్ పెట్టాలని, కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు.

అవినీతిపరుల పేర్లు ఎందుకు చెప్పడం లేదు: మహేశ్వర్‌రెడ్డి



ధరణితో లక్షల ఎకరాల భూములు మాయమయ్యాయని, రూ.2 లక్షల కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ పార్టీ గతంలో ఆరోపించిందని, ఆ వివరాలు ఇప్పుడు ఎందుకు బయటపెట్టడం లేదని బీజేపీ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. ధరణితో లాభపడ్డ బీఆర్‌ఎస్ నాయకుల పేర్లు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ధరణి అక్రమాలపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని కోరారు.

వక్ఫ్ భూములను పరిరక్షించిన వైఎస్: అక్బరుద్దీన్ ఒవైసీ



అనేక లోపాలతో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ కారణంగానే బీఆర్‌ఎస్ ఎన్నికల్లో ఓడిందని, అదే కాంగ్రెస్ విజయానికి కారణమైందని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ధరణితో ఎంతోమంది అక్రమంగా ప్రభుత్వ, పేదల భూములను తమ పేరిట చేసుకున్నారని, అక్రమాలకు పాల్పడిన వారిని జైలుకు పంపాలని కోరారు. వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వక్ఫ్ భూముల పరిరక్షణకు ఎన్నో చర్యలు తీసుకున్నారని, ఆయన గొప్ప నేత అని అక్బరుద్దీన్ గుర్తు చేసుకున్నారు. రెండోసారి వక్ఫ్‌బోర్డు భూములను సర్వే చేయించింది వైఎస్ అని చెప్పారు.



కార్యకారణ స్వరూపుడైన ఆ పరబ్రహ్మ తత్వాన్ని తెలుసుకొనడంతోనే
ఈ జీవాత్మ హృదయంలోని చిక్కుముడులు వీడిపోతాయి.
సంశయాలన్నీ తొలగిపోతాయి.
– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 3 ఆగస్టు 2024

పారదర్శకతే సరైన మార్గం

యాదృచ్ఛికమే కావొచ్చుగానీ... జాతీయ స్థాయి పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు వరసపెట్టి లీక్ అవుతున్న తరుణంలోనే ట్రెయినీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ ఎంపిక వ్యవహారం బద్దలై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శిగా పనిచేసి నాలుగేళ్ల క్రితం రిటైరైన ప్రీతి సుదాన్‌కు సంస్థ సారథ్యం అప్పగించారు. ఆమె యూపీఎస్సీని చక్కదిద్దుతారన్న నమ్మకం అందరిలోవుంది.సాధారణంగా ప్రశ్నపత్రాల లీక్ ఉదంతాలు చోటుచేసుకున్నప్పుడల్లా యూపీఎస్సీని అందరూ ఉదాహరణగా చూపేవారు. దాన్ని చూసి నేర్చుకోవాలని హితవు పలికేవారు. అలాగని యూపీఎస్సీపై అడపా దడపా ఆరోపణలు లేకపోలేదు. ముఖ్యంగా అంగవైకల్యం ఉన్నట్టు చూపటం, తప్పుడు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు దాఖలుచేయటం వంటి మార్గాల్లో అనర్హులు సివిల్ సర్వీసులకు ఎంపికవుతున్నారన్న ఆరోపణలు అధికం. ఫలితాల ప్రకటనలో ఎడతెగని జాప్యం సరేసరి. అయితే వీటికి సంతృప్తికరమైన సంజాయిషీలు రాలేదు. పరీక్ష నిర్వహణ మాటెలావున్నా ధ్రువీకరణ పత్రాల తనిఖీకి ఆ సంస్థ పకడ్బందీ విధానాలు పాటించడం లేదన్న విమర్శలున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏదో క్రమంలో పొరపాట్లు చోటుచేసుకునే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. వెనువెంటనే ఆరా తీసి సరిదిద్దుకుంటే అవి పునరావృతమయ్యే అవకాశాలు ఉండవు. విమర్శలు, ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ తక్షణం స్పందించే లక్షణం ఉండాలంటే జవాబుదారీతనం, పారదర్శకత తప్పనిసరి. అవి లోపించాయన్నదే యూపీఎస్సీపై ప్రధాన ఫిర్యాదు. ఒకపక్క అభ్యర్థులకు నైతిక విలువల గురించి ప్రశ్నపత్రం ఇస్తూ అలాంటి విలువలు సంస్థలో కిందినుంచి పైవరకూ ఉండటంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని గుర్తించకపోతే అంతిమంగా నష్టం కలిగేది సంస్థకే. పూజ గురించిన వివాదాలు సామాజిక మాధ్యమాల్లో బయటికొచ్చాక ఇప్పటికే సర్వీసులో చేరిన కొందరిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. కాళ్లకు సంబంధించి అంగ వైకల్యం ఉన్నట్టు చూపి ఉద్యోగం పొందారంటూ ఒక అధికారి వీడియో బయటికొచ్చింది. అందులో ఆయన నిక్షేపంగా ఉండటమేగాక సైక్లింగ్, రన్నింగ్ చేస్తున్నట్టు కనబడుతోంది. ఆయన నిజంగానే అలాంటి తప్పుడు పత్రంతో చేరారా లేక ఆ అధికారిపై బురద జల్లారా అనేది తెలియదు. తక్షణం స్పందించే విధానం రూపొందించుకుంటే తప్పుడు ఆరోపణలు చేసినవారిపై చర్య తీసుకునే వీలుంటుంది. లేదా సంబంధిత అధికారినుంచి సంజాయిషీ కోరే అవకాశం ఉంటుంది. రెండూ లేకపోతే ఎవరికి తోచినవిధంగా వారు అనుకునే పరిస్థితి ఏర్పడుతుంది.

యూపీఎస్సీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న మనోజ్ సోనీ రాజీనామా ఉదంతంలో కూడా సక్రమంగా వ్యవహరించలేదు. నిరుడు మే 16న చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సోనీ అయిదేళ్ల కాలవ్యవధికి చాలా చాలా ముందే ఎందుకు తప్పుకున్నారు? చూసేవారికి స్పష్టంగా పూజ ఎంపిక వ్యవహారం తక్షణ కారణంగా కనబడుతుంది. కానీ ఆ సంస్థ అదేం కాదంటోంది. 'వ్యక్తిగత కారణాలే' అని సంజాయిషీ ఇస్తోంది. అటు కేంద్రం సైతం ఏమీ మాట్లాడదు. దీనివల్ల ప్రజల్లో అనుమానాలు తలెత్తితే... మొత్తంగా అది సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయదా? అభ్యర్థులు తాము బాగా రాసినా అక్కడేదో జరిగిందన్న అపోహలుపడే పరిస్థితి తలెత్తదా? అసలు ఇలాంటివి జరుగుతున్నాయన్న నమ్మకాలు బలపడితే అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకూ, ఆ తర్వాత ఇంటర్వ్యూలకూ హాజరు కాగలరా? నూతన సారథి ఈ అంశాలపై ఆలోచన చేయాలి. పూజ ఉదంతంలో కోల్పోయిన విశ్వసనీయతను పెంపొందించుకోవటానికి ఏమేం చర్యలు అవసరమన్న పరిశీలన చేయాలి. అభ్యర్థుల మదింపు విషయంలో అనుసరించే విధానాల గురించి... ముఖ్యంగా వారి జవాబుపత్రాల దిద్దుబాటుకూ, ఆ తర్వాత జరిగే ఇంటర్వ్యూలో అభ్యర్థులిచ్చే జవాబుల ద్వారా వారి శక్తియుక్తులనూ, సామర్థ్యాన్ని నిర్ధారించే పద్ధతులకూ ఎలాంటి ప్రమాణాలు పాటిస్తారో తెలపాలి.

చదువుల్లో, సమస్యలను విశ్లేషించే సామర్థ్యంలో మెరికల్లా ఉండటం, సమాజంలో అపరిష్కృతంగా మిగిలిపోతున్న అంశాల విషయంలో ఏదో ఒకటి చేయాలన్న తపన, తాపత్రయం ఉండటం, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించటం సివిల్ సర్వీసుల అభ్యర్థులకు అవసరమని చాలామంది చెబుతారు. నిజానికి ఈ సర్వీసుల్లో పనిచేసేవారి జీతభత్యాలకు అనేక రెట్లు అధికంగా సాఫ్ట్‌వేర్ రంగంలో లేదా వ్యాపారాల్లో మునిగితేలేవారు సంపాదిస్తారు. అందుకే ఎంతో అంకిత భావం ఉండేవారు మాత్రమే ఇటువైపు వస్తారు. కానీ అలాంటివారికి యూపీఎస్సీ ధోరణి నిరాశ కలిగించదా? నీతిగా, నిజాయితీగా పాలించటం చేతకాని పాలకుల ఏలుబడిలో పనిచేయాల్సి వచ్చినప్పుడు సర్వీసులో కొత్తగా చేరిన యువ అధికారులు ఎంతో నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారు. అసలు యూపీఎస్సీయే నిర్లక్ష్యం లోనికో, నిర్లిప్తత లోనికో జారుకుంటే ఎవరిని నిందించాలి? పూజా ఖేడ్కర్‌కు సంబంధించి ఇంకా దోష నిర్ధారణ జరగలేదు. ప్రస్తుతం ఆమె కేవలం నిందితురాలు మాత్రమే. పునః శిక్షణకు రావాలన్న సూచనను బేఖాతరు చేయటంతో ఇప్పటికే యూపీఎస్సీ ఆమె ఎంపికను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. మరోపక్క పోలీసులూ, యూపీఎస్సీ నియమించిన కమిటీ ఆమె సమర్పించిన ధ్రువీకరణ పత్రాలపై ఆరా తీస్తున్నారు. ఆమె ముందస్తు బెయిల్ దరఖాస్తును న్యాయస్థానం తిరస్కరించింది. ఈ పరిణామంతో ఆమె దుబాయ్‌కి పరారీ అయ్యారన్న కథనాలు కూడా మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఈ ఉదంతంలోనైనా జరిగిందేమిటో వివరిస్తే, ఇది పునరావృతం కాకుండా తీసుకున్న చర్యలేమిటో చెబితే యూపీఎస్సీపై విశ్వసనీయత పెరుగుతుంది. దాని ప్రతిష్ఠ నిలబడుతుంది.

బడ్జెట్‌లో సామాజిక న్యాయం ఉందా?

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెలు, అక్షరాలు అపురూపంగా ఉన్నాయి. కానీ దళిత, బహుజన, మైనారిటీలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారని చెప్పక తప్పదు. ప్రధానంగా బడ్జెట్‌కు ఉండే రాజ్యాంగ స్పృహ తగ్గింది. దళితులకు భూమి, ఉపాధి, సాంకేతిక జ్ఞానం, నైపుణ్యం అందించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. భారతదేశ ఆర్థిక ఉత్పత్తిలో దళిత బహుజనులను భాగస్వామ్యం చేసినప్పుడే దేశ సంపద పెరుగుతుందని అంబేడ్కర్ అన్నారు. వారికి బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు వారి జీవనాభివృద్ధిని నిర్లక్ష్యం చేసేలాగానే ఉన్నాయి. మురుగువాడల నిర్మూలనకు, నూత్న పారిశ్రామిక వాడల నిర్మాణానికి పథకాలు లేవు. వ్యవసాయం, విద్య, ఉపాధి లాంటివాటి విషయంలోనూ బడ్జెట్ ఏ దూరదృష్టినీ కనబరచలేదు.

2024–25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెలు, అక్షరాలు అపురూపంగా ఉన్నాయి. కానీ దళిత, బహుజన, మైనారిటీలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యారని చెప్పక తప్పదు. పన్ను చెల్లింపు దారులకు బడ్జెట్ అనుకూలంగా ఉంది. ప్రధానంగా బడ్జెట్‌కు ఉండే రాజ్యాంగ స్పృహ తగ్గింది. భారతదేశ ఆర్థిక ఉత్పత్తిలో దళిత బహు జనులను భాగస్వామ్యం చేసినప్పుడే దేశ సంపద పెరుగుతుందని అంబేడ్కర్ అన్నారు. దళితులు శ్రామిక శక్తులు. వారికి భూమి, ఉపాధి, సాంకేతిక జ్ఞానం, నైపుణ్యం అందించినప్పుడే భారతదేశ సంపద పెరుగుతుంది.

భారతదేశం ముఖ్యంగా గ్రామీణ వ్యవసాయిక దేశం. ఈ బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి 2.66 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు. నిజానికి గ్రామాల్లో ఊరు వేరుగా ఉంది, దళితవాడ వేరుగా ఉంది. దళిత వాడకు విద్యుత్ సౌకర్యం లేదు. మంచినీటి సదుపాయం లేదు. మురుగు నీటి వ్యవస్థ లేదు. రోడ్లు లేవు. దళితులు 3, 4 కుటుంబాలు ఒక్క సెంటులో జీవిస్తున్నారు. భారత గ్రామాలను చూసిన విదేశీ పరిశోధకులు ఇది స్పృశ్య భారతమా? అస్పృశ్య భారతమా? అని అడుగుతున్నారు. గ్రామాల్లో ఉన్న వృత్తికారులు పట్టణాలకు వెళ్ళి మురుగువాడల్లో జీవిస్తున్నారు. నివాసానికి ఇళ్ళులేక మురుగు కాలువల మీద చెక్కబద్దలు వేసుకొని వాటిమీద బతుకుతున్నారు. ఈ మురుగువాడల నిర్మూలనకు, నూత్న పారిశ్రామిక వాడల నిర్మాణానికి పథకాలు లేవు. గ్రామీణాభివృద్ధి పథకం కింద 25 వేల గ్రామీణ జనావాసాలు ఉన్న దగ్గర శాశ్వత రహదారులు నిర్మిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అనేక దళితవాడలు, గిరిజన వాడలకు ఇంత జనాభా ఉండదు. అందుకే ఇది పన్ను కట్టేవారి బడ్జెట్‌గానే మన ముందుకు వచ్చింది. నిజానికి గిరిజన గ్రామాలు ఇంకా ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక సంక్షోభంలోనే ఉన్నాయి. గర్భవతిగా ఉన్న వారిని డోలీల్లో మోసుకొచ్చే పరిస్థితుల్లోనే ఉన్నారు. వారికి కేటాయించిన అతి స్వల్ప నిధి వారి జీవనాభివృద్ధిని నిర్లక్ష్యం చేసేలాగానే ఉంది.

ఇకపోతే వ్యవసాయ రంగానికి ఇచ్చిన కేటాయింపుల్లో దూరదృష్టి లేదనీ, రైతులకు మేలు జరిగే అంశాలు లేవనీ రైతు సంఘాల నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. 'కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చట్టబద్ధతపై ఎలాంటి ప్రకటన చేయలేదని కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) నాయకుడు సర్వన్ సింగ్ పంఢేర్ అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ స్పందిస్తూ, వ్యవసాయ రంగానికి కేటాయింపు పెరగాల్సిందన్నారు. రైతులకు సంబంధించినంత వరకు ఇది ఫ్లాప్ బడ్జెట్ అని మరొక రైతు నేత హర్మీత్ సింగ్ కడియన్ వ్యాఖ్యానించారు. పంజాబ్ రైతులకు మొండిచేయి చూపిందనీ, వ్యవసాయ వైవిధ్యత ప్యాకేజీగానీ, ఆగ్రో–ఇండస్ట్రియల్ ప్యాకేజీగానీ



ప్రకటించలేదని అన్నారు. మరో విషయం. బడ్జెట్‌లో భారతదేశంలో నిరంతరంగా వస్తున్న తుఫాన్లు, వరదలు, అతి ఉష్ణోగ్రతలు, అతి శీతలాలను పరిష్కరించే విధానాలకు, కార్యక్రమాలకు నిధులు కేటాయించలేదు.

ఇకపోతే భారత దేశానికి ఊపిరిలాంటి విద్యా రంగానికి భారీగా కోత పెట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1.29 లక్షల కోట్లు కేటాయించగా, ఈసారి రూ.1.20 లక్షల కోట్లే ఇచ్చి, తొమ్మిది వేల కోట్లు తగ్గించారు. భారతదేశంలో నిరక్షరాస్యత పెరగడానికి కారణం వయోజన విద్యకు అక్షరాలు రాయాల్సిన స్త్రీలు టీవీలకు బుర్రల్ని అప్పజెప్పడం! కేంద్ర విశ్వ విద్యాలయ స్థాయిలో కూడా ల్యాబులు, లైబ్రరీలు లేవు. పరిశోధకులకు సరైన స్కాలర్‌షిప్‌లు లేవు. భారతదేశంలో ఉన్నత విద్య సరిగా లేక విద్యార్థులు విదేశాలకు వలస పోతున్నారు. నిజానికి విద్యారంగాన్ని దెబ్బతీసే అనేక కోతలు జరిగాయి. ఉన్నత విద్య నియంత్రణ మండలి యూజీసీకి 60 శాతానికి పైగా నిధులు తగ్గించారు. దేశంలో ప్రతిష్ఠాత్మక ఐఐఎంలకు వరుసగా రెండో ఏడాది కూడా కేటాయింపులు తగ్గించారు.

ఇకపోతే మరోపక్క నిరుద్యోగం విపరీతంగా పెరుగుతోంది. ఈ బడ్జెట్‌లో ఉద్యోగ వసతికి ప్రాధాన్యం బాగా తగ్గించారు. భారత దేశాన్ని యువ భారతం అని పిలుస్తున్నారు. యువత దేశ భవిష్యత్‌కు సజీవ శక్తి లాంటిది. కానీ ఈ బడ్జెట్ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలను నిరాకరిస్తోంది. ఇవాళ నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక మత్తు మందులకు, గంజాయికి అలవాటుపడుతున్నారు, నేరాలకు పాల్పడుతున్నారు. వారికి ప్రభుత్వ ఉద్యోగ వసతి కలిగించినట్లయితే వారు నేరస్థులుగా, అర్ధ నేరస్థులుగా జీవించరు. వారిలో వ్యక్తిత్వ నిర్మాణ దక్షత పెరుగుతుంది. ఒక యువకుని వ్యక్తిత్వ నిర్మాణానికి లౌకికవాద భావజాలం, లౌకికవాద దృష్టి, సామాజిక స్ఫూర్తి అన్నీ అవసరం. స్కిల్ నైపుణ్యం ఒక్కటే చాలదు, జీవన నైపుణ్యం కావాలి.

ఇకపోతే ఆంధ్రప్రదేశ్ ముఖ్య పట్టణం అమరావతికి ఇచ్చిన 15 వేల కోట్లను గ్రాంట్‌గా కాక రుణంగా ఇవ్వడాన్ని ప్రతిపక్షాలు తప్పు పడుతున్నాయి. అసలు రాష్ట్ర విభజన ఒప్పందం ప్రకారం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. ఆ రోజున ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించి, ఈ రోజున ఇచ్చే నిధులన్నీ అప్పుగా ఇవ్వడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం ఆశ్చర్యంగా ఉంది. మమతా బెనర్జీ(పశ్చిమ బెంగాల్), స్టాలిన్ (తమిళనాడు), రేవంత్ రెడ్డి (తెలంగాణ), విజయన్ (కేరళ), సిద్ధరామయ్య (కర్ణాటక) లాంటి ముఖ్యమంత్రులందరూ రాష్ట్ర ప్రభుత్వాల అస్తిత్వాన్నీ, ఆర్థిక ప్రజాస్వామ్యాన్నీ దెబ్బతీసేదిగా ఈ బడ్జెట్ ఉందని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం బడ్జెట్‌లో సామాజిక న్యాయం లేదనీ, భారతదేశ ఆర్థిక ప్రగతికి విఘాతం కలిగించే శక్తులకు ఈ బడ్జెట్‌ను అప్పగించే ప్రయత్నం జరుగుతోందనీ అన్నారు.

ఇకపోతే ఉపాధి హామీ రంగానికి ఈ బడ్జెట్‌లో కోతలు విధించి బుద్ధిపూర్వకంగా శ్రామికుల ఆదాయ మార్గాన్ని దెబ్బతీశారని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు. నిజానికి అంబేడ్కర్ బడ్జెట్ నిర్మాణంలో తప్పకుండా భూమి పంపకం ఉండాలనీ, కుల నిర్మూలనా భావం ఉండాలనీ అన్నారు. కులాన్ని నిర్మూలించే భావ చైతన్యం కోసం, ఆచరణాత్మక కార్యక్రమం కోసం బడ్జెట్‌లో తగిన కేటాయింపులు ఉన్నప్పుడే, దేశంలో సామరస్యత, శాంతి ప్రజ్వరిల్లుతాయనీ చెప్పారు. దేశానికి మత సామరస్యం, లౌకికవాద భావన, సామ్యవాద సిద్ధాంత స్ఫూర్తి చాలా అవసరం అని నొక్కి చెప్పారు. దళితులు, ఆదివాసీల సమస్యలను వారి ఎంపీలే మాట్లాడితే అందులో సానుభూతి కాకుండా స్వీయ అనుభవపు గొంతుక వినబడుతుంది. ఒక జగ్జీవన్‌రామ్, ఒక దామోదరం సంజీవయ్య, ఒక ప్రగడ కోటయ్య లాంటివాళ్ల గొంతులు లోక్‌సభలో, రాజ్యసభలో వినిపించేవి. ఇప్పుడు రెండు సభల్లోనూ ఆధిపత్య కులాల ప్రతినిధులే మాట్లాడుతున్నారు. చివరకు రాహుల్ గాంధీని 'నీది ఏ కులం?' అనే దాక పరిస్థితి వెళ్ళింది. వాళ్ళ తాత ఫిరోజ్ గాంధీ ఒక పార్శీ, ఇందిరా గాంధీ కశ్మీరీ బ్రాహ్మణుడైన నెహ్రూ కుమార్తె. అది వర్ణాంతర వివాహం. వాళ్ళ తండ్రి రాజీవ్ గాంధీ, సోనియా గాంధీలది దేశాంతర వివాహం. మూడు తరాలు వర్ణాంతరం చేసుకుంటే వారికి కులం ఉండదు. రాబోయే కాలం కులాంతర సమాజం. అది అందరం తప్పకుండా అర్థం చేసుకోవలసిన విషయం.

ఇప్పుడు దళిత, బహుజన, మైనారిటీ, స్త్రీవాద, లౌకికవాద మేధావులంతా పార్టీలకు అతీతంగా అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ఆలోచించాలి. సామ్యవాద, లౌకికవాద భారతాన్ని నిర్మించడం కోసం నడుం కట్టాలి. అప్పుడే భారతదేశంలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వికాసం కలుగుతుంది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు | 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఒలింపిక్స్‌తో ప్రేరణ



ఇదొక ఆలోచన. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో పిల్లలకు కనీసం ఒక గంటసేపైనా పారిస్ ఒలింపిక్స్ చూపించడం తప్పనిసరి చేయాలి. పిల్లలు చాలా నేర్చుకోవడమే కాకుండా ప్రేరణ పొందుతారు. అన్ని విధాలుగా మంచిది!

– వీరేన్ రస్కిన్హా, హాకీ జట్టు మాజీ కెప్టెన్

యుద్ధం ఆపొచ్చుగా!



2020 నుంచి బైడెన్ రష్యాకు దౌత్యపరమైన తలుపులు మూసేశారు. కానీ రష్యా నుంచి చేసుకున్న అతిపెద్ద ఖైదీల మార్పిడిని ప్రచ్ఛన్న యుద్ధం తర్వాతి అతిపెద్ద దౌత్య విజయంగా అభివర్ణిస్తున్నారు. మరి అదే దౌత్యాన్ని ఉక్రెయిన్ యుద్ధం ముగియడానికి ఎందుకు పొడిగించకూడదు?

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

ప్రతిభ చూపకూడదా?



ఒక తెల్ల మహిళను (టెన్నిస్‌లో) గెలిచినప్పుడు సెరెనా విలియమ్స్‌ను మగవాడని నిందించారు. ఒక తెల్ల మహిళను (రన్నింగ్‌లో) గెలిచినప్పుడు కాస్టర్ సెమెన్యాను మగవాడని నిందించారు. ఒక తెల్ల మహిళను (బాక్సింగ్‌లో) గెలిచినప్పుడు ఇమేన్ ఖెలీఫ్‌ను మగవాడని నిందిస్తున్నారు. దీన్నుంచి కావాల్సింది తీసుకోండి!

– ఇసా పెరేజ్, వ్యాఖ్యాత

ఆసియా ఐరాస



క్వాడ్ అనేది ఆసియన్ నాటో కాలేదు. కానీ క్వాడ్ పరిధిలోకి వస్తున్న వాతావరణ మార్పు, ఆరోగ్యం లాంటి విస్తృత అంశాలను బట్టి అది ఆసియన్ ఐక్యరాజ్యసమితి కాగలదేమో!

– హేపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

ఆటలో అరటిపండు



ఔన్నత్యః పురుషుడు నిజ జీవితంలో ఒక మహిళ ముఖాన్ని బద్దలుకొడితే అతడు జైలుకు వెళ్లాల్సి వస్తుంది. కానీ అదే పురుషుడు ఒలింపిక్స్‌లో మహిళ ముఖాన్ని బద్దలుకొడితే మాత్రం పతకానికి అర్హుడా?

– శేఫాలీ వైద్య, జర్నలిస్ట్

వైజ్ఞానిక వేగుచుక్కలు

తొలితరం డాక్టర్, ఫెమినిస్ట్ కూడా!

1864 జనవరి ఒకటో తేదీన బొంబాయిలో ఒక వడ్రంగి కుటుంబంలో జన్మించిన రుక్మాబాయి 11 ఏళ్ల వయసులోనే 19 ఏళ్ల దాదాజీ బికాజీని వివాహం చేసుకున్నారు. మారు తండ్రి... సామాజిక కార్యకర్త, వైద్యుడు అయిన శేఖరం అర్జున్ ప్రోత్సాహంతో ఇంట్లోనే చదువు సాగించారు. సమాజసేవా కార్యక్రమాల వైపూ ఆకర్షితులయ్యారు. ఇల్లరికం వస్తానని మాటతప్పి సోమరిగా తిరుగుతున్న భర్త నుండి విడాకులు పొందడానికి పెద్ద యుద్ధమే చేసి విజయం సాధించారు.



రుక్మాబాయి

'బికాజీ వర్సెస్ రుక్మాబాయి 1885 కేసు'గా ఈ కేసు ఇండియాలోనూ, బ్రిటన్‌లోనూ ప్రసిద్ధి పొందింది. ఒకానొక సందర్భంలో కోర్టు ఆమెకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడంతో విక్టోరియా మహారాణి దృష్టికి తన కేసును తీసుకువెళ్లారు రుక్మాబాయి. మహారాణి ఈ వివాహాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈమె కేసుపై రేగిన చర్చోపచర్చల కారణంగా బ్రిటిష్ ప్రభుత్వం 1891లో 'ఏజ్ ఆఫ్ కాన్సెంట్ చట్టా'న్ని చేశారు. దాంతో అధికారికంగా బాల్యవివాహాలు మనదేశంలో రద్దయ్యాయి.

ఈ వ్యవహారం నడుస్తుండగానే రుక్మాబాయి మరింతగా చదువుకోవాలని భావిస్తే... డాక్టర్ ఎడిత్ పెచాయ్ ఆర్థిక వనరులను పోగు చేశారు. సంప్రదాయానికి వ్యతిరేకంగా పోరాడిన రుక్మాబాయి ధైర్యాన్ని మెచ్చుకుంటూ మహారాజా శివాజీరావు హోల్కర్ రూ. 500 విరాళంగా పంపారు. ఫలితంగా రుక్మాబాయి 1889లో ఇంగ్లండ్ వెళ్లి 1894లో 'లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఫర్ ఉమెన్'లో పట్టా, 'రాయల్ ఫ్రీ హాస్పిటల్'లో శిక్షణ పూర్తిచేసుకుని భారతదేశం తిరిగి వచ్చారు. 1895లో భారతదేశం తిరిగి వచ్చిన రుక్మాబాయి సూరత్‌లోని మహిళల ఆసుపత్రిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా చేరారు. తరువాత 1918లో రాజ్‌కోట్‌లోని 'ఉమెన్స్ స్టేట్ హాస్పిటల్'లో పనిచేయడానికి వెళ్లారు. 1929లో పదవీ విరమణ చేసేదాకా అక్కడే పనిచేశారు. పదవీ విరమణ తర్వాత బొంబాయిలో స్థిరపడిన రుక్మాబాయి 'నిషేధించాల్సిన పరదా' అనే ఒక కరపత్రం ద్వారా పెద్ద ఎత్తున పరదా పద్ధతికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు.

రుక్మాబాయి 91 సంవత్సరాల వయసులో ఊపిరితిత్తుల క్యాన్సర్ కారణంగా 1955 సెప్టెంబర్ 25న కన్నుమూశారు. అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన రుక్మాబాయి విజయగాథ ఎంతో మందికి స్ఫూర్తి కలిగిస్తూనే ఉంది. 2008లో వచ్చిన సుధీర్ చంద్ర పుస్తకం 'ఎన్‌స్లేవ్డ్ డాటర్స్: కలోనియలిజం, లా అండ్ ఉమెన్స్ రైట్స్', అలాగే 2016లో వచ్చిన మరాఠీ సినిమా 'డాక్టర్ రుక్మాబాయి' పెద్ద ఎత్తున విజయం సాధించి, సంచలనాలను నమోదు చేశాయి.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ | ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

కొత్త సీసాలో పాత సారా... పేర్లు మార్చారంతే!

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

భారతీయ న్యాయ సంహిత అనీ, నాగరిక సురక్షా సంహిత అనీ, సాక్ష్య అధినియమం అనీ మన కేంద్రప్రభుత్వం తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలకు పేర్లు పెట్టారు. అలాగే 'భారత్' అనే పేరుతోనే మన దేశాన్ని వ్యవహరించాలనీ తీర్మానించారు. మొత్తం మీద వీలున్నంత ఎక్కువగా 'భారతీయ' పదాన్ని అనేక అంశాలకు తగిలిస్తే కానీ తమ భారతీయ జనతాపార్టీకి మరింత గుర్తింపు వస్తుందనుకుందా ఏమిటి అని విమర్శకులు అంటున్నారు. నిజానికి రాజ్యాంగంలో ఇప్పటికే మన దేశాన్ని 'ఇండియా దట్ ఈజ్ భారత్' అని పేర్కొన్నారు. ఇప్పుడు కొత్తగా భారత్ అనే పిలవాలని అనడంలో అర్థం ఏముంది? అలాగే ఇప్పుడు తీసుకువచ్చిన కొత్త నేర చట్టాల మూలాలూ, అందులోని చాలా అంశాలూ పాత చట్టాల్లోనివే.

మన పాలకులు ఇప్పటివరకు అమలులో ఉన్న మూడు నేర చట్టాలను పాత బ్రిటిష్ కాలపు తుప్పుపట్టిన చెత్త చట్టాలని తప్పు పడుతున్నారు. ఆ మూడు క్రిమినల్ చట్టాల గురించి ఎవరికీ పెద్ద ప్రేమ ఉండనవసరం లేదన్నమాట నిజమే. అయితే 1973లో మన భారతీయ కోడ్‌ను ఆమోదించినది మన పార్లమెంటే కదా. అయినా 'చెత్త, పాత, తుప్పుపట్టిన' అని దాన్ని నిందించడం న్యాయమా?

ఇవీ మన కొత్త చట్టాలు-2



1860 నాటి 'ఇండియన్ పీనల్ కోడ్' తిట్టుకోదగిన పరమ పాత (సనాతన) చట్టంలోని నేర నియమాలను 90కి పైగా కేవలం వాటి నంబర్లు మార్చి కొత్త చట్టంలో చేర్చి సంస్కరణ అనడం ఎంతవరకు సమంజసం? ఇది అవసరమా? దీన్ని మోసం అంటే తప్పా? ఇక సాక్ష్య చట్టం కూడా 95 శాతం పాతదే. అక్షరం కూడా తు.చ. మార్చకుండా పేరు మార్చినంత మాత్రాన ఈ చట్టాలను వినూత్న చట్టాలనే అంటారా?

ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ స్వయంగా 470 ఎంపీ సీట్లు గెలుచుకోబోతోందని భావించి మొత్తం రాజ్యాంగాన్నే పూర్తిగా మార్చేస్తామని కూడా చెప్పుకున్నారు. అయితే ఈ ఎన్నికల్లో బీజేపీకి చాలా తక్కువ స్థానాలు మాత్రమే లభించాయి. చంద్రబాబు నాయుడు తెలుగుదేశం, నితీశ్ కుమార్ జేడీ (యూ) పార్టీ వంటివి లేకపోతే ఎన్డీఏ ఓడిపోయి ఉండేది. వారి మద్దతుతో బలహీనమైన బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం వచ్చింది. దానికే పూర్తి మెజారిటీ ఉంటే ఎటువంటి పరిణామాలు జరిగేవో మరి.

ప్రతిపక్షాలను ఎటూ ప్రభుత్వం పట్టించుకోవడం లేదనుకోండి. కనీసం ఎన్డీఏలోని బీజేపీ మిత్రపక్షాలతోనైనా చర్చించకుండా ఈ కొత్త నేర చట్టాలను యథాతథంగా అమలుచేయడం న్యాయమా? ఆ నేర చట్టాలు అమలు చేయడానికి జూలై 1వ తేదీ 00.00 సమయాన్ని ముహూర్తంగా నిర్ణయించడం సమంజసమేనా? సంకీర్ణంలోని టీడీపీ, జేడీ (యూ) లైనా ఈ చట్టాలపై 'చర్చించడం అవసరం' అని అనలేదే? మిగిలిన ప్రతిపక్షాలూ గట్టిగా ప్రశ్నించలేదు, కేవలం లాంఛనంగా మాత్రం వ్యతిరేకించాయి. తీవ్ర ప్రతిఘటన లేనే లేదు. కనీసం గెలిచిన కొత్త ఎంపీలైనా ఒక్కరంటే ఒక్కరు కూడా ఆలోచించక పోవడం విచిత్రం.

ఇలా ఎవరికి వారు ఈ చట్టాలపై తీవ్ర నిరసనను ప్రకటించకుండా వదిలేస్తే ముందు ముందు ప్రజలు ఇబ్బందుల పాలు అవుతారనడంలో సందేహం లేదు. ఈ చట్టాల రూల్స్, కస్టడీ, లాకప్ నియమాలను దృష్టిలో పెట్టుకొని చూస్తే ఏ క్షణంలో ఏ పౌరుణ్ణయినా పోలీసులు తమ కస్టడీలోకి తీసుకోవచ్చు.

కొన్నిటిని కోడ్‌లు అనీ, మరొక చట్టాన్ని ఆక్ట్ అని ఎందుకు అంటారో చూద్దాం. పీనల్ కోడ్ పేరుతో అనేకానేక నేరాల చట్టాలు ఓ సంపుటిగా ఉన్నప్పుడు దాన్ని 'కోడ్' లేదా స్మృతి అని అంటారు. అలాగే ప్రొసీజర్ అనే వివిధ చట్టాల సంపుటాన్ని కూడా కోడ్ అంటాం. సాక్ష్యానికి సంబంధించిన అనేక నియమాలను ఒకే చట్టం (ఆక్ట్)గా విభజించినారు. అవి 1. ఐపీసీలో నేరాలకు నిర్వచనాలు, శిక్షలు, మినహాయింపులకు సంబంధించిన నియమాలను పీనల్ కోడ్ 2. ప్రక్రియకు సంబంధించిన అనేక నియమాలు (ప్రొసీజర్ కోడ్). 3. సాక్ష్యాల నియమాలు వివరించే చట్టం. ప్రధానమైన ఈ మూడింటినీ కలిపి 'క్రిమినల్ లా' అంటారు. నేరాల గురించిన 'పీనల్ కోడ్–1860' మనకు 164 సంవత్సరాల నుంచి 'ఐపీసీ'గా తెలుసు. దీనితోపాటు 'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973', 'ఎవిడెన్స్ ఆక్ట్ 1872'లను కలిపి క్రిమినల్ చట్టాలు అంటున్నాం. ఏతావాతా చెప్పొచ్చేది ఏమిటంటే... పాత చట్టాలను మరింత ప్రమాదకరంగా మార్చి పోలీసులకు విశేష అధికారాలు కల్పించారని. ఒక్క మాటలో ఇవి 'కొత్త సీసాలో పాత సారా!'

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

సత్యపాలనలో విచక్షణ

శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పిన ఒక సందేశాత్మక కథ ఇది. కౌశికుడనే బ్రాహ్మణుడు ఒక నదీ సంగమ పుణ్య క్షేత్రంలో నివసిస్తూ, సత్యమే పలకాలనే వ్రతం పట్టి, సత్యవాదిగా ప్రసిద్ధుడయ్యాడు. నిరంతరం తపస్సు చేస్తూ ఉండేవాడు. ఒకనాడు కొందరు జనులు దొంగలు వెంటపడుతుంటే భయంతో ఇతని ఆశ్రమ ప్రాంతంలో ఉన్న పొదలలో దాక్కున్నారు. దొంగలు వచ్చి, కౌశికుని ఆ జనం ఎటు వైపు వెళ్లారని అడిగారు. తనకు అసత్య దోషం రాకూడదని అతడు, వాళ్ళు ఉన్న పొదల వైపు చూపించి చెప్పాడు. ఆ దొంగలు వారిని చంపి ధనాన్ని దోచుకున్నారు. కౌశికుడు తాను చేసిన దోషానికి నరకాన్ని పొందాడని కృష్ణుడు చెప్పాడు.



జ్యోతిర్మయం

భారత యుద్ధంలో, కర్ణుని ఆ రోజు చంపలేదని తెలిసి ధర్మరాజు, అర్జునుని పరాక్రమాన్ని అవమానిస్తాడు. గాండీవాన్ని కృష్ణునికిచ్చి, అర్జునుని రథం నడపమంటాడు. అప్పుడు అర్జునుడు కోపంతో తన గాండీవాన్ని ఇతరులకిమ్మని ఎవరైనా అంటే వారిని చంపుతానని చిన్నతనంలోనే ప్రతిజ్ఞ చేశానని, చెప్పి ధర్మరాజుని చంపబోతాడు.

కృష్ణుడు వారించి, చేయవలసిన పనిలో ధర్మ సూక్ష్మాన్ని గ్రహించమని, చిన్నప్పుడు లోకం తీరు తెలియనప్పుడు చేసిన ప్రతిజ్ఞను, విషయం తెలిసిన పెద్దలు ఎవరూ పట్టించుకోరని, ప్రతిజ్ఞా పాలనలో వివేకం అవసరమని చెబుతాడు.

అర్జునుడిది వ్యర్థ ప్రతిజ్ఞ కాకుండా ఉండటానికి ధర్మరాజుని నిందించి, తర్వాత నమస్కరించి ఆశీస్సులు పొందమని కృష్ణుడు చెపుతాడు.

ఆ సందర్భంలో కృష్ణుడు అర్జునునికి ఈ కథ నిదర్శనంగా చెప్పి, సత్యాసత్య నిరూపణలో వివేకాన్ని పాటించాలని చెపుతాడు. అసత్య దోషం కలుగుతుందని, ప్రతిజ్ఞా భంగం అవుతుందనే భయంతో హింసకు దారి తీసే, ధర్మానికి హాని చేసే పని చేయకూడదు. కౌశికుడు అలా చేసినందువల్లే జనులు దొంగల చేతిలో ప్రాణాలు కోల్పోయారు. అతనికీ హాని జరిగిందని కృష్ణుడు చెప్పాడు. సత్యవ్రత పాలనలో వివేకం అవసరమని దీని సారాంశం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.చతుర్దశి ప.3.35 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** పునర్వసు ప.12.48 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** రా.9.09 నుండి 10.49 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.42 నుండి 7.24 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.20 నుండి 11.58 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.30.

కేటాయించినవి ఖర్చు చేయలేదు

- అసెంబ్లీ ఆమోదం లేకుండానే కొన్ని పద్దుల్లో భారీ ఖర్చు
- భారీగా పన్నేతర రాబడుల అంచనాలు.. ద్రవ్యలోటును తక్కువగా చూపెట్టారు
- రుణాలు, అడ్వాన్సులు, అనివార్య ఖర్చులు పెరిగిపోయాయి
- ఆర్థిక నిర్వహణ విషయంలో గత ప్రభుత్వానికి కాగ్ అక్షింతలు
- సభలో రెవెన్యూ, ఆర్థిక రంగాల కాగ్ నివేదిక ప్రవేశ పెట్టిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తప్పు పట్టింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను తన నివేదికలో అప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వానికి అక్షింతలు వేసింది. కేటాయింపులు, ఖర్చులు ఇష్టారాజ్యంగా జరిగాయని, కొన్ని పద్దుల్లో కేటాయించిన నిధులు ఖర్చు చేయలేదని, కొన్ని పద్దుల్లో మాత్రం అసెంబ్లీ ఆమోదం పొందకుండానే ఇష్టమొచ్చినట్టు ఖర్చు పెట్టిందని ఆక్షేపించింది. డబుల్‌బెడ్‌ రూం ఇళ్లకు రూ.11వేల కోట్లు, గొర్రెలు, మేకల కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు, ఆయిల్‌పామ్ పెంపకానికి రూ.1000 కోట్లు, దళిత బంధు కింద రూ. 15,700 కోట్లు, రైతులకు రుణమాఫీ కింద కేటాయించిన రూ.3,964 కోట్లు ఖర్చు చేయకపోవడాన్ని తప్పు పట్టింది. 2014–21 వరకు రూ.2,89,115 కోట్ల అధిక వ్యయం జరిగిందని కూడా వెల్లడించింది. గత మూడేళ్ల పన్నేతర రాబడుల అంచనాలను భారీగా వేశారని, కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయక గ్రాంట్లు రాకపోయినా అవే అంచనాలను రూపొందించారని తెలిపింది. సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.2,06,977 కోట్లు ఎక్కువగా పెరిగిందని, పాలమూరు–రంగారెడ్డికి రూ.12,937 కోట్లు, కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.11,370 కోట్ల మూలధన వ్యయం ఎక్కువగా జరిగిందని వెల్లడించింది. ద్రవ్యలోటును ఆ ఆర్థిక ఏడాదిలో రూ.2,749 కోట్లు తక్కువగా చూపెట్టారని తెలిపింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో అనివార్య ఖర్చులు 43 శాతానికి చేరాయని, రుణాలు, అడ్వాన్సులు 150 శాతం పెరిగి మొత్తం బడ్జెట్‌లో 11 శాతానికి చేరాయని వెల్లడించింది. బడ్జెట్ వెలుపలి రుణాల విషయంలో స్పష్టత లేదని, డిస్కంల అప్పులను రూ.16వేల కోట్ల మేర తక్కువగా చూపెట్టారని కూడా కాగ్ ఆక్షేపించింది. ఈ మేరకు రెవెన్యూ, ఆర్థిక రంగాల కాగ్ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టింది.

పురపాలకశాఖ ఖర్చు చేసింది రూ. 7,990 కోట్లు

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 2022–23 సంవత్సరంలో కేటాయించిన రూ.10,591 కోట్లలో ఖర్చు చేసిన మొత్తం రూ. 7,990 కోట్లు మాత్రమే. ఈ విషయాన్ని కాగ్ తన నివేదికలో స్పష్టం చేసింది. గ్రాంట్ కింద కేటాయించిన ఈ మొత్తంలో రూ. 3,832 కోట్లు సరెండర్ చేసిన మొత్తంగా పేర్కొంది. ఇందులో మెట్రో కనెక్టివిటీకి కేటాయించిన రూ. 500 కోట్లు పనులు ప్రారంభించనందున ఖర్చు కాలేదు. ఎయిర్‌పోర్టు మెట్రో కనెక్టివిటీకి కేటాయించిన రూ.378 కోట్లు కూడా అదే పరిస్థితిలో ఖర్చు కాలేదు. ఓఆర్‌ఆర్‌కు కేటాయించిన రూ.200 కోట్లు విడుదల కాలేదు. హైదరాబాద్ పట్టణ సముదాయం కోసం కేటాయించిన రూ.151 కోట్లు, భూముల సేకరణకు కేటాయించిన రూ.100 కోట్లు కూడా వెనక్కి వెళ్లాయి. మూలధన విభాగం కింద రూ.151 కోట్లలో కేవలం రూ. 20,000 మాత్రమే వినియోగించబడినట్లు తెలిపింది.

కాంపాలో మిగిలిన రూ.1,114 కోట్ల బ్యాలెన్స్

2022–23 ఆర్థిక సంవత్సరం చివర్లో రాష్ట్ర ప్రత్యామ్నాయ అటవీకరణ నిధిలో (కాంపా) రూ.1,114 కోట్ల మొత్తం మేర బ్యాలెన్స్ మిగిలిపోయిందని కాగ్ పేర్కొంది. ఈ ఏడాది సందర్భంగా రూ.68 కోట్లు ఈ నిధిలోకి జమచేసి, మొత్తంగా ఈ నిధినుంచి రూ.404 కోట్లు కేటాయించిందని తెలిపింది. 2019 ఫిబ్రవరిలో తెలంగాణ ప్రభుత్వం 'స్టేట్ కాంపన్సెటరీ అఫారెస్టేషన్ ఫండ్'ను ఏర్పాటు చేసిందని వెల్లడించింది.

తెలంగాణ హరితనిధికి అసెంబ్లీ ఆమోదం లేదు

కాగ్ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఖాతాకు (గవర్నమెంట్ అకౌంట్) వెలుపల తెలంగాణ హరితనిధి ఏర్పాటు వల్ల అందులోకి వచ్చే డబ్బు బయటే ఉండటంతో దీనిద్వారా అయ్యే వ్యయంపై శాసనసభ పర్యవేక్షణ లేకుండా పోయే అవకాశముంటుందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) పేర్కొంది. అందువల్ల ఈ నిధి ఏర్పాటుకు అసెంబ్లీ ఆమోదం (లెజిస్లేటివ్ అప్రూవల్) లేదని స్పష్టంచేసింది. దీంతో ఈ నిధి ఏర్పాటుకు అసెంబ్లీ ఆమోదం అవసరం లేదని, ఇది అధికార (ఎగ్జిక్యూటివ్ డొమైన్) పరిధిలోకి వస్తుందని 2023, ఆగస్టులో పీసీసీఎఫ్ పేర్కొన్నారని తెలిపింది. అయితే ఏ అధికారంతో ఈ నిధిని ఏర్పాటు చేశారనేది మాత్రం పేర్కొనలేదంది. 2025లో తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించగా, 2021 అక్టోబర్‌లో అప్పటి ముఖ్యమంత్రి తెలంగాణ హరితనిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారని తెలిపింది. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, సమాజంలోని ఇతర వర్గాల నుంచి విరాళాల రూపంలో వసూలుకు వీలు కల్పించారని వెల్లడించింది. ఈ నిధి నిర్వహణ విషయంలో అటవీశాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్నట్లు అందులో తెలిపారంది. దీని కింద వివిధ వర్గాల నుంచి సేకరించిన విరాళాలను భారతీయ స్టేట్‌బ్యాంక్ తెలంగాణ గ్రీన్‌ఫండ్ ఖాతాలో ఉంచారని వెల్లడించింది. దీని ద్వారా 2023, మార్చి 31 నాటికి రూ.35 కోట్ల విరాళాలను సేకరించగా, అందులో రూ.15 కోట్లు ఖర్చుచేయడంతో రూ.20 కోట్లు మిగులుగా ఉన్నాయని పేర్కొంది. ఈమేరకు శుక్రవారం అసెంబ్లీకి కాగ్ నివేదికను సమర్పించింది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగ్గిన సిజేరియన్ ప్రసవాలు

60 నుంచి 39 శాతానికి తగ్గినట్లు కాగ్ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో 2017–18 మధ్య కాలంలో 60 శాతంగా ఉన్న సిజేరియన్ ప్రసవాలు 2021–22 నాటికి 39 శాతానికి తగ్గాయని కాగ్ నివేదిక వెల్లడించింది. కాగా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాత్రం అదే కాలంలో 40 శాతం నుంచి 61 శాతానికి పెరిగాయని పేర్కొంది. 2019 నాటికి కంటివెలుగు పథకం కింద 1.55 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించారని తెలిపింది. 2011 లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాకు 35,004 పడకలు అవసరం కాగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 27,996 పడకలు అందుబాటులో ఉన్నాయంది. ఫలితంగా 7,008 పడకల కొరత ఏర్పడిందని కాగ్ పేర్కొంది. తెలంగాణలో వైద్యుల లభ్యత పెరుగుతున్న ధోరణి ఉందని కాగ్ వెల్లడించింది. 881 మందికి ఒక వైద్యుడు అందుబాటులో ఉన్నారని ప్రస్తావించింది. మంజూరైన పోస్టులకు ఆస్పత్రుల్లో ఉన్న సిబ్బందికి భారీ తేడా ఉందని తెలిపింది. 45 శాతం ఖాళీలు ఉన్నాయంది. 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అసోసియేట్ కేడర్‌లో 48 శాతం, అసిస్టెంట్ ప్రొఫెసర్/ట్యూటర్ల కేడర్‌లో 40 శాతం ఖాళీలు ఉన్నట్లు పేర్కొంది. దీంతో వైద్య విద్య నాణ్యతపై ప్రభావం చూపుతుందని ప్రస్తావించింది.

గ్రామీణాభివృద్ధి నిధిని వాడుకోలేదు

కాగ్ ఆక్షేపణ

సాక్షి, హైదరాబాద్: గ్రామీణాభివృద్ధి నిధి (రూరల్ డెవలప్‌మెంట్ ఫండ్) కింద రూ.1,430 కోట్ల మేర పెద్ద మొత్తంలో నిధులు అందుబాటులో ఉన్నా, వినియోగించుకోకపోవడంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ప్రభుత్వాన్ని తప్పుబట్టింది. 2018–23 వరకు ఐదేళ్ల కాలంలో ఈ నిధిని ఉపయోగించుకోలేదని, 2018–19లో ఈ నిధి ప్రారంభ బ్యాలెన్స్ రూ.1,285 కోట్లకుగాను రూ.145 కోట్లు తన వంతు కాంట్రిబ్యూషన్‌ను ఇవ్వడం మినహా, అప్పటి నుంచి ప్రతీ ఏడాది రూ.1,430 కోట్ల చొప్పున నిధి అందుబాటులో ఉన్నా వినియోగించక పోవడాన్ని కాగ్ ఆక్షేపించింది. శుక్రవారం అసెంబ్లీకి సమర్పించిన నివేదికలో కాగ్ ఈ అంశాన్ని ప్రస్తావించింది.

ఎస్ఎఫ్‌సీని క్రియాశీలం చేయాలి..

రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) యంత్రాంగాన్ని క్రియాశీలం చేసి.. పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాగ్ సూచించింది. ఎస్ఎఫ్‌సీపై తామిచ్చిన నివేదికమీద అవసరమైన చర్యలు చేపట్టాలని సిఫార్సు చేసింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక.. ఏడాదిలోగానే ఎస్ఎఫ్‌సీ ఏర్పాటుపై గత ప్రభుత్వం 2015 మార్చిలో నోటిఫై చేసినా, 2018 జనవరిలో చైర్మన్, ఒక సభ్యుడిని నియమించిందని, అయితే టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌కు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు జారీచేయలేదని పేర్కొంది. ఐతే ఎస్ఎఫ్‌సీ ద్వారానే 2020–25 వరకు కేటాయింపులు, పంచాయతీరాజ్ యాక్ట్, 2018లోని అంశాల వర్తింపు వంటివి చేపట్టిందని తెలిపింది. ఎస్ఎఫ్‌సీ సభ్యుల నియామకంలో జాప్యం, రాజ్యాంగపరంగా తప్పనిసరిగా చేయాల్సిన వాటిని అమలు పరచక పోవడంతో పాటు, తగిన సిఫార్సులు లేకుండానే నిధులు విడుదలయ్యాయని పేర్కొంది.

అంతరిక్ష కేంద్రంలోకి శుభాన్షు శుక్లా

బ్యాకప్‌గా ప్రశాంత్ బాలకృష్ణన్


శుభాన్షు శుక్లా


ప్రశాంత్ బాలకృష్ణన్

న్యూఢిల్లీ: అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా సారథ్యంలో భారతీయ వ్యోమగామి త్వరలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో అడుగుపెట్టబోతున్నాడు. ఇందుకోసం భారతవాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను ఎంపికచేశారు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) మానవసహిత అంతరిక్ష వ్యోమనౌక కేంద్రం (హెచ్ఎస్ఎఫ్‌సీ), నాసా, అమెరికాకు చెందిన ఆక్సియమ్ స్పేస్ సంస్థల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా గగనయాత్రికులను నాసా ఐఎస్ఎస్‌కు తీసుకెళ్లనుంది. మిషన్ పైలట్‌గా గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా వ్యవహరిస్తారు. అనుకోని పరిస్థితుల్లో ఆయన వెళ్లలేకపోతే బ్యాకప్ మిషన్ పైలట్‌గా మరో గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌ను ఐఎస్ఎస్‌కు పంపిస్తారు. వీరికి ఈ వారంలోనే శిక్షణ మొదలవుతుంది. యాక్సియమ్-4 మిషన్ ద్వారా అక్కడకు వెళ్లే శుక్లా ఐఎస్ఎస్‌లో తోటి వ్యోమగాములతో కలిసి శాస్త్ర పరిశోధనలుచేయడంతో పాటు పలు సాంకేతికతలను పరీక్షించనున్నారు. తర్వాత ఐఎస్ఎస్ ఆవల అంతరిక్షంలోనూ గడిపే అవకాశముంది. శుక్లాతోపాటు ఐఎస్ఎస్‌కు అమెరికా, పోలండ్, హంగేరీల నుంచి ఒకరు చొప్పున వ్యోమగామి రానున్నారు. భారత తన సొంత మానవసహిత అంతరిక్ష ప్రయోగాల కోసం నలుగురిని గత ఏడాదే ఎంపికచేసిన విషయం తెల్సిందే. గగన్‌యాన్ మిషన్ కోసం బెంగళూరులోని ఇస్రో వ్యోమగామి శిక్షణా కేంద్రంలో వీరి శిక్షణ కూడా గతంలో మొదలైంది. ఇటీవల రష్యాలోనూ ప్రాథమిక శిక్షణ పూర్తిచేసుకున్నారు. గగన్‌యాన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములను 400 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి తీసుకెళ్లి తిరిగి సురక్షితంగా సముద్రజలాల్లో దింపాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది.

5 వేల కి.మీ. దూరం నుంచి శస్త్రచికిత్స



బీజింగ్: అత్యాధునిక వైద్య విధానాలతో అత్యవసర, ఆకస్మిక వైద్య సేవలు సైతం క్షణాల్లో అందుబాటులోకి వస్తాయని నిరూపితమైంది. చైనాలోని మారుమూల కష్కర్ ఛాతి ఆస్పత్రి ఈ ఘటనకు వేదికగా నిలిచింది. 5జీ టెక్నాలజీ సాయంతో వైద్యుడు 5,000 కిలోమీటర్ల దూరంలోని ఊపిరితిత్తుల రోగికి విజయవంతంగా శస్త్రచికిత్సచేయడం విశేషం. టెక్నాలజీకి ఆధునిక వైద్యవిధానాలు జోడిస్తే అద్భుతాలు సంభవిస్తాయని మరోసారి రూఢీ అయింది. వాయవ్య చైనాలోని గ్జిన్‌జియాంగ్ ప్రావిన్స్‌లోని మారుమూల కష్కర్ ఛాతి ఆస్పత్రిలో నూతన 5జీ సర్జికల్ రోబోట్ వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఊపిరితిత్తుల్లో కణతితో బాధపడుతున్న రోగికి రోబో శస్త్రచికిత్స చేసేందుకు ఇక్కడి నుంచి 5,000 కిలోమీటర్ల దూరంలోని షాంఘై నగరంలోని శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ లూ క్వింగ్‌క్వాన్ సిద్ధమయ్యారు. పలు రోబో చేతులు అమర్చిన 5జీ ఆధారిత రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సునాయసంగా వాడుతూ కేవలం గంటలో రోగి శరీరంలోని కణతిని విజయవంతంగా తొలగించారు.

భారత్‌లోనూ సేవలు మొదలు: ఇలాంటి సేవలు భారత్‌లోనూ అందుబాటులోకి వచ్చాయి. ఎస్ఎస్ఐ మంత్ర ఈ సేవలను చేరువచేసింది. ఐదు రోబో చేతులున్న ఈ వ్యవస్థతో గుండె ఆపరేషన్లనూ చేయొచ్చు. వైద్యుని ముందు 32 అంగుళాల మానిటర్, ఒక 3డీ విజన్ ఉంటాయి. ఇందులో ఒక భద్రతా కెమెరానూ బిగించారు. ఆపరేషన్ చేస్తూ వైద్యుడు మధ్యలో తల పక్కకు తిప్పగానే రోబో ఆపరేషన్‌ను ఆపేస్తుంది. శస్త్రచికిత్సలో ఒక్క సెకన్ కూడా పొరపాట్లు, తప్పిదాలు జరగకూడదనే ఉద్దేశంతో ఈ జాగ్రత్త ఏర్పాటుచేశారు. 8 మిల్లీమీటర్ల సన్నని ఉపకరణాలతో రోబో చేతులు చకచకా ఆపరేషన్ చేసేస్తాయి.

త్వరలో నాపైకి ఈడీ



'చక్రవ్యూహం' ప్రసంగమే కారణం: రాహుల్
చాయ్, బిస్కెట్లతో స్వాగతిస్తానని వెల్లడి

న్యూఢిల్లీ: మరోసారి తనపై ఈడీ దాడులు జరగనున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జోస్యం చెప్పారు. మోదీ సర్కారు తీరును నిశితంగా విమర్శిస్తూ ఇటీవల లోక్‌సభలో తాను చేసిన 'చక్రవ్యూహం' ప్రసంగం వారికి ఈ మేరకు ఆదేశాలందాయన్నారు. ''నా ప్రసంగం సహజంగానే '2 ఇన్ 1'కు నచ్చలేదు. దాని ఫలితంగానే నాపై దాడికి ఈడీ ప్లాన్ చేస్తోంది. ఈడీ లోపలి వ్యక్తులే ఈ మేరకు నాకు ఉప్పందించారు. నేను సిద్ధంగా ఉన్నా. ఈడీకి సాదర స్వాగతం. వారికోసం చాయ్, బిస్కెట్లతో ఎదురు చూస్తుంటా'' అని శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా ప్రకటించారు. భారతీయులను మోదీ ఆధునిక చక్రవ్యూహంలో బంధించి నానా సమస్యలపాలు చేస్తున్నారంటూ లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ ఇటీవల దుయ్యబట్టడం తెలిసిందే.

అమిత్ షాపై కాంగ్రెస్ హక్కుల తీర్మానం



న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్‌లో సంభవించిన విలయంపై ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ముందే హెచ్చరించామంటూ హోం మంత్రి అమిత్ షా జూలై 31న చేసిన ప్రకటన అబద్ధమని కాంగ్రెస్ పేర్కొంది. సభను తప్పుదోవ పట్టించారంటూ కాంగ్రెస్ సభ్యుడు జైరాం రమేశ్ శుక్రవారం రాజ్యసభలో మంత్రి అమిత్ షాపై హక్కుల తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 'కేరళ ప్రభుత్వానికి ముందే హెచ్చరికలు పంపామంటూ అమిత్ షా చేసిన ప్రకటన అబద్ధమని రుజువైంది. సభను తప్పుదోవ పట్టించడం ద్వారా సభా హక్కుల ఉల్లంఘనకు, సభా ధిక్కారానికి ఆయన పాల్పడ్డారు' అని ఆ నోటీసులో జైరాం రమేశ్ పేర్కొన్నారు.

ఆ 300 మంది ఎక్కడ?

శిథిలాల కింద చిక్కుకుంటే వారిని రక్షించేందుకు వ్యూహం సిద్ధం

వయనాడ్/కొల్లామ్: కేరళలో కొండచరియలు పడ్డాక కాపాడండంటూ ఆర్తనాదాలు చేసిన వారిని కాపాడిన సహాయక బృందాలు ఇప్పుడు కనిపించకుండా పోయిన వారిపై ప్రధానంగా దృష్టిపెట్టాయి. ప్రకృతి వినాశక విశాల ఘటనాప్రాంతాల్లో ఇంకా వస్తున్న సెల్‌ఫోన్ సిగ్నళ్ల సాయంతో మనుషుల జాడను గుర్తించే అత్యాధునిక పరికరాలను తెప్పిస్తున్నారు. సెల్‌ఫోన్ చివరి లొకేషన్‌ను అత్యంత ఖచ్చితత్వంతో చూపించే గూగుల్ జీపీఎస్ కోఆర్డినేట్స్, డ్రోన్ ఏరియల్ ఫొటోల సాయంతో శిథిలాలు, కూలిన చెట్లు, బండరాళ్ల మధ్యలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు విశ్వప్రయత్నం చేయనున్నారు. ముండక్కై, చూరల్మల, అత్తమల, నూల్పుజ కుగ్రామాల్లో మరణాల సంఖ్య తాజాగా 300 దాటింది. గుర్తు తెలియని మృతదేహాలకు సామూహిక దహనసంస్కారాలు చేస్తున్నారు.

బృందాలుగా ఏర్పడి బరిలోకి..

దాదాపు 300 మంది జాడ ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు చెప్పారు. కొండచరియలు పడి విస్తరించిన మొత్తం ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. శునకాలతోపాటు స్థానికులు, అటవీశాఖ సిబ్బంది మొత్తం 40 బృందాలుగా ఏర్పడి గాలింపు ముమ్మరంచేశారు. అత్తమల అరాన్‌మల, ముండక్కై, పుంచిరిమట్టం, వెల్లరిమల, జీవీహెచ్ఎస్ఎస్ వెల్లరిమల, నదీతీరం ఇలా కొండచరియల ప్రభావిత ప్రాంతాలను ఆరు జోన్లుగా విభజించారు. ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, డీఎస్‌జీ, కోస్టుగార్డ్, నేవీ, స్థానిక యంత్రాంగం, కేరళ పోలీసులు, స్థానికులు, అటవీ సిబ్బంది, గజ ఈతగాళ్ల సంయుక్తంగా ఈ సంక్లిష్టమైన రెస్క్యూ ఆపరేషన్‌ను మొదలుపెట్టారు. డ్రోన్ ఆధారిత అత్యాధునిక రాడార్‌ను ఢిల్లీ నుంచి తేనున్నారు. 190 అడుగుల బేలీ తాత్కాలిక వంతెన నిర్మాణం పూర్తవంతో భారీ యంత్రాలను తెచ్చేందుకు మార్గం సుగమమైంది.


బాధితులతో రాహుల్, ప్రియాంక

కేంద్రం శ్రద్ధతో పట్టించుకోవాలి: రాహుల్

గురువారం ఘటనాస్థలిని పరిశీలించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం సైతం పనులను పర్యవేక్షించారు. ''ఇది పెను విషాదం. ఈ ఉదంతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధతో పట్టించుకోవాలి. బాధిత కుటుంబాలకు వేరే ప్రాంతాల్లో శాశ్వత పునరావాసం కల్పించాలి'' అన్నారు. వారికి కాంగ్రెస్ 100 ఇళ్ల కట్టిస్తుందన్నారు.

నిక్షేపంగా ఇల్లు, కుటుంబం

ఇంతటి విలయం మధ్య ఒక ఇల్లు నిక్షేపంగా ఉండటం రెస్క్యూ టీమ్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. పడవెట్టు కున్ను ప్రాంతంలో భారీ కొండచరియలు పడినా అక్కడి ఒక ఇల్లు మాత్రం దెబ్బతినలేదు. అయితే చుట్టుపక్కల అంతా కొండచరియలు పడిన భయానక దృశ్యాన్ని చూసిన ఆ ఇంట్లోని నలుగురు కుటుంబసభ్యులు ప్రాణభయంతో మంగళవారం నుంచి ఇంట్లోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఫలానా ప్రాంతంలో తమ వారి జాడ తెలీడం లేదని బంధువులు ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న హెలికాప్టర్ బృందం సురక్షిత ప్రాంతానికి తరలించిందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి.



మేజర్ సీతకు సలామ్

కఠిన, విపత్కర, తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో మహిళలు పనిచేయడం కష్టమనే భావనను ఒక్క ఫొటోతో చెదరగొట్టిన ఆర్మీ మేజర్ సీత అశోక్ శెల్కేకు అందరూ మెచ్చుకుంటున్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నది మీదుగా 190 అడుగుల బేలీ వంతెనను నిర్మించాల్సిన బాధ్యతను మద్రాస్ ఇంజనీర్ గ్రూప్, సెంటర్ తలకెత్తుకుంది. మేజర్ సీత సారథ్యంలోని జవాన్ల బృందం రేయింబవళ్లూ పనిచేసి 31 గంటల్లోపు వంతెనను నిర్మించింది. వంతెన నిర్మాణ పనుల్లో నిమగ్నమైన మేజర్ సీత ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. 'భారత సైన్యం తరఫున ఇక్కడికొచ్చి సాయ పడుతున్నందుకు నాక్కూడా గర్వంగా ఉంది. నన్ను నమ్మి ఇంతటి బాధ్యతలు అప్పగించిన ఉన్నతాధికారులకు, సాయపడిన స్థానికులకు నా కృతజ్ఞతలు' అని సీత అన్నారు. సీత సొంతూరు మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ దగ్గర్లోని గడిల్‌గావ్.

పరిమళించిన మానవత్వం

రూ.10 వేలు దానమిచ్చిన చిరు టీస్టాల్ యజమానురాలు

సర్వం కోల్పోయిన శిబిరాల్లో తలదాచుకుంటున్న వారికి చిన్నపాటి టీస్టాల్ యజమానురాలు సైతం తనవంతు సాయంచేసి దానగుణాన్ని చాటారు. రోడ్డు పక్కన టీ అమ్ముకునే వృద్ధ మహిళ సుబేదా కేరళ విలయ బాధితులకు తనవంతుగా రూ.10,000 ఇచ్చారు. ఈమె దానగుణం చూసి అందరూ మెచ్చుకుంటున్నారు. ''బ్యాంక్ రుణం కట్టేందుకే ఈ డబ్బు దాచా. టీవీలో విషాదవార్త విని మనసు చలించింది. నెలవారీ కిస్తీ(ఈఎంఐ) తర్వాత కడదాం .. ముందు వీళ్లను ఆదుకుందాం అని భర్త సైతం నాకు మద్దతు పలికారు. ఆరోగ్యం సహకరించక వయనాడ్‌దాకా వెళ్లి స్వయంగా ఇచ్చే ఓపికలేక కలెక్టరేట్‌కు వెళ్లి ముఖ్యమంత్రి విపత్తు సహాయనిధిలో జమచేశా' అని సుబేదా చెప్పారు. వరద బాధితుల సహాయార్థం గతంలోనూ ఈమె తన నాలుగు మేకలను అమ్మేసి వచ్చిన నగదును విరాళంగా ఇచ్చారు.

మౌలిక ప్రాజెక్టులపైనే పిల్స్ ఎందుకు?

విస్మయం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కీలకమైన రహదారులు వంటి మౌలికరంగ ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్న సమయంలో వాటిని ఆపాలంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యా(పిల్)లు దాఖలు కావడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. గోవాలో వాస్కోడగామా- కులెం సెక్షన్‌లో రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులను నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ కీలకమేనన్న ధర్మాసనం..'హిమాచల్‌లో రోడ్డు పనులపై పిల్ వేశారు. ప్రధాన రహదారులు, హైవేలపై కూడా పిల్‌లు వస్తున్నాయి. మన దేశంలో మాత్రమే ఎందుకిలా జరుగుతోంది?'అని ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. రైలు సౌకర్యం లేని అంతర్జాతీయ రిసార్టు ఏదైనా ఉందా? అని పిటిషనర్‌ను నిలదీసింది. రైల్వే ట్రాక్ డబ్లింగ్ పనులను సవాల్ చేస్తూ దాఖలైన ఇదే పిల్‌ను ముంబై హైకోర్టు గోవా ధర్మాసనం కొట్టేయడాన్ని సమర్థించింది.

ఎలక్టోరల్ బాండ్లపై విచారణ చేయించలేం

ఎలక్టోరల్ బాండ్ల పథకంపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణ చేయించాలంటూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. సంబంధం లేని అంశంపై దర్యాప్తునకు ఆదేశించలేమని శుక్రవారం స్పష్టం చేసింది. కాంట్రాక్టులు కట్టబెట్టినందుకు బదులు(క్విడ్ ప్రొక్వో)గా వ్యక్తులు, సంస్థల నుంచి రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్లను తీసుకున్నాయన్న కేవల ఊహాజనితాల ఆధారంగా రిటైర్డు న్యాయమూర్తితో దర్యాప్తునకు ఆదేశించడం తొందరపాటు, అసందర్భ చర్య అవుతుందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా ధర్మాసనం విచారణ సందర్భంగా పేర్కొంది.

కమలా హారిస్ అభ్యర్థిత్వం ఖరారు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున కమలా హారిస్ అభ్యర్థిత్వం ఖరారైంది. శుక్రవారం పార్టీ డెలిగేట్ల ఆన్‌లైన్ పోలింగ్ మొదలైన నేపథ్యంలో ఆమె మెజారిటీ ఓట్లను గెల్చుకున్నారు. దాంతో అభ్యర్థిత్వం ఖరారైంది. ''పార్టీ నామినీగా ఎన్నికవడం గౌరవంగా భావిస్తున్నా. వచ్చే వారం నా అభ్యర్థిత్వాన్ని అధికారికంగా స్వీకరిస్తా. దేశంమీద ప్రేమతో ఏకమైన ప్రజల కోసం ఇకపై ప్రచారం చేస్తా'' అన్నారు. అమెరికా చరిత్రలో అధ్యక్ష అభ్యర్థిత్వం సాధించిన తొలి శ్వేతజాతీయేతర మహిళగా, తొలి భారతీయ అమెరికన్‌గా కమల చరిత్ర సృష్టించారు. ఆగస్టు 22న షికాగో జరిగే డెమొక్రటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో కమల తన అభ్యర్థిత్వాన్ని అధికారికంగా అంగీకరిస్తారు. అభ్యర్థిత్వం స్వీకరించాక కొద్దిరోజులకు ఆమె తన రన్నింగ్‌మేట్ పేరును ప్రకటిస్తారు.

ఇజ్రాయెల్ భద్రతకు బైడెన్ పూచీ



వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో మాట్లాడారు. ఇజ్రాయెల్ భద్రతకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఇరాన్, దాని మిత్రదేశాలు, ఉగ్రవాద సంస్థల నుంచి ఇజ్రాయెల్‌పై దాడుల మొదలైతే దీటుగా తిప్పికొడతామని చెప్పారు. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించారు.

టెల్ అవీవ్‌కు విమానాలు రద్దు: మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల దృష్ట్యా ఢిల్లీ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు ఈ నెల 8వ తేదీ దాకా విమానాల రాకపోకలు రద్దు చేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది.

ఇవేం బెయిల్ షరతులు!

దిగువ కోర్టుల తీరుపై సుప్రీం విస్మయం

న్యూఢిల్లీ: వైవాహిక విభేదాల కేసుల్లో ముందస్తు బెయిల్ షరతుల విషయంలో కోర్టులు అసాధ్యమైన షరతులు విధిస్తున్నాయంటూ సుప్రీంకోర్టు ఆవేదన వెలిబుచ్చింది. వరకట్న నిషేధ తదితర చట్టాల కింద ఆరోపణలెదుర్కొంటున్న ఓ వ్యక్తికి పట్నా హైకోర్టు విధించిన ముందస్తు బెయిల్ షరతులపై ధర్మాసనం శుక్రవారం విస్మయం వెలిబుచ్చింది. దంపతులు కలిసుండేందుకు ఒప్పుకోవడంతో దిగువ కోర్టు వారిని ఉమ్మడి అఫిడవిట్ వేయాలని ఆదేశించింది. విడాకుల పిటిషన్ వెనక్కి తీసుకునే షరతుపై పిటిషనర్‌కు బెయిలిచ్చేందుకు అంగీకరించింది. అయితే, 'గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు, ఆమె శారీరక, ఆర్థిక అవసరాలన్నిటినీ తీర్చుతానని హామీ ఇవ్వండి' అని షరతు పెట్టింది. దీన్ని సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ షరతును తొలగిస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి ఆచరణ సాధ్యం కాని షరతులను ఇవ్వొద్దని కోర్టులకు సూచించింది. గౌరవంగా జీవించే హక్కును గుర్తించాలని, విచారణ న్యాయబద్ధంగా సాగేలా చూడాలని కోరింది.

మళ్లీ 'నీట్'కు ఆదేశించలేం: సుప్రీం

- వ్యవస్థీకృత లీకేజీకి రుజువుల్లేవ్
- పరీక్ష సమగ్రత దెబ్బతినలేదు

న్యూఢిల్లీ: నీట్-యూజీ 2024 పరీక్ష సమగ్రతకే తూట్లు పొడిచేంతటి భారీ స్థాయిలో వ్యవస్థీకృత లీకేజీ జరిగినట్టు ఇప్పటికైతే ఎలాంటి రుజువులూ లేవని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో పరీక్షను తిరిగి నిర్వహించాలని ఆదేశించలేమని స్పష్టం చేసింది. సీజేఐ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. ధర్మాసనం తరఫున సీజేఐ 63 పేజీల తీర్పు రాశారు. ''సోషల్ మీడియా, ఇంటర్నెట్ వంటివాటి ద్వారా ప్రశ్నపత్రాన్ని విస్తృతంగా లీక్ చేశారనేందుకు ఎలాంటి ఆధారాలూ లేవు. లీకేజీ ప్రధానంగా పట్నా, హజారీబాగ్ ప్రాంతాలకే పరిమితమైనట్టు తేలింది. తద్వారా లబ్ధి పొందిన విద్యార్థులను గుర్తించడం కష్టమేమీ కాదు. వారెంత మందో సీబీఐ దర్యాప్తు ఇప్పటికే తేల్చింది. కనుక మళ్లీ పరీక్ష నిర్వహించడం అనవసరం. పైగా దానివల్ల ఈ దశలో విద్యా సంవత్సరం దెబ్బ తింటుంది'' అని పేర్కొన్నారు.

ఎన్‌టీఏకి తలంటిన సీజేఐ

నీట్-యూజీ వంటి కీలక పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వ్యవహరించిన తీరు దారుణమని సీజేఐ దుయ్యబట్టారు. ముందు తప్పుడు నిర్ణయాలు తీసుకుని తర్వాత దిద్దుబాటుకు దిగడం దారుణమన్నారు. ''లక్షలాది మంది విద్యార్థులు హాజరయ్యే జాతీయ స్థాయి పోటీ పరీక్షల నిర్వహణ బృహత్తర కార్యక్రమమే. అందుకు భారీ వనరులు, సమన్వయం, ప్రణాళిక అవసరం. మేమేమీ కాదనడం లేదు. కానీ ఎన్‌టీఏ వంటి సంస్థలను ఏర్పాటు చేసింది అందుకే కదా! ఈసారి జరిగిన తప్పిదాలను నివారించేందుకు కావాల్సినన్ని నిధులు, సమయం ఎన్‌టీఏకు అందుబాటులో ఉన్నాయి. కనుక ఒకే కేంద్రంలో భారీ సంఖ్యలో అభ్యర్థులను అనుమతించడం వంటివి లీకేజీకి కారణాలని చెప్పడం కుదరదు. పైగా హజారీబాగ్ పరీక్ష కేంద్రంలో భద్రతా వైఫల్యమూ చోటుచేసుకుంది. స్ట్రాంగ్ రూం వెనక తలుపు తెరిచి అనధికార వ్యక్తులు ప్రశ్నపత్రాలను చేజిక్కించుకున్నారు. వాటిని ఇ-రిక్షాల్లో తరలించుకుపోయి అభ్యర్థుల చేతిలో పెట్టారు. ఫలితంగానే 67 మందికి నూరు వాతం మార్కులొచ్చాయి. అనుమానితులైన 1,563 మందికి తిరిగి పరీక్ష పెడితే ఆ సంఖ్య అంతిమంగా 17కు తగ్గింది. అది కూడా అభ్యర్థుల ఆక్రందనలు, మీడియా రిపోర్టులు, కోర్టు జోక్యం అనంతరం! ఇలాంటి వాటితో నిమిత్తం లేకుండానే ప్రజలు విశ్వసించేలా పనితీరు ఉండాలి. ఇకనైనా మరింత జాగరూకంగా ఉండండి'' అంటూ ఎన్‌టీఏను మందలించారు. తీర్పులో పేర్కొన్న అన్ని అంశాలపైనా దృష్టి పెట్టి ఇకపై పరీక్షల నిర్వహణ పూర్తిగా దోషరహితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో సంస్కరణలు సిఫార్సు చేసే విషయంలో ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకోవాలని రాధాకృష్ణన్ ప్యానెల్‌ను సీజేఐ నిర్దేశించారు. అభ్యర్థుల గుర్తింపు నిర్ధారణ పద్ధతిని లోపరహితం చేయడం, పరీక్షల నిర్వహణ, ప్రక్రియ తాలూకు భద్రత, డేటా సెక్యూరిటీ తదితరాలపైనా సిఫార్సులు చేయాలని నిర్దేశించారు.

గవర్నర్లే వారధి

కేంద్ర, రాష్ట్ర బంధాల్లో కీలకం: మోదీ

న్యూఢిల్లీ: కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య గవర్నర్లు వారధిగా పనిచేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషయంలో వారిది అతి కీలక పాత్ర అన్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అధ్యక్షతన శుక్రవారం ఢిల్లీలో ప్రారంభమైన రెండు రోజుల గవర్నర్ల సదస్సులో మోదీ మాట్లాడారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత గవర్నర్లపై ఉందని మోదీ చెప్పారు. బడుగు బలహీనవర్గాలకు ప్రాతినిధ్యం వహించే సామాజిక సంస్థలతో, ప్రజలతో మాట్లాడుతూ ఉండాలని పేర్కొన్నారు. శక్తివంతమైన పదవిలో ఉన్న గవర్నర్లు రాజ్యాంగం పరిధిలో ప్రజా సంక్షేమానికి, ముఖ్యంగా గిరిజన, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాల్సి ఉంటుందని మోదీ వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ సజావుగా కొనసాగాలంటే కేంద్ర ప్రభుత్వ సంస్థలు రాష్ట్రాలతో సమన్వయంతో పని చేయాలని ముర్ము చెప్పారు.

అతని కోసం ఎందాకైనా...!

క్రషికోవ్... రష్యా టాప్ హిట్‌మాన్

జర్మనీ ఖైదు నుంచి విడిపించుకున్న పుతిన్

రష్యా చరిత్రలోనే అతి పెద్ద ఖైదీల మార్పిడి


మాస్కో విమానాశ్రయంలో క్రషికోవ్‌కు పుతిన్ స్వాగతం

2024 ఆగస్టు 1. మాస్కో అంతర్జాతీయ విమానాశ్రయం. అప్పుడే లాండైన విమానం నుంచి 8 మంది ప్రత్యేక భద్రత మధ్య బయటికి వచ్చారు. వారిలో ఒకరిని రిసీవ్ చేసుకునేందుకు ఏకంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతినే విమానాశ్రయం దాకా వచ్చారు. సదరు 'వీఐపీ'కి షేక్‌హ్యాండ్ ఇచ్చి మరీ సాదరంగా స్వాగతించారు.

సరిగ్గా ఐదేళ్ల క్రితం. 2019 ఆగస్టు. జర్మనీ రాజధాని బెర్లిన్. చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ కార్యాలయానికి, పార్లమెంటుకు కూతవేటు దూరంలో ఉన్న ఓ పార్కు. సైకిల్‌పై వస్తున్న ఓ వ్యక్తి ఉన్నట్టుండి తుపాకీ తీశాడు. తన ముందు నడుస్తున్న మాజీ చెచెన్ రెబెల్ జెలీంఖాన్ ఖాన్‌గోష్విలిని టపీమని కాల్చేశాడు. చుట్టుపక్కల వాళ్లు షాక్ నుంచి తేరుకునే లోపే క్షణాల్లో మాయమైపోయాడు. సైకిల్‌ను పక్కనే ఉన్న నదిలో పారేశాడు. విగ్గు తీసి, నీట్‌గా షేవ్ చేసుకుని ఎవరూ గుర్తించలేనంతగా రూపం మార్చుకున్నాడు. విధి వక్రించి ప్రత్యక్ష సాక్షులు గుర్తించడంతో కాసేపటికే పట్టుబడి జీవితఖైదు అనుభవిస్తున్నాడు.

- నాడు జర్మనీలో జీవితఖైదుకు గురైందీ, నేడు మాస్కోలో పుతిన్ నుంచి ఘనస్వాగతం అందుకున్నదీ ఒక్కడే. అతనే... వదీం క్రషికోవ్. పేరుమోసిన రష్యా హిట్‌మ్యాన్.

జెలీంఖాన్ ఒక్కడినే కాదు, రష్యాకు కంట్లో నలుసుగా మారిన వాళ్లెందరినో క్రషికోవ్ వెంటాడి వేటాడాడు. విదేశీ గడ్డపై ఇలాంటి అసైన్‌మెంట్లను సైలెంట్‌గా పూర్తి చేయడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. రష్యా గూఢచర్య సంస్థ ఎఫ్ఎస్‌బీలో చేరిన కొన్నాళ్లకే టాప్ రేటెడ్ హిట్‌మ్యాన్‌గా పేరు సంపాదించాడు. ముఖ్యంగా పుతిన్‌కు అత్యంత ఇష్టునిగా మారాడు. అందుకే అతన్ని విడిపించుకోవడాన్ని ఆయన సవాలుగా తీసుకున్నారు. జెలీంఖాన్ హత్యతో తనకు సంబంధమే లేదని విచారణ పొడవునా క్రషికోవ్ బుకాయించినా, అది అతని పనేనని పుతిన్ అధికారికంగానే అంగీకరించారు. క్రషికోవ్‌ను 'గొప్ప దేశభక్తుని'గా అభివర్ణించారు. అతని కోసం సోవియట్ యూనియన్ పతనం తర్వాత అమెరికాతో చరిత్రలోనే అతి పెద్ద ఖైదీల మార్పిడికి కూడా అంగీకరించారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ రిపోర్టర్ ఇవాన్ గెర్ష్‌కోవిచ్, మాజీ మెరైన్ పాల్ వీలన్, రష్యా అసమ్మతివాది వ్లాదిమిర్ కారా ముర్జా సహా 16 మందిని వదిలేశారు. బదులుగా అమెరికా, జర్మనీ, పశ్చిమ దేశాల నుంచి క్రషికోవ్‌తో పాటు 8 మంది రష్యన్లను విడిపించుకున్నారు. వారిలో మరో ఇద్దరు అండర్ కవర్ ఏజెంట్లున్నారు. తద్వారా, విదేశాల్లో ఇలాంటి ఆపరేషన్లు చేసే క్రమంలో దొరికిపోయినా అధ్యక్షుడు తమను కాపాడి తీరతారని నిఘా విభాగం ఏజెంట్లకు ధీమా ఏర్పడిందని విశ్లేషకులు భావిస్తున్నారు. పుతిన్ ఆశించింది కూడా అదేనని వారంటున్నారు.


- సాక్షి, నేషనల్ డెస్క్

క్షిపణి దాడి కాదది...

బెడ్రూంలో బాంబు

హనియే హత్య వెనక మతిపోయే ప్లాన్

- రెణ్నెల్ల ముందే అమర్చిన ఇజ్రాయెల్
- గదిలోకి వెళ్లగానే రిమోట్‌తో పేల్చివేత



'జింకను వేటాడేప్పుడు పులి ఓపికగా ఉంటది. అదే పులినే వేటాడాల్సొస్తే?! ఇంకెంత ఓపిక కావాలి?' ఇది ఓ సినిమాలోని డైలాగ్. హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియేపై దాడి కోసం ఇజ్రాయెల్ నిఘా విభాగం మొసాద్ కూడా అచ్చం అలాగే ఓపిక పట్టింది. అది కూడా ఒక రోజో, రెండ్రోజులో కాదు.. ఏకంగా రెండు నెలలకు పైగా! ఆయన బస చేస్తారని భావించిన ఇంట్లో అప్పటికే బాంబు అమర్చి ఉంచింది. ఏ బెడ్రూంలోకి వెళ్తాడో పక్కాగా తెలుసుకుని మరీ అందులోనే బాంబును సిద్ధం చేసి పెట్టింది. అలా హనియే కోసం ముందస్తుగానే కాచుకుని కూచున్న మృత్యువు, సమయం రాగానే అమాంతంగా మింగేసింది...!

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో గత బుధవారం తెల్లవారుజామున జరిగిన పేలుడులో హనియే మరణించారు. అత్యంత కచ్చితత్వంతో కూడిన ఇజ్రాయెల్ క్షిపణి దాడే అందుకు కారణమని తొలుత వార్తలొచ్చాయి. క్షిపణిలాంటి వస్తువేదో హనియే గది కిటికీని తాకడాన్ని ప్రత్యక్ష సాక్షులు చూశారని కొందరు చెప్పారు. అది క్షిపణి దాడేనని ఇరాన్ కూడా ఆరోపించింది. టెహ్రాన్‌లో కట్టుదిట్టమైన రక్షణలో ఉండే గెస్ట్ హౌస్‌ను హనియేకు కేటాయించారు. అలాంటి గెస్ట్ హౌస్‌పై సుదూరం నుంచి అంతటి కచ్చితత్వంతో క్షిపణి దాడి సాధ్యమేనా? పైగా క్షిపణి దాడితో భారీ విధ్వంసం జరుగుతుంది. కానీ ఆ గెస్ట్ హౌస్‌కు అంతటి నష్టమేమీ జరగలేదు. గది, పరిసర భాగాలే బాగా దెబ్బతిన్నాయి. అదే భవనంలో పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ నాయకుడు జియాద్ అల్ నఖలా బస చేసిన పక్క గది కూడా దెబ్బ తినలేదు. కనుక ఎలా చూసినా జరిగింది క్షిపణి దాడి కాదు.

వామ్మో ఇజ్రాయెల్!

హనియే మృతికి గది లోపలి పేలుడే కారణమని ఇరాన్ అధికారులు ఎట్టకేలకు గుర్తించారు. ఆ గదిలో రెండు నెలల కిందే బాంబు పెట్టారని తెలుస్తోంది. ఇరాన్ భద్రతలోని లోపాలనే అందుకు అనువుగా మార్చుకున్నారు. బాంబు పెట్టి రెండు నెలలపాటు ఓపికగా నిరీక్షించారు. ఇరాన్ కొత్త అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకారంలో పాల్గొనేందుకు హనియే టెహ్రాన్ చేరుకున్నారు. అది ముగిశాక గెస్ట్‌హౌస్‌కు చేరుకుని ఆ గదిలోకే వెళ్లినట్టు పక్కాగా నిర్ధారించుకున్న తర్వాతే రిమోట్‌తో బాంబు పేల్చారు. పేలుడు ధాటికి భవనం ఒక్కసారిగా కదిలిపోయింది. గోడలో కొంత భాగం కూలింది. కిటికీలు పగిలాయి. పేలుడు తీవ్రతకే హనియే మృతి చెందారు. ఈ కోవర్ట్ ఆపరేషన్ వివరాలన్నింటినీ పాశ్చాత్య అధికారులతో మొసాద్ పంచుకుందని న్యూయార్క్ టైమ్స్ వార్తా పత్రిక పేర్కొంది. దేశం వెలుపల రాజకీయ ప్రత్యర్థులు తదితర టార్గెట్ల ఏరివేతకు మొసాద్ పాల్పడుతోంది. ఇజ్రాయెల్‌పై హమాస్ అక్టోబర్ 7 దాడుల తర్వాత దాని అగ్ర నేతలందరినీ వేటాడతామని ప్రధాని నెతన్యాహూతో పాటు మొసాద్ చీఫ్ డేవిడ్ బర్నియా కూడా ప్రతిజ్ఞ చేశారు.


- సాక్షి, నేషనల్ డెస్క్


ఇంకా నయం, వరద నీటిపై కేసు పెట్టలేదు!

ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలు • సివిల్స్ అభ్యర్థుల మృతి కేసు సీబీఐకి

న్యూఢిల్లీ: రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో నీట మునిగి ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు మృతిచెందిన కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దర్యాప్తును పర్యవేక్షించడానికి సీనియర్ అధికారిని నియమించాలని కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు సూచించింది. పోలీసు శాఖతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ''బాధ్యత వహించాల్సిన అధికారులను వదిలేసి అటుగా వాహనంలో వెళ్తున్న అమాయకునిపై కేసు పెట్టారు. ఇంకా నయం, బేస్‌మెంట్‌లోకి పోటెత్తిందంటూ వరద నీటిపై కేసు పెట్టలేదు!'' అని వ్యాఖ్యానించింది.

రాజ్యసభలో నవ్వులు పూయించిన జయ


రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్


జయా బచ్చన్

న్యూఢిల్లీ: రాజ్యసభలో వాడివేడి చర్చ కొనసాగుతున్న వేళ ఒక్కసారిగా నవ్వులు విరబూశాయి. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయాబచ్చన్ తన పేరును గతంలో ఒకలా, ఇప్పుడు మరొకలా సంబోధించడమే ఇందుకు అసలు కారణం. గతంలో ఏం జరిగిందంటే.. రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నారాయణ సింగ్ చర్చలో మాట్లాడాల్సిందిగా జయాబచ్చన్‌ను 'జయా అమితాబ్ బచ్చన్' అని పలికారు. వెంటనే ఆగ్రహంతో ఊగిపోయిన జయాబచ్చన్.. 'అమితాబ్ పేరును నాకెందుకు జోడిస్తున్నారు?. నాకంటూ సొంత గుర్తింపు లేదా? మహిళను భర్త పేరును కలిపి పిలవడం చాలా తప్పు. మహిళకు గుర్తింపు రావాలంటే భర్త పేరు వాడాల్సిందేనా? అంటూ ఆగ్రహంగా మాట్లాడారు. దీంతో హరివంశ్ కల్పించుకుని.. 'జయా మేడమ్.. మీరే స్వయంగా అఫిడవిట్‌లో పేరును అలా రాశారు. నేనేమీ కొత్తగా జతచేయలేదు' అన్నారు. చేసేది లేక శుక్రవారం తన పేరును పూర్తిగా పలికారు. చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పిలవగానే లేచి, 'నేను జయా అమితాబ్ బచ్చన్‌ను మాట్లాడుతున్నా' అని అనగానే పాత విషయం గుర్తొచ్చి ధన్‌ఖడ్ ఘొల్లున నవ్వారు. జయ కూడా గట్టిగా పగలబడి నవ్వారు. దీంతో సభలో వారంతా నవ్వుల్లో మునిగిపోయారు.

70 ఏళ్లు.. 70 అడుగులు

ఖైరతాబాద్ మహాగణపతి నమూనా ఆవిష్కరణ



ఖైరతాబాద్ (హైదరాబాద్): ఖైరతాబాద్‌లో 1954లో అడుగు ఎత్తుతో ఏర్పాటు చేసిన మహాగణపతి.. ఈ ఏడాదితో 70 ఏళ్లయిన సందర్భంగా.. 70 అడుగుల ఎత్తున్న విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు మహాగణపతి నమూనాను శుక్రవారం ఆవిష్కరించారు. 'శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి'గా 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో స్వామి దర్శనమివ్వనున్నారు. నిల్చున్న ఆకృతిలో ఉండే గణపతి తలకు ఇరువైపులా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, మహంకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి రూపాలు, రెండు వైపులా 14 చేతులు, కుడివైపు చేతుల్లో చక్రం, అంకుశం, పుస్తకం, త్రిశూలం, కమలం, శంఖం, ఎడమ వైపు రుద్రాక్ష, ఆసనం, పుస్తకం, వీణ, కమలం, గద ఉన్నాయి. మహాగణపతి పక్కన కుడివైపు పది అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా బాల రాముడి విగ్రహం, ఎడమవైపు రాహుకేతువుల విగ్రహాలను 9 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయనున్నారు. వినాయకుడి పాదాల చెంత 3 అడుగుల మేర మూషిక వాహనం ఉంటుంది. మహాగణపతి కుడివైపు 14 అడుగుల ఎత్తులో శ్రీనివాస కల్యాణం, ఎడమవైపు శివపార్వతుల కల్యాణం విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు.

ఇదిగో జాబ్ కేలండర్

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించిన వివరాలను ప్రకటించారు. అయితే విభాగాల పేర్లను పేర్కొన్నప్పటికీ ఖాళీల సంఖ్యను మాత్రం వెల్లడించలేదు. కాగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభలో దీనిపై క్లుప్తంగా ప్రకటన చేశారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం

'నిరుద్యోగ యువతీ యువకుల ఆశలు నెరవేర్చేందుకు జాబ్ కేలండర్ ప్రకటిస్తామని ముందే చెప్పాం. ఆ విధంగానే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జాబ్ కేలండర్ విడుదల చేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామకాల ప్రకటనలు రావడం, రద్దు కావడం లేదా వాయిదా పడటం, పరీక్షలు జరిగితే ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల తేదీలు ఓవర్‌లాప్ లాంటి వాటితో అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వ పాలనలో గ్రూప్–1 పరీక్ష రెండుసార్లు రద్దయింది. 2023 మార్చి 17న పేపర్ లీక్ కావడంతో, 2024 ఫిబ్రవరి 19న అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోకపోవడంతో హైకోర్టు తీర్పు మూలంగా రద్దు అయింది. అధికారంలోకి రాగానే రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి.. యూపీఎస్సీ చైర్మన్‌ను సంప్రదించారు. సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీ యూపీఎస్సీ, కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విధానాలను అధ్యయనం చేసింది. అనంతరం కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. గ్రూప్–1 నోటిఫికేషన్‌లో అదనంగా 60 పోస్టులు జోడించి 563 ఖాళీల కోసం కొత్తగా నోటిఫికేషన్ జారీ చేశాం. ఫలితాలు ప్రకటించాం. ఈ ఏడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల చేశాం. మొత్తంగా 32,410 మంది నిరుద్యోగ యువతకు నియామక ఉత్తర్వులు జారీ చేశాం. అదనంగా 13,505 ఉద్యోగాల నియామకం చివరి దశకు చేరుకుంది. 11,022 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. గ్రూప్–1, గ్రూప్ 2, గ్రూప్–3 పరీక్షల మధ్య తగిన సమయం లేకపోవడంతో నిరుద్యోగుల కోరిక మేరకు ఆగస్టు 7, 8 తేదీల్లో జరగాల్సిన గ్రూప్–2 పరీక్షలు డిసెంబర్‌కు వాయిదా వేశాం. ఈ నెల 1వ తేదీన కేబినెట్ సమావేశంలో జాబ్ కేలండర్‌పై చర్చించి ఆమోదించాం..' అని డిప్యూటీ సీఎం తెలిపారు.

ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ కేలండర్ ఇదీ..

నియామకాలు	పోస్టులు	నోటిఫికేషన్ జారీ నెల	పరీక్ష నిర్వహణ నెల	నియామక సంస్థ
గ్రూప్–1 (మెయిన్స్)	గ్రూప్–1లో నోటిఫై చేసినవి	ఫిబ్రవరి-2024	అక్టోబర్-2024	టీజీపీఎస్సీ
గ్రూప్–3 సర్వీసెస్	గ్రూప్–3లో నోటిఫై చేసినవి	డిసెంబర్-2022	నవంబర్-2024	టీజీపీఎస్సీ
ల్యాబ్ టెక్నీషియన్/నర్సింగ్ ఆఫీసర్ ఫార్మాసిస్ట్ (హెచ్ఎంఅండ్ఎఫ్‌డబ్ల్యూ)	నోటిఫికేషన్‌లో నిర్దేశించినవి	సెప్టెంబర్-2024	నవంబర్-2024	టీఎంహెచ్ఎస్ఆర్‌బీ
గ్రూప్–2 సర్వీసెస్	గ్రూప్–2లో నోటిఫై చేసినవి	డిసెంబర్-2022	డిసెంబర్-2024	టీజీపీఎస్సీ
ఇంజనీరింగ్ పోస్టులు/ట్రాన్స్‌కో/ఎన్‌పీడీసీఎల్/ఎస్‌పీడీసీఎల్	ఏఈఈ/ఏఈ/ఎస్ఈ	అక్టోబర్-2024	జనవరి-2025	టీజీట్రాన్స్‌కో
గెజిటెడ్ కేటగిరీ ఇంజనీరింగ్ సర్వీసెస్	ప్రభుత్వ ఇంజనీరింగ్ విభాగాల్లో ఏఈఈ/ఈక్వలెంట్ పోస్టులు	అక్టోబర్-2024	జనవరి-2025	టీజీపీఎస్సీ
టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్	టీచర్స్	నవంబర్-2024	జనవరి-2025	డీఎస్ఈ
గ్రూప్–1 ప్రిలిమ్స్ (అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్- యూపీఎస్సీ ప్రిలిమినరీ ఫర్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్)	జీఓ ఎంఎస్ 55లో గుర్తించిన 19 కేటగిరీల్లోని పోస్టులు	అక్టోబర్-2024	ఫిబ్రవరి-2025	టీజీపీఎస్సీ
గెజిటెడ్ స్కేల్ ఇతర ప్రొఫెషనల్ సర్వీసెస్ (గ్రూప్స్‌లో లేనివి)	ప్రభుత్వ శాఖలు/ కార్పొరేషన్లు/ సొసైటీల పరిధిలో ప్రొఫెషనల్	జనవరి-2025	ఏప్రిల్-2025	టీజీపీఎస్సీ
స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం	ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు	ఫిబ్రవరి-2025	ఏప్రిల్-2025	డీఎస్ఈ
ఫారెస్ట్ బీట్ ఆఫీసర్	ఫారెస్ట్ బీట్ ఆఫీసర్	ఫిబ్రవరి-2025	మే-2025	టీజీపీఎస్సీ
టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్	టీచర్స్	ఏప్రిల్-2025	జూన్-2025	డీఎస్ఈ
గ్రూప్–1 మెయిన్స్	గ్రూప్–1 సర్వీసుల్లోనివి	-	జూలై-2025	టీజీపీఎస్సీ
ఎస్ఐ సివిల్/ఈక్వలెంట్ పోస్టులు (ప్రిలిమినరీ రాత పరీక్ష)	సబ్ ఇన్‌స్పెక్టర్స్	ఏప్రిల్-2025	ఆగస్టు-2025	టీజీపీఆర్‌బీ
పీసీ సివిల్/తత్సమాన పోస్టులు (ప్రిలిమినరీ రాత పరీక్ష)	పోలీస్ కానిస్టేబుల్స్	ఏప్రిల్-2025	ఆగస్టు-2025	టీజీపీఆర్‌బీ
డిగ్రీ కాలేజీల్లో అకడమిక్ పోస్టులు	లెక్చరర్/లైబ్రేరియన్/ ఫిజికల్ డైరెక్టర్ (డిగ్రీ కాలేజీలు)	జూన్-2025	సెప్టెంబర్-2025	టీజీపీఎస్సీ
డిగ్రీ లెక్చరర్స్	గురుకులాల్లో డీఎల్	జూన్-2025	సెప్టెంబర్-2025	టీఆర్ఈఐఆర్‌బీ
గ్రూప్–2 (ఎఫ్‌బీఓ కూడా)	జీఓ ఎంఎస్ 55లో గుర్తించిన 16 కేటగిరీల్లోని పోస్టులు	మే-2025	అక్టోబర్-2025	టీజీపీఎస్సీ
గ్రూప్–3 (క్లబ్‌డ్ విత్ గ్రూప్–4)	జీఓ ఎంఎస్ 55లో గుర్తించిన 10 కేటగిరీల్లోని పోస్టులు	జూలై-2025	నవంబర్-2025	టీజీపీఎస్సీ
వివిధ కేటగిరీల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టులు	మేనేజ్‌మెంట్ ట్రైనీ (మైనింగ్, ఈఅండ్ఎం, ఎఫ్అండ్ఏ, సివిల్) మెడికల్ ఆఫీసర్ (జీఓఎంఎస్)	జూలై-2025	నవంబర్-2025	ఎస్‌సీసీఎల్

ఒకే రోజు 350 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్!

- బదిలీపై వెళ్లిన ఓ సబ్ రిజిస్ట్రార్ నిర్వాకం
- అనుమానం వచ్చి ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏసీబీ
- అదుపులో ఇద్దరు అధికారులు!.. 64 డాక్యుమెంట్లు సీజ్



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో కళ్లు బైర్లు కమ్మే అక్రమాలు వెలుగు చూశాయి. ఇటీవల బదిలీపై వెళ్లిన ఓ సబ్ రిజిస్ట్రార్ వెళుతూ.. వెళుతూ పెద్ద ఎత్తున అక్రమ రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఏసీబీ అధికారుల దృష్టికి వచ్చింది. ఒకే రోజు ఏకంగా సుమారు 350 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. ఒక్కరోజే ఈ స్థాయిలో డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయడంతో అనుమానం వచ్చిన ఏసీబీ అధికారులు గురువారం సాయంత్రం ఈ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన విషయం విదితమే. తనిఖీలు రాత్రంతా జరిగాయి. శుక్రవారం ఉదయం ఏడు గంటల వరకు అధికారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలు చేస్తున్న సమయంలో కార్యాలయంలోని ఓ అధికారి రూ.96 వేల నగదును కార్యాలయం కిటికీలోంచి బయటకు విసిరేయడం కలకలం సృష్టించింది. ఈ క్రమంలో ఏసీబీ.. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న 64 డాక్యుమెంట్లను ఏసీబీ సీజ్ చేసింది. ఈ డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు.

ప్రభుత్వ భూములకు రిజిస్ట్రేషన్లు..!

ఏసీబీ అదుపులోకి తీసుకున్న అధికారులిద్దరూ ప్రభుత్వ భూములకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. పటాన్‌చెరు ప్రాంతంలో రూ.వందల కోట్లు విలువ చేసే భూములను ఈ అధికారులు రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం.

జిల్లా ఏసీబీ అధికారులకు తెలియకుండా..

ఈ తనిఖీలు నిర్వహించేందుకు హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయం నుంచి ఏసీబీ అధికారులు రావడం గమనార్హం. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఏసీబీ డీఎస్పీ కార్యాలయం ఉంటుంది. అయితే ఈ కార్యాలయం అధికారులకు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా నేరుగా రాష్ట్ర కార్యాలయంలోని సీఐయూ విభాగం అధికారులు తనిఖీలు చేపట్టారు.

ఐదేళ్లలో 35 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు

అత్యధిక ప్రాధాన్యంతో పెండింగ్, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం: మంత్రి ఉత్తమ్

- ఎన్నడూ లేని విధంగా ఈసారి ముందే ఎడమ కాల్వకు నీరు: కోమటిరెడ్డి
- సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసిన మంత్రులు




ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి కృష్ణమ్మకు సారె సమర్పిస్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పనిచేస్తుంది. ఏటా 6.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టించబోతున్నాం. ఈ ఐదేళ్లలో 35 లక్షల ఎకరాల్లో ఆయకట్టును సృష్టించి సాగునీరు అందించబోతున్నాం'అని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు, వరద కాలువకు శుక్రవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఏడాది సాగునీటికి బడ్జెట్ రూ.22500 కోట్లు పెట్టామని, దాంట్లో రూ.10,828 కోట్లు ఆన్ గోయింగ్ వర్క్స్ కింద, కొత్త ప్రాజెక్టులకు మూలధన వ్యయం కింద కేటాయించామన్నారు. మిగతా రూ.11వేల కోట్లు ఎస్టాబ్లిష్‌మెంట్, అప్పుల కోసమని చెప్పారు. తెలంగాణ చరిత్రలో ఏ ఒక్క ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ స్థాయిలో మూలధన వ్యయం కింద కేటాయించలేదని, ఇప్పుడు కేటాయించిన డబ్బంతా ఈ ఏడాది ప్రాజెక్టులపైనే ఖర్చు పెట్టబోతున్నామని ఉత్తమ్ స్పష్టం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఎప్పుడూ ఇవ్వనివిధంగా సాగర్ ఎడమ కాలువకు తాము ఈసారి ముందుగా నీళ్లు ఇచ్చామని చెప్పారు. గత ఏడాది నీళ్లు లేక రైతులు ఇబ్బంది పడ్డారని, సాగర్‌తోపాటు ఏఎంఆర్‌పీ పరిధిలోనూ పంటలు వేసుకోలేకపోయామన్నారు. నల్లగొండ జిల్లాకు ఎంతో కీలకమైన ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌పై 1981లో అంజయ్య సీఎంగా ఉన్నప్పుడే గ్రావిటీ ద్వారా నీటిని తీసుకొచ్చేలా ఆలోచించారని, అయినా అప్పుడు కాలేదన్నారు. వైఎస్.రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక, ఆయన్ను ఒప్పించి ప్రాజెక్టు తీసుకొచ్చామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నా పూర్తి చేయలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేట్ల ప్రకారం టన్నెల్ పనులను పూర్తి చేయడానికి నిధులు విడుదల చేసిందని చెప్పారు. వచ్చే రెండు మూడేళ్లలో సొరంగం పూర్తి చేస్తామని, దీంతో దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్: సాగర్ ఎడమకాల్వకు మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి చేతులమీదుగా శుక్రవారం సాయంత్రం నీటిని విడుదల చేశారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యేలు బాలునాయక్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నాగార్జునసాగర్‌కు వచ్చారు. ఎర్త్ డ్యాం అంతర్భాగంలో గల హెడ్ రెగ్యులేటర్ ప్యానల్‌బోర్డు వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్విచ్ ఆన్‌చేసి ఎడమ కాల్వకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గంటగంటకు నీటిని పెంచుతూ 11వేల క్యూసెక్కులు విడుదల చేయనున్నట్టు తెలిపారు.అనంతరం మంత్రులు వరదకాల్వ వద్దకు వెళ్లి అక్కడ నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపో మాపో సాగర్ గేట్లు ఎత్తివేత



సాక్షి, హైదరాబాద్/దోమలపెంట: నాగార్జునసాగర్‌లోకి కృష్ణా వరద ఉధృతి మరింత పెరిగింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు సాగర్‌లోకి 3,99,159 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో నీటినిల్వ 550.6 అడుగుల వద్ద 211.1 టీఎంసీలకు చేరుకుంది. రోజుకు సగటున 30 టీఎంసీల రాకతో మరో రెండు రోజుల్లో సాగర్ ప్రాజెక్టు నిండుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం నుంచి రోజుకు ఇన్‌ఫ్లో 40 టీఎంసీలకు పెరుగుతుందని..దీంతో రేపోమాపో గేట్లు ఎత్తివేసే వరదను కిందకు విడుదల చేసే అవకాశముందని అధికారవర్గాలు పేర్కొంటున్నారు. ఇటు సుంకేశుల నుంచి తుంగభద్ర, అటు జూరాల నుంచి కృష్ణా వరద ఉధృతి శ్రీశైలంలోకి మరింత పెరిగింది. ప్రాజెక్టులోకి 4,89,361 క్యూసెక్కుల ప్రవాహం చేరుతుండగా.. స్పిల్‌వే పది గేట్లు 20 అడుగు మేర ఎత్తి 4,66,650 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. విద్యుదుత్పత్తి చేస్తూ కుడి కేంద్రం నుంచి 23,904, ఎడమ కేంద్రం నుంచి 37,857 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. వెరసి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 5,28,411 క్యూసెక్కులు సాగర్ వైపు దూసుకెళ్తున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటకలో పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణా ప్రధాన పాయ, తుంగభద్ర నదుల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1.90 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.82 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి వరద ప్రవాహం స్థిరంగా వస్తున్న నేపథ్యంలో శ్రీశైలంలోకి వరద ఉధృతి శనివారం కూడా ఇదే రీతిలో కొనసాగుతుందని అధికారులు చెప్పారు.

5 నుంచి గీతకార్మికులకు

మొకుల పంపిణీ

మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: గీత కార్మికులను ప్రమాదాల నుంచి రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన కాటమయ్య రక్షణ కవచ్ మొకులను రాష్ట్రవ్యాప్తంగా కల్లు గీత వృత్తి చేసుకునే ప్రతి ఒక్కరికీ పంపిణీ చేయనున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుంచి ప్రతి నియోజకవర్గానికి వంద మొకుల చొప్పున మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 10 వేల మొకుల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. కాటమయ్య రక్షణ కవచ్ పంపిణీ కోసం తెలంగాణ బడ్జెట్‌లో కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. కాటమయ్య రక్షణ కవచ్ కార్యక్రమాన్ని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్‌గూడలో లాంఛనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే.

మణుగూరులో 'జియో థర్మల్' అన్వేషణ

కీలక ప్రాజెక్టుపై ఓఎన్జీసీ, జెన్‌కోతో సింగరేణి ఒప్పందం

సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సమీపంలోని పగిడేరు వద్ద భూగర్భంలో విస్తారంగా ఉన్న జియో థర్మల్ (భూతాప) క్షేత్ర అన్వేషణ, అభివృద్ధి ప్రాజెక్టు విషయంలో సింగరేణి సంస్థ, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్జీసీ), తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (తెలంగాణ రెడ్కో) మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. శుక్రవారం సింగరేణి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ సీఎండీ ఎన్.బలరామ్, ఓఎన్జీసీ డైరెక్టర్ (ఎక్స్‌ప్లోరేషన్) సుష్మా రావత్, తెలంగాణ రెడ్కో జీఎం సత్య వరప్రసాద్ ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. మణుగూరులో 122 మెగావాట్ల జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించిందని బలరామ్ తెలిపారు. సింగరేణి సంస్థ పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం దిశగా ముందుకు వెళ్తోందని చెప్పారు. ఇందులో భాగంగానే మణుగూరులో జియో థర్మల్ క్షేత్ర అన్వేషణలో ఓఎన్జీసీ, తెలంగాణ రెడ్కోతో కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. కాగా దేశంలో అతి పెద్ద జియో థర్మల్ క్షేత్రంగా మణుగూరు మారుతుందని సుష్మా రావత్ చెప్పారు. ఇక్కడ జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి పూర్తి అనువైన వాతావరణం ఉందని, మరింత అన్వేషణ జరిగితే జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తే కాకుండా హీలియం వెలికితీసేందుకు కూడా అవకాశాలు ఉన్నాయ ని తెలిపారు. కాగా మణుగూరులో ఇప్పటికే భూగర్భం నుండి ఉబికి వచ్చే వేడి నీటితో విద్యుత్ ఉత్పాదన కోసం కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారంతో సింగరేణి సంస్థ ప్ర యోగాత్మకంగా ఏర్పాటు చేసిన 20 కిలోవాట్ జియో థర్మల్ విద్యుత్ ప్లాంట్ విజయవంతమై ంది. మణుగూరు ప్రాంతంలో 3500 మెగావా ట్ల వరకు జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉన్నట్లుగా నివేదికలు ఉన్నాయని సింగరేణి సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

మీ చేతుల్లోనే రాష్ట్ర భవిత

▶ మొదటి పేజీ తరువాయి

33 లక్షల మంది విద్యార్థులున్నారు. ప్రైవేటు స్కూళ్లలో గొప్ప టీచర్లున్నారా? టెన్త్, ఇంటర్ ఫెయిలైన వాళ్లతో పాఠాలు చెప్పిస్తున్నారు. ఎక్కడో లోపం ఉంది. దీనికి ప్రభుత్వ విధానాలూ కారణమే. మౌలిక వసతులు లేక విద్యార్థులు ప్రైవేటుబాట పడుతున్నారు. మహిళా టీచర్లు పనిచేసే ప్రాంతాల్లో కూడా టాయిలెట్లు లేవు. కొన్నిచోట్ల స్కూళ్లలో పశువులను కట్టేసే పరిస్థితి. మేం పాఠశాలలను మెరుగుపరిచే బాధ్యతను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగించాం. ప్రతీ ప్రభుత్వ స్కూల్‌కు ఉచిత విద్యుత్ అందిస్తాం. పారిశుధ్య కార్మికులను నియమిస్తాం.

మీరే అంబాసిడర్లు..

తెలంగాణ సాధనలో టీచర్ల పాత్ర కీలకం. దీన్ని దృష్టిలో ఉంచుకునే వారి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిచ్చాం. టీచర్లతో పెట్టుకోవద్దని చాలామంది నాకు సలహా ఇచ్చారు. కానీ వారిలో విశ్వాసం నింపుతాననే నమ్మకం నాకు ఉంది. ప్రభుత్వ స్కూళ్లలో చదివే పేదల భవిత టీచర్ల చేతుల్లోనే ఉంది. గత ఏడాది విద్యార్థుల అడ్మిషన్లు 2 లక్షల మేర తగ్గాయి. అందువల్ల టీచర్లు ప్రభుత్వ స్కూళ్లకు పిల్లలను పంపడం ఆత్మగౌరవంగా భావించే పరిస్థితి తేవాలి..'' అని సీఎం రేవంత్ కోరారు. సమావేశంలో మంత్రి ప్రభాకర్, టీజేఎస్ చీఫ్ కోదండరాం, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఉపాధ్యాయులు

పేరుకేనా ముఖాముఖి: టీచర్ల అసంతృప్తి

ప్రమోషన్లు పొందిన వారితో సీఎం ముఖాముఖి అని చెప్పి అధికారులు తమను తీసుకొచ్చారని.. కానీ ఒక్కరికై నా మాట్లాడే అవకాశమే ఇవ్వలేదని సమావేశం అనంతరం టీచర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిజానికి విద్యాశాఖ అధికారులు వారం రోజుల నుంచే ఈ కార్యక్రమానికి సిద్ధమయ్యారు. ఉపాధ్యాయులను తరలించేందుకు ప్రతీ జిల్లా నుంచి పెద్ద ఎత్తున వాహనాలు ఏర్పాటు చేశారు. దీంతో టీచర్లు ఏమేం మాట్లాడాలో ముందే సిద్ధం చేసుకున్నారు. కనీసం జిల్లాకు ఒకరినైనా సీఎంతో మాట్లాడిస్తారని భావించామని.. కానీ సమావేశం కేవలం ప్రసంగాలకే పరిమితమైందని టీచర్లు పేర్కొన్నారు. గతంలో చెప్పినవే ఇప్పుడూ చెప్పారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా విద్యా రంగ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన సీఎంకు పీఆర్టీయూటీఎస్ నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 3 । ఆగస్టు । 2024



సవాళ్లను స్వీకరిస్తే విజయం మీదే

సవాళ్లను స్వీకరిస్తే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. -10లో



ఇక పారిశుధ్య కార్మికుల తరఫున..


ఎస్సీ వర్గీకరణ సాధించామని, ఇక పారిశుధ్య కార్మికుల తరఫున పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/24.0

నగర పరిధిలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. గరిష్టంగా 31, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవచ్చు.

మాస్టర్‌ప్లాన్‌పై టీజీఐఐసీ కసరత్తు



ఫ్యూచర్ సిటీలో వివిధ రంగాలకు కేటాయించే భూముల వివరాలు..

రంగం	విస్తీర్ణం (ఎకరాల్లో)
ఏఐ సిటీ	297
విద్య, విశ్వవిద్యాలయాల జోన్	454
ఎలక్ట్రానిక్స్, ఇతర పరిశ్రమలు	4,774
వినోద, ఇతర అవసరాలకు	470
ఫర్నిచర్ పార్కు	309
హెల్త్‌సిటీ	370
లైఫ్ సైన్సెస్ హబ్	4,207
రెసిడెన్షియల్ అండ్ మిక్స్‌డ్ యూజ్	1317
నివాస ప్రాంతం	1013
స్పోర్ట్స్ హబ్	761

- 14 వేల ఎకరాల్లో భూ వినియోగంపై స్పష్టత
- సంస్థల వారీగా భూ కేటాయింపుల వర్గీకరణ

నయా నగరి.. మహా దారి!



సాక్షి, సిటీబ్యూరో: నయా నగరి విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం మహా ప్రణాళిక అమలు చేస్తోంది. రెండ్రోజుల క్రితం పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన సర్కారు.. తాజాగా ఆ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోంది. సుమారు 14 వేల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రంగాలకు కేటాయించాల్సిన భూములను వర్గీకరించింది. ఈ మేరకు తయారు చేసిన మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఔషధనగరి స్థానంలో విశ్వనగరి పురుడు పోసుకోనుంది. నగర శివార్లలోని కందుకూరు, కడ్తాల్, యాచారం మండలాల్లో ప్రతిపాదించిన ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం 19,333 ఎకరాలను సేకరించింది. ఇందులో ఇప్పటివరకు సుమారు 14 వేల ఎకరాలను స్వాధీనం చేసుకుంది. ప్రస్తుత ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేసి.. దాని స్థానంలో మహానగరాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా గురువారం కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో నైపుణాభివృద్ధి విశ్వవిద్యాలయం, ఇంటిగ్రేటెడ్ స్కూల్ తదితర ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంకురార్పణ చేసి భవిష్యత్ సిటీకి పునాది రాయి వేశారు.

13,972 ఎకరాల్లో భవ్య నగరం..

- భవ్య నగరాన్ని 13,972 ఎకరాల్లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త సిటీలో కొలువుదీరే రంగాలకు కేటాయించే భూమిని నిర్దేశిస్తూ తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (టీజీఐఐసీ) మాస్టర్‌ప్లాన్ రూపొందించింది. ఇందులో ఏఐ (కృత్రిమ మేధ), హెల్త్ సిటీ, ఎలక్ట్రానిక్స్, ఇతర పరిశ్రమలు, ఫర్నిచర్ పార్కు, లైఫ్ సైన్సెస్ హబ్, స్పోర్ట్స్ హబ్ ఏర్పాటుకు భూమి కేటాయించాలని నిర్ణయించింది.
- ఏఐ సిటీకి సంబంధించి వచ్చే నెలలో భూమి పూజ చేయనుండగా.. ఎలక్ట్రానిక్స్ కంపెనీల ఏర్పాటుపై ఇప్పటికే జపాన్‌కు చెందిన సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే ఈ ప్రాంతానికి చేరువలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమైన యాపిల్ ఉపకరణాల తయారీ సంస్థ ఫాక్స్‌కాన్‌కు మరో 2 వేల ఎకరాలు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం ఇటీవల లేఖ రాసింది.
- మరోవైపు స్పోర్ట్స్ హబ్‌లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు బీసీసీఐ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఇదే విషయాన్ని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. పెట్టుబడులను సులువుగా ఆకర్షించవచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఎయిర్‌పోర్టు, జాతీయ రహదారి అందుబాటులో ఉండటం కలిసొచ్చే అంశంగా భావిస్తున్న సర్కారు.. మెట్రో రైలును కూడా ఇక్కడి వరకు పొడిగించేందుకు అలైన్‌మెంట్ మారుస్తోంది.

గ్రీనరీని పెంచడమే స్వచ్ఛదనం.. పచ్చదనం లక్ష్యం

అధికారులకు ఆమ్రపాలి దిశానిర్దేశం

లక్డీకాపూల్ : గ్రేటర్‌లో గ్రీనరీని పెంచడమే లక్ష్యంగా స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు ఆమె సూచించారు. శుక్రవారం 'స్వచ్ఛదనం – పచ్చదనం' నిర్వహణపై జోనల్ కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆమ్రపాలి మాట్లాడారు. స్వచ్ఛదనం- పచ్చదనం నిర్వహణకు అన్ని విభాగాల అధికారులతో కలిసి బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఈ బృందాలు షెడ్యూల్ మేరకు కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రజలకు ఉపయోగకరమైన మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. కమ్యూనిటీ హాల్స్ పర్యవేక్షణ చేయాలన్నారు.

అప్పు డబ్బులు అడిగినందుకు సుత్తితో కొట్టి చంపింది

మహిళను హత్య చేసిన మరో మహిళ



మృతి చెందిన నర్సమ్మ

నాగోలు: తీసుకున్న అప్పు డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు ఓ మహిళ మరో మహిళను సుత్తితో ముఖంపై కొట్టి చంపిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ భరత్‌నగర్ కాలనీ ఫేజ్- 2లో నివసించే నర్సమ్మ (45) స్థానికులకు అప్పులు ఇస్తుంటుంది. ఈ క్రమంలో ఆమె ఇంటి పక్కన ఉండే మరబోయిన సరోజిని అనేక మహిళకు నర్సమ్మ కొంత కాలం క్రితం రూ. 20 వేలు అప్పు ఇచ్చింది. ఈ క్రమంలో నర్సమ్మ శుక్రవారం రాత్రి డబ్బులు అడిగేందుకు సరోజిని ఇంటికి వెళ్లింది. డబ్బుల విషయంపై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆవేశంలో సరోజిని తన పక్కనే ఉన్న సుత్తితో నర్సమ్మ ముఖంపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. హత్య సమాచారం తెలుసుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, సీఐ రామాంజనేయులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

మృత్యు వేగం

ఫ్లైఓవర్‌ను ఢీకొట్టిన కారు

- నుజ్జునుజ్జయిన వాహనం
- బీబీఏ విద్యార్థి దుర్మరణం
- రాయదుర్గం పరిధిలో దుర్ఘటన



చరణ్ (ఫైల్)



ముద్ద ముద్దగా మారిన కారు



కారులో చరణ్ మృతదేహం

రాయదుర్గం: మితిమీరిన వేగంతో కారును నడిపిన బీబీఏ విద్యార్థి అసువులు బాశాడు. కారు వేగం నియంత్రణలోకి రాకపోవడంతో ఎడమవైపు టర్న్ కాకుండా ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్‌ను ఢీకొని అతడు అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన శుక్రవారం తెల్లవారుజామున రాయదుర్గం పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న చెప్పిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడలోని రహమత్‌నగర్‌కు చెందిన గోవుల చరణ్ (19) తల్లి చనిపోవడంతో తాత, మేనమామతో కలిసి ఉంటున్నాడు. శంకర్‌పల్లిలోని ఐబీఎస్ కళాశాలలో బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇప్పుడే వస్తానంటూ షిఫ్ట్ డిజైర్ కారులో ఇంటి నుంచి బయలుదేరాడు. బీఎస్‌ఆర్ హిల్స్ నుంచి టోలిచౌకీ వైపు వెళుతూ రాయదుర్గం కూడలిలోకి వచ్చాడు. అప్పుడు తెల్లవారుజాము 3.52 గంటలు అవుతోంది. ఆ సమయంలో కారు మితిమీరిన వేగంతో అదుపుతప్పింది. ఎడమ వైపు మళ్లకుండా ఎదురుగా ఉన్న రాయదుర్గం ఫ్లైఓవర్‌ను ఢీకొట్టింది. 70 శాతానికిపైగా నుజ్జునుజ్జయింది. డ్రైవింగ్ చేస్తున్న చరణ్ తీవ్ర గాయాలతో కారులోనే మృతి చెందాడు. కారు ముందు భాగం ముద్దగా మారిన పరిస్థితి చూస్తే దాని వేగం ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారులోని చరణ్ మృతదేహన్ని బయటికి తీసి పోస్టుమార్టమ్ నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పులపై 'ఆడిట్' నిప్పులు

బల్దియాలో విధుల నిర్లక్ష్యంపై కన్నెర్ర

ఆస్తిపన్ను అసెస్‌మెంట్లలో తేడాలు

- అడ్డగోలుగా నిధుల దుబారా
- ఖజానా డబ్బులు సొంత జేబుల్లోకి
- పనులు చేయకున్నా చెల్లింపులు
- పెన్షన్ చెల్లింపుల్లో అక్రమాలు
- 2019-20, 2020-21 వార్షిక నివేదికల్లో ఆక్షేపణలెన్నో!





సాక్షి, సిటీబ్యూరో: ఆస్తిపన్ను జాబితాల్లో అవకతవకలు.. వాణిజ్య భవనాలకు నివాస భవనాల ఆస్తిపన్ను.. జీహెచ్‌ఎంసీ ఖజానాలోకి చేరాల్సిన సొమ్ములు సొంత జేబుల్లోకి.. మంజూరు కాకపోయినా ఇంజినీరింగ్ పనులకు బిల్లుల చెల్లింపులు, అడ్వర్టయిజ్‌మెంట్లతో భారీ ఆదాయం పొందుతున్నప్పటికీ ఫీజులు చెల్లించని ఏజెన్సీలు.. అడ్డగోలుగా అడ్వాన్సులు.. టౌన్‌ప్లానింగ్‌లో అమ్యామ్యాలతో ఓసీలు.. ఇలా జీహెచ్‌ఎంసీ వివిధ నిర్వాకాలను రాష్ట్ర ఆడిట్ విభాగం (కాగ్) తప్పుబట్టింది. శుక్రవారం విడుదలైన 2019-20, 2020-21 వార్షిక నివేదికల్లో ఇలాంటి పలు అంశాలను ప్రస్తావించింది. ఇప్పటికైనా కార్పొరేషన్‌ను చక్కదిద్దుకోవాలని అధికారులకు సూచించింది.

2019-20 వార్షిక నివేదిక ప్రకారం..

- ఎల్‌బీనగర్ సర్కిల్‌లో ఎంబుక్‌లు, ఫైళ్లు, రికార్డుల పరిశీలనలో ఉల్లంఘనలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం ఆడిట్ నివేదికలో బట్టబయలైంది. పలు పనుల్లో, కూల్చివేతల వాహనాలు, కార్మికుల నియామక అంశాల్లో విచ్చలవిడిగా వ్యవహరించారు. అందుకు ఉన్న అధికారం, నిబంధనలు పేర్కొనకుండా చేసిన పనులపై ఆడిట్ విభాగం అనుమానాలు వ్యక్తం చేసింది. అలా వ్యయం చేసిన రూ.13,65,259 నిధులపై అభ్యంతరం తెలిపింది.
- పనులు సక్రమంగా చేయనందుకు గోషామహల్ సర్కిల్‌లో రూ.4,20,527పై అభ్యంతరం వెలిబుచ్చింది. అసెస్‌మెంట్‌లోని ప్లింత్ ఏరియా, టిన్ జనరేటెడ్ ప్లింత్ ఏరియాలో వ్యత్యాసాలు గుర్తించి జీహెచ్‌ఎంసీకి తీవ్ర నష్టం కొనసాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. మచ్చుకు ఏడు ఆస్తుల నుంచే ఆస్తిపన్నులో ఏటా రూ.11,71,523 నష్టం వాటిల్లుతున్నట్లు పేర్కొంది.
- ఈ లెక్కన జీహెచ్‌ఎంసీకి వాస్తవంగా రావాల్సిన ఆస్తిపన్ను ఎంతమేర నష్టపోతుందో అంచనా వేసుకోవచ్చు. జీహెచ్‌ఎంసీలో నిర్మాణాలు కూల్చివేసినప్పుడు డెబ్రిస్ చార్జీలు (ప్లింత్ ఏరియా చదరపు అడుగుకు రూ.12 వంతున) వసూలు చేయాల్సి ఉండగా, చార్మినార్ సర్కిల్‌లో ఆరుగురి నుంచి వసూలు చేయకపోవడం వల్ల సంస్థకు రూ.79,836 నష్టం వాటిల్లింది. పనుల కోసం తీసుకున్న తాత్కాలిక అడ్వాన్సులు సర్దుబాటు చేయడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని తప్పుపట్టింది.
- ఉద్యోగుల పర్సనల్ అడ్వాన్సుల బకాయిలు పేరుకుపోవడాన్ని ఎండగట్టింది. అల్వాల్ సర్కిల్‌లో రూ.11,85,757, చాంద్రాయణగుట్టలో రూ. 23,18,130 తాత్కాలిక అడ్వాన్స్‌లపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. చందానగర్ సర్కిల్‌లో అడ్వాన్స్‌గా చెల్లించిన రూ.1,75,67,496 ఆడిట్ ముగిసే వరకు సర్దుబాటు చేయకపోవడాన్ని తప్పుబట్టింది. గోషామహల్ సర్కిల్‌లో బిట్‌మన్ సరఫరా కోసం ప్రైవేటు ఏజెన్సీకి ఏకంగా 99,96,882 అడ్వాన్స్‌గా చెల్లించినప్పటికీ, రూ.79,155 సర్దుబాటు చేయకపోవడాన్ని ఆక్షేపించింది.

ఇంజినీర్ల ఇష్టానుసారం..

- నీటి సరఫరా నిర్వహణ వ్యయాన్ని వాటర్ బోర్డు భరించాల్సి ఉండగా, కూకట్‌పల్లి ఇంజినీర్లు ఇష్టానుసారం వ్యవహరించారు. ప్రైవేట్ సంస్థలకు రూ.45,30,004 చెల్లించారు. వినియోగించిన వాహనాల లాగ్‌బుక్‌లు కూడా ఆడిట్‌కోసం సమర్పించలేదు. దీనిపై ఆడిట్ విభాగం అక్షింతలు వేసింది. చట్టం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడాన్ని తప్పుపట్టింది. వాటర్‌బోర్డు నుంచి రీఫండ్ క్లెయిమ్ చేయాలని సూచించింది.
- గోషామహల్ సర్కిల్‌లో ఆరోగ్యం, పారిశుద్ధ్య విభాగంలో 41 మంది పెన్షనర్ల సర్వీస్ రిజిస్టర్లు లేకపోవడాన్ని తప్పుపడుతూ 2019 మార్చి నుంచి 2020 ఫిబ్రవరి వరకు చెల్లించిన రూ. 49,74,120పై అభ్యంతరం తెలిపింది. 2001 నుంచి వారి సర్వీసు రిజిస్టర్లే లేవు.
- అల్వాల్, ముషీరాబాద్ సర్కిళ్లలో చిట్టా పుస్తకాలు, బ్యాంకులో జమ చేసిన మొత్తాల్లో వ్యత్యాసాలు గుర్తించారు. అల్వాల్‌లో వసూలు చేసింది రూ.20 వేలైతే, బ్యాంకు ఖాతాలో జమచేసింది రూ.2 వేలే. ముషీరాబాద్‌లో నాలుగురోజుల్లో రూ.79,200 తక్కువగా జమచేశారు.
- భూగర్భ డ్రైనేజీ పనుల పేరిట మంజూరు కాకుండనే పనులు చేసినట్లు చూపి రూ.1,35,266 చెల్లించారు.
- సికింద్రాబాద్ సర్కిల్‌లో ఫ్యామిలీ పెన్షన్‌గా రూ.4,56,23,917లు అధికంగా చెల్లించారు.

టౌన్ ప్లానింగ్‌లో తప్పుడు లెక్కలు..

- టౌన్‌ప్లానింగ్ విభాగంలో భవన నిర్మాణ డీవియేషన్లలో తప్పుడు లెక్కలతో తక్కువ కాంపౌండింగ్ ఫీజు విధించి ఓసీలు జారీ చేశారు. అలా మల్కాజిగిరి సర్కిల్‌లో రెండు భవనాల నుంచే రూ.2,46,651 తక్కువ ఫీజు వసూలు చేశారంటే జీహెచ్‌ఎంసీలోని కుప్పలు తెప్పలుగా వెలుస్తున్న భవనాల్లో ఏమేరకు నిధులు చేతులు మారుతున్నాయో అంచనా వేసుకోవచ్చు.

అడ్వర్టయిజ్‌మెంట్లలో అవకతవకలు..

- అడ్వర్టయిజ్‌మెంట్లలో అవకతవకలు కౌన్సిల్ సమావేశాల్లోనూ బట్టబయలవుతున్న నేపథ్యంలో యాడ్ ఏజెన్సీలనుంచి పన్ను వసూలు చేయకపోవడాన్ని గుర్తించింది.రెండు యాడ్ ఏజెన్సీల నుంచి రూ.2,55,707 వసూలు చేయకపోవడాన్ని తప్పుపట్టింది.
- ఇలా వివిధ అంశాల్లోని పొరపాట్లను ప్రస్తావిస్తూ, భవిష్యత్‌లో తిరిగి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, నష్టపోయిన సొమ్ము రికవరీ చేసుకోవాలని ఆదేశించింది.

నిర్వాకం బయటపడటంతో రూ.27,51,317 రికవరీ చేశారు. మిగతా రూ.4,28,72,699 రికవరీ చేయాల్సిందిగా ఆదేశించింది.

2020-21 వార్షిక నివేదికలో..

వాణిజ్య భవనాలు నివాస భవనాల జాబితాలో ఉన్నా చర్యలు తీసుకోకుండా జీహెచ్‌ఎంసీకి తీరని నష్టం కలిగించారు. చందానగర్ సర్కిల్‌లో రెండు ఆస్తులకు ఒకే డోర్‌నెంబర్ ఇచ్చారు.అలా పది భవనాలకు గాను ఐదు పీటీఐఎన్‌లతో ఆస్తిపన్ను విధించారు. గోషామహల్ సర్కిల్‌లో 9 మంది బిల్‌కలెక్టర్లు 2020 ఏప్రిల్ నుంచి మార్చి 2021 వరకు ఆస్తిపన్నుగా ప్రజల నుంచి వసూలు చేసిన నగదు రూ. 6.32 లక్షలు జీహెచ్‌ఎంసీలో జమ చేయలేదు. భవిష్యత్‌లో ఇలాంటి తీవ్ర ఉల్లంఘనలు జరగకుండా చూడాలని ఆడిట్ విభాగం హెచ్చరించింది. అలాగే కాప్రా సర్కిల్‌లో రూ.63,011, ఖైరతాబాద్ సర్కిల్‌లో రూ.23,60,590, ముషీరాబాద్ సర్కిల్‌లో రూ.48,64,484 అవకతవకలు జరగడాన్ని ఆక్షేపించింది. కార్వాన్ సర్కిల్‌లో ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి రూ.37.97 లక్షల వ్యత్యాసం ఉండటాన్ని గుర్తించింది.

సాగర్‌లో 'ఎక్సర్‌సైజ్ రాహత్'







నగరంలోని హుస్సేన్ సాగర్‌లో భారత ఆర్మీ దళాలు ఎన్‌డీఆర్‌ఎఫ్, తెలంగాణ స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్సెస్ (డీఆర్‌ఎఫ్), తెలంగాణ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ డిపార్ట్‌మెంట్, సివిలియన్ ఎన్‌జీఓల ఆధ్వర్యంలో శుక్రవారం ఎక్సర్‌సైజ్ రాహత్‌ను నిర్వహించాయి. తెలంగాణ రాష్ట్రంలో వరద సహాయాన్ని అందించడానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని హుస్సేన్ సాగర్ వేదికగా ప్రదర్శించారు.

– సాక్షి, సిటీబ్యూరో

కళావిహీనంగా గుల్జార్‌హౌజ్

ఫౌంటేన్ ఆధునికీకరణ పనుల్లో నాణ్యత లేమి



చెత్తా చెదారం మధ్య గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్

- మరమ్మతుల పేరుతో నిధుల దుర్వినియోగం
- చెత్తలో పోసిన చందంగా రూ. 29.50 లక్షలు
- అధికారుల నిరంతర పర్యవేక్షణ అవసరం

చార్మినార్: పాతబస్తీకి ప్రధాన ప్రవేశం కనిపించే గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్ మళ్లీ శిథిలావస్థకు చేరుతోంది. నాలుగు శతాబ్దాల గుల్జార్‌హౌజ్‌కు మరమ్మతులు, ఆధునికీకరణ పేరుతో జరిపిన పనుల్లో ప్రజాధనం దుర్వినియోగమైంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో తరచూ శిథిలావస్థకు చేరుకుంటోంది. దీంతో మరమ్మతుల పేరుతో నిధులు మంజూరు చేయడం.. తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకోవడం తంతుగా మారింది. గత ఏడాది అక్టోబర్‌లో రూ.29.50 లక్షల వ్యయంతో చేపట్టిన ఆధునికీకరణ పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కుడా ఆధ్వర్యంలో..

కులీ కుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో గత ఫిబ్రవరిలో సుందరీకరణ పనులు చేపట్టి ఫౌంటేన్ చుట్టూ మార్బుల్స్‌తో పాటు ఎల్‌ఈడీ విద్యుత్ లైట్లను అమర్చి వాటర్ సప్లయ్‌తో తీర్చిదిద్దారు. రాత్రి పూట చార్మినార్, పాతబస్తీలో తదితర ప్రాంతాలను సందర్శించే పర్యాటకులకు కనువిందు చేసేలా ఆధునికీకరించారు. అయితే.. నిరంతర పర్యవేక్షణ లేని కారణంగా ప్రస్తుతం ఈ ఫౌంటేన్ శిథిలావస్థకు చేరుకుంటోంది. మార్బుల్ రాళ్లు పగిలిపోతున్నాయి. ఫౌంటేన్‌లోని నీరు ఎప్పటికప్పుడు మార్చకపోవడంతో కంపు కొడుతున్నాయి. దీంతో సుందరీకరణ ముచ్చట ఎక్కువ రోజులు నిలవడంలేదు. 2016లో సైతం ఫౌంటెన్ మరమ్మతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడంతో అప్పట్లో మరమ్మతు పనులు చేయించారు. మరమ్మతు పనుల అనంతరం ఫౌంటెన్‌ను నిరంతరం పర్యవేక్షించాల్సిన సిబ్బంది పట్టించుకోకపోవడంతో పనికి రాకుండా పోయింది. ప్రస్తుతం ఫౌంటెన్‌లో చెత్త చెదారం పేరుకుపోయి కళావిహీనంగా మారింది.



పగిలిపోతున్న మార్బుల్

పర్యవేక్షణ లేకపోవడంతో..

- గతంలో జరిగిన బయోడైవర్సిటీ సమావేశాల సందర్భంగా గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్‌కు మరమ్మతులు చేసి అందుబాటులోకి తెచ్చారు. ఏడాది గడిచేసరికే మళ్లీ శిథిలావస్థకు చేరుకోవడం.. మరమ్మతులు చేయడం పరిపాటిగా మారింది. సంబంధిత అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ లేకపోవడంతో తిరిగి శిథిలావస్థకు చేరుకుంటోంది. గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్ ప్రాధాన్యం దృష్ట్యా అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తే మరమ్మతులు పునరావృతం చేయాల్సిన అవసరం రాదని పాతబస్తీ ప్రజలు అంటున్నారు. మరమ్మతుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగమవుతోందని ఆరోపిస్తున్నారు.

సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం: మోత్కుపల్లి



అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం అని మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణకోసం తాను, మందకృష్ణ మాదిగ ఎంతో కృషిచేశామని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఇప్పుడు మాదిగలకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ నియామక పరీక్షల్లో, ఉద్యోగాలలో ఈ తీర్పును అమలు చేస్తామని ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. వర్గీకరణకు మద్దతిచ్చిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు ప్రసాద్, కట్ట రాములు తదితరులు పాల్గొన్నారు.

రెండో తరగతి విద్యార్థినిపై అసభ్య ప్రవర్తన

- 9 వ తరగతి విద్యార్థి వికృత చేష్టలు
- ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఘటన

ఉప్పల్: ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండు రోజుల క్రితం రెండవ తరగతి విద్యార్థినిపై అదే స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి వికృత చేష్టలకు పాల్పడ్డాడు. అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని చిన్నారి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు స్కూల్ ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ ఇరువురి పేరెంట్స్‌ను పిలిపించి రాజీ కుదిర్చారు. 9వ తరగతి విద్యార్థిపై చర్యలు తీసుకున్నారు. అయితే విషయం బయటకు పొక్కడంతో శుక్రవారం ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, బీజేవైఎం, ఎన్ఎస్‌యుఐ, మహిళా మోర్చా నేతలు గ్రూపులుగా వచ్చి పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. బాధితులకు న్యాయం చేయాలని, పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందే తల్లిదండ్రులతో సమావేశం ఉందని పాఠశాల యాజమాన్యం మేసేజ్‌లు పెట్టి ఉండటంతో అదే సమయంలో అక్కడికి పెద్దఎత్తున పేరెంట్స్ కూడా చేరుకున్నారు. దీంతో పాఠశాల ఆవరణలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి తమ సిబ్బందితో వచ్చి ఆందోళనకారులను అరెస్టు చేశారు. అనంతరం పరిస్థితులపై ఆరా తీశారు. ఈ విషయంలో బాధితుల తరపు నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఉన్నతాధికారులతో చర్చించి సుమోటోగా కేసు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి తెలిపారు. చిన్నారిపై మరో విద్యార్థి అసభ్యంగా ప్రవర్తించాడన్న విషయాన్ని పేరెంట్స్ ద్వారానే తెలుసుకున్నామని, ఇరువురి పేరెంట్స్‌ను పిలిపించి వారి సమక్షంలోనే సదరు విద్యార్థిపై చర్యలు తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అర్ధరాత్రి ఒంటి గంట వరకు షాపులు తెరవచ్చు..

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో ఇక నుంచి అర్ధరాత్రి 1 గంట వరకూ వాణిజ్య సముదాయాలు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పోలీసులు బలవంతంగా షాపులు మూసి వేయిస్తున్నారని సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడం, ఇదే అంశంపై అసెంబ్లీలోనూ చర్చ జరగడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో అర్ధరాత్రి ఒంటి గంట వరకూ దుకాణాలు తెరిచి ఉంచేందుకు అనుమతి ఇస్తూ ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. మద్యం దుకాణాలు మినహా రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు ఇతరత్రా వ్యాపార కేంద్రాలకు ఈ అనుమతి వర్తిస్తుంది.



స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు



పట్టాలు అందుకున్న విద్యార్థినుల ఆనంద హేల..



స్నాతకోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ, ఆనంద్ మహీంద్రా తదితరులు

సవాళ్లను స్వీకరిస్తే విజయం మీదే

మంత్రి దామోదర రాజనర్సింహ

సుభాష్‌నగర్: సవాళ్లను స్వీకరించడం, రిస్క్ తీసుకోవడం, ఎక్సలెన్స్‌పై దృష్టిసారించడం ద్వారా విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. దుండిగల్ మున్సిపాల్టీ బహదూర్‌పల్లిలోని మహీంద్రా యూనివర్సిటీ మూడవ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ నేటి డిజిటల్ ప్రపంచంలో యువత లక్ష్యాలపై దృష్టిపెట్టాలన్నారు. కొత్త ఆలోచనలు చేయాలన్నారు. మహీంద్రా యూనివర్శిటీ చాన్సలర్ ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయం సాంకేతిక రంగంలోనే కాకుండా మానవీయ శాస్త్రాల మధ్య సంబంధాలను అర్థం చేసుకునే విస్తృత ఆలోచనాపరులను తయారు చేయడంలో సహాయపడుతుందన్నారు. అపోలో హెల్త్ అండ్ ఫార్మసీ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభనా కామినేని, వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యాజులు మేదూరి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు వీరు 751 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. యూనివర్శిటీ ఆవరణలో నూతనంగా నిర్మించిన స్టూడెంట్ రెసిడెంట్ హాల్‌ను ప్రారంభించారు.

డిగ్రీ పట్టా అందుకునేందుకు వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి



సాయికుమార్ (ఫైల్)

మేడ్చల్‌రూరల్: నాలుగేళ్ల బీటెక్ విద్యను పూర్తి చేసుకుని..ఆనందంగా గ్రాడ్యుయేట్ పట్టా అందుకునేందుకు కళాశాలకు బయలుదేరిన విద్యార్థిని రోడ్డు ప్రమాదం బలిగొన్నది. ఈ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తోటి విద్యార్థులు, పోలీసుల వివరాల ప్రకారం... సంగారెడ్డి ప్రాంతానికి చెందిన సాయికుమార్ (23), అతని స్నేహితులు వినోద్, విజయ్‌లు కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ కళాశాలలో బీటెక్ పూర్తి చేసుకున్నారు. శుక్రవారం కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఏర్పాటు చేయగా డిగ్రీ పట్టాలు పొందేందుకు మిత్రులతో కలిసి సాయికుమార్ ద్విచక్ర వాహనంపై సంగారెడ్డి నుంచి కళాశాలకు బయలుదేరారు. మార్గమధ్యలో గౌడవెల్లి సమీపంలో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో దుండిగల్ వైపు నుండి సీఎంఆర్ కళాశాల వైపు వస్తుండగా ఓఆర్ఆర్ అండర్ పాస్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో మరో రోడ్డులో వెళ్తున్న లారీని ఢీ కొట్టారు. ప్రమాదంలో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందగా వినోద్, విజయ్ తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా ప్రమాదంలో మరణించిన సాయికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రీతి కిచెన్'కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రాన్ని అందుకుంటున్న కంపెనీ ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ మిక్సర్ గ్రైండర్ బ్రాండ్ కంపెనీ ప్రీతి కిచెన్ అప్లయెన్సెస్ ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. ఈ విషయాన్ని ఇండియా, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ న్యాయనిర్ణేతలు వివేక్ ఆర్ నాయర్, సగాయ రాజ్ శుక్రవారం ప్రకటించారు. దీంతో దేశంలోనే దృఢమైన పదార్థాలను సైతం చూర్ణం చేయగల అత్యంత శక్తివంతమైన మిక్సర్ గ్రైండర్‌గా గుర్తింపు పొందింది. కొచ్చి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి 120 మంది ఇన్‌ఫ్లూయెన్సర్లతో దీన్ని పరీక్షించారు. ఇటుకలు, కలపతో పాటు సుగంధ ద్రవ్యాలు వంటి ఘన పదార్థాలను సులువుగా మిక్సర్ గ్రైండర్ పొడి చేసింది. ఈ సందర్భంగా వెర్సుని ఇండియా హోమ్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుల్బహర్ తౌరానీ మాట్లాడుతూ ఈ గుర్తింపు వినియోగదారుల పట్ల మాకున్న నిబద్ధతకు నిదర్శనం అన్నారు. అత్యంత శక్తివంతమైన మిక్సర్ గ్రైండర్‌గా రికార్డు సాధించినందుకు గర్విస్తున్నామన్నారు.

నగరంలో నేడు..

- కనకదుర్గ నృత్య విభావరి ఆధ్వర్యంలో సాయంత్రం 5.30 గంటలకు చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో గురుపూర్ణిమ మహోత్సవం జరుగుతుంది.
- జూపాక సుభద్ర రచించిన తెలంగాణ కవిత్వం పుస్తకావిష్కరణ సభ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో జరుగుతుంది.
- బెంగాలీ సంస్కృతి, చేనేత హస్తకళలు, వంటకాల వారసత్వాన్ని చాటిచెప్పే విధంగా శిల్పారామంలో ఉదయం 10 గంటల నుంచి ఎన్స్రిమిటీ ఉత్సవ కార్యక్రమం జరుగుతుంది. ఇందులో ఎథ్నిక్ హాల్‌లో భారతీయ నృత్యాలు తదితర ప్రదర్శనలు ఉంటాయి.

వేధిస్తోందంటూ లావణ్యపై ఫిర్యాదు

మణికొండ: తనను మోసం చేశాడంటూ నటుడు రాజ్‌తరుణ్‌పై ఫిర్యాదు చేసిన లావణ్యపై ప్రీతి అనే మహిళ పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. లావణ్య తనను ఫోన్ చేసి వేధిస్తోందని, తనకు డ్రగ్స్ అలవాటు చేసిందంటూ ప్రీతి శుక్రవారం రాత్రి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై నార్సింగి అడ్మిన్ ఎస్ఐ సుఖేందర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రీతి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తున్నామని, అది తమ పరిధిలోకి వస్తుందా లేదా అనే అంశంతోపాటు.. అందులోని ఆధారాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. దీనిపై ఇపుడే ఏమి చెప్పలేమన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసిన తర్వాతే ఈ ఫిర్యాదుపై వివరాలను వెల్లడిస్తామన్నారు. ఫిర్యాదుదారు ప్రీతితో పాటు ఆర్‌జే శేఖర్ బాషా, న్యాయవాది శర్మ ఉన్నారు.

24 గంటల్లో 4 బ్రెయిన్ స్ట్రోక్ శస్త్ర చికిత్సలు

అపోలో వైద్యుల ఘనత

లక్డీకాపూల్ : నిర్విరామంగా 24 గంటల పాటు శ్రమించి బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న నలుగురికి పునర్జన్మను ప్రసాదించారు అపోలో వైద్యులు. మెకానికల్ థ్రోంబెక్టమీ ప్రొసీజర్‌తో సర్జరీలను విజయవంతం చేశారు. ఈ నలుగురిలో ముగ్గురు 74 ఏళ్లు కావడం గమనార్హం. ఈ వివరాలను ఆస్పత్రికి చెందిన ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ సురేష్ గిర్గాని మీడియాకు తెలిపారు. అత్యాధునిక పద్ధతైన మెకానికల్ థ్రోంబెక్టమీ ప్రొసీజర్‌తో బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు మెరుగైన చికిత్సలు అందించామని, ఈ ప్రక్రియలో తనతో పాటు న్యూరాలజిస్టులు డాక్టర్ సుధీర్, డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ సందీప్ నాయని, డాక్టర్ యశ్వంత్ పాల్గొన్నారని చెప్పారు.

కాగ్ మొట్టికాయలు!

రిజిస్ట్రేషన్ శాఖ పద్దులపై అభ్యంతరాలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని రిజిస్ట్రేషన్ శాఖ పద్దులపై కాగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు అత్యధికగా ఆదాయ సమకూర్చే హైదరాబాద్, రంగారెడ్డిజిల్లా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో రిజిస్ట్రేషన్ జరిగిన పాపర్టీల అండర్ వాల్యుయేషన్, పత్రాల తప్పు వర్గీకరణ, షార్ట్ లెవీ, నాన్ లెవీ ఆఫ్ డ్యూటీస్, రాబడి, తదితర తీరును తప్పుబట్టింది. శాఖపరమైన అండర్ అసెస్‌మెంట్‌లు, ఇతర లోపాలనుఎత్తి చూపింది. హైదరాబాద్ (రెడ్ హిల్స్), హైదరాబాద్ (సౌత్-బంజారాహిల్స్), రంగారెడ్డి, అజంపుర, చేవెళ్ల, కీసర, కుత్బుల్లాపూర్, శామీర్‌పేట్, శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సంబంధించి మొత్తం 128 కేసుల్లో స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుం కలిపి మొత్తం రూ.13.84 కోట్లు తక్కువ చూపినట్లు గుర్తించింది.

ఇక పారిశుధ్య కార్మికుల తరపున పోరాటం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ



హబ్సిగూడ: ఎట్టకేలకు ఎస్సీ వర్గీకరణ సాధించామని, ఇక పారిశుద్ధ్య కార్మికుల తరపున పోరాటం ప్రారంభిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎన్నో ఏళ్ల కల సాకారమైందన్నారు. శుక్రవారం హబ్సిగూడలో ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ, జిల్లా అధ్యక్షుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ..వర్గీకరణ సాధ్యమైందని, ఇక రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వర్గంగా ఉన్న పారిశుద్ధ్య కార్మికుల తరపున పోరాడుతామని స్పష్టం చేశారు. అరకొర వేతనాలతో పారిశుద్ధ్య కార్మికుల జీవన పరిస్థితి దుర్భరంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను కూడా పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల పరిధిలో ఉన్న కార్మికులతో చర్చించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, భాస్కర్, రమేష్, గణేస్, శ్రీనివాస్, యాకయ్య, వేణుగోపాల్, కృష్ణ, సంజీవ, నర్సింహ, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు బాలిక బలి!

- ప్రేమ పేరుతో వేధించడంతో ఉరివేసుకుని ఆత్మహత్య
- జవహర్‌నగర్ పరిధిలో ఘటన

శామీర్‌పేట్: ప్రేమ పేరుతో ఓ యువకుడు వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన మైనర్ బాలిక ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..కుమార్, శారద దంపతులు ఇటీవలే జవహర్‌నగర్ పరిధిలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. వీరి పెద్ద కుమార్తె (16) సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతుంది. బోనాల పండుగ సందర్భంగా ఇటీవల ఇంటికి వచ్చింది. వీరు నివాసం ఉంటున్న ప్రాంతంలోనే ఉండే ఓ కూల్‌డ్రింక్ షాపులో పనిచేసే బోడ శివ (20) అనే యువకుడు బాలికతో చనువుగా ఉండేవాడు. ఈ క్రమంలో బాలికకు మాయమాటలు చెప్పి..ప్రేమిస్తున్నానని వేధించడంతో మనస్తాపం చెందింది. గురువారం రాత్రి తల్లి శారద కూరగాయలు తీసుకురావడానికి బయటకు వెళ్లగా, ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపులు తెరవకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దీనిపై మృతురాలి తల్లి జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శివ వేధింపుల వల్లే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని పేర్కొంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతురాలి తల్లి శారద ఫిర్యాదు మేరకు బోడ శివపై 305, 78 ఏఎన్ఎస్ సెక్షన్, పోక్సో 11,12 తో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని కుషాయిగూడ ఏసీపీ మహేశ్ తెలిపారు.

జేఎన్ఎఫ్ఏయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ



గాయాలకు గురైన సాకేత్

నాంపల్లి: మాసాబ్ ట్యాంక్‌లోని జేఎన్ఎఫ్ఏయూ(జవహర్ లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ) కళాశాల ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ తలెత్తింది. పది మంది జూనియర్ విద్యార్థులు కలిసి ఒక సీనియర్ విద్యార్థిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో గాయపడ్డ సీనియర్ విద్యార్థి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన నాంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. జేఎన్ఎఫ్ఏయూ కళాశాలలో సాకేత్ బాదం (22) అనే విద్యార్థి బిటెక్ ప్లానింగ్ కోర్సులో నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం కళాశాల ముగిసే సమయంలో సాకేత్ తరగతి గది నుంచి బయటకు వస్తుండగా..అప్పటికే కళాశాల ప్రాంగణంలో కాపుగాచి ఉన్న పది మంది ఫొటోగ్రఫీ విభాగానికి చెందిన జూనియర్ విద్యార్థులు దాడికి పాల్పడ్డారు. అందరూ చూస్తుండగానే కళాశాల ఆవరణలో కట్టెలు, రాడ్లతో తరిమి తరిమి కొట్టారు. దీంతో సాకేత్ స్పృహతప్పి కింద పడిపోయాడు. దీంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. దాడికి పాల్పడిన వారిలో జూనియర్ విద్యార్థులతో పాటుగా ఓ మాజీ విద్యార్థి, అతడి అనుచరులు ఉన్నట్లు తెలుస్తోంది. దాడిలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడు సాకేత్ బాదం ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జీఓ 46తో నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలి

లక్డీకాపూల్: జీఓ 46 వల్ల నష్టపోయిన ప్రతి గ్రామీణ ప్రాంత మెరిట్ విద్యార్థులకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జీఓ 46 బాధితులు తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ బైఠాయించారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా ఫలితాలు ఇవ్వడం వల్ల గ్రామీణ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. హైకోర్టులో కేసు నడుస్తుండగానే ఫలితాలు ఇవ్వడాన్ని ఆక్షేపించారు. రాత్రి పొద్దుపోయే వరకు వారు తమ ఆందోళన కొనసాగించారు. వీరితో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇక ప్రజావాణిలో మొత్తం 472 దరఖాస్తులు అందాయి. చిన్నారెడ్డితో పాటు ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

సందడిగా ఫేర్‌వెల్ డే వేడుకలు


ఫేర్‌వెల్ డే వేడుకల్లో సైఫాబాద్ సైన్స్ కళాశాల విద్యార్థులు

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాలలో పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫేర్‌వెల్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఏ రంగంలో ఉన్నా విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదలతో ముందుకు సాగుతూ ఉన్నత స్థానానికి చేరుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నవనీత, బోటనీ హెడ్ డాక్టర్ వెంకటరమణ, కెమిస్ట్రీ హెడ్ వాసవి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఉషామెహ్రా కమిషన్ రిపోర్టు ఆధారంగానే వర్గీకరణ తీర్పు


అభివాదం చేస్తున్న మాదిగ సంఘాల మహా కూటమి నాయకులు

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పు మంద కృష్ణమాదిగ వల్ల రాలేదని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉషా మెహ్రా కమిషన్ వేయించిన సోనియా, మన్మోహన్‌సింగ్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వల్ల వచ్చిందని మాదిగ సంఘాల మహాకూటమి జాతీయ చైర్మన్ పోకల కిరణ్ మాదిగ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ జాతిని అంధకారంలోకి తీసుకువెళ్లే అనాలోచిత ఉద్యమమే చేశారని, తన స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలకు మాదిగ జాతిని తాకట్టు పెడుతూ వచ్చాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి సలహాదారులు సంగీతపు రాజలింగం, మాస్టార్జీ, నాయకులు జంగయ్య, భాస్కర్, రాందాస్, పరమేష్, రామకృష్ణ, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై దాడులను ఖండించాలి: హరగోపాల్

హిమాయత్‌నగర్: ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని పౌర హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. రాజ్యాంగాన్ని పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ మేరకు బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఈ నెల 9, 10 తేదీలలో 'ఆదివాసీల హక్కులు, కార్పొరేటీకరణ సంఘీభావ ఉద్యమాలు' అనే అంశంపై జరగనున్న అఖిల భారత సదస్సు పోస్టర్‌ను పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్‌తో కలిసి హరగోపాల్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల అంతర్జాతీయ హక్కుల దినోత్సవం సందర్భంగా వారి పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్లు మనోరంజన్, మహంతి, సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 10న సాయంత్రం 4 గంటలకు సుందరయ్యపార్కు నుంచి ఇందిరాపార్కు వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీకి ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, అమరుల బంధు మిత్రుల సంఘం ప్రతినిధి భవాని తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో స్వల్ప అగ్నిప్రమాదం


మంటలు ఆర్పుతున్న బంక్ సిబ్బంది

పంజగుట్ట: రాజ్‌భవన్ రోడ్డులోని కపాడియా లేన్ వద్ద ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులోని ట్యాంకులో స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పెట్రోల్ పోయించుకునేందుకు వచ్చిన వాహనదారులు భయంతో అక్కడ నుంచి పారిపోయారు. బంకులో పెట్రోల్ నింపేందుకు శుక్రవారం మధ్యాహ్నం ఆయిల్ ట్యాంకర్ వచ్చింది. దీంతో సిబ్బంది బంకులోని భూ అంతర్భాగంలో ఏర్పాటు చేసిన ట్యాంకు మూత తీస్తుండగా షాట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. బంక్ సిబ్బంది అప్రమత్తమై వెంటనే విద్యుత్ మెయిన్, పెట్రోల్ సరఫరా అయ్యే మెయిన్ లైన్ బంద్ చేశారు. బంకులో మంటలను ఆర్పే ఫైర్ ఫైటర్లను ఉపయోగించి మంటలను ఆర్పేశారు. సిబ్బంది వెంటనే అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పిందని వాహనదారులు అన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

రహమత్‌నగర్: ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకుడు, జూబ్లీహిల్స్ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ చిట్యాల ఆనంద్ మాదిగ గుర్తుచేశారు. రహమత్‌నగర్‌లో శుక్రవారం ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాదిగ మాట్లాడుతూ మాదిగ కులస్తుల పోరాటం విజయవంతం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నాయకులు పల్లె నరసింహ, పీఎల్ ప్రకాశం, దర్గయ్య, రాజు, పరుశురాం పాల్గొన్నారు.

ఆటో ఎల్‌పీజీలో చోరీ

వెంగళరావునగర్: మధురానగర్ పీఎస్ పరిధిలోని ఆటో ఎల్‌పీజీ స్టేషన్‌లో చోరీ జరిగిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నెల్లూరుకు చెందిన చరణ్ సాయి గత నెల 20వ తేదీన సారథి స్టూడియో సమీపంలోని ఎల్‌పీజీ సూపర్ గ్యాస్ కంపెనీలో విధుల్లో చేరారు. ఈ నెల 31న అతను రెండో షిఫ్ట్‌లో డ్యూటీకి వచ్చి రాత్రి ఎవరికీ చెప్పకుండా కంపెనీకి చెందిన రూ.33,618 తీసుకుని వెళ్లాడు. దాంతో జీనియల్ కన్సల్టెంట్ కాంట్రాక్టర్ ప్రవీణ్‌రెడ్డి శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శిశువుకు మురిపాలు

- ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు
- రోజుకో కార్యక్రమంతో అవగాహన
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- బిడ్డకు తల్లిపాలే మేలంటున్న అధికారులు


తల్లిపాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న ఫిలింనగర్ 18 బస్తీల అంగన్‌వాడీ టీచర్లు

బంజారాహిల్స్: తల్లిపాలు శిశువుకు ఎంతో శ్రేష్ఠమైనవని, అనారోగ్యాల బారినపడకుండా తల్లీపిల్లలను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తాయని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ఖైరతాబాద్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ఐసీడీఎస్ ఖైరతాబాద్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, బోరబండ డివిజన్ల పరిధిలో ఉన్న 141 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 మినీ అంగన్‌వాడీ పరిధుల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తూ బాలింతలకు, గర్భిణులకు ఈ వారం రోజుల పాటు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించనున్నారు. ఇందుకోసం రోజువారీగా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయనున్నారు. శిశువులకు తల్లిపాలు ఇవ్వకపోవడం వల్ల అటు తల్లులు, ఇటు పిల్లలు వివిధ రుగ్మతల బారిన పడుతుండటంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు తల్లిపాల ఆవశ్యకతపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు..


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

- ఆగస్టు 1న అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, మినీ కేంద్రాల్లో గర్భిణులు, పాలిచ్చే తల్లులు, కౌమారదశ బాలికలు, కుటుంబ సభ్యులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. పుట్టిన పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు అందించాలని సూచనలు చేశారు.
- 2వ తేదీన అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపకేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి తల్లిపాలపై అవగాహన కల్పించనున్నారు. తల్లులకు పాలిచ్చే బాధ్యత, విధానం, పాల ప్రత్యామ్నాయాలను వివరిస్తారు.
- 3న చిన్నారులకు కేంద్రాల్లో అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించి అనుబంధ పోషకాహారం అందిస్తారు.
- 5, 6 తేదీల్లో 6–24 నెలల వరకు వయస్సున్న పిల్లల గృహాలను సందర్శిస్తారు. పిల్లల బరువుపై తల్లులకు అవగాహన కలిగిస్తారు. తల్లిపాలు అందించే పద్ధతులు, ఆహారంపై అవగాహన కలిగిస్తారు. చేతుల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రాధాన్యతను వివరిస్తారు.
- 7న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహిస్తారు. పిల్లలు, మహిళల శ్రేయస్సు కోసం నిర్వహిస్తున్న అంశాలపై అవగాహన కలిగిస్తారు.
- పిల్లలకు బొప్పాయి, క్యారెట్, పాలకూర, సొరకాయ వంటివి పాలు పడేందుకు దోహదపడతాయని వివరిస్తారు. శిశువులో వ్యాధినిరోధక శక్తి పెరిగి వ్యాధులు తక్కువగా వచ్చే అవకాశం ఉందని తెలియజేస్తారు. శిశువుకు మాంసకృత్తులు, కొవ్వులు, పిండిపదార్థాలు, ద్రవాలన్నీ తల్లి ముర్రుపాలు ద్వారానే అందుతాయని, మొదటి ఆరు నెలలు తల్లిపాలే బిడ్డకు అమృతాహారంగా ఉపయోగపడతాయని తెలియజేస్తారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా శ్రీనివాసశర్మ


శ్రీనివాసశర్మకు శుభాకాంక్షలు చెబుతున్న లావణ్య

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ఈవోగా ఎం.శ్రీనివాసశర్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన లావణ్యను కర్మన్‌ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయానికి బదిలీ చేశారు. కర్మన్‌ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయానికి ఈవోగా పనిచేసిన శ్రీనివాసశర్మను శ్రీనగర్ కాలనీ ఆలయానికి బదిలీ చేశారు. శుక్రవారం ఆలయ కార్యాలయంలో బదిలీ అయిన ఈవో లావణ్య నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస శర్మకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2021లో తాను ఈఓగా ఇక్కడ బాధ్యతలు స్వీకరించానని, నాటి నుంచి నేటి వరకు కళ్యాణ మండపం కింద 4 ప్రత్యేక గదులు నిర్మించామని, అతి రుద్రయాగాన్ని వైభవంగా నిర్వహించామని తెలిపారు. అయ్యప్ప స్వామి ఆలయంలో మహా కుంభాభిషేకంతో పాటు వైకుంఠ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించామని తెలిపారు. తాను ఈవోగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రూ.2 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను విరాళాలుగా సేకరించినట్లు తెలిపారు. ఆలయ ఆదాయాన్ని సైతం గణనీయంగా పెంచినట్లు తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా పోరాటం

- ఈ నెల 29న చలో సచివాలయానికి పిలుపు
- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ స్వరూప్

హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, వర్గీకరణకు మద్దతు తెలిపిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటుకు సిద్ధం కావాలని దళిత బహుజన పార్టీ(డీబీపీ) జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాలమహానాడు నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఆర్టికల్ 341 నిబంధనలు ధిక్కరించి బీజేపీ, మోదీ ఇచ్చిన స్క్రిప్ట్‌నే వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చారన్నారు. తెలంగాణలో వర్గీకరణకు ఆర్డినెన్స్ తెస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. మాలల ఓట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అందుకు కారణం అయిన జాతికి వెన్నుపోటు పొడిచి తీవ్రంగా ద్రోహం చేశారని మండిపడ్డారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 29న చలో సచివాలయం ముట్టడి నిర్వహిస్తామని, అదేవిధంగా కాంగ్రెస్, బీజేపీ ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడించి పెద్ద ఎత్తున నిరసన చేపట్టాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జేఎస్.రావు, జాతీయ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ భాస్కర్, డీబీపీ నేతలు సిలివేరి వసంత్‌రావు, చిప్పర్తి సుబ్బారావు, బుంగా జయరాజు, బత్తుల సత్యనారాయణ, మహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



ఎగ్జిబిషన్‌లో వస్త్రాలను తిలకిస్తున్న మహిళలు

శ్రీనగర్‌కాలనీ: రంగురంగుల కాటన్, సిల్క్, డిజైనరీ చీరలతో శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్ మహిళలను ఆకట్టుకుటోంది. శుభకార్యాలు, పండగలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకమైన చీరలు ముఖ్యంగా పటోలా, చెందేరి, పోచంపల్లి, వెంకటగిరి, గద్వాల, బెనారస్, కోల్‌కతా, ఉప్పాడ, ధర్మవరం చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించాలనే సదుద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను 70స్టాల్స్‌తో ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 5 వరకూ ప్రదర్శన కొనసాగుతుందని ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా హెయిర్ కటింగ్


కుష్టు వ్యాధిగ్రస్తుడికి కటింగ్ చేస్తున్న సామాజిక సేవా కార్యకర్త రమేష్ కొడిచెర్ల

బంజారాహిల్స్: స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన స్మృతి నివాళిగా సామాజిక సేవా కార్యకర్త బంజారాహిల్స్ రోడ్డు నంబర్–2 ఇందిరానగర్ నివాసి రమేష్ కొడిచెర్ల శివానంద రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉన్న కుష్టు వ్యాధిగ్రస్తులకు శుక్రవారం ఉచితంగా హెయిర్ కటింగ్, షేవింగ్ చేశారు. ప్రముఖుల జయంతులు, వర్ధంతుల సందర్భంగా వారికి నివాళిగా ఆయన అనాథాశ్రమాల్లో ఈ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగానే పింగళి వెంకయ్యకు నివాళిగా ఆశ్రమంలో ఉన్న 25 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు హెయిర్ కటింగ్ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

కేబీఆర్ జీహెచ్ఎంసీ వాక్ వేలో ఓపెన్ జిమ్స్


కేబీఆర్ పార్కు వాక్ వేలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్ వేలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులతో కలిసి పర్యటించి వాక్ వేలో అభివృద్ధి పనులపై చర్చించారు. వాకర్లతో కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా వాక్ వే జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు ప్రస్తుతం ఉన్న ఓపెన్ జిమ్స్ స్థానంలో కొత్త పరికరాలతో ఆధునీకరించాలని సూచించారు. అలాగే ఇదే వాక్ వేలో మరోచోట కూడా ఓపెన్ జిమ్ నిర్మాణానికి స్థలం ఎంపిక చేయాలన్నారు. కేన్సర్ ఆస్పత్రి వైపు వాక్ వేలో కూడా మరొక ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసే ప్రతిపాదన రూపొందించాలన్నారు. కేబీఆర్ చుట్టూ ఉన్న జీహెచ్ఎంసీ వాక్ వేలో అవసరమైనన్ని ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణతో పాటు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. అలాగే బంజారాహిల్స్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు వెళ్లే వాక్‌వేలో వర్షం పడినప్పుడు తలదాచుకోవడానికి గొడుగు ఆకారంలో నిర్మాణం కూడా చేపట్టాలని, సీనియర్ సిటిజన్స్ కూర్చోవడానికి వీలుగా అన్ని హంగులతో నిర్మించాలన్నారు. వాక్‌వేలో అక్కడక్కడా మట్టి చేరిందని, మొరంతో చదును చేయాలని సూచించారు.

బోరబండకు ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలి

రహమత్‌నగర్: బోరబండ నుంచి బస్సు సర్వీసులు పెంచాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ కార్యకర్తలతో కలిసి బోరబండ బస్టాప్ వద్ద సీపీఎం నాయకులు శేషగిరిరావు, రాపర్తి ఆశోక్ శుక్రవారం ఆందోళన నిర్వహించి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోరబండ బస్టాప్ నుంచి నిత్యం వేలాది మంది రాకపోకలు కొనసాగిస్తుంటారని గుర్తు చేశారు. ప్రయాణికుల అవసరం మేరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపకపోవడంతో వారికి తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. స్వామి, ఏఆర్ నరసింహ, సోమ్లానాయక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: శాంతిశిఖర, అవంతినగర్, విద్యుత్ టవర్స్, భరత్‌నగర్, అమీర్‌పేట, లక్ష్మీకాంప్లెక్స్ 11కేవీ ఫీడర్లు కుందన్‌బాగ్, మోతీనగర్, బేగంపేట, జనప్రియ, మైత్రీవనం, ఆల్విన్ సబ్‌స్టేషన్ల మధ్య జరుగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు శాంతిశిఖర అపార్ట్‌మెంట్స్, అయ్యప్ప టెంపుల్ లేన్, చర్చి గల్లీ, స్వాతి టిఫిన్స్ వెనుక, మోతీనగర్, అవంతీనగర్, లీలానగర్, విద్యుత్ టవర్, కాకతీయ మెస్ పరిసరాలు, అమీర్‌పేట మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ శుక్రవారం తెలిపారు.

- ఆనంద్‌బాగ్, బీఎస్‌పురి, హైదరాబాద్ సెంట్రల్, సోమాజిగూడ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, 11కేవీ ఫీడర్లు మైత్రీవనం, మోతీనగర్, ఎర్రమంజిల్, గ్రీన్‌లాండ్స్, ఆల్విన్, సబ్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల సోమాబాయి టెంపుల్, సత్యం థియేటర్, శేషమహల్ ఏరియా, గౌతంపురికాలనీ, బీఎస్ పురి, నటరాజ్‌నగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి 1గంట వరకు కరెంటు ఉండదు అన్నారు.
- మహాత్మానగర్ 11కేవీ ఫీడర్ ఎస్‌పీఆర్‌హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల వల్ల 1గంట నుంచి 1.30 వరకు ఎస్‌పీఆర్ హిల్స్ బస్తీలు, ఎస్‌వీఎస్ టెంపుల్, గణేష్‌నగర్ 11కేవీ ఫీడర్లు, బేగంపేట ప్రాంతాల్లో కరెంటు ఉండదు.
- మోతీనగర్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు ఎస్‌వీఎస్ టెంపుల్, బి.టైప్, 3ఆర్‌టీ క్వార్టర్స్, ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంతాలు, స్నేహపురికాలనీ, మోతీనగర్ ప్రాంతాల్లో, ఈస్ట్ శ్రీనివాస్‌నగర్, అల్లాడిన్‌కోటి ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నాం.
- 11కేవీ ఫీడర్లు, మైత్రీవనం, లోధా సబ్‌స్టేషన్ల పరిధిల్లో మరమ్మతుల కారణంగా సత్యం థియేటర్ ఏరియా, ప్రైమ్ ఆస్పత్రి ఏరియా, ఇండస్ట్రియల్ ఏరియా, అల్లాడిన్ కోటి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సైఫాబాద్ డివిజన్ పరిధిలో..

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ టీఎస్ఎస్‌పీడీసీఎల్ పరిధిలోని శనివారం ఉదయం 10 నుంచి 4 గంటల వరకు సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్ తెలిపారు.

- హైదర్‌గూడ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు సీడీఆర్ హాస్పిటల్ లేన్, ఆర్టీసీ గెస్ట్‌హౌస్, ఉర్దూ కాలేజీ, పంచాయతీరాజ్ ఆఫీస్, మల్‌బార్ గోల్డ్ తదితర ప్రాంతాలు.
- ఇందిరాపార్క్ పరిధిలోని గంగామహల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు లోయర్ ట్యాంక్‌బండ్, బ్రదం గల్లీ, గ్యాస్ గోడౌన్, దోమలగూడ మార్కెట్, జెడ్పి ఆఫీస్ తదితర ప్రాంతాలు.
- రాంలీలా మైదాన్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు విజయ్‌మేరీ హాస్పిటల్, శివాలయం టెంపుల్ రోడ్డు, చర్చిగల్లీ, సైన్స్ కాలేజీ, చింతలబస్తీ మార్కెట్, ఆనంద్‌నగర్ ఫీడర్ పరిధిలో ఎమ్మార్వో ఆఫీస్, మాతృశ్రీ అపార్ట్‌మెంట్, శివాలయం తదితర ప్రాంతాలు.
- అనుగ్రహ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి 1గంట వరకు అనురాగా అపార్ట్‌మెంట్, నవీన్‌నగర్ ఏరియా, నవీన్‌నగర్ కమ్యూనిటీ హాల్, శారద అపార్ట్‌మెంట్, మిల్క్ బూత్ డీఎస్ఆర్ ఏరియా, హుస్సేన్‌సాగర్ ప్రాంతాలు.
- ఆదర్శ్‌నగర్ ఫీడర్ పరిధిలో 3 నుంచి 4.30 గంటల వరకు ఆదర్శ్‌నగర్, ఎస్‌బీఐ బ్యాంక్ ఏరియా, ఆదర్శ్‌నగర్, ఈఎస్ఐ హాస్పిటల్ ఏరియా, ఆదర్శ్ కేఫ్, గాంధీనగర్, బిర్లా ప్లానిటోరియం, హిమాయత్‌నగర్ మెయిన్ రోడ్డు, రత్నదీప్ సూపర్‌మార్కెట్ ఏరియా, గౌతం మోడల్ స్కూల్, బ్యాంక్ ఆఫ్ బరోడా ఏరియా, గాంధీనగర్ ఏరియా, దేవీచౌక్ ఏరియా, ఇందిరానగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

యంగ్ ఇండియా స్కిల్‌తో నైపుణ్యం మెరుగు

అమీర్‌పేట: గ్లోబల్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగులు, విద్యార్థులు, యువతలో నైపుణ్యతను పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ దోహదపడుతుందని ఏఐసీసీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కోఆర్డినేటర్ చౌదరిగౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్‌పేటలో తెలంగాణ ప్రభుత్వం భూమి పూజ చేసిన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం అమీర్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో చదువుతో పాటు నైపుణ్యం కలిగి ఉంటే పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఉద్యోగావకాశాలు, ఉపాధి కల్పనలో స్కిల్ యూనివర్సిటీ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్, శనివారం, 3, ఆగస్టు, 2024



- అడుగడుగునా కెమెరాలతో జంతువుల పర్యవేక్షణ
- థర్మల్ డ్రోన్లు, పీటీజెడ్ వంటి సాంకేతికత వినియోగం
- మనుషులు, జంతువుల కదలికలపై నిఘా
- పలు జాతుల సంతతి అభివృద్ధికి కృషి



జూమ్!

నెహ్రూ జూ పార్కులో అధునాతన టెక్నాలజీ

ఆదివారం వస్తే.. అలా సరదాగా ఫ్యామిలీతో గడపాలనిపిస్తుంటుంది. పిల్లలతో కలిసి జూపార్క్‌కు వెళ్తే బాగుంటుంది. పిల్లలకు సరదాతో పాటు అవగాహన, పరిజ్ఞానం వస్తుంటుంది. అయితే సెలవు రోజు కావడంతో జూపార్కు సందర్శకులతో కిటకిటలాడుతుంటుంది. క్యూలైన్లలో నిల్చుని చాలా కష్టపడి టికెట్ తీసుకోవాలి. ఇక బైక్ పార్కింగ్ చేయాలంటే పడే అగచాట్లు అన్నీ ఇన్నీ కాదు. ఇదంతా ఒకప్పుడు.. ఇప్పుడు అలా కాదు.. జూపార్క్ ఫుల్ స్మార్ట్‌గా మారిపోయింది. అన్ని సేవలూ మన స్మార్ట్‌ఫోన్ ద్వారానే చకచకా జరిగిపోతాయంతే.. టికెట్, పార్కింగే కాదు.. లోపలికి వెళ్లడం, ఈ-బైక్, ఈ-వెహికిల్ లాంటివి కూడా ఆన్‌లైన్‌లోనే బుకింగ్ చేసేసుకోవచ్చు. సందర్శకులకు సేవలందించడంతో పాటు జంతువుల సంరక్షణ, ఆహారం, ఆరోగ్యం అన్నీ టెక్నాలజీ సాయంతో మానిటర్ చేస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే జూపార్కు ఇప్పుడు టెకీ సామ్రాజ్యం.

– సాక్షి, సిటీబ్యూరో

పార్కులో దాదాపు 300 సీసీ కెమెరాలతో ఎక్కడికక్కడ మానిటరింగ్ చేస్తున్నారు. 360 డిగ్రీలు గమనించే కెమెరాలతో పాటు, మోషన్ క్యాప్చర్ కెమెరాలు, సౌర విద్యుత్‌తో పనిచేసే కెమెరాలను మూలమూలనా అమర్చారు. వీటి ద్వారా జంతువుల బాగోగులు, వాటి కదలికలు, ప్రవర్తన, ఆహారం గురించి కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి గమనిస్తుంటారు. అంతేకాకుండా ఉన్నతాధికారులు తమ స్మార్ట్‌ఫోన్లలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం ఉంది. ఏ చిన్న అనుమానం వచ్చినా సిబ్బందిని అలర్ట్ చేస్తారు. వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి సమస్యను పరిష్కరిస్తుంటారు. ఫ్రీ రేంజ్‌లో ఉన్న జంతువుల కదలికలను గుర్తించేందుకు, అడవుల్లోని జంతువులను గుర్తించేందుకు కెమెరా ట్రాప్‌లను వాడుతున్నారు. ఈ కెమెరాల ముందు నుంచి ఏదైనా జంతువు వెళ్లినప్పుడు వెంటనే గుర్తించి ఫొటో తీస్తుంది.

జంతువులకు మైక్రో చిప్స్..

జంతు సంరక్షణ విషయంలో సాంకేతికతను ఇక్కడ విరివిగా వాడుతున్నారు. జంతువులను గుర్తించేందుకు ట్రాన్స్‌పాండర్స్ ద్వారా మైక్రో చిప్‌లను వాటికి అమరుస్తారు. రిమోట్ సెన్సింగ్, జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) ద్వారా మ్యాపింగ్, లేఅవుట్, మాస్టర్ ప్లాన్ డిజైన్ గురించి ఏరియల్ సర్వే చేసేందుకు వినియోగిస్తున్నారు.





పార్కు భద్రత కోసం..



జూపార్కు భద్రత కోసం ప్రత్యేకంగా సోలార్ కంచెలు ఏర్పాటు చేశారు. బయటి నుంచి ఎవరూ లోపలికి రాకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. అలాంటి వారిని గుర్తించేందుకు థర్మల్ డ్రోన్లను వినియోగిస్తుంటారు. సఫారీలో బయటకు వెళ్లిన పులులు, సింహాలు అడవిలో తిరుగుతూ స్థావరాలకు రాకపోతే థర్మల్ డ్రోన్ల సాయంతో వాటిని గమనిస్తూ ఉంటారు. ఇక, జూపార్కులోని జంతువుల స్థావరాల్లోకి సందర్శకులు వెళ్లకుండా ఉండేందుకు చుట్టూ సోలార్ కంచెలు ఏర్పాటు చేశారు.

పూర్తిగా ఆన్‌లైన్‌లోనే..

పార్కుకు వచ్చే సందర్శకులు క్యూలైన్లలో ఇబ్బందులు పడకుండా చూసేందుకు టికెటింగ్ వ్యవస్థ మొత్తం ఆన్‌లైన్‌లోనే ఏర్పాటు చేశారు. క్యూఆర్ కోడ్ ద్వారానే ప్రవేశ టికెట్, ఈ-బైక్, వెహికిల్ వంటి సదుపాయాలు బుక్ చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్ విషయంలో ఇబ్బందులు లేకుండా త్వరలోనే ఆన్‌లైన్ పార్కింగ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు.

ప్రత్యేక యాప్ తయారీ..

జూపార్కు సందర్శకులకు మంచి అనుభూతి ఇచ్చేందుకు జూపార్కు నిర్వాహకులు ప్రత్యేక యాప్ అందుబాటులోకి తేనున్నారు. 'జూపీడియా'పేరుతో ఈ యాప్ రూపొందించారు. దీనిద్వారా జూలో ఏయే జంతువులు ఎక్కడ ఉన్నాయనే వివరాలను మ్యాప్ రూపంలో చూపించనుంది. సదరు జంతువు ఉన్న ప్రదేశంపై నొక్కితే వెంటనే అక్కడికి వెళ్లే దారిని చూపిస్తుంది. అంతేకాదు ఆ జంతువు పూర్తి వివరాలను అక్షర రూపంతో పాటు ఆడియో రూపంలో సందర్శకులకు అందిస్తుంది. విద్యార్థులకు ఆ జంతువుల గురించి పూర్తిగా తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది.

కంటికి రెప్పలా...



'అంతరించిపోయే ప్రమాదం ఉన్న జంతువుల సంతతి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా మూషిక జింకల సంతతిని పెంచేందుకు ఎంతో కృషి చేస్తున్నాం. రైనోసారస్ వంటి జంతువుల సంతతి కూడా పెరుగుతోంది. జూలోని జంతువులు అంటే ఇంట్లో పిల్లల మాదిరిగానే. వాటికి ఏ చిన్న గాయమైనా బాధ కలుగుతుంది. ప్రతి రోజూ వాటిని కంటికి రెప్పలా చూసుకుంటాం'

– సునీల్ హిరేమత్, క్యూరేటర్, నెహ్రూ జంతు ప్రదర్శనశాల




హైటెక్స్‌లో 'దీప్‌మేళా' ప్రారంభం



మాదాపూర్: దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన కళాకృతులు అద్భుతంగా ఉన్నాయని అటల్ బిహారి వాజ్‌పేయి ఫౌండేషన్ చైర్‌పర్సన్ కావ్య కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న దీప్‌మేళా ఎగ్జిబిషన్‌ను శుక్రవారం నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇటువంటి ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకృతులు, దుస్తులు, గృహోపకరణాల స్టాల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్లబ్ ద్వారా వచ్చిన ఆదాయంతో సొంతంగా పాఠశాలను నిర్వహించడం గర్వకారణమన్నారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు మద్దతు అందించడం, వెనుకబడిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తూ దీప్‌శిఖా మహిళా క్లబ్, కన్యక గురుకుల్ హైస్కూల్‌ను నిర్వహించి 1700 మంది విద్యార్థులకు విద్యను అందిస్తున్నందుకు అభినందించారు. సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమవుతుందని దీప్‌శిఖా మహిళా క్లబ్ అధ్యక్షురాలు రాధిక మలానీ అన్నారు. మేళాలో ఎలైట్ ఆభరణాలు, డిజైనర్ వస్త్రాలు, చేతిపనులు, జీవనశైలి వస్తువులు, బహుమతులు, పోషకాహార, గృహ ఉత్పత్తులు, చర్మ సంరక్షణ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్లబ్ సభ్యులు బహేటి, సంజీతజైన్, భావనసంఘి, మీనాక్షి ఛురారియా, శివానితిబ్రివాల్, ఇంద్రదోచనియ, ఉషాసంఘి పాల్గొన్నారు.

సేవ్ వయనాడ్

వరద బాధిత కుటుంబాలకు శ్రేయాస్ ఇంపాక్ట్ ఫౌండేషన్ సాయం



సాక్షి, సిటీబ్యూరో : ఇటీవల కేరళలోని వయనాడ్, పరిసర ప్రాంతాల్లో వరద సృష్టించిన బీభత్సం గురించి విదితమే. ఈ ప్రకృతి విపత్తు కారణంగా వందల మంది చనిపోవడమే కాకుండా, వేల మంది నిరాశ్రయులయ్యారు. ఈ తరుణంలో బాధితలకు అండగా హైదరాబాద్ నగరం స్నేహ హస్తాన్ని అందించేందుకు ముందుకొచ్చింది. ఇందులో భాగంగానే ప్రముఖ ఈవెంట్ ఆర్గనైజింగ్ సంస్థ శ్రేయాస్ గ్రూప్ ఆధ్వర్యంలోని శ్రేయాస్ ఇంపాక్ట్ ఫౌండేషన్ వయనాడ్ వరద బాధితులకు నిత్యావసర సరుకులను అందించేందుకు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఇందులో భాగంగా 400 బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, మందులు అందించనుంది. ఇందులో 2 వందల కుటుంబాలకు శ్రేయాస్ ఇంపాక్ట్ ఫౌండేషన్ తన సొంత ఖర్చులతో అవసరమైన సరుకులు సమకూర్చింది. మరో 200 కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని ఇతర సంస్థలు, వ్యక్తుల నుంచి సేకరించనుందని వ్యవస్థాపకులు శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 4న సాయంత్రం 5 గంటలకు సరుకులతో నింపిన వాహనాలు కేరళకు పంపనున్నామని, ఆ లోపు ఎవరైనా సహాయం అందించాలనుకుంటే.. వస్తువులు, నిత్యావసర సరుకులను జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్-5, మెట్రో స్టేషన్ దగ్గరలోని శ్రేయాస్ గ్రూప్ కార్యాలయానికి పంపించవచ్చని పేర్కొన్నారు. సర్వం కోల్పోయి సహాయం కోసం ఎదురు చూస్తున్న వారికి తోడ్పాటును అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. సమాచారం కోసం హెల్ప్ లైన్ నెంబర్ 96660 26666లో సంప్రదించవచ్చని అన్నారు.

సిటీలో ఏవియేటర్స్ మీట్



సాక్షి, సిటీబ్యూరో: ఏవియేషన్ రంగంలో విశేష కృషి చేసిన సభ్యులంతా ఒక వేదిక మీదకు చేరి తమ అనుభవాలను పంచుకున్నారు. హైదరాబాద్ ఏవియేటర్స్ సొసైటీ ఆధ్వర్యంలో మాదాపూర్ ఆడి షోరూమ్‌లో తమ 18వ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ మీట్‌లో 50 ఏళ్ల అనుభవమున్న ఆ తరం ఏవియేటర్స్‌తో పాటు ఈ మధ్యనే కెరీర్ ప్రారంభించిన వారు సైతం పాల్గొన్నారు. దేశ విదేశాల్లో ఉన్న హైదరాబాద్ ఏవియేటర్స్‌ను ఇలా కలుసుకోవడం సంతోషమని అసోసియేషన్ వ్యవస్థాపకులు కెప్టెన్ అనిల్ కుమార్ అన్నారు. కొన్నేళ్లుగా ఆర్మీ ప్రతినిధులను సైతం ఆహ్వానిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ముంబై, బెంగళూరు, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో కూడా అసోసియేషన్లను ఏర్పాటు చేసి వీటన్నింటితో భారతీయ ఏవియేషన్ సమాఖ్యను రూపొందించే యోచనలో ఉన్నామన్నారు. ఏవియేషన్ రంగంలోని పైలెట్స్, క్యాబిన్ క్రూ, ఇంజినీర్స్, ఆక్టోపస్ వివిధ విభాగాలకు చెందిన 250 మంది తమ అనుభవాలను పంచుకున్నారు. ఏవియేషన్ హిస్టారియన్ అనురాధ రెడ్డి ప్రసిద్ధ ఏవియేషన్ హిస్టారికల్ బుక్‌ను ఆడి ప్రతినిధులకు అందించారు. అసోసియేషన్ సహ వ్యవస్థాపకులు కెప్టెన్ మార్క్ నీల్, ఇతర కెప్టెన్లు కిషణ్, జి ప్రభాకర్ రావు, కెప్టెన్ రెజా, కెప్టెన్ మినోశ, ఎమ్మెస్ రెడ్డి, వి హెచ్ రామ్ పాల్గొన్నారు.

చౌమాన్‌లో 'ఓరియంటల్' సీఫుడ్ ఫెస్టివల్..





ఆహారప్రియులకు ఈ నెల 12 వరకూ అవకాశం

మాదాపూర్ చౌమాన్ హైదరాబాద్‌లో నిర్వహణ

మాదాపూర్/రాయదుర్గం: నగర వాసులకు నోరూరించే ఫుడ్‌ఫెస్టివల్ అందుబాటులోకి వచ్చింది. ఆహారప్రియులకు మాదాపూర్‌లోని చౌమాన్‌లో మొదటి ఓరియంటల్ సీ ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు. సముద్రపు అత్యుత్తమ చేపలతో తయారు చేసిన ఆహారపదార్థాలను మిగతావాటితో ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఫుడ్‌ఫెస్టివల్‌లో సీఫుడ్ వొంటన్ సూప్, బటర్ గార్లిక్ సాస్, సీజనల్ వెజ్జీలతో స్టిర్-ఫ్రైడ్ స్క్విడ్, చైనీస్ గ్రీన్స్‌తో, ఆవిరితో కూడిన బెక్టీ, కోల్‌కతా తరహా చిల్లీ ఆక్టోపస్, కుంగ్‌పావో, స్టైల్ లోబ్‌స్టర్ వంటి వినూత్న వంటకాలను ఫుడ్‌ఫెస్టివల్‌లో ఏర్పాటు చేశారు. నగరవాసులకు సీ ఫుడ్ ఫెస్టివల్ రుచులను చూపించాలనే తపనతో ఓరియంటల్ సీఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశామని చౌమాన్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ దేబాదిత్య చౌదరి అన్నారు. సముద్రపు ఆహారం పట్ల ఎంతో మంది నగర వాసులు మక్కువ చూపుతారన్నారు. నగర ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఈ ఫెస్టివల్ దోహదపడుతుందన్నారు. చౌమాన్ మాదాపూర్, కూకట్‌పల్లి బ్రాంచిలలో ఈ ఫుడ్ ఫెస్టివల్ ఈ నెల 12 వరకు ఉంటుందన్నారు. డైన్‌ఇన్‌తో పాటు హోం డెలివరీ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచామన్నారు.



పార్క్ హయత్‌లో పోల్కి డైమండ్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో ఫైన్ పోల్కి డైమండ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 2 నుంచి 4 వరకు జరగనున్న ఈ డైమండ్ ఎగ్జిబిషన్‌ను సినీ తారలు వర్ష, ప్రజ్ఞలతో పాటు మోడల్స్ ప్రారంభించారు. అరుదైన కాంబినేషన్‌లో రూపుదిద్దుకున్న డిజైనర్ డైమండ్ జ్యువెలరీని వీరు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. దేశవ్యాప్తంగా ప్రఖ్యాత జ్యువెలరీ బ్రాండ్ జేకేజే జ్యువెలర్స్ జైపూర్ ఈ ప్రదర్శనలో తమ అరుదైన ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచింది. జేఎకేజే జ్యువెలర్స్ డైరెక్టర్ జతిన్ మోసన్, చేతన్ మోసన్, జైమోసన్ పాల్గొన్నారు.

48 గంటలకోసారి 'కీ' ఇవ్వాలి..

చార్‌కమాన్ వైపు వినిపించే గంటల చప్పుడు

చెక్కతో వాచ్ ముల్లులు తయారు

వాహ్.. వాచ్

చారిత్రక ఆనవాలుగా చార్మినార్ గడియారం


చార్మినార్: నిజాం కాలంలో నిర్మించిన చార్మినార్ కట్టడానికి నలువైపుల ఏర్పాటు చేసిన గడియారాల గురించి చాలా తక్కువ మందికి తెలుసు. ఈ నాలుగు గడియారాల్లో ఒకటి రిపేర్‌కి వచ్చింది. వాచ్‌లోని 4–5 అంకెల నడుమ సిరామిక్ మెటల్ పగిలిపోవడంతో 12 గంటల పాటు సమయం నిలిచిపోయింది. వెంటనే బాగు చేయించి అందుబాటులోకి తెచ్చారు. ఇక ఈ గడియారాల పనితీరును ఒకసారి పరిశీలిస్తే...

నిజాం కాలంలో...

నిజాం కాలంలో అంటే.. 1889లోనే చార్మినార్ కట్టడానికి నలువైపులా ఈ గడియారాన్ని నిర్మించారు. అప్పట్లో స్థానిక ప్రజలకు సమయం తెలియడం కోసం నిర్మించిన ఈ గడియారంలోని సెరామిక్ మెటల్ ఇటీవల పగిలిపోవడంతో దాదాపు 12 గంటల పాటు సమయం నిలిచిపోయింది. నాలుగింట్లో జీహెచ్‌యంసీ సర్దార్ మహాల్ భవనం (తూర్పు) వైపు ఉన్న ఈ గడియారం మొరాయించింది.

1942 నుంచి వాహెద్ వాచ్ కంపెనీ పర్యవేక్షణలో...

1942 నుంచి లాడ్‌బజార్‌లోని వాహెద్ వాచ్ కంపెనీ యాజమాన్యం చార్మినార్ గడియారం పని తీరును పర్యవేక్షిస్తుంది. అప్పట్లో మోతీగల్లిలో ఉండే సికిందర్ ఖాన్ ఈ గడియారాలకు మరమ్మతులు, పర్యవేక్షణ బాధ్యతలను చూసే వారు. ఆయన మరణానంతరం 1962 నుంచి లాడ్‌బజార్‌లోని గులాం మహ్మద్ రబ్బానీ మరమ్మతు పనులను చూస్తున్నారు.



పావురాలు తిష్ట వేయడంతో..

విషయం తెలిసిన వెంటనే చార్మినార్ కట్టడం కన్జర్వేషన్ క్యూరేటర్ రాజేశ్వరి సంబంధిత వాహెద్ వాచ్ కంపెనీ టెక్నీషియన్స్‌తో మరమ్మతులు చేయించడంతో సమయం తిరిగి అందుబాటులోకి వచ్చింది. గడియారాన్ని మూసి వేయడానికి అవకాశాలు లేకపోవడంతో అలాగే వదిలేశారు. దీంతో అప్పుడప్పుడు సమయం చూపించే ముల్లులపై పావురాలు కూర్చుంటుండటంతో వాటి బరువుకు సమస్యలు తలెత్తుతున్నాయని క్యూరేటర్ రాజేశ్వరి స్పష్టం చేశారు. నాలుగింట్లో చార్‌కమాన్ వైపు గంటల శబ్దం వినిపించే గడియారం.. ఐదు అడుగుల వ్యాసార్థంతో గుండ్రంగా ఐరన్ మెటల్‌తో ఏర్పాటు చేశారు. లోపల సిరామిక్ మెటల్‌తో రూపొందించారు. గడియారంలోని అంకెలను చెక్కతో ఏర్పాటు చేశారు. ఇక గంటల ముల్లులను ఐరన్ మెటల్‌తో తయారు చేయించి అమర్చారు. గంట ముల్లు దాదాపు మూడు అడుగుల పొడవు, నిముషాల ముల్లు నాలుగ అడుగుల పొడవు ఉన్నట్లు వాహెద్ వాచ్ కంపెనీ యజమాని గులాం మహ్మద్ రబ్బానీ తెలిపారు. మక్కా మసీదు, లాడ్‌బజార్, చార్‌కమాన్, సర్దార్ మహాల్ వైపు నాలుగు గడియారాలను ఏర్పాటు చేయగా.. ఇందులో కేవలం చార్‌కమాన్ వైపు గడియారం ప్రతి గంటకూ శబ్దం చేస్తుంది. అయితే నాలుగు గడియారాల్లో ఈ ఒక్కదానికే సౌండ్ సిస్టం ఉందంటున్నారు.

48 గంటలకోసారి...

నలువైపుల ఉన్న గడియారాలకు ప్రతి 48 గంటలకొకసారి కీ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా రూపొందించిన ఈ 'కీ'వాహెద్ వాచ్ కంపెనీ వద్ద ఉంటుంది. దాదాపు అర గంటలో ఈ 'కీ' ఇవ్వడం పూర్తి చేస్తారు సిబ్బంది. చేతితో ఇచ్చే ఈ 'కీ'ని సకాలంలో ఇవ్వకపోతే గడియారాలు పనిచేయవు.

నిరంతర పర్యవేక్షణలో...



ఏళ్ల తరబడి తమ వాచ్ కంపెనీ ఆధ్వర్యంలో చార్మినార్ గడియారాల పని తీరును పర్యవేక్షిస్తున్నాం. వాచ్ మొరాయిస్తుందని తెలిసిన వెంటనే మరమ్మతు చేస్తాం. 1995లో సాలార్‌జంగ్ మ్యూజియం గడియారం పనిచేయకపోతే.. మేమే మరమ్మతు చేశాం.

– గులాం మహ్మద్ రబ్బానీ–వాహెద్ వాచ్ కంపెనీ యజమాని

నేడు అమెరికాకు సీఎం రేవంత్‌రెడ్డి

న్యూయార్క్, వాషింగ్టన్ డీసీ, శాన్‌ఫ్రాన్సిస్కో, డాలస్, దక్షిణకొరియాలో పర్యటన

సీఎంతో పాటు పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు పయనం

రాష్ట్రానికి పెట్టుబడులపై ప్రముఖ వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో భాగంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శనివారం అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలకు వెళ్లనున్నారు. పరిశ్రమలు, ఐటీ శాఖమంత్రి డి.శ్రీధర్‌బాబు కూడా ఆయనతో వెళ్తున్నారు. శనివారం ఉదయం 4.35 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయల్దేరి మధ్యాహ్నం 2.25 గంటలకు న్యూయార్క్ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఈనెల 4న న్యూజెర్సీలో జరిగే ప్రవాస తెలంగాణీయులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. 5, 6 తేదీల్లో న్యూయార్క్‌లో వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపై చర్చిస్తారు. 6న పెప్సికో, హెచ్‌సీఏ కంప్యూటర్స్ ప్రతినిధులతో భేటీ అవుతారు. మధ్యాహ్నం వాషింగ్టన్ డీసీకి చేరుకుని అక్కడ ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులతో సమావేశం కానున్నారు. 7న డాలస్‌లో వ్యాపార సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. అదే రోజు అక్కడ గాంధీ స్మృతి కేంద్రాన్ని సందర్శిస్తారు. 8న శాన్‌ఫ్రాన్సిస్కోలో యాపిల్ ఉత్పాదక బృందం, ట్రైనెట్ సీఈఓ, ఇతర వ్యాపార సంస్థల ప్రతినిధులతో భేటీ అయి చర్చించనున్నారు. 9న గూగుల్, అమెజాన్ తదితర సంస్థల ప్రతినిధులతో సమావేశం అవుతారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో సాయంత్రం జరిగే ప్రవాస తెలంగాణీయుల భేటీలో పాల్గొంటారు. 10న శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి బయల్దేరి 11న దక్షిణ కొరియా రాజధాని సియోల్‌కు చేరుకుంటారు. 12, 13 తేదీల్లో ఎల్‌జీ, శామ్‌సంగ్‌తో పాటు ఇతర వ్యాపార సంస్థల ప్రతినిధులతో భేటీ అయి పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించనున్నారు. 13న రాత్రి 11.50 గంటలకు సియోల్ నుంచి బయల్దేరి 14న ఉదయం 10.50 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటారు.


శుక్రవారం సీఎంను కలిసిన ఆనంద్ మహీంద్రా

సీఎం రేవంత్‌తో ఆనంద్ మహీంద్రా భేటీ

రాష్ట్రంలో కొత్తగా స్థాపించనున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో ఆటోమోటివ్ విభాగాన్ని ప్రారంభించేందుకు మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా ముందుకొచ్చారు. ఈమేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఆనంద్ మహీంద్రా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొత్త పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించారు. త్వరలోనే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిశీలనకు తమ కంపెనీ బృందాన్ని పంపిస్తామని సీఎంకు తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో క్లబ్ మహీంద్రా హాలీడే రిసార్ట్ విస్తరణకు ముందుకొచ్చారు.

ఇళ్లలోకి చొరబడి మనుషులను చంపడమా!

మహిళను వీధి కుక్కలు తినడంపై తీవ్రంగా స్పందించిన హైకోర్టు

- పరిష్కార మార్గం కనుగొనకుంటే ఎలా అని సర్కార్‌ను నిలదీత
- స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కాదు.. నియంత్రణకు ఏం చర్యలు చేపట్టారో చెప్పాలి
- జీహెచ్ఎంసీకి పలు మార్గదర్శకాలు జారీ చేస్తూ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: వీధి కుక్కలు ఇంట్లోకి వెళ్లి మహిళను చంపి.. అవయవాలు తినడం అత్యంత దారుణమైన ఘటన అని హైకోర్టు పేర్కొంది. ఇలా మహిళలు, చిన్నారులను కుక్కలు చంపుతున్నా పరిష్కార మార్గం కనుగొనకుంటే ఎలా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. 'స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కాదు.. దాడుల నియంత్రణకు ఏం చర్యలు చేపట్టారో చెప్పాలి'అని ఆదేశించింది. ప్రజాప్రయోజన వ్యాజ్యంలో వాదనలు కాదని, పరిష్కారం కావాలని న్యాయవాదులకు సూచించింది. ఆ దిశగా అందరి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని సర్కారుకు స్పష్టం చేసింది. వీధి కుక్కలకు పునరావాస కేంద్రాలు, ప్రజల కోసం హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయాలని చెప్పింది. జూన్ 28న పటాన్‌చెరు ఇస్నాపూర్‌లో వీధి కుక్కల దాడిలో 8 ఏళ్ల బాలుడు విశాల్ మృతి చెందాడు. ఈ దారుణంపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న పిటిషన్లకు దీనిని జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వృద్ధురాలిని కుక్కలు పీక్కుతిన్న వైనం, చిన్నారులపై కుక్కల దాడిపై పత్రికల్లో వచ్చిన కథనాలు కోర్టులో ప్రస్తావనకు వచ్చాయి.

పర్యవేక్షణకు కమిటీ ఏర్పాటు చేశాం..

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. యానిమల్ బర్త్ కంట్రోల్, యాంటీ రేబీస్ ప్రోగ్రామ్‌ను సమర్థవంతంగా అమలు చేయడం కోసం కమిటీ ఏర్పాటు చేశామని, ఈ కమిటీ పలు నిర్ణయాలు తీసుకుందని వివరించారు. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్ పనిచేస్తోందన్నారు. జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్ నంబర్‌ను కూడా నిర్వహిస్తోందన్నారు. కాగా, గత విచారణ సందర్భంగా ధర్మాసనం ఆదేశాల అమలుపై జీహెచ్ఎంసీ నివేదిక అందజేసింది. పెంపుడు కుక్కలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వాటి యజమానులకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించింది. కాగా, వీధి కుక్కలను షెల్టర్లకు తరలించి వాటికి అక్కడే అన్ని సదుపాయాలు కల్పించాలని న్యాయవాది వేణుమాధవ్ కోరారు. జీహెచ్ఎంసీ నివేదికను పరిశీలించిన సీజే పలు సూచనలు చేశారు. జంతు సంక్షేమ బోర్డు తరఫున న్యాయవాదిగా డీఎస్‌జీ గాడి ప్రవీణ్‌కుమార్‌ను చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

ధర్మాసనం సూచనలు..

- వీధి కుక్కలపై ఫిర్యాదులకు నగరవాసుల కోసం ప్రత్యేకంగా ఓ హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయాలి.
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ, రాష్ట్రంలోని వివిధ జంతు సంక్షేమ సంస్థలను సంప్రదించి దాడుల నియంత్రణకు సూచనలు స్వీకరించాలి.
- ఏబీసీ నిబంధనల ప్రకారం జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థలు తగినన్ని షెల్టర్లు, పశు వైద్యశాలలు, కుక్కల తరలింపు వ్యాన్‌లు, మొబైల్ వ్యాన్లు, సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఏబీసీ కేంద్రాలు నెలకొల్పి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- ఏబీసీ కేంద్రాల్లో కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించాలి. వ్యాక్సినేషన్ నిర్వహించేందుకు జంతు సంక్షేమ సంస్థలు ముందుకొస్తే ఆ ఖర్చులు ప్రభుత్వం భరించాలి.
- ఏబీసీ కమిటీ నెలకోసారి భేటీ కావాలి. నిబంధనలు పాటించకుంటే కమిటీలను రద్దు చేయాలి.
- ఐదేళ్ల పాటు 10 కుక్కలను దత్తత తీసుకునేలా జంతు ప్రేమికులను ప్రోత్సహించాలి.
- కుక్కలు కరిస్తే ఏం చేయాలో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
- హైదరాబాద్ సిటీకి దూరంగా వీధి కుక్కలకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలి.

పెండింగ్ బిల్లులు వచ్చే వరకూ అండగా ఉంటాం

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- జేఏసీ ఆందోళనకు బీఆర్ఎస్ నేతల సంఘీభావం

రసూల్‌పురా/సాక్షి, హైదరాబాద్: అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేసిన మాజీ సర్పంచులు బాకీలు కట్టలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని శుక్రవారం రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో సచివాలయ ముట్టడికి ప్రయత్నించిన పలువురు మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేసి తిరుమలగిరి, బొల్లారం పీఏస్‌లకు తరలించారు. వారికి సంఘీభావంగా హరీశ్‌రావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు పీఎస్‌లకు చేరుకుని రాష్ట్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం పల్లెప్రగతి కోసం ప్రతీ నెల రూ.270 కోట్లను పంచాయతీలకు ఇచ్చిందని చెప్పారు. అక్రమంగా అరెస్టు చేసిన మాజీ సర్పంచులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల అయ్యే వరకు మాజీ సర్పంచులకు అండగా ఉంటామన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీల్లో చేసిన పనులకు సంబంధించి మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తమ డిమాండ్ల సాధనకోసం నిరసన తెలిపేందుకు వస్తున్న మాజీ సర్పంచులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఖండించారు.

భూమి హక్కులకు 'కొత్త చట్టం'!

▶ మొదటి పేజీ తరువాయి

అయా కారణాలను వివరిస్తూ మ్యుటేషన్ నిలిపేయవచ్చు. ప్రస్తుత చట్టంలో ఈ అవకాశం లేదు. రిజిస్టర్డ్ దస్తావేజులు, భాగ పంపకాలు, వారసత్వ హక్కుల మ్యుటేషన్‌ను విచారించే అధికారం తహసీల్దార్లకు ఉంటుంది. మిగతా అంశాలకు సంబంధించి ఆర్డీవోకు అధికారం ఉంటుంది.

→ రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేటప్పుడు సర్వే మ్యాప్ తప్పనిసరి. రిజిస్ట్రేషన్‌కు వెళ్లేవారు ఈ మ్యాప్‌ను తీసుకెళ్లాల్సి ఉంటుంది. భవిష్యత్తు వివాదాలకు చెక్ పెట్టేలా గతంలో లేని ఈ కొత్త నిబంధన తెస్తున్నారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన తేదీ తర్వాత (ఇందుకు అవసరమైన వ్యవస్థ సిద్ధమయ్యాక) మాత్రమే ఈ మ్యాప్ తప్పనిసరి అవుతుందని బిల్లులో పొందుపరిచారు.

→ ఇప్పటికే తీసుకున్న సాదాబైనామా దరఖాస్తులను కొత్త చట్టం కింద చేసుకున్న దరఖాస్తులుగానే పరిగణిస్తారు. వాటి పరిష్కార సమయంలో స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాల్సిన అవసరం లేదు. అయితే కొత్తగా సాదాబైనామాల దరఖాస్తులను తీసుకుని పరిష్కరించే అధికారాన్ని ఈ బిల్లులో పొందుపరిచారు. కొత్త దరఖాస్తుల పరిష్కారానికి స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. సాదాబైనామాల పరిష్కార అధికారం గతంలో కలెక్టర్లకు ఉండగా కొత్తగా ఆర్డీవోలకు అధికారాలిచ్చారు.

→ ప్రతి భూకమతానికి తాత్కాలిక, శాశ్వత భూఆధార్ (ప్రత్యేక గుర్తింపు సంఖ్య) ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత రికార్డులను పరిశీలించి తాత్కాలిక సంఖ్య ఇస్తారు. సర్వే తర్వాత శాశ్వత భూఆధార్ జారీ చేస్తారు. ఈ భూఆధార్‌కు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తుంది.

→ కొత్తగా గ్రామీణ ప్రాంత ఇంటి స్థలాలకు (ఆబాదీ) కూడా ప్రత్యేక హక్కుల రికార్డు తయారు చేయాలని బిల్లులో పొందుపరిచారు. భూఆధార్‌తోపాటు ఈ ఆబాదీల ఆర్‌వోఆర్‌కు అవసరమైన నిధులు కేంద్రం నుంచి తెచ్చుకోవచ్చు. గత చట్టంలో ఆర్‌వోఆర్ రికార్డుకు, గ్రామ పహాణీకి సంబంధం ఉండేదికాదు. ఈ కొత్త చట్టంలో.. హక్కుల బదలాయింపు జరగ్గానే గ్రామ పహాణీలో ఆ హక్కుల రికార్డును నమోదు చేసేలా నిబంధన విధించారు.

→ తహసీల్దార్లు, ఆర్డీవోలు చేసే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లకు సంబంధించి వివాదాలు వస్తే.. అప్పీల్, రివిజన్‌కు కొత్త చట్టం అవకాశం ఇవ్వనుంది. కలెక్టర్లు లేదా అడిషనల్ కలెక్టర్లకు అప్పీల్ చేసుకోవచ్చు. తర్వాత సీసీఎల్ఏకు సెకండ్ అప్పీల్ చేసుకోవచ్చు. ఇది పాత చట్టంలో లేదు.

→ రివిజన్ మాత్రం రాష్ట్ర ప్రభుత్వం లేదా సీసీఎల్ఏ మాత్రమే చేయాలని బిల్లులో పొందుపరిచారు. గతంలో జాయింట్ కలెక్టర్లకు ఉన్న రివిజన్ అధికారాలను ఇప్పుడు సీసీఎల్ఏకు దఖలు పర్చారు. ఏదైనా రికార్డులో తప్పు జరిగిందని భావిస్తే.. సుమోటోగా తీసుకుని కూడా పరిష్కరించవచ్చు. అయితే అడిషనల్ కలెక్టర్ స్థాయి నుంచి ప్రభుత్వం వరకు అప్పీల్ లేదా రివిజన్లలో ఏ నిర్ణయం తీసుకున్నా లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వడాన్ని తప్పనిసరి చేశారు. 2020 చట్టంలో ఈ అంశం లేదని.. కొత్త చట్టం అమల్లోకి వస్తే భూమి హక్కుల రికార్డుల వివాదాలన్నీ అప్పీలు, రివిజన్లతోనే పరిష్కారమవుతాయని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. యాజమాన్య హక్కుల వివాదాలు, భాగపంపకాల విషయంలో వివాదాలున్నప్పుడు మాత్రమే కోర్టులకు వెళ్లాల్సి ఉంటుందని, తద్వారా కోర్టులపై భారం తగ్గుతుందని అంటున్నాయి.

రూపకల్పన కోసం విస్తృత కసరత్తు

'రికార్డ్ ఆఫ్ రైట్స్–2024 చట్టం'ముసాయిదా బిల్లు రూపకల్పన కోసం రెవెన్యూ వర్గాలు విస్తృతస్థాయిలో కసరత్తు చేశాయి. తెలంగాణలో ఇప్పటివరకు అమలైన 1936, 1948, 1971, 2020 నాటి చట్టాలను పరిశీలించి.. వాటి అమలు వల్ల వచ్చిన ఫలితాలను బేరీజు వేసి కొత్త చట్టాన్ని రూపొందించారు. తెలంగాణలో ఆర్‌వోఆర్ చట్టాల అమలు చరిత్ర, ప్రస్తుత సమస్యలు, రాబోయే అవసరాలను అంచనా వేసి 20 సెక్షన్లతో ముసాయిదాను సిద్ధం చేశారు. ఈ క్రమంలో 18 రాష్ట్రాల్లోని ఆర్‌వోఆర్ చట్టాలను, బిహార్‌లో అమల్లో ఉన్న మ్యుటేషన్ చట్టాన్ని కూడా అధ్యయనం చేశారు. భూముల కు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (భూఆధార్), గ్రామీణ ప్రాంత ఆస్తుల రికార్డు తయారీ ద్వారా కేంద్ర పథకాల అమలుకు వెసులుబాటును కల్పించనున్నారు. ముసాయిదా రూపకల్పనలో భూచట్టాల నిపుణుడు ఎం.సునీల్‌కుమార్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సీఎంఆర్‌వో పీడీ వి.లచ్చిరెడ్డి కీలకపాత్ర పోషించారు.

ప్రజల సలహాలు, సూచనలకు అవకాశం

ఈ ముసాయిదా బిల్లుపై రాష్ట్ర ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామని రెవెన్యూ శాఖ వెల్లడించింది. సీసీఎల్ఏ వెబ్‌సైట్ (ccla.telangana.gov.in)లో ఈ బిల్లును అందుబాటులో ఉంచుతున్నామని.. ఈ నెల 2వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రభుత్వానికి అభిప్రాయాలు తెలియజేయాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు తమ సలహాలు, సూచనలను ror2024-rev@telangana.gov.inకు ఈ–మెయిల్ ద్వారా పంపవచ్చని.. లేదా ల్యాండ్ లీగల్ సెల్, సీసీఎల్ఏ కార్యాలయం, నాంపల్లి స్టేషన్‌రోడ్, అబిడ్స్, హైదరాబాద్–500001కు పోస్టు ద్వారా పంపవచ్చని వెల్లడించారు.

సాక్షి రియల్టీ

వావ్.. వాల్ పేపర్!



సాక్షి, హైదరాబాద్: ఇంటికి వచ్చిన అతిథులను త్రీడీ వాల్ పేపర్లతో కట్టిపడేస్తున్నారు ఇంటీరియర్ ప్రియులు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక వాల్ పేపర్లలోనూ సరికొత్త పోకడలు సంచరించుకుంటున్నాయి. నిర్వహణలో కాస్త శ్రద్ధ చూపిస్తే చాలు త్రీడీ వాల్ పేపర్ల మన్నిక బాగానే ఉంటుంది. కొత్తదైనా, పాతదైనా వాల్ పేపర్ల సహాయంతో ఇంటిని అందంగా అలంకరించుకోవచ్చు. మార్కెట్లో వాల్ పేపర్లు రోల్స్ రూపంలో లభ్యమవుతాయి. ఒక్క రోల్ కొంటే కనీసం 57 చ.అ. విస్తీర్ణానికి సరిపోతుంది. దీని ప్రారంభ ధర రూ.2 వేల నుంచి ఉంటుంది. గోడ సైజు 10 X 10 ఉంటే కనీసం రెండు రోల్స్ సరిపోతాయి. గోడకు అంటించడానికి అదనపు చార్జీలుంటాయి. కనీసం రూ.400 వరకుంటుంది.



త్రీడీలో వాల్..

మారుతున్న అభిరుచులకు అనుగుణంగా ఇంటీరియర్ డిజైనర్లు ఎప్పటికప్పుడు కొత్త పోకడలను పరిచయం చేస్తున్నారు. ప్రధానంగా వాల్ పేపర్ల విభాగంలో త్రీడీ పేపర్స్, కస్టమైజ్ వాల్ పేపర్లను మార్కెట్లోకి తీసుకొచ్చారు. ఇవి మనం కోరుకున్న డిజైన్లు, సైజుల్లో లభించడమే వీటి ప్రత్యేకత. దేవుడి బొమ్మలు, కుటుంబ సభ్యుల బొమ్మలు, తమ అభిరుచులను ప్రదర్శించే బొమ్మల వంటివి ఇంట్లోని గోడల మీద అంటించుకోవచ్చు. త్రీడీ వాల్ పేపర్లు సుమారు 1/1 సైజ్ నుంచి 20/20 సైజ్ దాకా లభిస్తాయి. ధర చ.అ.కు రూ.120 వరకు ఉంటుంది. త్రీడీ వాల్ పేపర్ల నిర్వహణ కూడా చాలా సులువు. మరకలు పడితే తడి గుడ్డతో తుడిస్తే శుభ్రమవుతుంది.

క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైదరాబాద్ ప్రాపర్టీ షోల సిరీస్ మొదలైంది. తొలిసారిగా క్రెడాయ్ హైదరాబాద్ మూడు స్థిరాస్తి ప్రదర్శనలను నిర్వహిస్తుండగా.. 'క్రెడాయబిలిటీ' థీమ్‌తో శుక్రవారం మాదాపూర్‌లోని హైటెక్స్‌లో తొలి ప్రదర్శన ఘనంగా ప్రారంభమైంది. 200ల నిర్మాణ సంస్థలు, 800లకు పైగా ప్రాజెక్ట్‌లు ప్రాపర్టీ షో ప్రదర్శనకు ఉంచారు. ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, వాణిజ్య సముదాయాలు అన్ని రకాల ప్రాపర్టీలు ప్రదర్శనలో ఉన్నాయి. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) నేషనల్ వైస్ చైర్మన్ సీ శేఖర్ రెడ్డి, క్రెడాయ్ నేషనల్ సెక్రటరీ జీ రాంరెడ్డి, క్రెడాయ్ నేషనల్ ఈసీ సభ్యులు సీహెచ్ రామచంద్రారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీబీఆర్ఈ, సీఆర్ఈ మ్యాట్రిక్స్ సంస్థలు రూపొందించిన స్థిరాస్తి రంగంలోని ట్రెండ్స్, ఔట్‌లుక్ నివేదికలను ఆవిష్కరించారు. అనంతరం క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వీ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..బ్రాండ్ హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నాల్గవ నగరంగా గుర్తింపు పొందిందన్నారు. ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి, మౌలిక సదుపాయాలను పెంచడానికి, నగర సర్వతోముఖాభివృద్ధిని నిర్ధారించడానికి ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో వ్యూహాత్మక కార్యక్రమాలు, గణనీయమైన పెట్టుబడులను కేటాయించిందని తెలిపారు. ఔటర్ వరకూ కోర్ అర్బన్ రీజియన్‌గా ప్రభుత్వం గుర్తించడంపై ఆనందం వ్యక్తం చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మల్టీ మోడల్ రవాణా వ్యవస్థ, మూసీ సుందరీకరణ వంటి కీలక ప్రాజెక్ట్‌లతో స్థిరాస్తి రంగంలో నూతనోత్తేజం నింపుతుందని పేర్కొన్నారు. అనంతరం క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్-ఎలెక్ట్ ఎన్ జైదీప్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి అవసరాలను తీర్చడమే కాకుండా, భవిష్యత్ తరాల ప్రయోజనాలను కాపాడే గ్రీన్ బిల్డింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నది మా నిబద్ధత అని చెప్పారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, విద్యా, వైద్య సేవలు, వినోద కేంద్రాలతో కార్పొరేట్‌లకు ఆకర్షణీయమైన నగరంగా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ బీ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు. ఈనెల 4 వరకూ ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుంది. తదుపరి రెండు ప్రాపర్టీ షోలు ఈనెల 9–11న కొంపల్లిలోని శ్రీ కన్వెన్షన్స్‌లో, ఈనెల 23–25న నాగోల్ మెట్రో స్టేషన్ సమీపంలో జరుగుతాయి.



క్లుప్తంగా...

పాఠశాల సమస్యలు పరిష్కరించండి

- విద్యావలంటీర్లను నియమించాలి
- సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బదిలీ అయినా ఇప్పటివరకు నూతన పాఠశాలల్లో చేరని ఎస్‌జీటీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, బదిలీలతో ఖాళీ అయిన పాఠశాలల్లో అవసరమైన మేరకు విద్యావలంటీర్లను వెంటనే నియమించాలని ఆయన కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌కు అభినందనలు తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్‌కు శుక్రవారం ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మంత్రి హరీశ్‌రావు లేఖ రాశారు. మధ్యాహ్న భోజనం వర్కర్ల వేతనాలను పెంచాలని, ఆ పథకంకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

కొత్త నేరచట్టాలను పరిశీలిస్తున్నాం: శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: కేంద్రం తెచ్చిన కొత్త నేర చట్టాలను రాష్ట్ర న్యాయశాఖ పరిశీలిస్తోందని, పౌరస్వేచ్ఛ, భావప్రకటన స్వేచ్ఛ పరిమితికి ఇబ్బందికరంగా ఉండే అంశాలను పునఃసమీక్షించి నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ సివిల్ కోర్టుల చట్ట సవరణ బిల్లును శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టి మాట్లాడారు. కొత్త హైకోర్టు భవన నిర్మాణానికి రూ.1000 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, దేశంలో మరెక్కడ లేని రీతిలో భవనాన్ని నిర్మించాలని సీఎం రేవంత్ భావిస్తున్నారన్నారు. వ్యవసాయ వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కేటీఆర్ సూచించగా, గత బీఆర్ఎస్ పాలనలోనే భూకేటాయింపులు జరిగాయని శ్రీధర్‌బాబు బదులిచ్చారు.

హెచ్‌సీయూ ఇంటిగ్రేటెడ్ పీజీ-2024 అడ్మిషన్లు షురూ

- దరఖాస్తుకు చివరి తేదీ ఆగస్టు 15...22న కౌన్సెలింగ్

రాయదుర్గం: కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) యూజీ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులనుంచి ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ శుక్రవారం విడుదల చేసింది. సీయూఈటీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థులు ఆయా కోర్సుల్లో చేరేందుకు ఆగస్టు 15లోగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఆగస్టు 22న కౌన్సెలింగ్ 30, 31 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని వెల్లడించింది. సెప్టెంబర్ 2 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపింది. మరిన్ని వివరాలకు www.uohyd.ac.inను సంప్రదించవచ్చని వర్సిటీ సూచించింది.

ప్రభుత్వ సిఫారసులను పక్కన పెట్టండి: దాసోజు

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల అంశంపై లేఖ



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంకోర్టులో తాము వేసిన కేసు తేలేంత వరకు రాష్ట్ర ప్రభుత్వ సిఫారసులను పక్కన పెట్టాలని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్.. గవర్నర్‌కు లేఖరాశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న గత గవర్నర్‌ను ఉద్దేశిస్తూ రాసిన లేఖను శుక్రవారం రాసిన లేఖకు జతచేశారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నామినేట్ చేసిన ప్రొఫెసర్ కోదండరాంరెడ్డి, అమేర్ అలీఖాన్ పేర్లను రాష్ట్ర కేబినెట్ చేసిన తాజా సిఫారసులను పక్కన పెట్టాలని దాసోజు కోరారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసులో ఈ ఇద్దరితో పాటు తెలంగాణ ప్రభుత్వం, గవర్నర్ కార్యదర్శిని కూడా ప్రతివాదులుగా చేర్చినందున రాజ్యాంగ నైతికత పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన కుర్రా సత్యనారాయణ, తన పేర్లను పరిశీలించాల్సిందిగా నూతన గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో వ్యక్తిగతంగా వివరణ ఇచ్చేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరారు.

పరిశోధనలతో సమాజానికి మేలు

(వివేకానంద్ తంగెళ్లపల్లి)

'సాక్షి'తో యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్

- యువత పరిశోధనా రంగంలోకి రావాలి
- ఎంత ఎక్కువ మంది వస్తే దేశానికి అంత లబ్ధి
- ఉద్యోగం కోసం కాకుండా రీసెర్చ్‌పై ఆసక్తితో రావాలి
- పరిశోధనల్లో నాణ్యత పెరగాలంటే విద్యార్థులు, అధ్యాపకుల నిష్పత్తి సరిగ్గా ఉండాలి
- బోధనా సిబ్బంది విషయంలో ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి.... కాంట్రాక్టు సిబ్బంది నుంచి నాణ్యమైన పరిశోధనలు ఆశించలేం!
- మేము రాష్ట్ర ప్రభుత్వాలు, గవర్నర్లకు లేఖలు రాస్తూనే ఉన్నాం

పరిశోధనలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్ స్పష్టం చేశారు. యువత పరిశోధనా రంగంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కి చెప్పారు. ఎంత ఎక్కువ మంది పరిశోధనా రంగంలోకి వస్తే అంత ఎక్కువగా దేశానికి లబ్ధి చేకూరుతుందని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన జగదీశ్‌కుమార్ 'సాక్షి'తో మాట్లాడారు.

తగినంత మంది అధ్యాపకులు ఉండాలి

ప్రభుత్వ కాలేజీలు, యూనివర్సిటీల్లో బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని జగదీశ్‌కుమార్ అన్నారు. వీరి నియామకాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల నుంచి నాణ్యమైన పరిశోధనలు ఆశించలేమని. కాంట్రాక్టు పద్ధతిన పనిచేసే వారు నిబద్ధతతో పని చేయలేరని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, అధ్యాపకుల నిష్పత్తి తగిన విధంగా ఉంటే పరిశోధనల్లో ఆటోమేటిక్‌గా నాణ్యత పెరుగుతుందని స్పష్టం చేశారు. చాలా వర్సిటీల్లో శాశ్వత సిబ్బందిని నియమించకుండా, కాంట్రాక్టు అధ్యాపకులతోనే నడిపిస్తున్నారు కదా! అనే ప్రశ్నకు బదులిస్తూ..ఇది చాలా పెద్ద సమస్య అని, రాష్ట్రాల గవర్నర్లు, ప్రభుత్వాలకు ఈ విషయంలో తాము చాలాసార్లు లేఖలు రాశామని చెప్పారు. తమ పరిధిలో ఉన్నంత వరకు తాము ప్రయత్నిస్తున్నామని, గత వారంలో కూడా దీనిపై చర్చించామని తెలిపారు. ఇప్పటికైనా ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఉద్యోగం కోసం పీహెచ్‌డీ చేయకూడదు

పరిశోధనా రంగంలోకి ఎక్కువ మంది యువత రావాలనే ఉద్దేశంతోనే.. పీజీతో సంబంధం లేకుండా నాలుగేళ్ల డిగ్రీ తర్వాత పీహెచ్‌డీ చేసే వెసులుబాటు కల్పించామని జగదీశ్‌కుమార్ వెల్లడించారు. ఈ విధానం విదేశాల్లో ఎప్పటి నుంచో విజయవంతంగా అమలవుతోందని, ఇక్కడ కూడా మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. పీహెచ్‌డీ చేసిన వారికి జీవనోపాధి కష్టమవుతోందనే అభిప్రాయంపై మాట్లాడుతూ..'పీహెచ్‌డీ అంటే ఏదో ఉద్యోగం కోసం చేసే కోర్సు కాదు. రీసెర్చ్‌పై ఆసక్తి (ప్యాషన్) ఉంటేనే ఈ రంగంలోకి రావాలి. దేశానికి సేవ చేయాలనే ఉద్దేశంతో పీహెచ్‌డీ చేయాలి. అంతేకానీ ఉద్యోగం కోసం మాత్రం రావొద్దు. ఉద్యోగమే కావాలనుకుంటే పీజీ తర్వాత ఏదైనా వేరే కోర్సు చేసి స్థిరపడటం మంచిదని నా అభిప్రాయం..'అని చెప్పారు.



న్యాక్ గుర్తింపు తీసుకోవాలి

తెలంగాణ సహా ఎక్కడైనా యూనివర్సిటీలు, డిగ్రీ కాలేజీలు న్యాక్ గుర్తింపు పొందే విషయంలో ఎప్పటికప్పుడూ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ వారికి అవగాహన కల్పిస్తున్నామని, ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నాయని జగదీశ్‌కుమార్ తెలిపారు. న్యాక్ గుర్తింపు కోసం ముందుకు రావాలని విద్యా సంస్థలకు విజ్ఞప్తి చేశారు. అలా రాకపోతే సమాజానికి మేలు చేయని వారిగానే పరిగణించాల్సి వస్తుందని, నాణ్యమైన విద్యను అందించడం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు.

ఏయ్.. తోలు తీస్తా కొడకల్లారా.. బయట కూడా తిరగనివ్వ

- బీఆర్ఎస్ సభ్యులనుద్దేశించి సంయమనం కోల్పోయిన ఎమ్మెల్యే దానం
- మైక్ ఆన్‌లో ఉండగానే అనుచిత వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: శాసనసభలో శుక్రవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ సంయమనం కోల్పోయారు. బీఆర్ఎస్ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో మైక్ ఆన్‌లో ఉండడంతో శాసనసభ ప్రత్యక్ష ప్రసారంలో వెళ్లడం, సభలో వినిపించడంతో గందరగోళానికి దారితీసింది.

అసలు ఏం జరిగిందంటే..

హైదరాబాద్‌లో సుస్థిర అభివృద్ధి అంశంపై స్పీకర్ లఘు చర్చను ప్రారంభించి దానం నాగేందర్‌కు మైక్ ఇచ్చారు. నాగేందర్ మాట్లాడటం ప్రారంభించగానే.. ఆయన వైపు తిరిగి 'నువ్వు ఏ పార్టీ సభ్యుడిగా మాట్లాడుతున్నావు'అంటూ బీఆర్ఎస్ సభ్యులు గట్టిగా నిలదీశారు. నాగేందర్ ఇవేమీ పట్టించుకోకుండా మాట్లాడుతుండగా, వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు పదేపదే ప్రశ్నించటంతో నాగేందర్ తీవ్ర అసహనానికి గురయ్యారు. ఆ క్రమంలోనే సహనం కోల్పోయి.. 'నన్ను ఏయ్ అంటారా'అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారు మళ్లీ నాగేందర్‌ను ఏ పార్టీ సభ్యుడిగా మాట్లాడుతున్నావంటూ నిలదీయటంతో.' ఏయ్ మూసుకో రా..నీయమ్మ.. తోలు తీస్తా కొడుకా ఒక్కొక్కరిది.. నీ యమ్మ బయట కూడా తిరగనీయరా. ఏం అనుకుంటున్నార్రా మీరు...తోలు తీస్తా...బయట కూడా తిరగనియ్య.. రారా.'అంటూ మాట్లాడటంతో సభ్యులంతా విస్తుపోయారు. వెంటనే మేల్కొన్న కాంగ్రెస్ సభ్యులు నాగేందర్ వద్దకు వచ్చి మైక్ ఆన్‌లో ఉందని, అలా మాట్లాడొద్దని సూచించారు. ఇంతలో కొందరు బీఆర్ఎస్ సభ్యులు నాగేందర్ వైపు దూసుకొచ్చి తమను బూతులు తిడతావా అంటూ నిలదీశారు. రండిరా చూసుకుందాం.. అంటూ నాగేందర్ కూడా వారితో బాహాబాహికి సిద్ధమయ్యారు. కాంగ్రెస్ సభ్యులు ఆయన్ను నిలువరించారు. అటువైపు బీఆర్ఎస్ సభ్యులను వారి పార్టీ, కాంగ్రెస్ సభ్యులు కొందరు ఆపి వెనక్కి తీసుకెళ్లారు. ఆ తర్వాత దానం తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సభలోనే ఏవో కాగితాలు చదువుతూ ఉండిపోయారు.

ఖండించిన అక్బరుద్దీన్

సభ వెలుపల ఉన్న మజ్లిస్ శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ వెంటనే సభలోకి వచ్చి. దానిపై స్పందించారు. సీనియర్ సభ్యుడైన దానం నాగేందర్ సభలో అన్‌పార్లమెంటరీ పదాలు వాడడం ఏమాత్రం సబబు కాదని, సభకు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యులు కూడా అన్‌పార్లమెంటరీ పదాలు వాడుతూ తనను మాట్లాడనీయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని, ఆ సందర్భంలో తాను ఆగ్రహం వ్యక్తం చేశానని, కావాలని అలాంటి పదాలు ఉచ్చరించలేదని, దానిపై ఎవరికైనా బాధ కలిగితే విచారం వ్యక్తం చేస్తున్నానని దానం పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను పరిశీలించి రికార్డుల్లో నుంచి తొలగించే విషయమై నిర్ణయం తీసుకుంటానని స్పీకర్ పేర్కొన్నారు. అయితే, తాను మాట్లాడింది హైదరాబాద్ నగర మాండలికంలో భాగమేనంటూ దానం నాగేందర్ పేర్కొనటం కొసమెరుపు. మాట్లాడేందుకు మైక్ ఇవ్వాలని స్పీకర్‌ను బీఆర్ఎస్ సభ్యులు అడగ్గా ఆయన ఇవ్వలేదు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

65.33 గంటలు.. 17 గంటలకుపైగా చర్చలు

38 శాఖల డిమాండ్లను ఆమోదించాం: మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: తొమ్మిది రోజులపాటు జరిగిన శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిసారి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిందని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు తెలిపారు. సీఎల్పీలో శుక్రవారంరాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సమావేశాల్లో 38 శాఖల డిమాండ్లను అసెంబ్లీ ఆమోదించినట్లు తెలిపారు. 65 గంటల 33 నిమిషాలపాటు అసెంబ్లీ పనిచేసిందన్నారు. రాష్ట్ర చరిత్రలో మొదటిసారి ఏకంగా 17 గంటలకు పైగా అసెంబ్లీలో జరిగిన చర్చలో 24 మంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేలకు పద్దులపై మాట్లాడడానికి స్పీకర్ అవకాశం ఇచ్చారని చెప్పారు. స్కిల్స్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసుకోవడం ఒక గొప్ప కార్యక్రమమని, రాష్ట్ర చరిత్రలో ఇది ఒక గొప్పఅడుగు అని అన్నారు. ఐదు ప్రభుత్వ బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపిందన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం అసెంబ్లీలో జాబ్ కేలండర్‌ను విడుదల చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన మరో హామీని నెరవేర్చినట్టు చెప్పారు. ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును అడ్డుకోవడానికి అసెంబ్లీలో బీఆర్ఎస్ రాజకీయం చేసిందని విమర్శించారు. జాబ్ కేలండర్‌పైన ఇదే విధంగా వ్యవహరించిందన్నారు.

శాసనసభ సమావేశాలు నిరవధిక వాయిదా

శాసనసభ 2024-25 వార్షిక బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ముగిశాయి. గత నెల జూలై 23న ప్రారంభమై ఆగస్టు 2 వరకు తొమ్మిదిరోజులపాటు సమావేశాలు జరగ్గా, శాసనసభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రసాద్‌కుమార్ శుక్రవారం ప్రకటించారు.

'విద్య'కు సంస్కరణలు అవసరం

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ జగదీశ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: నాణ్యమైన విద్యతోనే ఉత్పాదకత పెరుగుతుందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ జగదీశ్‌కుమార్ అన్నారు. ఫిక్కీ, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన 'ఎంపవరింగ్ ఎడ్యుకేషన్ ఎకోసిస్టమ్'సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ఆకాంక్షలతో పాటు, సవాళ్లు ఉన్నాయని, పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు అనేక సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. తాను యూజీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సమయంలో చాలా వర్సిటీల్లో పరిశోధనలకు సంబంధించి ప్రత్యేక విభాగం లేదనే విషయం తెలిసి ఆశ్చర్య పోయానని చెప్పారు. యువతకు సాధికారత కల్పించడమే తమ లక్ష్యమని టెక్నికల్ అండ్ కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన అన్నారు. అభివృద్ధి చెందుతున్న సమాజానికి విద్య మైలురాయి లాంటిదని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫిక్కీ, పీడబ్ల్యూసీ సంయుక్తంగా రూపొందించిన 'ఎంపవర్ తెలంగాణ ఎడ్యుకేషన్ సిస్టమ్'నివేదికను విడుదల చేశారు. కార్యక్రమంలో తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, ఫిక్కీ మాజీ ప్రెసిడెంట్ సంగీతారెడ్డి, ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారాం, ఏఐసీటీఈ ఎక్స్‌చైర్మన్ ఎస్ఎస్ మంథా, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, జేఎన్‌యూ న్యూఢిల్లీ వీసీ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ పాల్గొన్నారు.

సీఎంతో గద్వాల ఎమ్మెల్యే భేటీ

కాంగ్రెస్‌లోనే కొనసాగాలని నిర్ణయం



సీఎం రేవంత్‌తో జూపల్లి, బండ్ల తదితరులు

సాక్షి, హైదరాబాద్: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఎట్టకేలకు మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఆయన.. కొద్దిరోజులకే మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. పాలమూరు జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో మళ్లీ కాంగ్రెస్ పార్టీలో ఉండేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ భేటీ లో మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ఉన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌లు కూడా శనివారం మర్యాదపూర్వకంగా సీఎంను కలిశారు.

సమర్థుడికే అధ్యక్ష పదవి ఇవ్వాలి: ఎంపీ అర్వింద్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే సత్తా, సామర్థ్యం ఉన్న వ్యక్తికే రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వాలని బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఈ విషయంలో పార్టీ తనను సంప్రదిస్తే అభిప్రాయం చెబుతానన్నారు. శుక్రవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో అర్వింద్ విలేకరులతో మాట్లాడారు. 'అధ్యక్ష పదవి కోసం మా పార్టీలో రేసులు ఉండవు. నాకు ఇవ్వాలనుకుంటే నన్ను పిలిచి మాట్లాడుతారు. అప్పుడు నా సమాధానం అధిష్టానానికి చెబుతా. నాకు సామర్థ్యం ఉందని నేను అనుకుంటే సరిపోదు. పార్టీ అనుకోవాలి'అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర బీజేపీ నేతల మధ్య సమన్వయలోపం ఉందంటూ వస్తున్న వార్తలను ఖండించిన ఆయన.. పార్టీ ఐక్యంగానే ఉందని స్పష్టంచేశారు. 'రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా గత ప్రభుత్వ అవినీతిపై దర్యాప్తు ఏమైంది? రేవంత్ పౌరుషం ఏమైంది? కమిషన్లు వేయడం కాదు. మీ చిత్త శుద్ధి ఏమైంది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం' అని అర్వింద్ అన్నారు. మందకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ కులగణన జరిగేలా సుప్రీంకోర్టు ఆదేశాలివ్వాలి: జాజుల

7న అమృత్‌సర్ ఓబీసీ మహాసభ, 9న ఢిల్లీలో బీసీల మహాధర్నా

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లను పెంచి బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 7న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జరగనున్న ఓబీసీ తొమ్మిదవ మహాసభ వాల్ పోస్టర్‌ను బీసీ కులసంఘాల నేతలతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ మీడియా పాయింట్‌లో జాజుల మాట్లాడారు. బీసీ కులగణన కూడా జరిగేలా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఈనెల 9న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీల మహాధర్నాను చేపట్టనున్నట్లు తెలిపారు.

బజారుభాషతో రేవంత్ పైశాచిక ఆనందం

▶ మొదటి పేజీ తరువాయి

కేలండర్ పేరిట మోసగిస్తున్న కాంగ్రెస్ నాయకులను యువ త ఎక్కడికక్కడ నిలదీసి కొట్టాలన్నారు. గన్‌పార్కు అమరుల స్తూపం వద్ద కేటీఆర్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందుకు హైదరాబాద్ అశోక్‌నగర్‌కు వచ్చిన రాహుల్‌గాంధీ అధికారంలోకి వచ్చిన తొలిఏడాదే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని డ్రామా చేశారన్నారు. దమ్ముంటే రాహుల్‌గాంధీ, రేవంత్ అశోక్‌నగర్‌కు వచ్చి ఒక్క ఉద్యోగం ఇచ్చినట్టు రుజువు చేసినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరమూ రాజీనామా చేస్తామని చెప్పారు. రేవంత్ మగాడైతే సిటీ సెంట్రల్ లైబ్రరీకి రావాలంటూ సవాల్ చేశారు. మార్పు పేరిట నిరుద్యోగులను మభ్య పెట్టిన రేవంత్‌ను తన్ని తరమడం ఖాయమని కేటీఆర్ హెచ్చరించారు. జాబ్ కేలండర్‌పై అసెంబ్లీలో చర్చించకుండా ప్రభుత్వం పారిపోయినందునే గన్‌పార్క్ వద్ద నిరసన తెలుపుతున్నామన్నారు.



గన్‌పార్కు అమరుల స్తూపం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కేటీఆర్, పల్లా, సబిత, లక్ష్మి, హరీశ్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, ప్రభాకర్, మల్లారెడ్డి, గంగుల, కౌశిక్‌రెడ్డి, వివేకానంద తదితరులు

శాసనసభ చరిత్రలో బ్లాక్ డే: హరీశ్‌రావు

అసెంబ్లీ చరిత్రలో ఇది బ్లాక్ డే అని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఇందిరమ్మ రాజ్యంతో మహిళా ఎమ్మెల్యేలను అవమానించేలా సభా నాయకుడే తిట్టిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ రౌడీషీటర్ భాషతో కన్నతల్లులను అవమానించేలా మాట్లాడుతున్నాడని, ఉద్యమ సమయంలోనూ ఇలాగే మాట్లాడాడని చెప్పారు. హైదరాబాద్ ఏమైనా ఆయన జాగీరా అని ప్రశ్నిస్తూ, దానం నాగేందర్ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జాబ్ కేలండర్‌పై అసెంబ్లీలో డిప్యూటీ సీఎం చేసిన ప్రకటన చిత్తు కాగితంలా ఉందన్నారు. అశోక్‌నగర్‌కు సమయం, తేదీ చెబితే..తామూ వస్తామని, కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేది లేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

- సభ్య సమాజం తలదించుకునేలా మాట్లాడిన దానం నాగేందర్‌పై స్పీకర్ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీలో అసభ్యకరంగా మాట్లాడిన దానం నాగేందర్ రాజీనామా చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. పోస్టులు పెంచాలని అడుగుతున్న నిరుద్యోగులపై లాఠీచార్జ్ చేస్తూ కేసులు పెడుతున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే దానం వ్యాఖ్యలతో...

జాబ్ కేలండర్‌పై చర్చించాలంటూ స్పీకర్ పోడియం వద్ద నిరసన తెలుపుతున్న తమ పార్టీ ఎమ్మెల్యేలపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ మండిపడింది. అయితే దానం వ్యాఖ్యలపై స్పీకర్ స్పందించక పోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సమావేశ మందిరం నుంచి మూకుమ్మడిగా బయటకు వచ్చారు. లాబీలోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో భేటీ అయ్యారు. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తున్న తీరును ఎండగట్టాలని నిర్ణయించారు. దీంతో కేటీఆర్ నేతృత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నినాదాలు చేసుకుంటూ గన్‌పార్కుకు చేరుకున్నారు. బీఆర్ఎస్ ఆందోళన నేపథ్యంలో గన్‌పార్కు వద్ద పోలీసులు భారీగా మోహరించారు. గన్‌పార్కు నుంచి వెళ్లాలని పోలీసులు కోరినా బీఆర్ఎస్ నేతలు నిరాకరించడంతో కేటీఆర్, హరీశ్‌రావు సహా ఆందోళన చేస్తున్న నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని తెలంగాణ భవన్‌కు నేతలను తరలించే క్రమంలో గన్‌పార్కు వద్ద ఉద్రిక్తత నెలకొంది. తెలంగాణ భవన్‌కు చేరుకున్న బీఆర్ఎస్ నేతలను పలువురు నిరుద్యోగులు కలిసి ఉద్యోగాల భర్తీ జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.



శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్.

అవ్వ బరువు.. బువ్వ కరువు

- గాయాలతో చీకటిగదిలో వృద్ధురాలు
- పట్టించుకోని కుమారుడు, కోడలు

నెక్కొండ: ఆస్తి అంతా బతికుండగానే పిల్లలకు రాసిచ్చిన ఓ వృద్ధురాలు.. ఇప్పుడు ఆ బిడ్డలు పట్టించుకోక నరకయాతన పడుతోంది. ప్రమాదవశాత్తు గాయపడిన తల్లిని చీకటి గదికి పరిమితం చేసి.. అన్నపానీయాలు కూడా ఇవ్వని కొడుకు, కోడలి కర్కశత్వం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వెలుగు లోకి వచ్చింది. నర్సంపేట ఐసీడీఎస్ ఏసీడీపీవో శ్రీదేవి కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చంద్రుగొండకు చెందిన వడ్డె కొమురమ్మ (73) భర్త చంద్రయ్య పదేళ్ల క్రితం మృతి చెందాడు. పెద్ద కుమారుడు పరమేశ్వర్ వరంగల్‌లో ఉంటున్నాడు. చిన్న కుమారుడు కుమారస్వామి, కోడలితో కలిసి కొమురమ్మ చంద్రుగొండలో నివసిస్తోంది. కొడుకులకు మూడెకరాల భూమి పంచి ఇచ్చింది. కాగా, నెల రోజుల క్రితం ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో ఆమె మెదడులో రక్తం గడ్డ కట్టడంతోపాటు కాలు విరిగింది. చిన్న కుమారుడు, అంగన్‌వాడీ టీచర్ అయిన కోడలు.. వృద్ధురాలిని ఓ పాత ఇంటిలోని చీకటి గదికి పరిమితం చేసి కనీసం నీరు, ఆహారం కూడా అందించడం లేదు. విషయం తెలుసుకున్న అధికారులు ఆమె ఇంటికి చేరుకొని విచారణ చేపట్టారు. వృద్ధురాలికి మెరుగైన చికిత్స అందించడంతోపాటు ఆలనాపాలన చూసుకోవాలని ఏసీడీపీవో కొమురమ్మ కుటుంబ సభ్యులను హెచ్చరించారు. అంగన్‌వాడీ టీచర్ అయిన కోడలు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని కలెక్టర్‌కు నివేదిస్తామని ఆమె పేర్కొన్నారు.



అనారోగ్యంతో బాధపడుతున్న కొమురమ్మ

డెంగీ హైరిస్క్ ప్రాంతాలు 2,071

అక్కడ నివసించే జనాభా 65 లక్షల మంది

- పరిస్థితిని సమీక్షించిన వైద్య,ఆరోగ్యశాఖ కార్యదర్శి
- ఒక్క జూలై నెలలో 800 డెంగీ కేసుల వరకు నమోదైనట్టు నిర్ధారణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డెంగీ పంజా విసురుతోంది. దీంతో కేసులు భారీగా నమోదవుతున్నాయి. ఈసారి తెలంగాణలో అత్యధికంగా డెంగీ కేసులు నమోదవుతాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించిన నేపథ్యంలో వైద్య,ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 2,071 డెంగీ హైరిస్క్ ప్రాంతాలను గుర్తించింది. ఆ ప్రాంతాల్లో ఏకంగా 65.62 లక్షల మంది జనాభా ఉన్నారని నిర్ధారించడం ఆందోళన కలిగిస్తోంది. గత సంవత్సరాల్లో వచ్చిన డెంగీ కేసుల ఆధారంగా ఈ నిర్ధారణకు వచ్చినట్టు వైద్య,ఆరోగ్యశాఖ వెల్లడిస్తూనే, అప్రమత్తమై 33 ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేసింది. 42 డెంగీ పరీక్ష కేంద్రాలు, ఆస్పత్రులు, తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్లను గుర్తించి వాటిల్లో సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 53 బ్లడ్ బ్యాంకులను గుర్తించగా, వాటిలో 26 బ్లడ్ బ్యాంకుల్లో ప్లేట్‌లెట్ యూనిట్లు ఉన్నాయని తెలిపింది. అన్ని జిల్లాల్లోనూ శానిటైజేషన్, నీటినిల్వ ప్రాంతాల్లో దోమలు రాకుండా చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని వైద్య,ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినాజడ్.చోంగ్తు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం డెంగీ, సీజనల్ వ్యాధుల పరిస్థితిపై అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించడంలో భాగంగా ఆశ, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లాలని, నీటిలో డెంగీ కారక దోమల సంతానోత్పత్తిని నివారించాలని కోరారు. లార్వా వ్యాప్తి ఇతర జిల్లాల కంటే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, ఖమ్మం, నిజామాబాద్, సంగారెడ్డి, వరంగల్ వంటి కొన్ని జిల్లాల్లో ఎక్కువగా ఉన్నాయని వైద్య,ఆరోగ్యశాఖ ప్రకటించింది.

జూలై నెలలోనే 800 కేసులు

వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో దోమల తీవ్రత కారణంగా డెంగీ బాధితుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ ఏడాది జూన్ వరకు రాష్ట్రంలో 1,078 కేసులు నమోదైతే... ఒక్క జూలైలోనే 800 వరకు కేసులు నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. నీటి నిల్వలు భారీగా పెరుగుతుండటం, పారిశుధ్యలోపం కారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో డెంగీ బాధితుల సంఖ్య మరింత పెరగవచ్చని వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు డెంగీ బాధితులు వస్తున్నారు. ఔట్ పేషెంట్ల సంఖ్య కూడా పెరిగింది. ఇక గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా ఉందంటున్నారు.



మీరు పడుకునే భంగిమే మీరు!



అలసిన శరీరాన్ని, మనసును సేద తీర్చేది నిద్రే. కడుపు నిండా తిన్నా, కంటినిండా నిద్ర లేకపోతే మరునాడు ఏ పనీ చేయబుద్ధి కాదు. నిద్ర లేకపోతే అలసట, మగత, నీరసం, ఉషారు లేకపోవడం, దేని మీదా దృష్టి పెట్టలేకపోవడం వంటి సమస్యలు చాలా సహజం. ఇంతకూ మీరెలా పడుకుంటారు? వెల్లకిలానా? బోర్లా పడుకుంటారా? ముడుచుకుని పడుకుంటారా లేక పక్కకు తిరిగి పడుకుంటారా? ఎందుకంటే మనం పడుకునే భంగిమను బట్టి మన మనస్తత్వం ఏమిటో సులువుగా అంచనా కట్టవచ్చునని స్లీప్ సైకాలజీ చెబుతోంది.

ముడుచుకుని పడుకోవటం

దగ్గరకు ముడుచుకుని లేదా గర్భస్థ శిశువు మాదిరి ఓ వైపు వంపు తిరిగి నిద్రపోవటం మీకు భద్రంగా ఉన్న అనుభూతి కలిగిస్తుంది. ఈ పొజిషన్‌లో పడుకోవటం వల్ల మెల్లిగా ఊహాలోకంలోకి జారుకుని ఆపై చక్కటి నిద్రను సొంతం చేసుకోగలుగుతారు. స్లీప్ రీసెర్చర్ డాక్టర్ శామ్యూల్ డంకెల్ పరిశోధన ప్రకారం ఈ భంగిమలో నిద్రపోయే వారు చాలా ఆత్రుతతో కూడిన లేదా ఉద్వేగభరితమైన మనస్తత్వం కలవారై ఉంటారు.

వెల్లకిలా పడుకోవడం

స్లీప్ సైంటిస్ట్‌ల అధ్యయనం మేరకు ఇలాంటి భంగిమలో నిద్రపోయేవారు చాలా కలివిడి మనస్తత్వం గలవారై ఉంటారు. చాలా తేలికగా అందరితో కలిసిపోగలుగుతారు. పరిచయం లేని వారిని కూడా త్వరగా నమ్మగలిగే మనస్తత్వం వీరిది. అయితే వీరిలో కొంతమంది మోసపూరిత స్వభావాన్ని కూడా కలిగి ఉండే అవకాశముంది.

చేతులు చాచి...

ఇది కూడా ఓ విధంగా నిటారుగా నిద్రపోయే భంగిమ లాంటిదే. కాకుంటే ఈ పొజిషన్లో నిద్రపోయే వారు చేతులు వీలైనంతగా జాపి నిద్రలోకి జారుకుంటారు. ఈ చేతులు చాచే విధానం వారు దేనికోసమో లేదా ఎవరి కోసమో చాలా ఆత్రుత గా ఎదురుచూస్తున్నట్లు లేదా దేనినో బలంగా కోరుకుంటున్నట్లు సూచిస్తుంది.

బోర్లాపడుకోవడం

దీన్నే ఫ్రీఫాల్ స్లీపింగ్ అని వ్యవహరిస్తారు. ఈ రకమైన భంగిమలో నిద్రించేందుకు ఇష్టపడే వారు చాలా కలివిడి, అలాగే సున్నితమైన మనస్తత్వం కలవారై ఉంటారు. క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న కారణంగా ఎప్పుడూ ఆందోళనగా కనిపిస్తుంటారు. అదే సమయంలో వీరా పరిస్థితులను దృఢంగా ఎదుర్కోగలవారై ఉంటారని కొన్ని పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

స్టార్‌ఫిష్ భంగిమ

కాళ్లూ చేతులు బార్లా జాపి హాయిగా నిద్రపోయేందుకు ఇష్టపడే వారు. వీరు సాధారణంగా మంచి శ్రోతలై ఉంటారు. స్టార్ ఫిష్ భంగిమలో నిద్రించే వారు. స్నేహానికి చాలా విలువనిస్తారు. అలాగే ఇతరులకు సహాయం చేసేందుకు నిమిషం కూడా ఆలోచించనివారై ఉంటారని పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

సైనిక భంగిమ

– డాక్టర్ ఇడ్జికోవ్స్కి ప్రకారం సైనికుడి మాదిరి భంగిమలో నిద్రించేవారు. చాలా ప్రశాంతంగా, నెమ్మదిగా ఉంటారు. అయితే వీరు ఎవరితోనూ అంత త్వరగా కలిసిపోలేరు.

మీరు ఏ భంగిమలో అయినా పడుకోండి కానీ, హాయిగా నిద్రపోవడం వల్ల వెన్నెముకకు తగినంత రిలాక్సేషన్ దొరుకుతుంది. మనస్సు, శరీరం కూడా సేదతీరి, హాయిగా తేలిగ్గా... కొత్త ఉత్సాహం పుంజుకున్నట్లు ఉంటుంది. వేధించే ఒళ్లు నొప్పులు, మెడ నొప్పి వంటివి తగ్గుతాయి. మంచి సౌకర్యవంతమైన పరుపు, మెడ కండరాలకు సాంత్వననిచ్చే దిండు, సౌకర్యవంతమైన పడక నిద్రను ప్రభావితం చేస్తాయి.

పక్కకి తిరిగి పడుకోవడం అన్ని నిద్ర భంగిమలలోనూ మంచిదని స్లీప్ సైకాలజిస్టులు చెబుతారు.



బత్తాయిలతో బోలెడు లాభాలు!

ఉదర సంబంధిత వ్యాధులకుబత్తాయి పండ్లు చెక్ పెడతాయి. వ్యాధినిరోధక శక్తిని పెంచే ఈ పండ్ల రసాన్ని రోజూ ఓ గ్లాసుడు తీసుకోవడం ద్వారా శరీరానికి కొత్త ఉత్సాహం వస్తుంది. శరీరానికి కావలసిన ధాతువులు, పీచు పదార్థాలు, పోషకాలు బత్తాయి రసంలో లభిస్తాయి. గర్భిణులు బత్తాయి రసాన్ని తీసుకోవడం వల్ల అందులో ఉండే క్యాల్షియం, కడుపులో పెరిగే బిడ్డకు, తల్లికి ఇద్దరికీ అనేక ప్రయోజనాలను చేకూర్చుతుంది.



మందార 'టీ'తో బీపీకి చెక్

మందార ఆకుతో చేసిన టీని తాగడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. మందార ఆకు టీ సేవించటం వలన రోగనిరోధక శక్తి పెరిగి తద్వారా జలుబు, దగ్గు తగ్గటానికి సహాయపడుతుంది. మందార ఆకు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించడానికి ఉపయోగపడుతుంది.

ఇంటి చుట్టూ చెట్లు, పూలమొక్కలు, ఆ చెట్ల మధ్య అందంగా అల్లుకున్న పొదరిల్లు... అని చెప్పుకునే అదృష్టం నగరజీవికి ఉండదు. అందుకే చెట్లను ఇంటి లోపలికి ఆహ్వానించాం. ఈ ఇండోర్ ప్లాంట్స్ కంటికి ఇంపుగా ఇంటిని అందంగా ఉంచడంతో సరిపెట్టుకోవడం లేదు. నగరజీవికి లోపించిన ప్రశాంతతను, మంచి నిద్రను కూడా ఇస్తున్నాయి. ఏ మొక్కలతో ఏయే ప్రయోజనాలున్నాయో హైదరాబాద్‌లోని గార్డెనర్ లతాకృష్ణమూర్తి వివరిస్తున్నారు.

ఇంటిలో హాయిగా గాలి పీల్చుకోండి



''ఇండోర్ ప్లాంట్స్‌లో రకరకాలున్నాయి. ఎప్పటినుంచో ఇంటినల్లుకున్న మనీ ప్లాంట్, డ్రాయింగ్ రూమ్ కార్నర్‌ని కబ్జా చేసిన లక్కీ బాంబూ, భక్తిగా మొక్కే తులసి మొక్క ఉండనే ఉంటాయి. వీటికి తోడుగా ఇప్పుడు లావెండర్, స్నేక్ ప్లాంట్, స్పైడర్ ప్లాంట్, పీస్ లిలీ, జాస్మిన్, అలోవెరా, ఫెర్న్, అరేకా పామ్, రబ్బర్ ప్లాంట్ వచ్చి చేరాయి. వీటిలో చాలా వరకు తక్కువ సూర్యరశ్మితో బతికే మొక్కలే. ఇన్‌డైరెక్ట్ సన్‌లైట్‌తో బతికే ఈ మొక్కలకు ఇంటిలో పల స్థానం దక్కింది. జాస్మిన్‌ని మాత్రం నాలుగ్గోడల మధ్య పెంచడం కొంచెం కష్టమే. దీనిని బాల్కనీలో పెట్టి బెడ్ రూమ్ కిటికీ నుంచి లోపలకి సువాసనలు వెదజల్లేటట్లు చూసుకోవచ్చు. అలోవెరా, లావెండర్‌లకు వారాని కోసారి నీరు పెడితే చాలు. అలోవెరా, స్నేక్ ప్లాంట్‌లు ఇండోర్ ఎయిర్ పొల్యూషన్‌ను తగ్గిస్తాయి. అలోవెరా ఇతర మొక్కలకు మంచి ఎరువు కూడా. స్పైడర్ ప్లాంట్ గాలిలోని రసాయనాలను, దుర్వాసనలను పీల్చుకుని గాలిని శుభ్రపరుస్తుంది.

చిన్న పిల్లలుంటే జాగ్రత్త

ఇండోర్ మొక్కల పెంపకంలో ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే... చిన్నపిల్లలు ఆకులను తుంచి నోట్లో పెట్టుకోకుండా చూడాలి. ఇండోర్ ప్లాంట్స్ ఆకులు కొద్దిపాటి విషపూరితంగా ఉంటాయని కొన్ని అధ్యయనాలు తెలిపాయి. కాబట్టి ఇంట్లో చిన్న పిల్లలు, పెట్‌లను పెంచుకునే వాళ్లు జాగ్రత్తగా ఉండాలి. ఈ చిన్న జాగ్రత్త తప్ప ఇండోర్ మొక్కల వల్ల అన్నీ ప్రయోజనాలే. పచ్చదనం కంటికి ఆహ్లాదాన్నిస్తుంది. మంచి గాలి కోసం కృత్రిమమైన రూమ్ ఫ్రెషనర్స్ మీద ఆధారపడడం కంటే గదిలోని దుర్వాసనను, విషపు వాయువులను పీల్చుకుని సహజంగా ఇంటిని ఆరోగ్యకరంగా మార్చే మొక్కలకు స్థానం కల్పిస్తే హాయిగా గాలి పీల్చుకోవచ్చు'' అన్నారు లతా కృష్ణమూర్తి. నిద్ర పట్టడం లేదని స్లీప్ స్పెషలిస్టులను సంప్రదించడానికి ముందు ఇంట్లో ఈ మొక్కలను పెంచుకుందాం.

– వాకా మంజులారెడ్డి

రేడియేషన్ తగ్గుతుంది



గదిలోని గాలిలో శుభ్రత లోపించడం కూడా కలతనిద్రకు దారితీస్తుంది. మొక్కలన్నీ గదిలోని కార్బన్‌డయాక్సైడ్‌ని పీల్చుకుంటూ ఆక్సిజన్ స్థాయులను పెంచుతాయి. లావెండర్, జాస్మిన్ సువాసననిస్తూ మంచి నిద్రకు కూడా దోహదం చేస్తుంది. మంచి నిద్ర కోసం బెడ్ దగ్గర పెట్టుకోగలిగిన మొక్కల్లో మొదటగా చెప్పాల్సిన మొక్కల్లో స్నేక్ ప్లాంట్ కూడా ఒకటి. దీనికి వారంలో మూడు సార్లు నీరు పడితేచాలు. పీస్‌లిలీ మంచినిద్రనివ్వడంతోపాటు తేమను విడుదల చేస్తుంది. దాంతో గది ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. మొక్కలన్నీ కిరణజన్య సంయోగక్రియ కోసం ఉష్ణోగ్రతను గ్రహిస్తాయి. కాబట్టి సూర్యరశ్మిలోని రేడియేషన్ తీవ్రతను కూడా పీల్చుకుని గది ఉష్ణోగ్రతలను తగ్గించడంతోపాటు ఆరోగ్యకరంగా ఉంచుతాయి.

– లతా కృష్ణమూర్తి, గార్డెనర్

20లో అలవాట్లే... 40లో ఆరోగ్యం

'భవిష్యత్‌పై దృష్టి పెట్టాలి' అనే మాట యవ్వనంలో చాలామందికి అంతగా వినిపించకపోవచ్చు. భవిష్యత్తు అంటే ఆర్థిక భద్రతే కాదు ఆరోగ్యం కూడా. ఇరవైలలో ఆరోగ్య స్పృహ లేకుంటే ఆ ప్రభావం నలభైలలో ఉంటుంది అని చెబుతున్నారు యుసి శాన్‌ఫ్రాన్సిస్కో పరిశోధకులు. వయసు, శారీరక శ్రమ, టోటల్ కొలెస్ట్రాల్... మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకొని అధ్యయనం చేపట్టారు.

'ఇన్‌ఫ్లమేషన్' (వాపు ప్రక్రియ) గురించి ఈ అధ్యయనం ప్రస్తావించింది.

శరీరంలో శక్తి లోపించడం, తరచు జ్వరం రావడం, తలనొప్పి, తినాలనే కోరిక లేకపోవడం... మొదలైనవి ఇన్‌ఫ్లమేషన్ లక్షణాలు. గుండెజబ్బులు, డిప్రెషన్, అల్జీమర్స్... మొదలైన వాటికి ఇన్‌ఫ్లమేషన్ కారణం అవుతుంది. అధిక స్థాయి వాపులు అనేది ఊబకాయం, శారీరక శ్రమ లోపించడం, ఒత్తిడి, ధూమపానంతో సంబంధం కలిగి ఉంటుంది.

'యవ్వన ప్రారంభం నుంచి మొదలయ్యే రకరకాల అలవాట్లు, జీవనశైలి నలభైలలో ఏ రకంగా ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మా లక్ష్యం' అంటున్నాడు అధ్యయన కర్త అంబర్ బహోరిక్. 'ఇన్‌ఫ్లమేషన్ ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలను తగ్గించడానికి శారీరక శ్రమను పెంచడం, ధూమపానానికి దూరంగా ఉండడం, మంచి జీవనశైలి ముఖ్యం' అంటున్నారు పరిశోధకులు యువతరం ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని.



ఇక షురూ



● ప్రభాస్

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుంది. 'ఫౌజి' టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుందని, ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్రకు మృణాల్ ఠాకూర్, పాకిస్తాన్ నటి సజల్ అలీని అనుకుంటున్నారనీ ప్రచారం జరుగుతోంది. ఈ నెల మూడో వారంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరగనుందని, ఆ వెంటనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని తెలిసింది. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారని, మూడు పాటల పని కూడా పూర్తయిందని ఆ మధ్య హను రాఘవపూడి చెప్పిన విషయం గుర్తుండే ఉంటుంది.

ఉగాదికి వస్తున్నా



● విజయ్ దేవరకొండ

ఉగాదికి థియేటర్స్‌లో కలుద్దాం అంటున్నారు విజయ్ దేవరకొండ. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విజయ్ దేవరకొండ కెరీర్‌లో 12వ సినిమాగా రూపొందుతున్న ఈ సినిమా ఇటీవల శ్రీలంకలో ఓ భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి, మూవీని వచ్చే ఏడాది మార్చి 28న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఉగాది సందర్భంగా ఈ చిత్రం విడుదలను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ''ఇప్పటివరకు 60 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఈ నెలలోనే టైటిల్‌ను, త్వరలోనే ఇతర వివరాలను వెల్లడిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందుతోందని, ఇందులో విజయ్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారనీ టాక్. ఈ సినిమాకు కెమెరా: గిరీష్ గంగాధరన్, జోమోన్ టి. జాన్, సంగీతం: అనిరుధ్ రవిచందర్.

మా నిర్ణయంలో మార్పు లేదు
– తమిళ నిర్మాతల మండలి

తమిళ నిర్మాతల మండలి, నడిగర్ సంఘం (దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం) మధ్య వివాదం ముదురుతోందా? అంటే అవుననే అనిపిస్తోంది. ఇటీవల తమిళ నిర్మాతల మండలి, డిస్ట్రిబ్యూటర్ల సంఘం, థియేటర్ల సంఘం నిర్వాహకులు సమావేశమై నటీనటుల పారితోషికాలు, పెరిగిపోతున్న నిర్మాణ వ్యయం, నటీనటులు ముందుగా ఒప్పుకున్న చిత్రాలు పూర్తి చేశాకే కొత్త చిత్రాలను అంగీకరించాలని, నటుడు ధనుష్ చాలా చిత్రాలకు అడ్వాన్స్‌లు తీసుకున్నారని, ఆయనతో కొత్తగా చిత్రాలు చేసే నిర్మాతలు ముందుగా నిర్మాతల మండలితో చర్చించాలని, ఈ సమస్యలన్నీ పరిష్కారమయ్యే వరకూ నవంబర్ నెల ఒకటో తేదీ నుంచి షూటింగ్‌లను రద్దు చేస్తున్నట్లు తీర్మానాలు చేశారు. నిర్మాతల మండలి చేసిన ఈ తీర్మానాలు తమకు సమ్మతం కాదని, వెనక్కి తీసుకోవాలని దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం కార్యవర్గం డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ పై స్పందిస్తూ తమిళ నిర్మాతల మండలి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నటుడు ధనుష్‌పై ఎలాంటి ఫిర్యాదు లేదని దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం పేర్కొనడం అవాస్తవమని నిర్మాతల మండలి పేర్కొంది. ఏడాదిన్నర క్రితమే నిర్మాతల మండలి సర్వసభ్య సమావేశంలో నిర్మాతలకు నష్టం కలిగించిన ఐదుగురు నటుల గురించి తీర్మానం చేసి, దాన్ని నడిగర్ సంఘానికి పంపామని తెలిపింది. అయితే దానిపై ఆ సంఘం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించింది. ఈ కారణంగానే నిర్మాతల మండలి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని, తమ నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేయడంతో పాటు తమకు నడిగర్ సంఘం సహకరిస్తుందని భావిస్తున్నామని పేర్కొంది. దీనిపై నడిగర్ సంఘం ఎలా స్పందిస్తుందో చూడాలి.

– సాక్షి, చెన్నై

గుండె ఒట్టు పెట్టుకున్నాదే...



● రవితేజ భాగ్యశ్రీ బోర్సె

'అల్లరిగా అల్లికగా అల్లేసిందే నన్నే...' అంటూ మొదలవుతుంది 'మిస్టర్ బచ్చన్' సినిమాలోని రొమాంటిక్ సాంగ్ 'జిక్కీ'. రవితేజ టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ఈ చిత్రంలో భాగ్య శ్రీ బోర్సె కథానాయిక. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. శుక్రవారం ఈ సినిమాలోని 'జిక్కీ...' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''నిన్ను చూసి గుండె ఒట్టు పెట్టుకున్నదే... గట్టుదాటి గట్టిగానే కొట్టుకున్నదే... పట్టుపట్టి పిల్లా చెయ్యి పట్టుకున్నదే...', 'నా మనసే నీకే చిక్కి... దిగనందే మబ్బుల్ ఎక్కి... నీ బొమ్మే చెక్కి... రోజూ నిన్నే పూజించానే జిక్కీ...' అనే లిరిక్స్‌తో ఈ పాట సాగుతుంది. సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ స్వరకల్పనలో వనమాలి సాహిత్యం అందించిన ఈ పాటను కార్తీక్, రమ్య బెహరా పాడారు.

లవ్ స్కోర్ ఎంత?



లవ్ స్కోర్ ఎంత ఉందో చెక్ చేసుకుంటున్నారు కృతీ శెట్టి. మరి... స్కోర్ ఎంత అంటే 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'లో చూడాలంటున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే... 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. విఘ్నేష్ శివన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్, విఘ్నేష్ భార్య నయనతార ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని ప్రదీప్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. తాజాగా కృతీ శెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చూస్తుంటే 2035 సెప్టెంబరు 9న ఓ హై ఎండ్ టెక్నాలజీ మొబైల్ ఫోన్‌లో కృతీ శెట్టి లవ్ స్కోర్‌ను చెక్ చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. దీన్నిబట్టి భవిష్యత్‌లో సోషల్ మీడియా ప్రభావం, యువతీ యువకుల తీరు, మానవీయ సంబంధాలు వంటి అంశాలను ఈ చిత్రంలో దర్శకుడు విఘ్నేష్ ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది.

● కృతీ శెట్టి

వినోదం... భావోద్వేగం



తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో నటించనున్న కొత్త చిత్రం ప్రకటన వచ్చింది. వంశీరెడ్డి దొండపాటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని బూసం జగన్‌మోహన్ రెడ్డి, వేణు ఊడుగుల నిర్మించనున్నారు. శ్రీనివాస్ గౌడ్ (తరుణ్ భాస్కర్) అనే పాత్ర అతని భార్య శ్రీలత నుంచి విడాకులు తీసుకున్నట్లు సూచించే స్టాంప్ పేపర్‌తో ఈ మూవీని ప్రకటించారు మేకర్స్. ''వినోదం, భావోద్వేగంతో అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ప్రేక్షకులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కొత్త నటీనటులకు చాన్స్ ఇచ్చేందుకు కాస్టింగ్ కాల్‌ని అనౌన్స్ చేశాం'' అని చిత్రబృందం పేర్కొంది.

దర్శకుడు అజయ్ శాస్త్రి కన్నుమూత



'నేను మీకు తెలుసా?' సినిమాతో దర్శకుడిగా మారిన అజయ్ శాస్త్రి (50) కన్నుమూశారు. ఈ సినిమాలో హీరోగా నటించిన మంచు మనోజ్ దర్శకుడు అజయ్ శాస్త్రి మృతి గురించి 'ఎక్స్'లో పేర్కొన్నారు. ''నేను మీకు తెలుసా?' సినిమా కెప్టెన్, నా స్నేహితుడు అజయ్ శాస్త్రి ఇక లేరని తెలియజేయడానికి చాలా బాధగా ఉంది. త్వరగా వెళ్లిపోయావ్... అజయ్. ఆ పరమశివుడు అతని కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలి. ఓం శాంతి' అంటూ చాలా భావోద్వేగంగా 'ఎక్స్'లో షేర్ చేశారు మనోజ్. హైదరాబాద్‌లో పుట్టి పెరిగారు అజయ్. జులై 26, 1974లో అజయ్ జన్మించారు. సినిమాలపై ఆసక్తితో ఫిల్మ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. దర్శకుడు కృష్ణవంశీ తెరకెక్కించిన 'రాఖీ', 'డేంజర్' సినిమాలకు దర్శకత్వ శాఖలో పని చేశారు. షార్ట్ ఫిల్మ్స్, యాడ్ ఫిల్మ్స్ చేశారు. ర్యాక్‌బ్యాండ్స్‌లో లీడ్ సింగర్‌గానూ పాటలు పాడారు. మంచు మనోజ్‌తో అజయ్ దర్శకత్వం వహించిన 'నేను మీకు తెలుసా?' సినిమా 2008లో విడుదలైంది. ఈ సినిమా దర్శకుడిగా అజయ్‌కి మంచి పేరు తెచ్చిపెట్టింది. అయితే ఆ తర్వాత ఆయన మరో సినిమాకు దర్శకత్వం వహించలేదు. ఇక అజయ్ శాస్త్రి మృతి పట్ల పలువురు తెలుగు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు.

కామెడీ...



● నందిని, అనిల్

వాటుపల్లి అనిల్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బుక్కా ఫకీర్'. యుక్తా మూవీస్ పతాకంపై రూపొందిన ఈ మూవీలో నందిని హీరోయిన్. ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని ఆంధ్రప్రదేశ్ గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రిలీజ్ చేసి, మాట్లాడుతూ – ''ట్రైలర్ చూస్తుంటే ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు హారర్ నేపథ్యంలో సినిమా సాగుతుందని తెలుస్తోంది'' అన్నారు.

యాక్షన్ విక్రమ్



● ఉపేంద్ర

కంచర్ల ఉపేంద్ర హీరోగా నటిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'విక్రమ్ కే దాస్'. బాలు పొలిచెర్ల దర్శకత్వంలో కంచర్ల అచ్యుతరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఉపేంద్ర కెరీర్‌లోని ఈ 8వ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నాయి. ''యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న మూవీయే అయినప్పటికీ సంగీతానికి ప్రాముఖ్యత ఉంది. సంగీత దర్శకుడు పృథ్వీ మంచి ట్యూన్స్ ఇస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది. అలాగే ఉపేంద్ర కెరీర్‌లో రెండో మూవీగా రూపొందిన 'కంచర్ల' త్వరలో విడుదల కానుంది.

సర్దార్‌కి జోడీగా...



● మాళవికా మోహనన్

కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సర్దార్' (2022) సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ హిట్ కాంబినేషన్‌లోనే 'సర్దార్ 2' రూపొందుతోంది. ఈ మూవీలో కార్తీకి జోడీగా మాళవికా మోహనన్ నటిస్తున్నట్లు శుక్రవారం మేకర్స్ ప్రకటించారు. ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ''సర్దార్' తమిళ, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీకి సీక్వెల్‌గా రూపొందిస్తున్న 'సర్దార్ 2' షూటింగ్ చెన్నైలో ప్రారంభమైంది. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య ఓ పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది.



తొలి రౌండ్ హీట్స్‌లోనే అంకిత, పారుల్ నిష్క్రమణ

పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో భారత్‌కు వరుసగా రెండో రోజు నిరాశ తప్పలేదు. మహిళల 5000 మీటర్ల పరుగులో పారుల్ చౌధరీ, అంకిత దయాని హీట్స్‌లోనే వెనుదిరిగారు. భారత్ నుంచి రెండు ఈవెంట్‌లలో విశ్వక్రీడలకు అర్హత సాధించిన పారుల్ చౌధరీ.. శుక్రవారం జరిగిన రెండో హీట్‌లో 15 నిమిషాల 10.68 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 14వ స్థానంతో సరిపెట్టుకుంది. తొలి హీట్‌లో పోటీపడిన భారత మరో రన్నర్ అంకిత దయాని 20వ స్థానంలో నిలిచింది. అంకిత 16 నిమిషాల 19.38 సెకన్లలో గమ్యాన్ని చేరుకుంది. ఒక్కో హీట్ నుంచి తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన వాళ్లు ఫైనల్‌కు అర్హత సాధించారు.

స్వియాటెక్‌కు కాంస్యం



పారిస్ ఒలింపిక్స్ మహిళల టెన్నిస్ సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) కాంస్య పతకం సాధించింది. కాంస్య పతక మ్యాచ్‌లో టాప్ సీడ్ స్వియాటెక్ 6–2, 6–1తో కరోలినా ష్మిడ్లోవా (స్లొవేకియా)పై విజయం సాధించింది.

మరో చరిత్రకు మను 'సై'

మూడో ఒలింపిక్ పతకంపై మనూ భాకర్ గురి

25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఫైనల్‌కు అర్హత	క్వాలిఫయింగ్‌లో 590 పాయింట్లతో 2వ స్థానం	నేడు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పతకం కోసం పోటీ

టాప్-3లో నిలిస్తే అత్యధిక వ్యక్తిగత ఒలింపిక్ పతకాలు గెలిచిన భారత ప్లేయర్‌గా ఘనత



ఏ భారత ప్లేయర్‌కూ సాధ్యంకాని రికార్డును తన పేరిట లిఖించుకునేందుకు పిస్టల్ షూటర్ మనూ భాకర్ ఒక్క పతకం దూరంలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఇప్పటికే రెండు కాంస్య పతకాలు గెలిచిన 22 ఏళ్ల మనూ భాకర్ మూడో పతకంపై గురి పెట్టింది. శుక్రవారం జరిగిన మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ క్వాలిఫయింగ్‌లో మనూ రెండో స్థానంలో నిలిచి ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య నేడు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి జరిగే ఫైనల్లో మనూ టాప్-3లో నిలిస్తే మూడో పతకాన్ని ఖరారు చేసుకుంటుంది. దాంతోపాటు ఒలింపిక్స్ చరిత్రలో అత్యధికంగా 3 వ్యక్తిగత పతకాలు గెలిచిన భారత ప్లేయర్‌గా మనూ భాకర్ అవతరిస్తుంది. నార్మన్ ప్రిచర్డ్ (1900 పారిస్; అథ్లెటిక్స్‌లో 2 రజతాలు), రెజ్లర్ సుశీల్ కుమార్ (2008 బీజింగ్‌లో కాంస్యం; 2012 లండన్‌లో రజతం), షట్లర్ పీవీ సింధు (2016 రియోలో రజతం; 2020 టోక్యోలో కాంస్యం) రెండు పతకాల చొప్పున సాధించగా... ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచి ప్రస్తుతం ఈ ముగ్గురి సరసన మనూ భాకర్ ఉంది.

పారిస్: టోక్యో ఒలింపిక్స్‌లో పూర్తిగా నిరాశపరిచిన మనూ భాకర్ 'పారిస్'లో మాత్రం విశ్వరూపం ప్రదర్శిస్తోంది. తాను పాల్గొంటున్న మూడు ఈవెంట్లలోనూ మనూ భాకర్ ఫైనల్‌కు చేరి ఔరా అనిపించింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కాంస్యం... 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలోనూ కాంస్యం గెలిచిన మనూ భాకర్ 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలోనూ పతక పోరుకు అర్హత పొందింది. 40 మంది షూటర్ల మధ్య జరిగిన క్వాలిఫయింగ్‌లో మనూ 600 పాయింట్లకుగాను 590 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడ్డ మరో భారత షూటర్, తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ 581 పాయింట్లు స్కోరు చేసి 18వ స్థానంతో సరిపెట్టుకుంది. టాప్–8లో నిలిచిన వారికి మాత్రమే ఫైనల్ బెర్త్‌లు ఖరారవుతాయి. 25 మీటర్ల పిస్టల్ క్వాలిఫయింగ్‌ను రెండు భాగాలుగా నిర్వహించారు. ముందుగా ప్రెసిషన్ ఈవెంట్‌లో, తర్వాత ర్యాపిడ్ ఈవెంట్‌లో పోటీపడ్డారు. మనూ ప్రెసిషన్ ఈవెంట్‌లో 294 పాయింట్లు, ర్యాపిడ్‌లో 296 పాయింట్లు సాధించింది. క్వాలిఫయింగ్‌లో వెరోనికా (హంగేరి; 592 పాయింట్లు) టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఆ తర్వాత హనియె రోస్తమియాన్ (ఇరాన్; 588 పాయింట్లు) మూడో స్థానాన్ని, ట్రిన్ తు విన్ (వియత్నాం; 587 పాయింట్లు) నాలుగో స్థానాన్ని దక్కించుకున్నారు. నాన్ జావో (చైనా; 586 పాయింట్లు) ఐదో ర్యాంక్‌లో, జిన్ యాంగ్ (కొరియా; 586 పాయింట్లు) ఆరో ర్యాంక్‌లో, కామిలి జెద్రావ్స్కీ (ఫ్రాన్స్; 585 పాయింట్లు) ఏడో ర్యాంక్‌లో, కేటలిన్ మోర్గాన్ (అమెరికా; 585 పాయింట్లు) ఎనిమిదో ర్యాంక్‌లో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు.



గురి చెదిరింది కాంస్యం చేజారింది

సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. ఒలింపిక్స్ ఆర్చరీలో సెమీఫైనల్‌కు చేరిన భారత మిక్స్‌డ్ జట్టు.. పతకం పట్టే సువర్ణావకాశాన్ని చేజార్చుకుంది. ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్–అంకిత భకత్ జోడీ.. 'పారిస్' క్రీడల్లో నాలుగో స్థానంలో నిలిచింది. సెమీఫైనల్లో దక్షిణ కొరియా జోడీ చేతిలో ఓడిన ధీరజ్–అంకిత జంట... కాంస్య పతక పోరులో అమెరికా ద్వయం చేతిలో ఓడి రిక్తహస్తాలతో వెనుదిరిగింది.

- మిక్స్‌డ్ టీమ్‌లో ధీరజ్–అంకిత జోడీకి నాలుగో స్థానం
- కాంస్య పతక పోరులో అమెరికా జంట చేతిలో ఓటమి

పారిస్: విశ్వక్రీడల్లో భారత ఆర్చర్లకు మరోసారి నిరాశ తప్పలేదు. 36 ఏళ్ల ఒలింపిక్స్ ఆర్చరీ చరిత్రలో తొలిసారి సెమీఫైనల్‌కు చేరి పతక ఆశలు రేపిన మన మిక్స్‌డ్ ఆర్చరీ జట్టు చివరకు నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఒలింపిక్స్ చరిత్రలో మన ఆర్చర్లకు ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం గమనార్హం. శుక్రవారం రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్య పతకం కోసం జరిగిన పోరులో బొమ్మదేవర ధీరజ్–అంకిత భకత్ ద్వయం 2–6తో (37–38, 35–37, 38–34, 35–37) బ్రాడీ ఎలీసన్–క్యాసీ కాఫ్‌హోల్డ్ (అమెరికా) జంట చేతిలో ఓడింది. ధీరజ్ గురి అంచనాలకు తగ్గట్లు సాగినా... ఒత్తిడికి గురైన అంకిత పలుమార్లు గురి తప్పడం ఫలితంపై ప్రభావం చూపింది. నాలుగు సెట్‌లలో కలిపి అంకిత రెండుసార్లు 7 పాయింట్లు సాధించడంతో జట్టు విజయావకాశాలను ప్రభావితం చేసింది. తొలి సెట్‌లో అంకిత 7 ,10 పాయింట్లు సాధించగా.. ధీరజ్ రెండు 10లు నమోదు చేశాడు. ప్రత్యర్థి ఆర్చర్లు 10, 9, 9, 10 పాయింట్లు సాధించి ముందంజ వేయగా.. రెండో సెట్‌ను కూడా అంకిత 7 పాయింట్లతో ప్రారంభించింది. ఈసారి కూడా ప్రత్యర్థిదే పైచేయి కాగా.. మూడో సెట్‌లో అంకిత 10, 9, ధీరజ్ 9, 10 పాయింట్లు గురిపెట్టారు. ప్రత్యర్థి జంట 10, 7, 9, 8 పాయింట్లు చేసి వెనుకబడింది. ఇక నాలుగో సెట్‌లో అంకిత రెండు బాణాలకు ఎనిమిదేసి పాయింట్లే రాగా.. ధీరజ్ 9, 10 పాయింట్లు గురిపెట్టాడు. అయితే వరుసగా 10, 9, 9, 9 పాయింట్లు సాధించిన అమెరికా జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. దక్షిణ కొరియా, జర్మనీ జోడీలకు స్వర్ణ, రజత పతకాలు లభించాయి. అంతకుముందు సెమీఫైనల్లో ధీరజ్–అంకిత జోడీ 2–6తో (38–36, 35–38, 37–38, 38–39) ప్రపంచ నంబర్‌వన్ కిమ్ వూజిన్–లిమ్ షిహ్యోన్ (కొరియా) జంట చేతిలో ఓడింది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో భారత్ 5–3తో (38–37, 38–38, 36–37, 37–36) స్పెయిన్‌పై, తొలి రౌండ్‌లో 5–1తో (37–36, 38–38, 38–37) ఇండోనేసియాపై గెలిచింది. మహిళల వ్యక్తిగత విభాగంలో దీపికా కుమారి, భజన్ కౌర్ ఈరోజు బరిలోకి దిగనున్నారు.



52 ఏళ్ల తర్వాత...

- ఒలింపిక్స్‌లో ఆస్ట్రేలియాపై భారత హాకీ జట్టు విజయం
- 3–2తో ఓడించి పూల్ 'బి'లో రెండో స్థానం

పారిస్: ఆగస్టు 30, 1972... ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు అగ్రశ్రేణి టీమ్ ఆస్ట్రేలియాను 3–1 గోల్స్ తేడాతో ఓడించింది. ఆ తర్వాత ఇన్నేళ్లల్లో ఒలింపిక్స్ వేదికగా 'కూకాబుర్రాస్'లపై మన జట్టు విజయం సాధించలేకపోయింది. ఇప్పుడు 52 ఏళ్ల తర్వాత భారత్ ప్రదర్శన పునరావృతమైంది. శుక్రవారం జరిగిన పూల్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 3–2 గోల్స్ తేడాతో అగ్రశ్రేణి జట్టు ఆస్ట్రేలియాను ఓడించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ (13వ, 32వ ని.లో) సాధించగా, అభిషేక్ (12వ ని.లో) మరో గోల్ కొట్టాడు. ఆసీస్ ఆటగాళ్లలో క్రెయిగ్ థామస్ (25వ ని.లో), బ్లేక్ గోవర్స్ (55వ ని.లో) చెరో గోల్ నమోదు చేశారు. అయితే ఈ మ్యాచ్‌కు ముందే క్వార్టర్ ఫైనల్‌కు చేరిన భారత్ ... తాజా ఫలితంతో 10 పాయింట్లతో గ్రూప్‌లో రెండో స్థానంతో ముగించింది. గ్రూప్ 'ఎ'లో మూడో స్థానంలో నిలిచిన జట్టుతో (బ్రిటన్ లేదా జర్మనీ) ఆదివారం జరిగే క్వార్టర్ ఫైనల్లో భారత్ ఆడుతుంది.

టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత ఆసీస్‌తో కాంస్యపతక విజేత భారత్ మధ్య పోరు హోరాహోరీగా సాగింది. ఇరు జట్లు దూకుడుగా ఆటను మొదలు పెట్టాయి. ఆసీస్‌కు వరుసగా వచ్చిన రెండు అవకాశాలను భారత డిఫెన్స్ సమర్థంగా అడ్డుకుంది. అయితే 12వ నిమిషంలో లలిత్ కొట్టిన షాట్‌ను ఆసీస్ కీపర్ చార్టర్ నిలువరించగలిగినా... రీబౌండ్‌లో అభిషేక్ దానిని పోస్ట్‌లోకి కొట్టాడు. తర్వాతి నిమిషంలోనే భారత్‌కు పెనాల్టీ అవకాశం రాగా, చక్కటి ఫ్లిక్‌తో హర్మన్‌ప్రీత్ దానిని సమర్థంగా ఉపయోగించుకున్నాడు. రెండో క్వార్టర్‌లో తమకు లభించిన కార్నర్‌ను కంగారూలు గోల్‌గా మలిచారు. మూడో క్వార్టర్‌లో మన్‌ప్రీత్‌ను ఆసీస్ ఆటగాడు ఫ్లయిన్ ఒగిలివీ దురుసుగా అడ్డుకోవడంతో భారత్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. దీనిని హర్మన్ సునాయాసంగా గోల్‌గా మార్చాడు. చివరి క్వార్టర్‌లో మన జట్టుకు మరో రెండు అవకాశాలు దక్కినా గోల్ మాత్రం రాలేదు. ఆట మరో ఐదు నిమిషాల్లో ముగుస్తుందనగా తమకు లభించిన పెనాల్టీ స్ట్రోక్‌గా గోల్‌గా మలచి ఆసీస్ గెలుపు అంతరాన్ని తగ్గించ గలిగింది.



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

ఆర్చరీ
మహిళల వ్యక్తిగత ఎలిమినేషన్ రౌండ్: దీపికా కుమారి X మిచెల్లి క్రాపెన్ (జర్మనీ) (మధ్యాహ్నం గం. 1:52 నుంచి), భజన్ కౌర్ X దినంద చోరునిసా (ఇండోనేసియా) (మధ్యాహ్నం గం. 2:05 నుంచి)

షూటింగ్
మహిళల స్కీట్ క్వాలిఫికేషన్ రౌండ్: రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). మహిళల 25 మీటర్ల పిస్టల్ (పతక పోరు): మనూ భాకర్ (మధ్యాహ్నం గం. 1:00 నుంచి)

బాక్సింగ్
పురుషుల 71 కేజీల క్వార్టర్ ఫైనల్: నిశాంత్ X మార్కో వెర్డె (మెక్సికో) (అర్ధరాత్రి గం. 12:18 నుంచి)

సెయిలింగ్
పురుషుల డింగీ రేసులు: విష్ణు (మధ్యాహ్నం గం. 3:45 నుంచి). మహిళల డింగీ రేసులు: నేత్ర కుమానన్ (సాయంత్రం గం. 5:55 నుంచి)

'లక్ష్యం' దిశగా మరో అడుగు



- బ్యాడ్మింటన్ సెమీఫైనల్లో లక్ష్య సేన్
- పురుషుల సింగిల్స్‌లో ఈ ఘనత సాధించిన తొలి భారత ఆటగాడిగా గుర్తింపు

పారిస్: భారత యువ షట్లర్ లక్ష్య సేన్ ఒలింపిక్స్ పతక ఆశలను సజీవంగా నిలిపాడు. అద్భుత ఆటతీరుతో చెలరేగుతున్న లక్ష్య సెమీఫైనల్లోకి అడుగు పెట్టి పతకంపై గురి పెట్టాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 19–21, 21–15, 21–12 స్కోరుతో ప్రపంచ 11వ ర్యాంకర్ చో టిన్ చెన్ (చైనీస్ తైపీ)పై గెలిచాడు. 75 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో తొలి గేమ్‌ను కోల్పోయినా... ఆ తర్వాత సత్తా చాటిన 23 ఏళ్ల లక్ష్య సెమీస్ చేరాడు. ఒలింపిక్స్ పురుషుల సింగిల్స్‌లో భారత్ తరఫున సెమీఫైనల్ చేరిన తొలి ఆటగాడిగా సేన్ ఘనత సృష్టించాడు. గతంలో భారత్ నుంచి అత్యుత్తమంగా పారుపల్లి కశ్యప్ (2012), కిడాంబి శ్రీకాంత్ (2016) క్వార్టర్ ఫైనల్ వరకు మాత్రమే రాగలిగారు. లో కీన్ యె (సింగపూర్), అక్సెల్‌సన్ (డెన్మార్క్) మధ్య జరిగే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ విజేతతో ఆదివారం జరిగే సెమీఫైనల్లో లక్ష్య సేన్ తలపడతాడు. సెమీస్‌లో లక్ష్య గెలిస్తే అతనికి స్వర్ణం లేదా రజతం ఖాయమవుతుంది. ఒకవేళ సెమీఫైనల్లో ఓడినా కాంస్య పతకం కోసం మళ్లీ పోటీ పడే అవకాశం ఉంటుంది. 2021 వరల్డ్ చాంపియన్‌షిప్ కాంస్యపతక విజేత అయిన లక్ష్య క్వార్టర్స్‌లో తొలి గేమ్‌లో కూడా పోరాడాడు. ఆరంభంలో దూకుడు ప్రదర్శించిన టిన్ చెన్ 11–9తో ముందంజ వేసి ఆపై 14–9తో నిలిచాడు. అయితే కోలుకున్న లక్ష్య వరుస పాయింట్లతో 16–15కు దూసుకెళ్లాడు. స్కోరు 19–19కి చేరగా, చివరకు గేమ్ తైపీ ఆటగాడిదే అయింది. రెండో గేమ్ కూడా పోటాపోటీగా సాగగా సేన్ 11–10తో ఆధిక్యంలో నిలిచాడు. స్కోరు 13–13కి చేరిన తర్వాత 10 పాయింట్లలో 8 గెలుచుకొని గేమ్ సొంతం చేసుకున్నాడు. మూడో గేమ్‌కు వచ్చే సరికి లక్ష్య ఆటతో మరింత జోరు పెరిగింది. విరామ సమయానికి 11–7 వద్ద ఉన్న సేన్ ఆ తర్వాత దూసుకుపోయాడు. వరుస స్మాష్‌లతో దూకుడు కనబర్చడంతో టిన్ చెన్ వద్ద సమాధానం లేకపోయింది.



'నన్ను పెళ్లాడతావా'

బ్యాడ్మింటన్ కోర్టులో షట్లర్ పెళ్లి ప్రతిపాదన

హువాంగ్ య ఖియాంగ్... చైనా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి. శుక్రవారం మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో జెంగ్ సివీతో కలిసి బరిలోకి దిగిన హువాంగ్ విజేతగా నిలిచి స్వర్ణపతకం సొంతం చేసుకుంది. అయితే పసిడి సాధించిన కొద్ది సేపటికే ఆమెకు సహచరుడి నుంచి అనూహ్యంగా పెళ్లి ప్రతిపాదన వచ్చింది. చైనా డబుల్స్ ప్లేయర్ ల్యూ యుచెన్ ఉంగరాన్ని తీసుకొచ్చి 'నన్ను పెళ్లాడతావా' అంటూ హువాంగ్ ముందు మోకాళ్లపై కూర్చొని అడిగాడు. వెంటనే తాను కూడా సంతోషంగా స్పందిస్తూ ఓకే చెప్పేసింది. స్వదేశానికి ఒలింపిక్ పతకంతో పాటు ఇప్పుడు ఎంగేజ్‌మెంట్ రింగ్‌ను కూడా ఆమె తీసుకెళుతోంది.



'కొంత విరామం కావాలి'

ఆటలో కొనసాగుతానని సింధు స్పష్టీకరణ

పారిస్: భారత్ తరఫున వరుసగా మూడు ఒలింపిక్స్ క్రీడల్లో పతకాలు సాధించిన తొలి క్రీడాకారిణిగా నిలిచే లక్ష్యంతో బరిలోకి దిగిన బ్యాడ్మింటన్ స్టార్ పూసర్ల వెంకట (పీవీ) సింధు దురదృష్టవశాత్తూ ఆ ఘనతను అందుకోలేకపోయింది. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన సింధు పారిస్ ఒలింపిక్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. ఈ నేపథ్యంలో తన భవిష్యత్తు ఆలోచనల గురించి సింధు వెల్లడించింది. తాజా ఓటమితో చాలా బాధపడుతున్నానన్న ఆమె... మరో చర్చకు తావు లేకుండా ఆటలో కొనసాగుతానని స్పష్టం చేసింది. అయితే శారీరకంగా, మానసికంగా కాస్త విరామం కోరుకుంటున్నానని పేర్కొంది. 29 ఏళ్ల సింధు ఒలింపిక్స్ పరాజయం తర్వాత సోషల్ మీడియా ద్వారా తన స్పందనను తెలియజేసింది. 'పారిస్ ప్రయాణం చాలా గొప్పగా సాగింది. కానీ ఓటమి బాధించింది. ఈ పరాజయం నా జీవితంలో చాలా కఠినమైంది. దీని నుంచి కోలుకునేందుకు సమయం పడుతుంది. అయితే జీవితం ఆగిపోదు. మళ్లీ కొనసాగాల్సిందే. పారిస్‌కు అర్హత సాధించే క్రమంలో ఎంతో పోరాడాను. గత రెండేళ్లు గాయాలతో ఎక్కువ సమయం ఆటకు దూరమయ్యాను. ఈ సవాళ్లను అధిగమించి నా దేశం తరఫున మూడో ఒలింపిక్స్‌లో ఆడే అవకాశం రావడం గొప్పగా అనిపించింది. ఈ స్థాయిలో ఆడటం, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలవగలగడం నా అదృష్టం. నేను విజయం కోసం శాయశక్తులా ప్రయత్నించాను కాబట్టి ఎలాంటి చింత లేదు. ఇప్పుడు అభిమానుల మెసేజ్‌లు నాకు ఊరటనందిస్తున్నాయి. నా భవిష్యత్తు గురించి స్పష్టత ఇవ్వదల్చుకున్నా. ఆటలో ఇంకా కొనసాగుతా. అయితే కొంత విరామం తీసుకుంటాను. నా శరీరానికి, మనసుకు ఇప్పుడు విశ్రాంతి చాలా అవసరం. రాబోయే రోజుల కోసం సరైన ప్రణాళికలు రూపొందించుకుంటా. ఎందుకంటే నేను అమితంగా ఇష్టపడే ఆటలోనే నాకు ఆనందం దక్కుతుంది' అని సింధు తన మనసులో భావాన్ని వ్యక్తపర్చింది.

40 ఏళ్ల తర్వాత మళ్లీ ఒలింపిక్స్‌లో...



వెనిజులా షూటర్ అరుదైన ఘనత



1984 ఒలింపిక్స్‌లో 2024 ఒలింపిక్స్‌లో

పారిస్: ఒలింపిక్స్‌లో ఆటగాళ్ల విజయగాథలే కాదు... వీటిలో పాల్గొనే వారిలో ఎన్నో భిన్నమైన, ఆసక్తికర నేపథ్యాలు కూడా ఉంటాయి. అలాంటి వాటిలో ఇది కూడా ఒకటి. వెనిజులాకు చెందిన షూటర్ లియోనెల్ మార్టినెజ్ పారిస్‌లో ట్రాప్ ఈవెంట్‌లో పోటీ పడ్డాడు. ఓవరాల్‌గా 28వ స్థానంతో ముగించాడు. అయితే అతను పోటీల్లో పాల్గొనడం విశేషం కాదు... 60 ఏళ్ల వయసున్న మార్టినెజ్ 40 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ ఒలింపిక్స్ బరిలోకి దిగడమే అసలు ఘనత! 20 ఏళ్ల కుర్రాడిగా 1984 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో మార్టినెజ్ పాల్గొన్నాడు. ఆ తర్వాత ఆటకు దూరమై పలు వ్యాపారాల్లో స్థిరపడ్డాడు. అయితే చాలా ఏళ్ల తర్వాత అతనికి మళ్లీ షూటింగ్ వైపు మనసు మళ్లింది. మొదటి నుంచి రెగ్యులర్‌గా జిమ్‌కు వెళుతూ తన శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకున్న మార్టినెజ్‌కు మరోసారి క్రీడల్లోకి అడుగు పెట్టడం కష్టం కాలేదు. తన షూటింగ్‌కు పదును పెట్టుకున్న అతను 2023 పాన్ అమెరికన్ క్రీడల్లో రజతం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. 2028 లాస్ ఏంజెలిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లోనూ పాల్గొనాలనేదే మార్టినెజ్ తర్వాతి లక్ష్యం. అప్పటికి 64 ఏళ్లు వచ్చినా సరే... ఎక్కడ మొదలు పెట్టానో అక్కడే ముగిస్తాను అంటూ అతను ఘంటాపథంగా చెబుతున్నాడు. మార్టినెజ్‌కు ముందు జపాన్ ఈక్వెస్ట్రియన్ ఆటగాడు హొకెసు హిరోషి మాత్రమే రెండు ఒలింపిక్స్ మధ్య ఎక్కువ విరామం (44 ఏళ్లు) తీసుకున్నవాడిగా నిలిచాడు. తొలిసారి 1964 ఒలింపిక్స్‌లో పాల్గొన్న అతను ఆ తర్వాత 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో మళ్లీ బరిలోకి దిగాడు.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	13	8	8	29
2	ఆస్ట్రేలియా	10	6	5	21
3	అమెరికా	9	18	15	42
4	ఫ్రాన్స్	9	11	12	32
5	బ్రిటన్	9	9	8	26
6	జపాన్	8	3	6	17
7	దక్షిణ కొరియా	7	5	4	16
44	భారత్	0	0	3	3

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

సాక్షి బిజినెస్
శనివారం
3-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
886	293
80,981	24,718

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	16,702	▽	498
డోజోన్స్	39,476	▽	872
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,175	▽	109
డాక్స్	17,661	▽	422
షాంఘై	2,905	▽	27
నికాయ్	35,910	▽	2,217

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారెట్లు)	68,990
బంగారం (22 క్యారెట్లు)	65,700
వెండి (కిలో)	91,000

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.33	84.35
£	బ్రిటన్ పౌండ్	106.36	108.95
€	యూరో	89.54	91.45
¥	జపాన్ ఎన్ (100)	54.53	55.34
AUS	ఆస్ట్రేలియా డాలర్	53.56	55.49
S$	సింగపూర్ డాలర్	60.45	65.00
SAR	సౌదీ రియాల్	21.45	23.01
UAE D	యూఏఈ దిర్హామ్	21.86	23.62
¥	చైనా యువాన్	10.72	12.45

ఐటీ రిటర్నులు @ 7.28 కోట్లు

- గతేడాది కంటే 7.5% అధికం
- 72% కొత్త విధానంలోనే



న్యూఢిల్లీ: గడిచిన ఆర్థిక సంవత్సరానికి (2023–24) సంబంధించి 7.28 కోట్ల ఆదాయపన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలయ్యాయి. రిటర్నుల దాఖలుకు జూలై 31తో గడువు ముగియగా, ఇందుకు సంబంధించి వివరాలను ఆదాయపన్ను శాఖ విడుదల చేసింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గతేడాది జూలై 31 నాటికి 6.77 కోట్ల రిటర్నులు నమోదు కాగా, వాటితో పోల్చితే 7.5% మేర ఎక్కువ మంది తమ ఐటీ రిటర్నులు సమర్పించారు. 5.27 కోట్ల మంది కొత్త విధానంలో రిటర్నులు సమర్పించారు. 2.01 కోట్ల మంది పాత విధానాన్ని ఎంపిక చేసుకున్నారు. ఈ ప్రకారం 72% మంది కొత్త విధానంలోకి మళ్లారు. నిర్ణీత రుసుం చెల్లించి ఈ ఏడాది డిసెంబర్ చివరి వరకు ఆలస్యపు రిటర్నులను దాఖలు చేసుకోవచ్చు.

గోల్డ్ బాండ్స్.. లక్కీ చాన్స్!

ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు.. బడ్జెట్లో మోదీ సర్కారు బంగారంపై గురి పెట్టింది. అనూహ్యంగా దిగుమతి సుంకాన్ని సగానికిపైగా తగ్గించడంతో కొత్తగా సావరీన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ)లో పెట్టుబడి పెట్టేవారికి ధర భారీగా దిగొచ్చింది. మరోపక్క, పాత బాండ్ల చెల్లింపులపై (రిడెంప్షన్లు) భారాన్ని కూడా ప్రభుత్వం తగ్గించుకుంటోంది. తాజా నిర్ణయంతో గోల్డ్ బాండ్ స్కీమ్ మరింత ఆకర్షణీయంగా మారుతుందంటున్నారు విశ్లేషకులు!

- దిగుమతి సుంకం కోతతో ఊరిస్తున్న పుత్తడి
- కొత్త గోల్డ్ బాండ్లలో పెట్టుబడులు ఆకర్షణీయం
- రిడెంప్షన్లపై ప్రభుత్వానికి భారీ ఊరట...

బంగారం దిగుమతులపై కస్టమ్స్ సుంకాన్ని ఈ ఏడాది బడ్జెట్లో 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే. దీంతో పసిడి ధరలు ఒక్కసారిగా రూ. 5,000 మేర పడిపోయాయి. దీంతో గత కొద్ది రోజులుగా బంగారం షాపులు కళకళలాడిపోతున్నాయి. మళ్లీ ధర పెరిగిపోతుందేమోనన్న ఆత్రుతతో పసిడి ప్రియులు ఇన్వెస్ట్‌మెంట్ కోసం కూడా పుత్తడి కొనుగోళ్లకు ఆసక్తి చూపుతుండటంతో డిమాండ్ పుంజుకుందని బులియన్ మార్కెట్ వర్గాలు చెబుతున్నారు. ధర భారీగా తగ్గడం వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా విడుదల చేసే గోల్డ్ బాండ్లకు కూడా గిరాకీ ఉంటుందని భావిస్తున్నారు. దేశంలో భౌతిక రూపంలో బంగారం డిమాండ్‌ను తగ్గించడంతో పాటు ప్రజల పొదుపు మొత్తాలను పసిడిలోకి కాకుండా ఆర్థికపరమైన సాధనాల్లోకి మళ్లించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2015లో గోల్డ్ బాండ్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పటిదాకా వీటి ద్వారా ప్రభుత్వం రూ. 72,274 కోట్ల నిధులను సమీకరించింది.

అప్పట్లో గ్రాము రూ.3,100...

2015 నుంచి 2017 వరకు మూడేళ్లలో జారీ చేసిన గోల్డ్ బాండ్లకు గ్రాము రేటు రూ.3,100 నుంచి రూ.3,500 స్థాయిలో ఉంది. తాజా బడ్జెట్‌కు ముందు గ్రాము మేలిమి బంగారం ధర రూ.7,200 పలికింది. గోల్డ్ బాండ్ గడువు వ్యవధి (మెచ్యూరిటీ) 8 ఏళ్లు. అంటే, గతంలో జారీ చేసిన బాండ్ల గడువు తీరుతుండటంతో ఇప్పుడు ప్రభుత్వం తిరిగి చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. రేటు రెట్టింపునకు పైగా పెరిగిపోవడంతో ప్రభుత్వ ఖజానాపై భారం కూడా భారీగా ఉంటుంది. దిగుమతి సుంకం తగ్గింపుతో ఒక్కో గ్రాముపై రేటు భారీగా దిగొచ్చింది. అంతర్జాతీయంగా పసిడి ధరల ట్రెండ్ ప్రస్తుత స్థాయిలోనే కొనసాగితే, బాండ్ రిడెంప్షన్లపై సర్కారు చెల్లింపులు తగ్గుతాయి.

130 శాతం రాబడి...

గోల్డ్ బాండ్ల గడువు తీరిన తర్వాత, రిడెంప్షన్ తేదీకి ముందు 24 క్యారెట్ల బంగారం 3 రోజుల సగటు ధర ప్రకారం రూపాయిల్లో చెల్లించాల్సి ఉంటుంది. గోల్డ్ బాండ్ స్కీమ్ కింద ఎనిమిదేళ్ల క్రితం 2016 ఆగస్టులో జారీ చేసిన సిరీస్–1 బాండ్ల గడువు ఈ నెలలోనే ముగుస్తుంది. అప్పట్లో ఒక్కో గ్రాముకు రూ.3,119 చొప్పున ఇన్వెస్టర్లు చెల్లించారు. దీనికి వార్షికంగా 2.75 శాతం వడ్డీ కూడా జమవుతుంది (ప్రస్తుతం వడ్డీ 2.5 శాతంగా ఉంది). తాజా రేటు ప్రకారం రూ. 6,900–7,000 స్థాయిలో రిడెంప్షన్ ధర ఉండొచ్చని అంచనా. దీని ప్రకారం చూస్తే, వడ్డీ కూడా కలిపితే ఇన్వెస్టర్లకు 130 శాతం లాభాలు వస్తున్నట్లు లెక్క. అయితే, ప్రభుత్వ గ్యారంటీ ఉండటం, వార్షికంగా 12–13 శాతం రాబడులు పక్కాగా లభిస్తుండటంతో గోల్డ్ బాండ్లకు వన్నె తగ్గదని నిపుణులు అంటున్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



సెప్టెంబర్‌లో మరో విడత!

బడ్జెట్లో సుంకం కోత నిర్ణయం నేపథ్యంలో తాజా గోల్డ్ బాండ్ల జారీని ప్రభుత్వం వాయిదా వేస్తూ వచ్చింది. చివరిగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎస్‌జీబీలను జారీ చేశారు. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఏటా నాలుగు సార్లు చొప్పున ఎస్‌జీబీలను కేంద్రం అందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి విడత బాండ్లను సెప్టెంబర్‌లో జారీ చేయొచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నారు. గ్రాము ధర ప్రస్తుత ట్రెండ్ ప్రకారం రూ. 7,000కు అటుఇటుగా నిర్ణయించే అవకాశం ఉండటంతో ఇన్వెస్టర్ల నుంచి భారీగా డిమాండ్ ఉంటుందని రిద్ధిసిద్ధి బులియన్స్ ఎండీ పృథ్వీరాజ్ కొఠారి అభిప్రాయపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మూడు విడతల్లో బాండ్ల జారీ ఉంటుందని అంచనా. తద్వారా ప్రభుత్వం రూ.18,500 కోట్లను సమీకరించే అవకాశం ఉంది. అమెరికాలో వడ్డీరేట్ల కోత సంకేతాలు, భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా బంగారం ధరలు మరింత ఎగబాకే అవకాశాలు ఉన్నాయి.

ఇన్ఫీ జీఎస్‌టీ నోటీస్ వెనక్కి!

- ఉపసంహరించుకున్న కర్ణాటక అధికారులు
- డీజీజీఐకి వివరణ ఇవ్వాల్సిందిగా సూచన



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు జారీ చేసిన జీఎస్‌టీ ఎగవేత నోటీసుపై అధికారులు వెనక్కి తగ్గారు. రూ.32,403 కోట్ల జీఎస్‌టీ ఎగవేత విషయంలో కంపెనీకి జారీ చేసిన ప్రీ–షోకాజ్ నోటీసులను కర్నాటక రాష్ట్ర జీఎస్‌టీ అధికారులు ఉపసంహరించుకున్నారు. అయితే, దీనిపై జీఎస్‌టీ, సెంట్రల్ ఎక్సైజ్ సుంకం, సర్వీస్ ట్యాక్స్ ఎగవేతలకు సంబంధించిన కేసులను దర్యాప్తు చేసే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ)కి వివరణ ఇవ్వాలని కంపెనీకి సూచించారు. బీఎస్‌ఈకి వెల్లడించిన సమాచారంలో ఇన్ఫోసిస్ ఈ విషయాన్ని తెలిపింది. 2017 నుంచి ఐదేళ్లపాటు విదేశీ బ్రాంచ్‌ల నుంచి అందుకున్న సర్వీసులకు గాను రూ. 32,403 కోట్ల జీఎస్‌టీ చెల్లించాలంటూ పన్ను అధికారులు ఇన్ఫీకి డిమాండ్ నోటీసులు ఇవ్వడం తెలిసిందే. అయితే, ఇది కేవలం ప్రీ–షోకాజ్ నోటీసు మాత్రమేనని, అధికార యంత్రాంగం పేర్కొన్న వ్యయాలకు జీఎస్‌టీ వర్తించదని ఇన్ఫోసిస్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ ఉదంతంపై ఐటీ పరిశ్రమల సమాఖ్య నాస్కామ్ కూడా స్పందించింది. పన్ను అధికారులు ఐటీ పరిశ్రమ నిర్వహణ విధానాలను సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని పేర్కొంది. కాగా, అంతర్జాతీయంగా భారీ వ్యాపార కార్యకలాపాలు గల కంపెనీలకు ఇలాంటి పన్ను నోటీసులను ఇచ్చే ముందు సరైన దర్యాప్తు, స్పష్టమైన రుజువులను సమర్పించాల్సి ఉంటుందని ఎస్‌కేఐ క్యాపిటల్ ఎండీ, సీఈఓ నరీందర్ వాధ్వా వ్యాఖ్యానించారు.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
అమెరికా ఎకానమీకి భారత్ ఎంతెంతో దూరం
దివాలా అస్త్రం నుంచి బయటపడ్డ బైజూస్

మార్కెట్‌కు మాంద్యం భయం



అమెరికా మార్కెట్ల భారీ పతన ప్రభావం • ఒక శాతానికి పైగా నష్టపోయిన సూచీలు • 25 వేల స్థాయిని కోల్పోయిన నిఫ్టీ

ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల ప్రభావంతో దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం ఒకశాతం మేర నష్టపోయాయి. సెన్సెక్స్ 886 పాయింట్లు క్షీణించి 81 వేల దిగువన 80,981 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 293 పాయింట్లు పతనమై 25వేల స్థాయిని కోల్పోయి 24,718 వద్ద నిలిచింది. ఇటీవల వెల్లడైన దేశీయ కార్పొరేట్ క్యూ1 ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడం, దలాల్ స్ట్రీట్ వరుస రికార్డు ర్యాలీతో అధిక వాల్యుయేషన్ల ఆందోళన పరిణామాలు ఇన్వెస్టర్లను లాభాల స్వీకరణ వైపు పురిగొల్పాయి. ఒక దశలో సెన్సెక్స్ 999 పాయింట్లు క్షీణించి 80,869 వద్ద, నిఫ్టీ 324 పాయింట్లు కుప్పకూలి 24,686 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. రియల్టీ, మెటల్, ఆటో, ఐటీ, కమోడిటీ, టెక్, క్యాపిటల్ గూడ్స్ షేర్ల భారీ పతనంతో బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 0.58% 1.19 శాతం నష్టపోయాయి.

సూచీల భారీ పతనంతో ఇన్వెస్టర్లకు ఒక్క రోజులో రూ.4.46 కోట్ల నష్టం వాటిల్లింది. బీఎస్‌ఈలోని మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.457 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల భారీ పతనం

అమెరికాలో జూలై తయారీ రంగ పీఎంఐ, ఉద్యోగ ఉద్యోగ కల్పన గణాంకాలు నిరాశపరచడంతో ఆర్థిక మాంద్య భయాలు తలెత్తాయి. అలాగే ఫెడరల్ రిజర్వ్ సెప్టెంబర్‌లో వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలను బలహీనపరిచింది. అమెరికా దిగ్గజ టెక్ కంపెనీలైన టెస్లా, ఆల్ఫాబెట్, ఎన్‌విడీయా, మైక్రోసాఫ్ట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు అంచనాలకు అందుకోలేకపోవడం ఆగ్నికి ఆజ్యం పోశాయి. నాస్‌డాక్ 3% క్షీణించి 16,683 వద్ద ట్రేడవుతోంది. టెక్ కంపెనీల షేర్లకు ప్రాతినిధ్యం వహించే ఈ సూచీ జూలై 10న జీవితకాల గరిష్ఠం (18,671) నుంచి ఏకంగా 10%పైగా కుప్పకూలింది. డోజోన్స్ ఇండెక్స్ 2.5% నష్టపోయి 39,430 వద్ద కదలాడుతోంది. అమెరికా మార్కెట్ల నష్టాల ప్రభావంతో ఆసియా, యూరప్ మార్కెట్లూ డీలా పడ్డాయి. బ్యాంక్ ఆఫ్ ఆఫ్ జపాన్ వడ్డీరేట్ల పెంపు అంచనాలతో జపాన్ సూచీ నికాయ్ 6% క్షీణించింది. తైవాన్ ఇండెక్స్ 5%, కోస్పీ సూచీ 4%, హాంగ్‌కాంగ్ సూచీ 2% కుప్పకూలాయి. ఆర్థిక వ్యవస్థ మందగమన భయాలతో చైనా షాంఘై సూచీ ఒక శాతం నష్టపోయింది. ఇక మధ్య ప్రాచ్యంలో విస్తరిస్తున్న యుద్ధ భయాలతో యూరప్ మార్కెట్లూ 2.50% నుంచి రెండుశాతం పైగా నష్టపోయాయి.

శీతల్ దేవితో మియా బై తనిష్క్



ముంబై: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ మియా బై తనిష్క్ 'దేఖ్నా హై తో ఖేల్ దేఖో' పేరుతో ప్రకటన చిత్రాన్ని విడుదల చేసింది. ఇందులో ప్రపంచ నెంబర్‌వన్ మహిళా పారా అథ్లెట్, అర్జున అవార్డు గ్రహీత శీతల్ దేవి అసామాన్య నైపుణ్యాలు, ఆత్మస్థైర్యం, ఆటపట్ల అభిరుచిను కళ్లకు కట్టేలా చిత్రీకరించారు. శీతల్ దేవితో ఈ ప్రచార చిత్రాన్ని రూపొందించడాన్ని గర్వంగా భావిస్తున్న మియా బై తనిష్క్ బిజినెస్ హెడ్ శ్యామలా రామన్ తెలిపారు.



సింగిల్స్ ఫైనల్లో అల్‌కరాజ్

స్పెయిన్ యువ టెన్నిస్ ప్లేయర్ కార్లోస్ అల్‌కరాజ్ ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరిన పిన్న వయస్కుడిగా ఘనతకెక్కాడు. శుక్రవారం పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్ అల్‌కరాజ్ 6–1, 6–1తో ఫెలిక్స్ ఆగర్ (కెనడా)పై విజయం సాధించాడు. ఇప్పటికే నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన 21 ఏళ్ల అల్‌కరాజ్.. చిన్న వయసులో ఒలింపిక్ పతకం నెగ్గిన తొలి టెన్నిస్ ప్లేయర్‌గా నిలిచేందుకు అడుగుదూరంలో ఉన్నాడు. ఒక గంట 15 నిమిషాల్లో ముగిసిన సెమీస్‌లో పూర్తి ఆధిపత్యం కనబర్చిన అల్‌కరాజ్.. వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించాడు. రోలాండ్ గారోస్‌లో ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ పట్టిన అల్‌కరాజ్.. 14 విన్నర్లు సంధించడంతో పాటు.. 13 నెట్ పాయింట్స్ సాధించాడు. శనివారం జరగనున్న మహిళల సింగిల్స్ ఫైనల్లో జెంగ్ క్విన్‌వెన్ (చైనా)తో డోనా వెకిక్ (క్రొయేషియా) తలపడనుంది.

కేటీ... 13 పతకాలతో మేటి

- అమెరికా స్విమ్మర్ కేటీ లెడెకీ అరుదైన ఘనత
- అత్యధిక ఒలింపిక్ పతకాలు నెగ్గిన మహిళా స్విమ్మర్‌గా రికార్డు



పారిస్: అమెరికా మహిళా స్విమ్మర్ కేటీ లెడెకీ విశ్వ క్రీడల్లో మరోసారి మెరిసింది. 4×200 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో కేటీ లెడెకీ, క్లెయిర్ వీన్‌స్టెన్, పెయిజ్ మాడెన్, ఎరిన్ గిమెల్‌లతో కూడిన అమెరికా బృందం రజత పతకం (7ని:40.86 సెకన్లు) సాధించింది. తాజా ఒలింపిక్స్‌లో ఇప్పటికే మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో స్వర్ణం, మహిళల 400 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో కాంస్యం గెలిచిన లెడెకీకిది మూడో పతకం కాగా... 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఆమె బరిలోకి దిగాల్సి ఉంది. తాజా పతకంతో లెడెకీ రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది. ఒలింపిక్స్ చరిత్రలో అత్యధికంగా 13 పతకాలు గెలిచిన మహిళా స్విమ్మర్‌గా చరిత్ర లిఖించింది. 12 పతకాలతో జెన్నీ థాంప్సన్ (అమెరికా) పేరిట ఉన్న రికార్డును లెడెకీ సవరించింది. వరుసగా నాలుగో ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న లెడెకీ ఇప్పటి వరకు విశ్వక్రీడల్లో 8 స్వర్ణాలు, 4 రజతాలు, ఒక కాంస్యం సాధించింది. ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో అమెరికా మాజీ స్విమ్మర్ మైకేల్ ఫెల్ప్స్ అత్యధికంగా 28 పతకాలు సాధించి ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. 13 పతకాలతో లెడెకీ మహిళల విభాగంలో అగ్రస్థానంలో, ఓవరాల్‌గా రెండో స్థానంలో ఉంది. 'విశ్వక్రీడల్లో ఒత్తిడి సహజమే. అయితే నా వరకు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడమే లక్ష్యంగా పెట్టుకుంటా. ఆ క్రమంలో రికార్డులు నమోదైతే అది మరింత ఆనందం. స్వదేశంలో జరిగే 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లోనూ పాల్గొంటా' అని లెడెకీ పేర్కొంది.

తులికా తొలి రౌండ్‌లోనే...



పారిస్ ఒలింపిక్స్ బరిలోకి దిగిన భారత ఏకైక జూడో ప్లేయర్ తులికా మాన్ తొలి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన మహిళల ప్లస్ 78 కేజీల విభాగంలో తులికా 0–10తో ఓర్టిజ్ (క్యూబా) చేతిలో ఓడింది. ఇప్పటి వరకు నాలుగు ఒలింపిక్ పతకాలు నెగ్గిన ఓర్టిజ్ ముందు తులికా మాన్ నిలవలేకపోయింది. 28 సెకన్లలోనే భారత జూడోకాను చెక్‌హోల్డ్‌తో ఉక్కిరిబిక్కిరి చేసిన ఓర్టిజ్ విజయం సాధించింది. అయితే తదుపరి రౌండ్‌లో ఓర్టిజ్ పరాజయం పాలవడంతో... తులికా మాన్‌కు రెపిచాజ్ ద్వారా కాంస్య పతక పోరులో బరిలోకి దిగే అవకాశం కూడా లేకుండా పోయింది.

బల్‌రాజ్‌కు 23వ స్థానం

పారిస్ ఒలింపిక్స్‌లో భారత రోవర్ బల్‌రాజ్ పన్వర్ 23వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. పురుషుల సింగిల్ స్కల్స్ ఈవెంట్ రౌండ్ 'డి' ఫైనల్లో శుక్రవారం బల్‌రాజ్ 7 నిమిషాల 2.37 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. అంతకుముందు రెపిచాజ్ రౌండ్‌లో రెండో స్థానంలో నిలిచి క్వార్టర్స్‌కు చేరిన బల్‌రాజ్... అక్కడ ఐదో స్థానానికి పరిమితమవడంతో ఫైనల్‌కు దూరమయ్యాడు. ఫైనల్ 'ఎ'లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు లభిస్తాయి.



శ్రీలంక 230... భారత్ 230



'టై'గా ముగిసిన తొలి వన్డే

- రాణించిన రోహిత్, అక్షర్ పటేల్
- తిప్పేసిన అసలంక, హసరంగ
- రేపు రెండో వన్డే

కొలంబో: శ్రీలంక చేసిన స్కోరు 230/8. ఇదేమంత పెద్ద లక్ష్యమేం కాదు... సులువైందే కానీ కష్టం, అసాధ్యం కానేకాదు. కానీ పిచ్ స్పిన్‌కు దాసోహమైంది. ఇది ఆతిథ్య బౌలర్లకు కలిసొచ్చింది. టి20 సిరీస్‌లో తేలిపోయిన లంకేయులు... తొలి వన్డేలో మాత్రం పట్టు సడలించకుండా పోరాడారు. ఫలితం 'టై' అయినప్పటికీ రోహిత్, కోహ్లిలు ఉన్న పటిష్ట జట్టును శ్రీలంక సమష్టిగా నిలువరించింది. దీంతో భారత్ 11 బంతులున్నా లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. మొదట శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దునిత్ వెలలగే (65 బంతుల్లో 67 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), పతున్ నిసాంక (75 బంతుల్లో 56; 9 ఫోర్లు) రాణించారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత్ 47.5 ఓవర్లలో 230 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్, ఓపెనర్ రోహిత్ శర్మ (47 బంతుల్లో 58; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒక్కడే అదరగొట్టాడు. అక్షర్ పటేల్ (57 బంతుల్లో 33; 2 ఫోర్లు, 1 సిక్స్), కేఎల్ రాహుల్ (43 బంతుల్లో 31; 2 ఫోర్లు) మెరుగ్గా ఆడారు.

ఆదుకున్న వెలలగే

ఆరంభంలోనే ఓపెనర్ అవిష్క ఫెర్నాండో (1)ను సిరాజ్ పెవిలియన్ చేర్చాడు. తర్వాత మరో ఓపెనర్ నిసాంక, కుశాల్ మెండిస్ (14) కుదురుగా ఆడటంతో రెండో వికెట్‌కు 39 పరుగులు జతయ్యాయి. తర్వాత స్వల్ప వ్యవధిలో రెండు కీలక వికెట్లను కోల్పోయింది. కుశాల్, సమరవిక్రమ (8) వికెట్లను పారేసుకోవడంతో 60 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. తర్వాత కెప్టెన్ అసలంక (14), నిసాంక వికెట్లను కాపాడుకునేందుకు విఫల ప్రయత్నం చేశారు. 91 పరుగుల వద్ద అసలంక, 67 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాక నిసాంక కూడా అవుటవడంతో లంక జట్టు 101 పరుగుల వద్ద సగం వికెట్లను కోల్పోయింది. ఈ దశలో లియనాగే (26 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్), దునిత్ వెలలగే వికెట్ల పతనానికి కాసేపు బ్రేక్ వేయడంతో ఆరో వికెట్‌కు 41 పరుగుల భాగస్వామ్యం జతయ్యింది. మరింత బలపడకముందే ఈ జోడీని అక్షర్ విడగొట్టాడు. హసరంగ (24; 1 ఫోర్, 2 సిక్స్‌లు), ధనంజయ (17)లతో కలిసి దునిత్ జట్టు స్కోరును 200 పైచిలుకు తీసుకెళ్లాడు.

రాణించిన రోహిత్

సులువైన లక్ష్యానికి సరైన శుభారంభాన్ని ఓపెనర్లు రోహిత్, శుబ్‌మన్ గిల్ (16) ఇచ్చారు. కెప్టెన్ రోహిత్ తొలి ఓవర్ నుంచే ఎదురుదాడికి దిగాడు. 5.3 ఓవర్లలోనే జట్టు స్కోరు 50 పరుగులు దాటింది. పదో ఓవర్ పూర్తయ్యేసరికి భారత్ 71/0 స్కోరు చేసింది. తర్వాత 11వ ఓవర్ నుంచి లంక బౌలర్ల ప్రతాపం మొదలైంది. పరుగుల రాక గగనమైంది. ఈ ఐదు ఓవర్లలో కేవలం 15 పరుగులే చేసిన భారత్ ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. తదనంతరం సుందర్ (5) అవుటయ్యాడు. 12 పరుగుల వ్యవధిలోనే ఈ మూడు వికెట్లు కూలడంతో భారత్ 87/3 స్కోరు చేసింది. ఈ దశలో కోహ్లి (24; 2 ఫోర్లు), అయ్యర్ (23; 4 ఫోర్లు) నింపాదిగా ఆడి జట్టు స్కోరును వంద దాటించారు. నాలుగో వికెట్‌కు 43 పరుగులు జోడించాక కోహ్లిని హసరంగా ఎల్బీగా పంపగా, కాసేపటికే, బుల్లెట్‌లాంటి బంతితో ఫెర్నాండో అయ్యర్‌ను బౌల్డ్ చేయడంతో 132/5 స్కోరు వద్ద భారత్ కష్టాల్లో పడింది. తర్వాత రాహుల్, అక్షర్ మెరుగ్గా ఆడినా, దూబే (25; 1 ఫోర్, 2 సిక్స్‌లు) సిక్స్‌లు, ఫోర్‌తో గెలుపు మెట్టుపై నిలబెట్టినా... కెప్టెన్ అసలంక వేసిన 48వ ఓవర్లో దూబే, అర్ష్‌దీప్ అవుటవడంతో మ్యాచ్ టైగా ముగిసింది.

2 భారత్, శ్రీలంక జట్ల మధ్య 'టై' అయిన మ్యాచ్‌లు. ఈ రెండు జట్ల మధ్య 2012లో హోబర్ట్ వేదికగా జరిగిన ముక్కోణపు టోర్నీ మ్యాచ్ తొలిసారి 'టై'గా ముగిసింది. ఇప్పటి వరకు ఈ రెండు జట్లు 169 వన్డేల్లో తలపడ్డాయి. 99 మ్యాచ్‌ల్లో భారత్ నెగ్గగా... 57 మ్యాచ్‌ల్లో లంక గెలిచింది. 11 మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి.


సూపర్ ఓవర్ ఉండదా?

ఐసీసీ నిబంధనల ప్రకారం ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో సూపర్ ఓవర్‌కు అవకాశం లేదు. రెండు కంటే ఎక్కువ జట్లు అనగా, ఆసియా కప్, ముక్కోణపు సిరీస్, ఐసీసీ ఈవెంట్లలో మాత్రం ఫలితం కోసం 'సూపర్ ఓవర్'ను అనుమతిస్తారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (ఎల్బీడబ్ల్యూ) (బి) సుందర్ 56; అవిష్క (సి) అర్ష్‌దీప్ (బి) సిరాజ్ 1; కుశాల్ మెండిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) దూబే 14; సమరవిక్రమ (సి) గిల్ (బి) అక్షర్ 8; అసలంక (సి) రోహిత్ (బి) కుల్దీప్ 14; జనిత్ (సి) రోహిత్ (బి) అక్షర్ 20; వెలలగే (నాటౌట్) 67; హసరంగ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 24; ధనంజయ (సి) సుందర్ (బి) అర్ష్‌దీప్ 17; షిరాజ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 230.** **వికెట్ల పతనం:** 1–7, 2–46, 3–60, 4–91, 5–101, 6–142, 7–178, 8–224. **బౌలింగ్:** సిరాజ్ 8–2–36–1, అర్ష్‌దీప్ 8–0–47–2, అక్షర్ 10–0–33–2, దూబే 4–0–19–1, కుల్దీప్ 10–0–33–1, సుందర్ 9–1–46–1, గిల్ 1–0–14–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వెలలగే 58; గిల్ (సి) కుశాల్ మెండిస్ (బి) వెలలగే 16; కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) హసరంగ 24; సుందర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ధనంజయ 5; అయ్యర్ (బి) అసిత ఫెర్నాండో 23; రాహుల్ (సి) వెలలగే (బి) హసరంగ 31; అక్షర్ (సి) కుశాల్ మెండిస్ (బి) అసలంక 33; దూబే (ఎల్బీడబ్ల్యూ) (బి) అసలంక 25; కుల్దీప్ (బి) హసరంగ 2; సిరాజ్ (నాటౌట్) 5; అర్ష్‌దీప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అసలంక 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (47.5 ఓవర్లలో ఆలౌట్) 230.** **వికెట్ల పతనం:** 1–75, 2–80, 3–87, 4–130, 5–132, 6–189, 7–197, 8–211, 9–230, 10–230. **బౌలింగ్:** అసిత ఫెర్నాండో 6–1–34–1, షిరాజ్ 4–0–25–0, వెలలగే 9–1–39–2, ధనంజయ 10–0–40–1, హసరంగ 10–0–58–3, అసలంక 8.5–0–30–3.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.